భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జూన్ 1962

సంపుటము 39 : : సంచిక 6

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1962

గ్రీష్మ విక్రాంతి

శ్రీ శనగన నరసింహస్వామి

ముదిరిన బాడబానలము మోములు మింటికి గ్రక్కు మంటలో
ప్రిదిలిన వహ్నిభూధరము బీటలు చేటల ఖ్లాటు కీలలో
కదలిన కాలరుద్రు నలికప్రవినేత్రము చిమ్ము నగ్నులో
యిదియన జీవలోకముల నేర్చెను వేసవియెండ తీవ్రమై

కొలకుల నీళ్లింకి పులుగు మొత్తంబులు
జలదేశముల దిక్కు వలసబోయె
కాళ్లు నొదల మాడి కంపించి తెరువరి
పానీయశాలకు పరుగువెట్టె
నెండమావుల బీర మెదనమ్మి మృగతతి
యూసాయ మన్వేషణార్తమయ్యె
తాపార్తి రోజుచు తడినేలకోసము
కుక్క యూరంతయు కొసరితిరిగె

ఆది వైశాఖమే పులియన్న మీద
పొంచి రోహిణి పులిమీద పుట్రగాగ
గ్రీష్మ భాస్కర విక్రమక్రీడయందు
ప్రజల కనిశమ్ము కుంపటిబ్రదుకులయ్యె

తామరపువ్వులో తనువు దాచుకొనెన్ విధి, పుష్పసాయక
స్వామియు మల్లికాకుసుమవాటిక జేరెను, గ్రీష్మతాప సం
గ్రామ బలమ్మునన్ హృదయకాయము లొక్కటయాడి మాన
స్తోమము రేవగల్ కరము సొక్కెను చల్లని పూలసేవలో

దహనదేవుడు గేహ దహనమ్ము సాగింప
పవమాను డనుకూల భంగివీచె

భారతి

జీర్ణ పర్ణ శ్రేణి చిత్రచిత్రమ్ముగా
        సుడిగాలితో బాటు సుళ్లుతిరిగ
ఛాయ లాతపభీతి జగతీజముల క్రింద
        విశ్రమించెను పాంథవితతితోడ
పగలు మార్తాండుడు పరితాపమును పూర్వ
        రాత్రి చంద్రుడు కూడ రాపు పెట్టె

సారె సారెకు శీతల నీరమాని
కడుపు బరువెక్క నిజబుభుక్షాభరమ్ము
ప్రథమ కబళావసితముగా ప్రజలు రేల
బయట నిద్రించి రనిలప్రపాపిపాస.

వేసగి రక్కసి పటుని
శ్వాసము పశ్చిమదిశోగ్ర పవనము కర్ణ
ప్రాసంబైనను తొలకరి
కోస మ్మసురాజి నిల్పుకొనె ప్రజయెటులో

సాహిత్య సదస్సు

ఉత్తమ సాహిత్యం ఎప్పుడు వచ్చింది

స్వాతంత్ర్యమునకు ముందా? తర్వాతా?

"సాహిత్యవిద్యార్థి"

[ఈ వ్యాసకర్త ప్రసిద్ధ తెలుగురచయిత. విమర్శకుడు. అనేక సంవత్సరాలుగా తెలుగు సాహిత్యము అనుసరిస్తున్న గతులను నిత్యమూ గమనించే పరిశీలకుడు. భారత భాషలను అనేక మెరిగినవారు. కొన్నిటిలో గట్టిప్రవేశమున్నవారు. సంస్కృతాంధ్రాంగ్లములను తరచి చవిచూచినవారు. స్వాతంత్ర్యానంతరం ఉత్తమ సాహిత్యం వచ్చినదా? అంతకుపూర్వం ఉత్తమ సాహిత్యం వచ్చినదా? మీ అభిప్రాయం ఏమిటో ఒక వ్యాస రూపంగా భారతికి ఇవ్వమని వ్యాసకర్తని కోరాము. మా కోరికననుసరించి వారు పంపిన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము. ఈ అంశముపై రచయితల పాఠకుల అభిప్రాయములను ఆహ్వానిస్తున్నాము. విమర్శ, చర్చ సాహిత్యాన్ని అనుసరిస్తూ వస్తాయి. అవి ఆదరణీయములు. — సంపాదకుడు]

భారతదేశంలోను, తెనుగు దేశంలోను స్వాతంత్ర్యం అనంతరం ఉత్తమసాహిత్యం వచ్చిందా? లేక అంతకు పూర్వం ఉత్తమ సాహిత్యం వచ్చిందా'' అని భారతి సంపాదకులు నన్ను ప్రశ్న వేశారు. ఈ ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పడానికి వీలు లేదు. తెనుగుదేశంలోనే అన్నమాట ఏమిటి, యావత్ భారత దేశంలోనే ఇది ఆలోచన పురికొల్పే ప్రశ్న. వివాదగ్రస్త విషయము! భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినతరువాత సాహిత్య రంగంలో ఎన్నోమార్పులు వచ్చాయి. ఎన్నో క్రొత్త పుస్తకాలు వస్తున్నాయి. గద్యపద్యాత్మకరచనలు గణింపడానికి వీలులేనన్ని వివిధభాషలలో వెలువడుతున్నాయి. కాని—ఈ పది పదిహేను సంవత్సరాలకాలంలో భారతీయ ప్రతినిధి అని చెప్పుకోతగిన మహాకవి ఎవరైనా వచ్చారా అనేది ప్రశ్న! వాల్మీకి, వ్యాసుడు వంటి మహాకవుల కోవలో చేరనక్కర లేదు. కాళిదాసు, భవభూతివంటి కవులశ్రేణిలోనూ చేరనక్కరలేదు. కాని, తులసీదాస్, కంబరు, వేమన వంటి ప్రజాభిమానపాత్రులయిన కవుల స్థాయిలో కాని చేర్చదగిన కవులు కనిపించడంలేదు. ఆధునికయుగంలో 20-వ శతాబ్దంఆరంభంలో దేశం మొత్తంమీద వివిధభాషలలోను వెలువడిన సాహిత్యాన్ని పరిశీలన చేస్తే—ఒక మహాకవి యనదగిన ప్రతినిధుల సంఖ్య వ్రేళ్లమీద మాత్రమే లెక్కించవచ్చును. రవీంద్రనాథ్ ఠాకూర్, జయశంకర ప్రసాద్, సుబ్రహ్మణ్య భారతి, గురజాడ అప్పారావు, వల్లత్తోళ్ ఇటువంటి కవులశ్రేణిలో చేర్చదగినవారు హెచ్చుమంది లేరు.

ఇంక స్వాతంత్ర్యం వచ్చినతరువాత విశాలభారతిలో సంస్థానాలు, జమీందారీ ప్రథ పోయిన తరువాత ప్రజలే కవులకు, సాహిత్య వేత్తలకు ప్రధానపోషకు లయ్యారు. అయినప్పటికీ పద్యవాఙ్మయమునకున్న పరపతి గద్యవాఙ్మయమునకు లేదు. అది భారతీయుల హృదయములోనే చిర ప్రతిష్ఠ గడించుకొని శాశ్వతపీఠం స్థాపించుకొన్నది. అందుచేత స్వాతంత్ర్యం అనంతరంవచ్చిన సాహిత్యవైఖరి సమీక్షచేసి విలువ కట్టడంలో కవికే అగ్రతాంబూలం లభిస్తుంది కాని గద్యరచయిత ఎవ్వరికీ గౌరవస్థానం లభించదు. కవులే—నవలలు వ్రాసినా, నాటకాలు వ్రాసినా తమ కవితాప్రతిభలో గణుతి కెక్కినట్లు చెప్పవచ్చు.

మనదేశంలో అన్ని భాషలలోను, అన్ని సాహిత్య రంగాలలోనూ ఒక ఘట్టంక్రింద పేర్కొని స్వాతంత్ర్యానంతరం—సాహిత్య సమీక్ష చేసినట్లే, అఖిలప్రపంచ రంగంలో యుద్ధానంతరం సాహిత్యాన్ని పర్యావలోకన చేసేవా రున్నారు. ఆ సమీక్షలో కూడ, అంతకుముందున్న కవుల వంటివారు ఈ పది పదిహేను సంవత్సరాలలోను రాలేదని తేల్చారు.

ప్రపంచం మొత్తంమీద ఆడెన్, స్పెండరు వంటి కవులు తమ క్రొత్త కంఠస్వరాలు వినిపించవచ్చును! అమెరికాలో ఆర్చిబాల్డ్ మెక్లీష్, ఫ్రాస్టు వంటి కవులు సరిక్రొత్త రకం ప్రాతకవిత్వం వ్రాయవచ్చును. యూరప్‌లో కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రభావంలో పడి మారిపోయిన రచయితలు ఆర్థర్ కొయజ్లర్, బోరిస్ పాస్టర్‌నాక్, జార్జి ఆర్వెల్

వంటివారు విసువెత్తి మరీ అతిశయోక్తులతో కూడిన బీభత్స రసప్రధానమైన సమవాకారాన్ని ప్రదర్శించవచ్చును. కాని సాహిత్యంలో చిరకాలపువిలువలను ప్రతిపాదించే ఉత్తమ రచనలు చేసి ఉత్కృష్ట సందేశాన్ని ఈయ గల్గిన కవి ఒక్కడూ కూడ ఈ యుద్ధానంతరం రాలేదని నిష్ణాతులయిన నిష్పాక్షిక విమర్శకులే నిర్ణయించేసి 'ఉన్నారు. యుద్ధమునకు పూర్వం వచ్చిన సాహిత్యమే యుద్ధానంతర సాహిత్యంకంటె ఉత్తమమని తేల్చారు.

ఈ పరామర్శచేస్తూ — రాజకీయార్థిక విషయ నిర్ణేత అయిన ఒక సాధు విమర్శకుడు జాన్ స్ట్రాచీ నలుగుఝ ప్రసిద్ధ రచయితల గ్రంథాలు పర్యావలోకనం చేస్తూ ఒక చక్కని అభిప్రాయం వెలిబుచ్చాడు. అతడు తీసుకున్న రచయితలు ఆర్థర్ కొయజ్లర్, జార్జి ఆర్వెల్, ఛాంబర్స్, బోరిస్ పాస్టర్నాక్. వీరు నలుగురూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను, సామ్యవాదాన్ని కొంతవరకు బలపరచి, తరువాత ఎదురు తిరిగినవారే. వీళ్ళు నలుగురూ ప్రతిపాదించిన వాదమే రియాక్షనరీ వాదమని (Reactionary) ఈ రాజకీయవాది విమర్శ !

రియాక్షనరీ అంటే ప్రగతి వాదానికి విరుద్ధం. ప్రస్తుతం కమ్యూనిస్టు సిద్ధాంతాలలో మార్క్స్, ఏంజెల్సు వంటి వేత్తలు ప్రతిపాదించిన సామ్యవాదపద్ధతి, దానితో వచ్చినవిప్లవము, ఆ విప్లవము సాధించిన సమాజ పరివర్తన ఒక విశిష్టమైన ప్రథ యని కొందరు భావించారు. అది హేతువాదంతో రేషనలిస్టు వైఖరితో కూడిన ప్రగతి యని సమర్థించారు. ఆ రకపు సాహిత్యము మొదటి ప్రపంచ యుద్ధానంతరం వచ్చింది. యూరపులో బయలుదేరిన యీ సాహిత్యం ఫ్రాంసు, జర్మనీ, స్పెయిన్ వంటి దేశాలలోనే వెర్రితలలు వేసి—డాడాయిజమ్, క్యూబిజమ్, సర్రియలిజమ్ వంటి ఉద్యమాలను చిత్రకళతో ప్రారంభించి సాహిత్య వీధులలోనికి కూడ ప్రవేశపెట్టి అరాజకానికి దారితీసింది.

అదే ఫ్రాంసులో రెండవ యుద్ధం తరువాత—ఎగ్జిస్టెన్షనలిజమ్ (Existentionalism) జీన్ పాల్ సార్త్రీ వంటివారి నాయకత్వం క్రింద వర్ధిల్లింది. దీనికి కర్క్‌గార్డు, షొపెన్‌హొవర్ వంటి తత్త్వవాదుల సిద్ధాంతాలు మూలం ! ఈ తత్త్వం తన రచనల ద్వారా ప్రతిపాదించిన జీన్‌పాల్‌సార్త్రీ ఒక అభిప్రాయం విశదీకరించాడు. మానవుడు—పరిస్థితుల ప్రభావంవల్ల, యాంత్రికంగా ఒక మరలో చిక్కిన శిలలాగ చరించడంలేదు. అతడు విధి చేతిలో కీలుబొమ్మ అసలే కాడు. తనస్థితికి తానే కారకుడు. తానెలాగ తయారుచేసికొంటే అలాగ తయారవుతాడు. తాను చేసిన కర్మకు ఆ కర్మ ఫలాలకు తానే కారకుడు కాని మరొకరు కారు. అతని స్థితిగతులకు యాంత్రికమైన నిర్ణయపద్ధతికాని విధి విహితముకాని కారణము కాదు. (Mechanistic determinism). మార్క్సు చెప్పినట్లు — మానవులు తమ చరిత్ర తామే చేసుకుంటున్నారనే విషయాన్ని సార్త్రీ ఒప్పుకుంటాడు. సార్త్రీ ఇంకో అడుగు ముందువేసి తాను చేస్తున్న పని తానే నిర్ణయించుకొని దాని ఫలాఫలాలను తాను అనుభవిస్తున్నాడనీ, దానికి సంఘాన్ని కాని, విధిని కాని నిందించ నక్కరలేదనీ అంటాడు. మనమంతా ఒక చెడ్డ విశ్వాసంతో ఆత్మలాభంతో చెయ్యాలని పాపం చేస్తున్నాము. ఈ పాపాన్ని క్రైస్తవమతంలోని 'ఆజన్మపాపం' (Original Sin) తో ముడిపెట్టితే పెట్టవచ్చును. ఈ పాపచింతఉండి దానిలో నుండి విముక్తి లేనట్లు—మనమంతా పాపాలు చేస్తున్నట్లు సార్త్రీ చిత్రిస్తాడు. ఇదీ పాప విశ్వాసం (Bad Faith). అది పెట్టుకొని మనమంతా మనపాత్రలు శీలగా నటిస్తున్నట్లు చిత్రిస్తాడు. సార్త్రీ నవలల్లోను, నాటకాలలోనూ—యీ పాపచింతనుండి విముక్తి లేనట్లే నిరూపిస్తాడు. ఈ ఘోరణినే—మన తెలుగు రచయితలు కొందరు ఇటీవల అవలంబిస్తున్నారేమో !

ఈ సిద్ధాంతంలో వచ్చిన రచనలలో పాప పుణ్యాల పరిశీలన ఉండదు. నీతి, అవినీతి వీడి, లైంగికవాంఛల పరితృప్తిలో విచ్చలవిడిగా, విశృంఖలంగా వాంఛలు స్వైర విహారం చేస్తూ ఉంటాయి. దీని ప్రతిఫలము ఒక నిస్పృహ, ఒక నిరాశ !

ఈ యరాజకంలో నుండి యిటీవల పది యేండ్ల నుండి మరొక రకం నిస్పృహ బయలుదేరింది. అది ప్రస్తుతం జరుగుతున్న చరిత్రమీద అసంతృప్తి. ఈ చరిత్ర చట్రంలో ఇమిడిన తీవ్ర శక్తుల సంఘర్షణలో—ఉద్ధతుల మధ్య పేదలకుండ తరమే—అనే నిరుత్సాహంతో కొందరు యువకులు కోపోద్దీపిత మనస్కులై కన్ను లెర్రజేస్తున్నారు. వీళ్ళ క్రోధానలవాదులు. Angry youngmen. క్రోధ మానసపుత్రులు. ప్రతిదీ విమర్శించి ప్రస్తుత నాయక వర్గంకాని, సమాజ పద్ధతి కాని సరిగా లేదని—ఈ సమాజ చట్రానికి వెలుపలినుండి ఆగ్రహం వెల్లడి చేస్తున్నారు. వీరి చేతలవల్లకాని, వ్రాతలవల్ల కాని ఏ పనీ జరగదని తెలుసు. అయినా తమకోపం అనేకవిధాల వెడలగ్రక్కుతున్నారు. తీవ్రంగా తీక్షణంగా భావాలు ప్రతిపాదిస్తున్నారు. వీరి వ్యాపారమంతా నయితత్పురుష సమాసం—కర్మధారయ కాదు. అశక్తి దుర్జనత్వం.

ఇదేరకం మానసాందోళన కలిగిన యువకులు కొందరు కొట్టాయిళ్ళు (Beatniks) బరితెగిపోయి—అరాజకం అన్నివిధాల తీసుకొని రావాలని ప్రయత్నం చేస్తున్నారు. వీళ్ళ అమెరికాలోను, ఫ్రాంసులోను తలసూపి, వ్రాతలలోనే కాదు, వేషభాషలలో అరాజకత్వం తేవాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి ప్రయత్నాలు గమనించేవారు ఎవరూ లేరు. ఏవో కుఱ్ఱతనపు చేష్టలుగా త్రోసిపుచ్చేవా రున్నారు.

అయితే ఈ పరిస్థితులలో—నిజానికి ఏదో చేద్దామని, ఏదో భావపరివర్తన తేవాలనీ ప్రయత్నం చేసేవారు లేక పోలేదు. వారు గద్య రచయితలు కావచ్చు. పద్య రచయితలు కావచ్చు. కాని ప్రస్తుత రాజకీయసిద్ధాంతాలు, ఆర్థిక సూత్రాలు, సామాజికవ్యవస్థ పనికిరాదని వాటిని మార్చి

స్వాతంత్ర్యమునకు ముందా? తర్వాతా?

పూర్వపుసిద్ధాంతాలు ప్రతిపాదించడమే మంచిదని గొప్ప ఆదనలు చేసినవా రున్నారు. వీరంతా సామ్యవాద సిద్ధాంతాన్ని విమర్శచేసి దానివలన ఫలములేదని నిరూపించినవారే. వీరి రచనలను సమీక్ష చేసిన రాజకీయవేత్త జాన్ స్ట్రాచీ—తాను రచించిన 'గద్గదరోదనం'! (Strangled Cry) లో ఈ భావన పరిశీలనచేస్తూ ఈ యుగంలో రచనలు అందరూ 'రియాక్షనరీ' అంటున్నారనే అభిప్రాయం వెలిబుచ్చాడు. 'రియాక్షనరీ' అయితే తప్పేమిటి అని ఆతని వాదం. దీనినే తెల్గులో పునః ప్రతిష్ఠావాదం అందాం. ఈ వాదంవల్ల సాహిత్యం పొందే నష్టమూ లేదు, లాభమూ లేదు. ఇది యీవేళ బయలుదేరిన కమ్యూనిస్టు సిద్ధాంతాలపైన తిరుగుబాటు కాదు; కడచిన అయిదువందల యేండ్లలో వచ్చిన హేతువాదము, సంస్కరణ, పరివర్తన వీటిమీద తిరుగుబాటు. అదే యీ వాదంలోని లోపము, బలమూ కూడ.

ఈ కాలంలో సాహిత్యముప్రభావము రాజకీయాల మీద హెచ్చుగా కన్పిస్తున్నది. ఒకవిధంగా చూస్తే ఈ కాలంలో వచ్చే సాహిత్యమంతా రాజకీయ సాహిత్యమే. సాంఘిక రాజకీయ పరివర్తనమే దీనిలో ప్రతిఫలించేది. ఇది ఇరవై భాషలలో ఉన్నది. ఎంతో విస్తృతంగా వస్తున్నది. ఇది మరీ హెచ్చుగా వరదలాగ పొంగి రావడంచేత దీనిని ధీమంతులయిన వారు పూర్తిగా విస్మరిస్తున్నారు కూడా. ఇలాంటి స్థితిలో ఈ రకం సాహిత్యానికి విలువ ఎవరు కల్పిస్తారు ?

ఈ విమర్శకుడు పరిశీలించిన నలుగురు రచయితలలోను ఒకరైన అమెరికన్ నవలారచయిత ఛాంబర్సు అన్నట్లు—ఇది ఆస్తికవాదులకు నాస్తికవాదులకు జరుగుతూఉన్న సంఘర్షణ. ఇది కేవలం వ్యక్తుల మధ్య జరుగుతూఉన్న సంఘర్షణకాదు. రాజ్యాల మధ్య, దేశాలమధ్య జరుగుతూన్న సంఘర్షణ కూడ. ఈ సంఘర్షణ సంగతి పేర్కొనకుండా వచ్చే సాహిత్యం లేనేలేదు. ఛాంబర్సు తనకథలో ముగింపు గురించి ప్రస్తావనచేసి—ఇలాగ అన్నాడు: నా కథలో చెప్పవలసిన విషయం ఉన్నది. ఎందుచేతనంటే నిజానికి ప్రతీ కథకు ముగింపులో ఉండే "విజయాంతం" కాని "విప్లవాంతం" కాని నా కథలో లేకపోవడమే. ఈ రెండు రకాలుగా కాక మూడవ రకంగా ముగించాను. ఈ మూడవ పద్ధతిలో ఆధ్యాత్మిక విధానంలో—మత విశ్వాసాలు—భగవంతుని మీదభక్తి వస్తాయి.

ఈ కాల స్థితిగతులు పర్యావలోకనచేస్తే—యీ సూచన పూర్తిగా అన్వయిస్తుంది. "విప్లవాంతం" చేయడం కాని "విజయాంతం" చేయడంకాని యీనాటి కావ్యాలకు పనికిరాదు. నిజానికి—విప్లవం అనేది ప్రస్తుతం లేనేలేదు. సామాజిక ధర్మము, న్యాయము జరగనీయకుండా అడ్డుపడే ప్రతికూల శక్తులు బయలుదేరినపుడు వాటిని నిర్మూలనం చేయడానికి—విప్లవం—అవసరం. ఇపుడలాంటి ప్రతికూల శక్తులూ సంస్థలూ లేవు. రాజకీయాలు, సామాజిక సిద్ధాంతాలు రెండురకాల నిరంకుశాధికార ప్రపత్తిమధ్య సీమితం అయిపోయాయి. నిజానికి లోక కళ్యాణానికి ఈ రెండు వాదాలూ అరిష్టదాయకాలే. వీటి మధ్య న్యాయము, ధర్మము నశించడానికి వీలున్నది. అయితే వీటిని తొలగించడానికి విప్లవం అక్కరలేదు. ఉభయపక్షాలూ శాంతినే కోరుతున్నపుడు, ఆశాంతి మానవజాతిలో ధర్మసంస్థాపనకోసం ఉపయోగపడేదే కాని విరుద్ధంకాదు. అందుచేత యిక్కడ భావ విప్లవం అవసరంలేదు. నేటిస్థితిలో—విప్లవానికి చోటులేదు.

అయితే యిలాంటి సంఘర్షణ లేనిచోట వ్యక్తిగత స్వార్థం తలెత్తడంకద్దు. ఆ వ్యక్తి విజయమే స్వాభిమానము స్వరక్షణ స్వాతిశయము గా పరిణమించి, స్వార్థముగా పర్యవసిస్తుంది. ఇటువంటి కరుడుగట్టిన స్వార్థజీవులనే డాంటే మహాకవి యిలాగో వర్ణించాడు. "ఇలాంటి వ్యక్తులు, పాటుపడేది దేవునికోసమూకాదు, దెయ్యంకోసమూ కాదు. తమ కోసమే! తమస్వార్థంకోసమే".

అయితే యిలాంటి వ్యక్తిగత వాదాన్నికాని సామాజిక విప్లవ వాదాన్నికాని నిరసించి ఆధ్యాత్మికవాదం చేపట్టడమంటే కేవలం భగవత్ భక్తియేనా? లేక యే ప్రత్యేకవిశ్వాసాన్ని అయినా బలపరచడమా? అనిలంటే—నిజానికి ఏమతానికీ చెందని ఆధ్యాత్మిక విశ్వాసమే రచయితలు సమర్థించవలసిన మతవాదం అనిపిస్తుంది. ఆ భగవంతుడు రోమన్ కేథలిక్ మతస్థులుకాని, ఇస్లాం మతస్థులుకాని మరొక మతస్థులుకాని సమర్థించే దైవం కానక్కరలేదు. జెన్ బౌద్ధ మతస్థులుకాని నిరీశ్వరవాదులుకాని నిరసించే భగవంతుడు కూడా కానక్కరలేదు. "పరిత్రాణాయసాధూనాం, వినాశాయ చ దుష్కృతాం ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే" అన్న విశ్వరూప సందర్శనమిచ్చిన పరబ్రహ్మశక్తి కావచ్చును. మానవులకు మాటిమాటికీ బలము, ఉత్సాహమూ ప్రసాదించి ప్రకృతికి అతీతమైన పరమపురుషస్వరూపం కావచ్చును.

ఇలాంటి ఆధ్యాత్మికచింతనకు గల అవకాశాన్ని నేటి అరాజక భౌతికవాదాలలో మునిగిన పాశ్చాత్యులు కూడ ఒప్పుకొంటున్నారు. యూరపులోకాని అమెరికాలోకాని పాశ్చాత్యులు నేటివిజ్ఞాన పరిశోధనలతో భౌతికవాదులైపోయి పరిణామ సిద్ధాంతాన్ని నమ్ముకొని హేతుపరిశీలనకు వ్యతిరేకమైనది ప్రతీ విషయమూ తిరస్కరిస్తున్నారనుకోవడం పొరపాటు. వారుకూడ ఆధ్యాత్మిక విషయాలు పరిశీలిస్తున్నారు. పరిశోధన చేస్తున్నారు. మానవునికి ఇహపరాలలో శాంతి సౌఖ్యాలనిచ్చే మానసిక తత్త్వంకోసం అరాటపడుతున్నారు. హిందూమతము ప్రతిపాదించే అద్వైతసిద్ధాంతాన్ని, జెన్ బౌద్ధము ప్రతిపాదనచేసే ప్రకృతి కృపణత్వవాదాన్ని, మార్క్స్—యెంజల్సు బలపరచిన మానవతావాదాన్నికూడ పరిశీలిస్తున్నారు. మంచిచెడ్డలు విమర్శచేస్తున్నారు. "వారికేమీ తెలియదు. వారికి భారతదేశమే విజ్ఞాన జ్యోతిని వెలిగించాలి, వేదాంత బోధచేసి యీ భవతరణోపాయం చూపించాలి అనడం" అవివేకం.

నిజానికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత యీ భావమే హెచ్చు ప్రబలిపోయింది. దీనివలన భారతదేశంలో వచ్చిన సాహిత్యము, కళలు, సంస్కృతి మహోత్కృష్టమైనవనే భావం ప్రచారంలోకి వచ్చింది. దానితో మన

పురాతన కథలను, సాహిత్యాన్ని ప్రశంసచేయడం హెచ్చయింది. స్వాతంత్ర్యానంతర పరిణామాలలో ముఖ్యమైనది యిదే. ఇది భారతదేశంలో అన్ని భాషలలోను తలసూపింది. సాహిత్యంలో ఈ పది, పదియేనేండ్లలోను మరింత ప్రచారం లోనికి వచ్చింది. ఆధునికశాస్త్రపరిశోధనలు, విజ్ఞానము, ఖగోళ, రసాయనిక, భూగోళ పరిశోధనలలో తెలిసిన అంశములు కూడ మన పూర్వ గ్రంథములలో ఉన్నవని చెప్పే దశకు మన అహంభావం పెరిగిపోయింది. హెచ్. జి. వెల్సు 1940 లో ఈ సంగతి పేర్కొని—న్యూన బుద్ధుల లక్షణాలలో ఒకటి ఆత్మస్తుతి యన్నాడు. అదే దురహంకారంగా ప్రకోపించవచ్చు. భారతదేశం ఇన్నాళ్ళు పరదేశ పరిపాలనలో ఉండి ఒక్కసారి బయటపడిన కారణంచేత—యీ అహంభావము ఈ అల్పత్వమూ అలవరచుకున్నదేమోనని పరదేశీయులకు కనిపించవచ్చు. ఈ లక్షణం భారతదేశంలో అందరికీ పట్టినది. సాహిత్యంలో ముఖ్యంగా పరిస్ఫుటంగా కన్పిస్తున్నది. ఎవరి సాహిత్యాన్ని వారు—ఇతర సాహిత్యాలన్నింటికంటె ఉత్తమమైనదని పొగడుకొంటున్నారు.

మన ఆంధ్రదేశంలో—స్వాతంత్ర్యానంతరం వచ్చిన సాహిత్యం తీసికొంటే ఇలాంటి అహంభావం వల్లనే భారత భూమిని పొగడే పాటలు, ఆంధ్రుల గొప్పతనాన్ని పొగిడే పద్యాలు హెచ్చయిపోయాయి. ఆ కాలంలో నవయుగ భావోదయం కలిగినపుడు భారతప్రశస్తి, ఆంధ్ర ప్రశస్తి పద్యాలు పాడితే ఒడలు పులకరించి ప్రజలు ఆవేశంతో ఓలలాడిపోయారు. ఈ కాలంలో స్వాతంత్ర్యం వచ్చింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణా కూడా చేరి మహాంధ్రోదయమయింది. అందుచేత యిప్పుడు "చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల ప్రశస్తి హృదయముల చీల్చి చదువుడో సదయులారా" అని కాని, "ఏరాజు పంచెనో ఇచట శౌర్యపు పాయసమ్మును నాగులచవితినాళ్ళ' అని కాని పాడితే హాస్యాస్పదంగా ఉంటుంది. అయినా — ఆయా సమయానుకూలమైన మార్పులు వర్ణిస్తూ కవులు చేసిన "రాష్ట్రగానము" మహాంధ్రోదయ వర్ణనము అప్పటికప్పుడు సరిపోయినవి. వాని సందర్భము జరిగిపోగానే చరిత్రలో దాగిపోయినవి. ఈ రచనలు చేసిన కవుల నీనాడు మనం మహాకవులుగా పరిగణించము—దేశాభిమానం, ఆంధ్రాభిమానం ఒకపుడు మంచి ఉద్రేకాన్ని కలిగించే భావాలు. ఈనాడు విశ్వకుటుంబజీవి అయిన మానవుని విశాలభావనలో భారతజాతీయతకాని, ఆంధ్రాభివ్యక్తి కాని అల్పభావాలే.

ఇంక వీటినన్నిటినీ తిరస్కరించి—మహాకావ్యములయిన రామాయణ భారత భాగవతాదులను గైకొని వాటిని తిరిగి చెప్పేవా రున్నారు. వానిలో కెమిస్ట్రీ మక్లియరుఫిజిక్సు చదివేవా రున్నారు.

స్వతంత్రభారతదేశంలో భావప్రకటనా స్వాతంత్ర్యం లభించింది. నిజమే. ఎవరు తోచిన భావాన్ని వారు ప్రచారం చేసికోవచ్చును. భారతదేశానికి ప్రజాతంత్రపరిపాలనా దక్షత లభించిన తరువాత సామాన్యమానవుడు పాలకుడు కాగలడు.. కుల జాతి మత లింగభేదాలు పోయాయి. జమీందారులు, ధనవంతులు, సామంతులు పోయి సామ్యవాద సిద్ధాంతముల మీద సమాజం ఏర్పడింది. విప్లవశంఖం మ్రోయించడానికి ఇంక ఏ ఉద్యమం మిగులలేదు. పంచవర్ష ప్రణాళిక లేర్పడి ఆర్థికంగా జనుల స్తోమత పెరుగుతోంది. అణుశక్తి, అంతర్గోళయాత్రలు, ఎలెక్ట్రానిక్స్, స్పుట్నిక్కులు మొదలయిన విజ్ఞానపరిశోధనలతో, సౌకర్యాలు పెరిగాయి. దూర భారాలు తరిగాయి. సరిహద్దులు చెరగిపోతున్నాయి. ప్రపంచమంతా ఒకటే అనే భావం పెరుగుతున్నా, అగ్రరాజ్యాల మధ్య కక్షలు ఆయుధ వృద్ధికీ అణుశక్తి మారణహోమాలకీ దారి తీస్తున్నవి. వీని సంఘర్షణలో స్వతంత్రభారత పౌరుడు ఏమనుకొంటున్నాడు ? పెరిగిన విద్యాగంధంతో తన భావలోకాన్ని విస్తరింపజేసికొంటాడా ? భారతీయ ప్రతిష్ఠ చూచి భుజములెగురవేసుకొంటాడా ? పడిపోయిన ప్రమాణాలకు విలపిస్తాడా ? పెరుగుతున్న ధరలలో అల్లాడిపోతాడా ? ఆతనికి సరియైన లక్ష్యం చూపవలసినవాడు సాహిత్యద్రష్ట.

అయితే ఈసాహిత్యవేత్త — స్వాతంత్ర్యానంతరం సత్య జగత్తునుండి మరింత దూరమై—పరారీ చిత్తగించి ఆదర్శాల నీలి మేడలో నింగి శిఖరంలో కూర్చుండి కలలు కంటున్నాడు ? ఇతడు రచించిన సాహిత్యం ఉత్తమమైనదా ? ఈతనికి నేడు స్వతంత్రభారతి యిచ్చే బిరుదులు, పదవులు, పతాకాలు, బహుమతులు ప్రదానాలు—స్వాతంత్ర్యానికి ముందు రచించిన వేత్తలకు లేవు. అయినా వారు మంచి సాహిత్యం సృష్టిచేశారు. అది ఒకరి ప్రోద్బలంవల్ల ఒకరి ప్రోత్సాహం చేత వచ్చినది; వారి ఉత్సాహంచేత, వారి ఉద్వేగంచేత సృష్టి చేసింది. అందుకే అది ఉత్తమమయింది. అయితే నేడు కవులలో అహంభావము ఆడంబరమూ పెరిగింది. అది కూడ స్వాతంత్ర్యము తరువాత వచ్చిన దుష్పరిణామాలలో ఒకటే !

ఆస్థానకవి అయిన శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు మొదలు అత్యంత నవీనులయిన విశ్వనాథ సత్యనారాయణగారి వరకు రామాయణము రచించారు. అయితే వీరి రామాయణములో ప్రత్యేకత ఏమున్నది ? పాడినదే పాట. చెప్పినదే తిరిగి చెప్పి, ఆ కథనే మరికొన్ని హెచ్చుపద్యాలలో తెగే వరకు సాగదీశారు. రాముని మానవునిగా వర్ణించినవా రున్నారు-- వాల్మీకివంటి మహాకవులు. భగవత్ స్వరూపునిగా చూచినవా రున్నారు— తులసీదాసు, కంబరు మొదలయిన కవులు. అయితే రామచంద్రుని భగవంతునిగా భావించుకొని అతనిలో ఈకాలపు చిరంజీవి రామచంద్రరావును ఆ సీతలో సౌభాగ్యవతి కుమారి జానకీరాణిని చూపించడం ఎవ్వరూ హర్షించరు. రామాయణంలో మూడు ముఖ్య నగరాలూ, అక్కడ ప్రవర్తిల్లిన సామ్రాజ్యాలూ, వానికి చెందిన మూడు విభిన్న వర్గాల సంస్కృతులూ ఉన్నవని ఆదికవి వాల్మీకి చూపించియున్నాడు. అయోధ్యలో, కిష్కింధలో, లంకలో ఎక్కడ చూచినా ఆనాటి స్థితిగతులు, సమాజ జీవనము, ప్రకృతి విశేషాలు, ఆచార సంప్రదాయాలు, సాంఘిక వ్యవస్థలూ ప్రతిఫలించే పద్ధతి కనిపించాలి. అంతేకాని రామా

స్వాతంత్ర్యమునకు ముందా? తర్వాతా?

యణం పేరున మనం తచ్చాడే మురికి వీధుల దుర్గంధము, మనము తిరుగుతూన్న పరిసరాలలోని పక్షపాతాలు, మనకు తెలిసిన మిత్రశత్రుకోటిలోని పాత్రలు గోచరిస్తే ఆ మహా కావ్య గరిమకు ఏమంత నిదర్శనము ? ఈనాటి రచనలు రామాయణం చెప్పినా, భారతం చెప్పినా ఇదే ధోరణిని ప్రతిబింబింప జేస్తున్నాయి.

పౌరాణిక కాలంనుండి చరిత్రకు తెలిసిన కాలంలో ప్రవేశించి కొందరు ఎన్నో కథలు వ్రాస్తున్నారు. ఉదాహరణకు ఆంధ్రుల చరిత్రగూర్చి వ్రాసిన 'ఆంధ్ర పురాణము' అసంపూర్ణకావ్యముగా వచ్చినది. దీనిలో — చరిత్రకు తెలిసిన అంశాలను కల్పనతో మేళవించి ఆంధ్రాభిమానాన్ని ఉగ్గడించేదిగా ఉన్నదేమో కాని ఏ కావ్యత్వగుణమును పొంద లేదు. పైగా ఈ రకపుకావ్యము — కొడాలి వేంకటసుబ్బారావుగారు రచించిన 'హంపీ క్షేత్రము'నకు అనుకరణ అనిపించే ఘట్టాలతో అలరారుచున్నది. ఇదేపద్ధతిలో—'ద్రాక్షారామము', 'సింహబలి' వంటి కావ్యములు వచ్చినవి కాని వీనిలో కావ్యత్వగౌరవము ఉన్నతశ్రేణిని అందుకోలేదేమో !

ఇంక జీవితచరిత్రలు కథావస్తువులుగా తీసికొన్న రచయితలు కూడ ఈ కాలంలో పలువురు కనిపిస్తున్నారు. గడియారం వేంకటశాస్త్రిగారు ప్రారంభంచేసిన 'శివభారతము' పద్ధతిలో ఎందరెందరో వ్యక్తిగత విజయాలను ఉగ్గడించే జీవితచరిత్రలు పద్యకావ్యములుగా రచించి తమ ప్రతిభను ప్రకటించుకొన్నారు. ఉదాహరణకు 'శ్రీ కృష్ణదేవరాయల' గూర్చి వచ్చిన కావ్యము 'శంకరాచార్యుల' వారిని గూర్చి చెప్పిన కావ్యము, నాగార్జునాచార్యుల ప్రతిభ నుగ్గడించిన కావ్యం—ఇటువంటివి చాలా పేర్కొనవచ్చును. కాని వీనిలో ఒక యుగకవిని, ఒక ప్రవక్తను చూపు ప్రత్యేక కృషి కనిపించక ఎవరో ఒకరు చూపిన మార్గమును అనుకరించిపోయే బాట మాత్రం కనిపిస్తున్నది. ఈ రకపు కావ్యాలలో పోతన గూర్చిన మహాకావ్యం తెలంగాణా కవి వానమామలై వరదాచార్యులుగారు రచించినది ఇంకా అప్రకటితంగానే ఉండిపోయింది. అది వస్తే—దానిని విమర్శకులు ఏ కోవలో చేర్చగలరో ! ఈ రకపు రచనలలో కూడా స్వాతంత్ర్యం పూర్వం వచ్చిన శివభారతం, రాణాప్రతాపసింహ వంటి రచనలే ఉత్తమమైనవిగా తోస్తున్నవి.

నిజానికి మన దేశం సంస్కరణోద్యమంలో ప్రవేశించిన నవోదయకాలంలో ఒక క్రొత్త ఉద్యమం ఈ శతాబ్ది ఆరంభంలో ప్రారంభమయింది. ప్రబుద్ధభారతంలో ప్రవేశించిన ఆ ఉద్యమమే అభినవ కవితగా అన్ని భాషల సాహిత్యంలోనూ వ్యాపించింది. తెనుగుదేశంలో అది ఒక పుష్కరం దాటిన తరువాత 1912 లోనో 1913 లోనో మొదలయింది. అపుడే తోకచుక్క చూచి గానంచేసిన విప్లవ కవి గురజాడ అప్పారావుగారు, ఆంధ్రోద్యమంగురించి ఆవేశ మెత్తిన ఆత్మాశ్రయవాది రాయప్రోలు సుబ్బారావుగారు వైతాళికులై తమ కవితాగానం వినిపించారు. వారి గొంతుకలు క్రొత్తగానే ఉన్నవి. భావము, భాష, అభిప్రాయము అన్నీ క్రొత్తవే. ఈ క్రొత్తదనం అందరూ పోల్చుకొన్నారు. అదే అభినవ కవిత, భావ కవిత, నవ కవిత. ఈ నవకవిత్వం వచ్చిన క్రొత్తరోజులలో—ఎందరో యువకులు ముక్తకంఠంతో తమ కవితలు వినిపించారు. వారిలో వచ్చిన ధోరణిలో మూడు ముఖ్య లక్షణాలు కనిపిస్తవి. అవి జాతీయాభిమానం, ప్రకృతి సౌందర్యారాధన, ప్రణయ నివేదన. ఇవన్నీ ఆత్మాశ్రయ భావములే—సమాజ దృక్పథం లేదు. విప్లవదృష్టి లేదు. ఆత్మీయదృష్టి ఉన్నది. ఈ రకపు కవిత్వము ముప్పై నలబై యేండ్లవరకు ముద్రవేసి నిలిచినది. కాని ఆ భావాల ధోరణులు ప్రాతపడగానే అది వెగటు కలిగించింది. ఆ కాలంలో నవకవితలు రచించిన కవులలో ఆంగ్ల సాహిత్యంలో రొమాంటిక్ ఉద్యమం ప్రారంభం చేసిన షెల్లీ, కీట్సు, వర్డ్సువర్తు వంటి కవులలో వలెనే మూడు ముఖ్యమైన ప్రభావాలు పనిచేశాయి. అది వ్యక్తిత్వము, శైలి, నిజాయితీ. (Personality, style and sincerity). వాని వల్లనే వారు మంచి కావ్యాలు రచించారు. ఆకాలంలో 'ఎంకి పాటలు' పాడినా, ''కిన్నెరసాని'' ఆడినా, గిరికుమారుడు గీతం ఆలాపించినా, సౌభద్రుడు ప్రణయయాత్ర చేసినా, కృష్ణపక్షంలో కన్నీరుకార్చి ఊర్వశికోసం ప్రవాసం అనుభవించే కవి ఏకాంతసేవ చేసినా వానిలో నిజాయితీ ఉన్నది. చిత్తశుద్ధి ఉన్నది. కవికోకిల పానశాలలో రుబాయీలు పాడినా, కవికొండల గడ్డిపూలగూర్చి గానంచేసినా ఒక రమణీయభావం ఉన్నది. వానిలో భావకవితవచ్చినా అహంభావకవిత వచ్చినా ఉత్తమ కావ్యలక్షణమైన 'ధ్వని' ప్రతిధ్వనించింది. ఈ నాడు, రొమాంటిక్ కవిత్వం వ్రాస్తున్న కవులున్నారు కాని ఎవరో ఆంగ్లవిమర్శకు డన్నట్లు ''ప్రతిధ్వనియే'' కాని 'ధ్వని' లేదు. రసస్పందనం లేదు. ప్రతిశ్రుతులే కాని శ్రుతులు లేవు.

అందుచేత—స్వాతంత్ర్యం అనంతరం ఎవరు రొమాంటిక్ కవిత్వం చెప్పినా ఆ కాలపువారిని అనుకరించక తప్పదు. ఎవరు ఎంత క్రొత్తగా రచించినా నిజాయితీ లోపిస్తున్నది. చిత్తశుద్ధి కనిపించదు. వారి నవీన గేయరచనల్లో ఎక్కడో ఒకచోట ఆ ప్రణయకవితాసారథులయిన వైతాళికుల కంఠం వినిపిస్తూనే ఉంటుంది. యుగప్రతినిధులయిన కవులు గోచరించరు. ఏదో తెచ్చిపెట్టుకున్న పలాయన వాదంగా ఎస్కేపిజమ్‌లాగ తోస్తుంది.

ఈ భావకవితా యుగంలోనే, మానవతావాదం మాటు మణగలేదు. గురుజాడ అప్పారాయకవినుండి నేటివరకు సాంఘిక న్యాయాలు గూర్చి, సామాజిక ధర్మం గురించి, మానవతా సమానత గూర్చి రచనలు చేస్తూనే ఉన్నారు. అటు వంటివారిలో 'యుగకర్త—మరో ప్రపంచపు ధగధగలు చూచుకుని ఉద్బుద్ధుడయిన శ్రీ శ్రీ. గురజాడ అడుగుజాడలలో క్రొత్తదారి చూచిన యీ కవి ''ప్రభవ'' లో ప్రణయ గీతాలు పాడుకొని ప్రయోజనంలేక క్రొత్తపిలుపు విని మహాప్రస్థానంవైపు మళుపు తిరిగాడు. అతని కంఠంలో ఒక ఉచ్చస్వరం, ఒక విప్లవ శంఖం వినిపించింది. దానిని విని చాల మంది విస్తుపోయారు. పతితుల్ని, భ్రష్టుల్ని ఉద్దేశించిన

ఆ నినాదం కర్షకుల, కార్మికుల ఘర్మజలానికి ఖరీదుకట్టే షరాబు లేడని నిరూపించింది. ఒక విప్లవవాదాన్ని ప్రతిపాదించింది. ఆనాటి ఆర్థికస్థితిగతుల తాడనలో, దరిద్రదేవత పదాఘాతంలో నలిగి చేదు విషం పాటలు పాడాడు. ఆ మాటలో, ఆ పాటలో నిజం యముని మహిషపులోహఘంటలాగ పలికింది. నేటి సాహిత్యవేత్తల్లో ఒకరైన విశ్వనాథవా రన్నట్లు హేతువాదయుగాన్ని ప్రారంభం చేసింది శ్రీ శ్రీ.

అతని తరువాత, ఆతని కావ్యం మహాప్రస్థానం తరువాత "శ్రీ శ్రీ మార్కు" పద్యాలే చాలమంది వాడుకొన్నారు కాని తమ ప్రత్యేకత నిలుపుకొన్న కవులు హెచ్చుగా లేరు. స్వాతంత్ర్యం తరువాత—ఏర్పడిన స్థితిగతులు చూచి "నిరుడు కురిసిన హిమసమూహములేవి తల్లీ" అని పాట పాడినా శ్రీ శ్రీ యే పాడి వినిపించారు. "ఏది సత్యం ఏ దసత్యం" అని మహాత్ముని మరణశయ్యపైన మాలలు వేస్తూ కఠోర ప్రశ్న వేసినా శ్రీ శ్రీయే వేయవలసి వచ్చింది. ప్రాస క్రీడలు చేసినా అతడే; వెకిలి పద్యాలు వ్రాసినా అతడే; డబ్బింగు డబ్బు పాటలు పాడినా అతడే. అతన్ని అనుసరించి మౌనశంఖం పూదినవారు సప్త సముద్రాలమీద జలతరంగిణి వాయించినవారూ, "త్వమేవాఽహమ్" అని సినీవాలిలో చందమామను చూచినవారూ ఉన్నారు. ఇది చెప్పడానికి ఛందోబందోబస్తులు చట్‌ఫట్‌మని త్రెంచి అర్థాన్ని అర్థానపు అడవిలో వదలిపెట్టినవా రున్నారు. నసన నత్తిమాటలు చెప్పి ప్రే It is Poetry అన్నవారూ, మీటనొక్క చంద్రుణ్ణి వెలిగించుమన్నవాళ్ళూ, మస్తిష్కంలో లేబరేటరీలు చూచినవాళ్ళూ ఎందరెందరో ఉన్నారు. ఇదిగాక, సంప్రదాయములమీద తిరుగుబాటుచేసి, భాషలో భావాలలో విచ్చలవిడి విశృంఖలత తెచ్చిన కవులు చాలమంది వచ్చారు. ఆ రకం కవులలో సమదర్శనం చేసేవాళ్ళు, తేనె పాటలు పాడుకొనేవాళ్ళు, మనోభూమికలు రచించేవాళ్ళూ, చిరంజీవి మానవునికి లేఖలు వ్రాసేవాళ్ళూ, మేలుకున్న ఆకాశాన్ని క్రిందకి దించేవాళ్ళూ, క్లార్కు సూర్యారావును సముదాయించేవాళ్ళు, ఇలాగ ఎన్ని రకాలు. కొందరు క్రొత్తగా చెప్తున్నట్లు నటించి ఏ డైలాన్ థామస్‌నో, ఏ క్రిస్టఫర్ ఫ్రైనో, ఏ ఇలియట్‌నో అనుకరిస్తారు. కొందరు ఫాషన్ కోసం పాస్టర్‌నాక్ కవిత్వానికి అనువాదమనో, పాలు ఎలువార్డుకి అనుకరణమనో క్రొత్తకవిత్వం చెబుతారు. ఈ రకం గేయ కవిత్వమూ, వచన గీతికలూ చూస్తే ఒక్క సంగతి బోధపడుతుంది. అది ఆధునిక కవిత్వం గురించి ఆంగ్ల విమర్శకులు చెప్పినమాట—ఆధునిక కవిత రానురాను అయోమయం అయిపోతున్నదని;—యుద్ధానంతర కవితకు చెప్పిన యీ లక్షణమే మన ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యానంతరం వచ్చిన కవితకు పట్టినది. అయోమయ భావాలు అర్థంకానిక్లిష్టతతో అన్వయ దోషాలతో అవకతవక సమాసాలతో కలవరపెడ్తూ ఉంటాయి. దానికి కారణం రచయితలలో అవగాహన లోపించడమే! నిజాయితీకాని, నిర్మమత కాని లేకపోవడమే! ఏదో చిత్రంగా ఉత్త చమత్కృతితో చెప్పి ఎదుటివాళ్లను విభ్రాంతుల్ని చెయ్యాలనే సంకల్పం తప్ప తనకు తోచిన భావం సొగసుగా చెప్పడంలేదు. అందుకే ఉపమానాలు, రూపకాలు, భావాలు, అన్నీ ఎరువే. ఎరువుసొమ్ములు బరువు చేటైనా సరే ఈ యనుకరణలూ, అపహరణలూ మానరు. ఛందస్సు లేనేలేదు. భాషలో స్పష్టత ఉండదు. ఇటువంటి రచనలలో ఏది మహాకావ్యం అనగలము? ఎవరిని మహాకవి అని పేర్కొని ఊరేగించగలం? ఏ పాశ్చాత్యకవి భావమో తీసికొని స్వంతంచేసుకొని నిర్లజ్జగా, నిస్సంకోచంగా తాము ప్రకటించడం!

స్వాతంత్ర్యానంతరం వచ్చిన సాహిత్యం సమగ్రంగా పరిశీలన చేస్తే కొన్ని లక్షణాలు కనిపిస్తున్నాయి. అవి ఆడంబరత, అపహరణ, అర్థక్లిష్టత. ఆడంబరత వలన వచ్చిన లక్షణమే ఆత్మస్తుతి అహంభావమున్నూ. మరొక భాషలో సాహిత్యము చదువకుండా మరొక కవి పరిచయము లేకుండా "ఇంతటి ఉత్కృష్టకావ్యము మరే భాషలోనూ లేదు. ఇంతటి మహాకవి మరే సాహిత్యంలోను పుట్టబోడు" "ఇంత గొప్ప కవిత్వం చెప్పేవాడు—ఎక్కడో అన్నమాట ఏమిటి తెనుగు దేశంలోనే లేడు"—ఇలాంటి ప్రకటనలు తరచు చేస్తూ ఉండటం పరిపాటిఅయింది. ఊరూరా ఊరేగింపులు, ఉత్సవాలు చెలరేగి ఊకదంపుడు ఉపన్యాసాలు ఎక్కువైనాయి. ఈ కాలంలో—సాహిత్యంలో కూడ మఠాలు ప్రవేశించి మఠాలూ, భజన కూటాలూ ఏర్పడ్డాయి. ఒక్కరుంటే వారి చుట్టూ చెక్కభజన చేసేవాళ్ళూ చేరుతున్నారు. కనకాభిషేకాలు, గండపేరండాలు, గజారోహణ మహోత్సవాలు. ఇంతటితో ఆగక కవి సామ్రాజ్యాధిష్ఠానదేవతలలాగ సమ్రాట్టు బిరుదులు తగిలించుకొనడం, మహాకవులు అనిపించుకోవడం ఒక ప్రచారనీతి అయిపోయింది. నిజానికి ఈ పది పదిహేనేళ్లలో యీ మహాకవులు, మహాకవి సార్వభౌములూ కవిసమ్రాట్ శేఖరులూ వీధివీధికీ, పల్లెపల్లెకు ఒక్కొక్కరుగా తయారయ్యారు. వీరు రచించిన కావ్యాలు తక్కువ. ఉన్నవానిలో పస తక్కువ. పూర్వపు ఖ్యాతిగురించి చెప్పుకుని వాటిని గూర్చి సన్మానాలు చేయించుకొనేవారు ఉన్నారు. నేడు ఏవో పనికిరాని అనువాదాలు చేసి తమ పూర్వ కీర్తిసంపదను గంగపాలు చేసికొనే లబ్ధప్రతిష్ఠులూ ఉన్నారు. పాతికేండ్ల క్రితం వైతాళికుల జాబితాలో చేరినవారే ఈనాడు షష్టిపూర్తులు చేసుకొని తిరిగి పూర్వరచితకావ్యాలనే పొగడించుకొంటున్నారు. ఉదాహరణకు ఒకానొకచోట — ఒక మహాకావ్యం ఉదయించి పాతికేళ్ళు నిండినదని రజతోత్సవం జరుపుకొన్నారు. సువర్ణపత్రంమీద సన్మాన వాక్యాలు వ్రాయించుకొన్నారు. ఇంతకీ ఆ మహాకావ్యం—రెండువేల యేండ్ల క్రితం ఒక మహనీయుడు గొప్పగా రచించిన సంస్కృత కావ్యంలో ఒక చిన్న భాగానికి బహిరంగంగా చెప్పని అనువాదం. ఆ సంగతి ఏతత్ కావ్యకర్తలు నాటికీ నేటికీ ఎక్కడా ఒప్పుకోలేదు. ఇలాగ—కొందరు చెప్పి, కొందరు చెప్పకుండా గ్రంథచౌర్యం చేసినవారు చేస్తున్నవారు తెలుగు నాట నేటి సాహిత్యవేత్తలలో అనేకులున్నారు. అనువాదంచేయడం, అనుకరణ చేయడం అవమానహేతువైన కార్యం కాకపోయినా,

స్వాతంత్ర్యమునకు ముందా? తర్వాతా?

కొందరు ప్రబుద్ధులు ఆ యదార్థం బయటపెట్టకుండా అలాగ చిరకాలం దాచుకొంటూ ఉంటారు. అట్టి వారిని మహాకవులని పొగడి యెక్కడ పట్టం కట్టగలము ?

ఇంక యీ తరం కవులూ రానున్నతరంవారిలో కవులు మూడు రకాలుగా చీలిపోతున్నారు. ఒకరకం ప్రబంధ పద్ధతిగా పద్యాలు వ్రాసేవారు. ఛందోరీతులు పాటిస్తూ చెప్పవలసింది చక్కగా, చమత్కారంగా చెప్తున్నవారు. అలాంటి వాళ్లు దేశంమొత్తంమీద రెండు, మూడు వందలమంది పద్యకర్తల వరకు ఉన్నారు. వారి కావ్యాలు చదివి హెచ్చుమంది మెచ్చుకొంటున్నారు. నేటి ప్రచారసాధనాలయిన సినిమా, రేడియో, గ్రామఫోన్, అచ్చుయంత్రం ఇటువంటి వానివలన వేలకు వేలు ప్రతులు చెల్లిన కవితాగ్రంధాలు, కీర్తిప్రఖ్యాతులు సంపాదించిపెట్టిన కవితా సంపుటాలు ఉన్నవి.

ఈ ప్రజాస్వామికయుగంలో బహుజనసమాదరణ పొందిన కవులకు విలువ యున్నది కాని సాహిత్యంలో ప్రమాణాలు సంఖ్యాధిక్యాన్ని బట్టి నిర్ణయించడానికి సహృదయ విమర్శకులు నిజానికి ఒప్పరు. ఇంతమంది కమ్మగా పద్యాలు వ్రాసేవారున్నా కవితాపీఠంలో మహోన్నతస్థానం ఆక్రమించగల్గినవారు ఒక్కరూ లేరేం ? కారణం వారిలో నిజాయితీ లోపించడమేనేమో ! అంతేకాక వారు క్రొత్తగా చెప్పవలసిందేమీ లేకపోవడం కావచ్చు. చెప్పవలసిన విషయం ఏదైనా ఉంటే అది యింతకంటే అందంగా, ఇంతకంటె సూటిగా ఇదివరకు ఎవరో చెప్పివేశారు. అందుచేత ఆ తరం కవులలో ఆశించవలసింది ఏమీలేదు. వారి యుగం అయిపోయింది. మంచిగానో, చెడ్డగానో వారు పాతికేళ్లక్రితం రచించిన అభినవకవిత్వంమీదనో నాటి నవకవిత్వంమీదనో ఆధారపడవలసిందే. క్రొత్త భావమూ లేదు. వారిని ఉద్రిక్తత పరచిన ఉద్యమమూ లేదు.

స్వాతంత్ర్యానంతరం ఇంతహెచ్చుసాహిత్యం వస్తే ఇందులో ఏ యొక్క రచనా ఉత్తమస్థాయి నందినది లేదా యని ప్రశ్న రావచ్చును. నిజానికి లండన్ టైమ్సు పత్రికలో ఒక బెంగాలీ రచయిత భారతదేశంలో యీ స్వాతంత్ర్యానంతరం కవిత్వాన్ని సమీక్షచేస్తూ దేశం మొత్తంమీద నలుగురు పేరులు చెప్పాడు. బెంగాలీలో ప్రేమేంద్రమైత్ర, హిందీలో సూర్యకాంత త్రిపాఠీ (నిరాలా) (ఇటీవలే యీయన కీర్తిశేషు డయ్యాడు), మరాఠీలో కీ.శే. బి. యస్. మర్ఢేకర్, తెనుగులో నార్ల వెంకటేశ్వరరావు. ఈ విమర్శకుని దృష్టిని ఆకర్షించిన అంశం యీ కవులు ప్రతిపాదించిన జీవిత విమర్శ (Poetry as criticism of life). వారి నిజాయితీ. వారు ప్రతినిధులయి వర్ణిస్తున్న జాతిని గూర్చిన వాస్తవికత. ఆ దృష్టితో చూస్తే "నార్ల" రచించిన 'జగత్ కథ', 'మావూరు', 'నార్లవారి మాట' ఆధునికమైన తెనుగు జీవితంమీద మంచి విమర్శలే. కాని ఈ రచనలు—స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన, రామిరెడ్డిగారి "కృషీవలుడు" 'వనకుమారి', 'నలజారమ్మ' వంటి కావ్యాలతో పోల్చగలమా? నార్ల రచించిన కావ్యాలు చాల తక్కువ. వానిలో కావ్యసౌందర్యము ప్రాచ్య పాశ్చాత్య లక్షణములబట్టి చూస్తే అత్యున్నతస్థాయి నందుకోదగినదని ఎంద రొప్పుకుంటారు ?

· నిజానికి ఇంత నిజాయితీతో వ్రాస్తున్న కవులు చాలా అరుదు. 'నార్ల' వలెనే—తాము అనుభవించిన వాస్తవికానుభూతులను కవితారూపంగా చిలకరించిన కవులలో బోయి భీమన్న, దాశరధి, నారాయణరెడ్డి కనిపిస్తున్నారు. భీమన్న—"దీపసభ", "కావ్య కుసుమావళి", "రాగోదయం" వంటి కావ్యాలలో అచ్చటచ్చట భావకవితలను స్ఫురింపజేసినా యీ కవిహృదయంలోని నిజాయితీని శంకించడానికి వీలులేదు. మరొక రకం—అభినవ కవితను శృంగారరసాత్మకం చేసి ప్రబంధరీతి ప్రణయపథంలో పడి నేటికాలపు గేయఫణితి వరించిన సి. నారాయణరెడ్డి కవిత్వంలో ఒక శైలి ఉన్నది; ధారాశుద్ధి ఉన్నది. నిండు మనమ్ము నవ్యనవనీతము చేసిన గండుతనం కాని, గాంభీర్యం కాని లేదు. అలాగే—దాశరధి ప్రబంధఫక్కిని పద్యాలలో పిడుగులు రాల్చగలడు., రుధిర జ్వాలతో వేడినెత్తురు పొంగించగలడు. తెలంగాణా వీణలో కోటి రాగాలు మీటించగలడు. దాశరథీశతకం చెప్పి తమాషాలు చేయగలడు. మహాంధ్ర గూర్చి మహనీయస్తుతి చేయగలడు. గాలిబ్ గజల్సు గళగ్రాహిగా పలికించగలడు. కాని "పలికెడివాడు ప్రౌఢకవి" అని పట్టుతోపల్క లేకపోతున్నాడు. అలాగే ఆరుద్ర పురుగులాగ "ఆరుద్ర" ఆరడి గారడీలు చేసి స్పుట్నిక్కులతో సూర్యగోళంమీదికి పోవచ్చు. అనువ్రతిలో కుక్కముట్టిన శిశువును గూర్చి అశ్రుగీతి ఆలాపించవచ్చును. కాని ఆత డెక్కబోయే ట్రెయిన్ ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు. ఆశయాల ఎక్స్ప్రెస్‌ల గేజ్ వెనుక బ్రేక్ వేనులో వేయువలసిందే ! ఇలాగ ఎందరెందరో కవులున్నా ఏ యొక్కరి రచనా మనల్ని ఆకర్షించలేకపోతున్నదేమి ? అది వారిలోపమా ? మన రసగ్రహణ లోపమా ? వీరిలో కొందరిలో లోపించిన నిజాయితీ కొంత కారణం కావచ్చు. లేక యీ యుగ లక్షణములయిన ఆడంబరత, అనుకరణశీలము, అయోమయత్వము కొంతకారణం కావచ్చు.

ఈ యరాజకంలో ఏ కొంచెమైనా ప్రత్యేకత నిరూపింపజాలు కవితాగ్రంథములు లేవా అంటే ఉన్నవి. అవి వ్రేళ్లమీద లెక్కింపతగినవే. ఉదాహరణకు—రాయలసీమలోని కరువు కాటకాలు చూచి ఆ క్షామానికి బలి అయిన ఒక రైతు కుటుంబపు విషాదగాథ తీసుకొని అలనాటి వాల్మీకి లాగున మధనపడి శోకించి పరితపించి, కోపించిన కవి యున్నాడు. ఆ శోకమే శ్లోకమైనట్లు ఆ కోపశాపాలే ఈ కవి రచించిన మహాకావ్యమైనది. అది విద్వాన్ పెన్నేటిపాట."

"ఇదే పెన్న ఇదే పెన్న
నిదానించి నడు—
విదారించు నెద ?"

అని పెన్న నది ఒడ్డున బీడుపడిన పొలాలలో అడుగులు తడబడుతూ ఆక్రోశించిన రైతుపాటయే పెన్నేటి పాట. స్వాతంత్ర్యానంతరం వచ్చిన రచనలలో "పెన్నేటిపాట" పట్టి

నిలిపి చదివిస్తుంది. ఈ పాట పాడిన కవి విద్వాన్ విశ్వం రాయలసీమలో ఉండి అచ్చటి కరువు కాటకాలు ప్రత్యక్షంగా చూచివచ్చిన తరువాత, ఒక భావోద్రేకంతో వ్రాసినది. ఆ కారణంచేత అనుకంపతోపాటు ఆవేశంతోపాటు అమర్ష నిలిచి పోయింది. అందుచేతనేమో ఈ కావ్యానికి రావలసిన ప్రశస్తి రాలేకుండా చేసింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన మంచి కావ్యాలలో ఒకటి "పెన్నేటిపాట". కాని ఆ కావ్యంవ్రాసిన కవికి స్వాతంత్ర్యానంతర కవిశ్రేణిలో ఏస్థానం లభిస్తుంది ?

ఈకాలపు విపరీత పరిస్థితులను చూచి హేళనచేస్తూ వచ్చిన హేళనకావ్యము లెన్నో వచ్చాయి. వానిలో జాషువాగారి "గబ్బిలము" వల్లూరుదుర్గయ్యగారి "గంగిరెద్దు", భీమన్నగారి "పిల్లి శతకము", శ్రీ శ్రీ "సిరిసిరిమువ్వ శతకం" కృష్ణశాస్త్రిగారి. 'వేమన శతకం' ఇటువంటివి, నార్లవారి వాస్తవమ్ము—ఎన్నయినా చెప్పవచ్చును. వీటివలన కొంత చమత్కారము, కొంతవెటకారము, కొంత వేళాకోళము తప్ప మహాకావ్యత్వసిద్ధి లభించదు. లభించునని ఆ రచయితలు కైతము ఎన్నడూ ఆశించియుండరు. ఒక కథ, దానికి ప్రధాన రసము, అంగిరసములు ఇతరకావ్యలక్షణములు కలిగిన కావ్యాలు ఈకాలంలో అరుదే అయినప్పటికీ కొందరు నూతవ రచనలు ఈ లక్షణములతో చేసే ప్రయత్నం కూడ చేస్తున్నారు. ఉదాహరణకు వీరరసప్రధానమైన ఇతివృత్తం తీసికొని మోటూరి వేంకటరావుగారు "సింహబలి" అనే కావ్యం వ్రాస్తే అందులో యుద్ధవర్ణనలు తిక్కన రచనను తలపింపజేసింది అన్నవా రున్నారు. అలాగే 'మధూళిక' అను పేరున దుర్గానంద్ రచించిన కథాకావ్యంలో హిందీ సాహిత్య ప్రభావం ద్యోతక మయిందని పల్కినవా రున్నారు. భాషా సమితి బహుమతి నందిన "అమరవీణ" పద్యకావ్యము ఆర్ఫియసీ జీవితగాథను కవితాగానం చేసింది. అలాగే కవితా' రంగంలో ఆంధ్రపత్రిక బహుమతినందిన "ఆంధ్ర విప్లవు' ద్విపదకావ్య మున్నూ దేనికది ప్రత్యేకత కూర్చుకున్న కావ్యమే అయినా ఉత్తమశ్రేణిలో చేర్చదగిన ఉన్నతస్థాయి నందుకొన్నదా ?

స్వాతంత్ర్యం తరువాత ప్రకాశకులు, స్వయం ప్రకాశకులు ఎక్కువయినారు. ఇంక—ఏనాటి కానాడు క్రొత్త రచనలు క్రొత్త కవులు చేసినవి ప్రాతకవులు చేసినవీ పుస్తకరూపంలో వెలువడుచున్నవి. పత్రికలలో సాక్షాత్కరిస్తున్నవి. వేదికలపైన వినపడుచున్నవి. "ఆహా ఎంత గొప్ప కావ్యము !" "ఎంత గొప్ప కవి" అని కలకాలం చెప్పుకొనేటట్టు పలికినవి ఏ యొక్కటీ కనుపించడంలేదనీ సాహితీప్రియులయిన పలువురినోట వినిపిస్తున్నది. కారణం—ఈ కవులను ఉగ్రరాత లూగించి ఉద్వేగంతో పలికించే ఉద్యమం ఏమీ లేకపోవడమేనేమో ! ఒక నిండుతనం లేదు. ఒక నిర్మలాంతఃకరణం లేదు. అంతా ఖాళీ.

అమెరికన్ రచయిత ఛాంబర్సు చెప్పినట్లు నేటి కవులు విప్లవంగురించి వర్ణించాలంటే విశ్వవిప్లవం తెచ్చిన భావాలన్నీ ఇదివరకే ఎవరో ఒకరు ప్రతిపాదించి ఉన్నారు. అలాగే వ్యక్తిగతమైన ధర్మవిజయాన్ని వర్ణించాలీ అంటే అది కేవలము కరుడుకట్టిన స్వార్థంలోనికి దిగజారిపోయి ఒక వ్యక్తి సాధించిన స్వంతలాభంలాగ తేలిపోతున్నది. "దేశాభిమానం నాకు కద్దని వట్టిగొప్పలు చెప్పబోకోయి, పూనియేదైనాను, గట్టిమేల్ తలపెట్టవోయి" అనే నినాదం కూడా చెప్పడానికి ఈకాలం వాళ్ళకి భయం వేస్తున్నది. ఈ కాలంలో యువకరచయితలు, భాషలో, భావంలో తమ అర్భకత చాటుకొంటున్నారు. నిర్భీకత, నిశ్చలత, నిర్మలత వారికి అలవడటంలేదు. విప్లవాత్మకూ విశిష్టవ్యక్తికీ జరుగుతున్న సంఘర్షణలో మధ్య తరగతి ప్రజలు మౌనప్రాణులై పోయారు. స్ఫూర్తి మాటాడలేరు. ధైర్యంగా ముందు నిలువబడలేరు. దొంగచాటుగా వంగి వంగి సలాములు చేస్తారు. వంగి మాటలతో ముందు పొగడి వెనుకనుండి దెబ్బలు తీస్తున్నారు. సత్యాన్ని చెప్పగల సాహసంలేదు. సత్యం, ధర్మం దర్శించాలని కాని ఆకాంక్షలేదు. అబద్ధం, అన్యతం ! అందంగా అవుపించే అబద్ధాన్నే అలంకారాలుచేసి చేతనైనంత ఆడంబరంగా అందిస్తున్నారు. దానికి మనప్రాచీనహిందూ ధర్మం, భారతీయసంస్కృతి, వేదాంతవిద్య ఇలాంటివి ముదిరంగులుగా మురిపెపుతెరలుగా పెట్టుకున్నారు. దానికి ఆధ్యాత్మిక విజ్ఞానం, శాంతి సందేశం అనిపేరులు పెట్టున్నారు. ఆత్మవంతన చేసుకుంటున్నారు. తమయెడలగాని, తమ సంస్కృతి యెడలగాని తమ సాహిత్యంయెడలగాని తమకే నమ్మకంలేదు.

స్వాతంత్ర్యానంతరం ప్రవర్తిల్లిన భావసంఘర్షణలో మొట్టమొదట బలిఅయిన ప్రథమయోధుడు 'సత్యం'— రెండవచావు భారతీయ సభ్యత లేక సంస్కృతి—దీనినే పూర్వీకులు 'శివమ్' అనేవారేమో. మూడవది— 'సుందరమ్'—ఈ కాలంలో అందమైనదీ, ఆనందకరమైనదీ అరుదై పోయినది. కనీసంవాటిని గుర్తించే కళ్ళుకూడ కరువైపోయినవి. మనసాహిత్యరంగంలో పూర్తిగా లోపించినవి సత్యమ్, శివమ్, సుందరం. ఇలాంటి—సమాజంలో ఉద్భవించిన కవిత్వం పలాయనవాదం పఠించిందంటే ఆశ్చర్యమేమున్నది? ప్రగతి, పరిణామవాదంపేరున ప్రచారగీతాలు పాడుతున్నది. నీతి పాఠాలు చెప్తున్నది. విశ్వశ్రేయస్సు, సదసద్విచారం పేరున విచారగేయాలు వినిపిస్తున్నది. కావ్యాలంకారసారసంగ్రహం పేరున కష్టలకు కావేశాలకు వారితీస్తున్నది? ఈయపస్వరాల మధ్య సాధుసంగీతం ఎలాగ పోల్చుకొనడం? ఏ చిన్నగొంతు అయినా సన్నగా పలుకుతూఉంటే ఈ యార్భాటాల సంరంభంలో ఎవరు వినుపించుకుంటారు? ఎవర్ని వినినిస్తారు? వింటే, ఎక్కడయినా ఉత్తమకవి కంఠం పోల్చుకోగలమేమో ? ఉత్తమసాహిత్యలక్షణాలు కవిత్వంలోనే లేకపోతే గద్యరచనలలో ఎక్కడ? ఈ దృష్టితో పరికిస్తే స్వాతంత్ర్యానికి పూర్వంవచ్చిన సాహిత్యమే మెరుగేమో! స్వాతంత్ర్యంవచ్చి మనసాహిత్యవేత్తలను రాజకీయదాసులుగానో ప్రభుత్వ ప్రచారకులుగానో చేసిందేమోకాని ఉత్తమసాహిత్య స్రష్టలుగా చేయలేదు. దీనికి మీరేమంటారు ?

తొలి మజిలీ

'ఆదివిష్ణు'

ఇప్పుడు నా వ్యక్తిత్వమ్మీద నాకు నమ్మకం ఏర్పడింది!

ఈనాడు నేను ఉద్యోగిని. అందరూ నన్నిప్పుడు గౌరవిస్తారు. నాకో స్థాన మిస్తారు. నన్ను చూచిఅమ్మ గర్విస్తుంది. తమ్ముడి చదువు నిర్విఘ్నంగా సాగగలదు.

ఈ రెండేళ్లనుంచీ నన్ను వెంబడించిన సమస్యకు స్వస్తి పలికాను. ఈ శుభసమయంకోసమే రెండేళ్లనుంచి ఆశతో ఎదురుచూశాను. నాతోపాటు అమ్మా, తమ్ముడూ కూడా నిరీక్షించారు యీ ఘట్టంకోసం.

మాకు భయం దూరమయ్యింది. అందరిలోనూ అవు ననిపించుకుంటాము.

నా చదువూ, నేనూ—మన్ననల నందుకుంటాం. ఇంత కంటె నాలాటి మనిషి కోరుకునే దేమున్నది గనుక ?

నేను వస్తూంటే అమ్మ అన్నది—'బరువు దించుకున్నారా శంకరం ! మీనాన్న కిచ్చిన మాట నిలబెట్టుకున్నాను. ఈ యింటికి రెండు కళ్లులా నువ్వూ, తమ్ముడూ పెరిగారు. తమ్ముడి భవిష్యత్తు యికనుంచి నీమీదనూ ఆధారపడి ఉంటుంది. మరిచిపోబోకు.'.

ఆ మాటలు వింటూ గర్వించాను. నా శక్తిమీద అమ్మకి గురి ఏర్పడినందుకు ఆనందించాను.

ఆమె నన్ను ఆశీర్వదించి సాగసంపింది—కొత్తచోటుకి, సరికొత్త జీవితానికి.

బి. కాం పాసయ్యి రెండేళ్లపాటు యింటిపట్టున గోళ్లు గిల్లుకుంటూ గడిపాను. ఉద్యోగంకోసం నా శాయశక్తులా ప్రయత్నించాను. ఏరోజుకారోజు ఎదురుచూచాను. రోజులు గడుస్తున్నకొద్దీ భయంగా ఉండేది. దీనికి తగ్గట్టు సూదుల్లాటి మాట లొకటి—నా ప్రాణాన్ని కొరుక్కుతినేవి.

ఇలాంటిపరిస్థితుల్లో అమ్మ గనక నాకు ధైర్యం చెప్పకపోతే, నే నేనాడో పిచ్చివాణ్ణయి రోడ్లవెంట తిరిగేవాణ్ణి. అనుక్షణం నన్ను కంటికి రెప్పలా చూచింది. 'దిగు లెందుకురా శంకరం ! కాస్త అలస్యమైతే కావచ్చును కాని—డిగ్రీ చేతిలో పెట్టుకున్న నీకు ఉద్యోగం దొరక్కమానదు.' అని నన్ను వూరడించేది. నిజంగా అమ్మ దేవత.

'నాకు రెక్క లిచ్చావు. నా కర్తవ్యం నాకు తెలుసు—అయినా అవకాశంలేక ఏం చేతగానివాడిలా తయారయ్యాను. రోజురోజుకి అసహనం పెరిగిపోతోంది. చివరికి నే నేమవుతానో నాకు తెలీకుండా ఉంది' అని నే నంటూంటే ఆమె చిన్నగా మందలించేది. నాలాటివాళ్లు యింకా చాలామంది ఉన్నారని, వాళ్లందరు నాలా పిచ్చిగా తయారవడంలేదని హెచ్చరించేది. నిజంగా అమ్మధైర్యాన్ని అభినందించవలసిందే.

నా అదృష్టవశాత్తూ యీనాటికి కాకినాడలో ఉద్యోగం దొరికింది!—ఇప్పు డనిపిస్తున్నది—అమ్మ నన్ను వూరడించకపోతే, ఆశ కర్పకపోతే—ఈ ఉద్యోగం కళ్లారా చూచే భాగ్యం కరువయ్యేదనీ, ఏదో అఘాయిత్యాన్ని తలపెట్టేవాడిననీను.

ఉద్యోగంలేనినాడు నన్ను యీసడింపుగా చూచిన మనుషులు చాలామంది, నాకు ఉద్యోగం దొరికిందన్న మరుక్షణాన్నే అభినందించారు. వాళ్లందరిలోనూ మావయ్య ముఖ్యుడు.

నాన్న బ్రతికున్నరోజుల్లో, ఆయనా, మావయ్య యిద్దరూ కలిసి మెలిసే ఉండేవారు. వారిమధ్య చుట్టరికమే కాకుండా మంచి స్నేహం ఉండేది. ముఖ్యంగా వాళ్లు యీ స్నేహాన్నే ప్రదర్శించేవాళ్లు.

రాధ మావయ్యకూతురు. మా చిన్నతనంలోనే అనుకున్నారు 'రాధ నాకోసమే పుట్టిన నా భార్య' అని. నేను చదువుకుంటూన్న రోజుల్లో గూడా—వీలు దొరికినప్పుడల్లా మా యిద్దర్ని అదే వరసల్తో పిలుస్తూ ఆనందిస్తూండేవాళ్లు.

'శంకరం వట్టి అమాయకుడోయ్ బావా ! రాధ వాడికి పెళ్లాంగా, వాడ్నేమి చక్కబరుస్తుందో ఏమోగాని—మా అమ్మకున్న తెలివి, మీ వాడిలో కాగడాపెట్టి వెతికినా కనిపించదేమోయ్ మరీను.' అని మావయ్య అంటూంటే నాన్న పకాలున నవ్వి అనేవారు 'నిజం సుమా!' అని.

అలాంటిది నా యసల్సీ రోజుల్లో నాన్న పోయిన తర్వాత ఆ మాట కాస్తా మరిచిపోటానికి ప్రయత్నించాడు మావయ్య. నాతో చనువుగా తిరుగుతూన్న రాధను గదమాయించడం గూడా నేర్చుకున్నాడు.

దీనికొ్కంత కారణం—నాన్న పోయినతర్వాత మా కుటుంబం ఆర్థికంగా కాస్త వెనకబడటమేను.

తాను చేస్తూన్న గుమాస్తా గిరికి కాస్త పెద్ద ఫాయిదాలోనే సంసారాన్ని ఉంచారు నాన్న. ఆయనకు ప్రతి చిన్న పనినీ హంగామాగానూ, హడావిడిగానూ చెయ్యడం ఒక అలవాటు. ఒక్కోసారి స్థితికి మించినపనులు ఆలోచించకుండానే చేస్తూండేవారు. దీనికి చక్కటి నిదర్శనం—అక్కయ్య పెళ్లి. ఆ పెళ్లి యింకా నా కళ్లకు కట్టినట్టుంటుంది.

అప్పట్లో శేఖరంబావ బి. ఇ. చదువుతూండేవాడు. అతను నాన్న కంటికి రత్నంగా కనుపించాడు. ఈ సమ్మంధంతో నువ్వు తూగలేవని ఎవరెన్ని చెప్పినా ఆయన వినలేదు. అతనికి అక్కయ్యనిచ్చి పెళ్లిచేసి తనమాట నిలబెట్టుకున్నారు. అతని చివరి రెండేళ్ల చదువూ నాన్నే చెప్పిం

చారు. దీంతో మా ఆర్థికస్థితి కాస్త కుంటుపడింది. ఆ తర్వాత నాన్న పోవడం, మిగిలున్న కాస్త ఆస్తితోపాటు అమ్మ నగలుకూడా అమ్మి నన్ను చదివించడం మొదలైన వన్నీ జరిగాయి.

మా కుటుంబపరిస్థితులు ఎప్పటికప్పుడు వెయ్యి కళ్లతో కనిపెడ్తూన్న మావయ్య జాగ్రత్త తీసుకున్నాడు.

కాలేజీ చదువుకోసం బందరు వెళ్లాను. అసలు నాకు పై చదువులు చదవా లనిపించలేదు. యసల్సీతో ఆపి ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేసుకుందామనే నా సంకల్పానికి అమ్మ అడ్డు పడింది. నాన్న ఆత్మశాంతికోసమైనా నన్ను చదవమని బల వంతపెట్టింది. చదవక తప్పిందికాదు.

ఈ మధ్యకాలంలో అమ్మ రెండు మూడుసార్లు రాధ పెళ్లి గురించి అడిగిందిట. మావయ్య ఆమెకేమీ జవాబు చెప్పలేదుట. నే నప్పుడే అనుకున్నాను—మావయ్యాని యిది చెయ్యి, అది చెయ్యి అని శాసించి చెప్పటానికీ, తన స్నేహంతో ఆయన్ను తనవైపు తిప్పుకోటానికీ నాన్న లేనప్పుడు, నాకు రాధతో పెళ్లిజరగడం కల్ల అని. అని నిజమయ్యింది.

ఫైనలియరు పరీక్షలు రాసి యింటికొచ్చాను. ముహూర్తం పెట్టించమని అమ్మ మావయ్యని అడిగింది. వాడు పరీక్ష పాసవ్వనీ చూద్దాంలే అన్నాడు. రిజల్ట్సు తెలి శాయి. పాసయ్యాను. అమ్మ నా పెళ్లి విషయం మళ్లీ అడి గింది. ఉద్యోగం గూడా రానివ్వమన్నాడు. సంవత్సరం గడిచింది. ఉద్యోగంలేదు. కాళ్లరిగేలా తిరిగాను. ఎందర్నో ఆశ్ర యించాను. లాభంలేకపోయింది.

చివరికి తప్పదన్నట్టు, అభిమానం చంపుకుని అక్కయ్య వాళ్లింటిగ్గూడా వెళ్లాను. బావగారు పేరూ ప్రతిష్టలున్న ఇంజనీరు. ఆయన నాకో చిన్నఉద్యోగం చూచిపెట్టలేరా అని నా ఆశ.

కాని శేఖరం నాన్న ఉన్నరోజుల్లో నాటి మనిషికాడు. పూర్తిగా మారిపోయాడు. అధికారం, అంతస్థూ పెరిగింది. వాటికి లోకువైపోయాడు. అతని కంటికి నలుసులా కనిపిం చాను. ఆ యింటో రెండురోజు లుండలేకపోయాను. అక్క య్యతో అతనన్న మాటలు నా కిప్పటికీ గుర్తే !—

'ఇంకెన్నా ళ్లుంటాట్ట మీ తమ్ముడూ ? అయినా యిక్కడ ఉద్యోగాలు జేబుల్లో పెట్టుకుకూర్చున్నామా ఏవిటి ? నాకు మరొళ్లని నోరు విప్పుకుని అడగటం చాత కాదు. ఈనాడు నేను ఎదుటివాళ్లని ఆశ్రయిస్తే—వాళ్లు రేపు నా ప్రాణమ్మీద కూర్చుని, నాకు యిష్టం లేకపోయినా, నాచాత పనులు చేయించుకుంటారు. ఇదిమాత్రం నావల్లకాదు.'

ఈమాటలు వింటూనే నా మనస్సు చివుక్కుమన్నది. అతను చాలా మరిచిపోయాడు. ఇంతవాడిగా తయారవ్వ టానికి కొంతకారణం నాన్న అన్న కృతజ్ఞత సైతం మరిచి పోయాడు.

ఆ తెల్లవారుఝామునే ఆ యింటినుంచి వచ్చేశాను. ఏం జరిగిందని అమ్మ అడిగింది. దాచకుండా అంతా చెప్పాను. ఆమె నిట్టూర్చింది.

అంతే—

మళ్లీ నా పెళ్లివిషయం ప్రస్తావించలేదు అమ్మ. ఆ తర్వాతనే రాధపెళ్లి రాజారావుతో జరిగిపోయింది !— అతను రాజమండ్రిలో కలపవ్యాపారం చేస్తుంటాడు. లక్షలు సంపాయించాడని వినికిడి.

ఆ పెళ్లి చాలా ఆడంబరంగా జరిగింది. ఎవరో కొందరు మావయ్య నడిగారు. 'ఇలా చేసావేమిటీ' అని.

'మరింకెలా చెయ్యమంటారూ ? నా కూతుర్ని తాడూ బొంగరం లేనివాడికిచ్చి, అది అవస్థపడ్తూంటే కళ్ల నీళ్లు పెట్టుకుని చూస్తూ ఉండమని సలహాచెప్పటానికి వచ్చా రుటయ్యా' అని మావయ్య వాళ్లకి జవాబు చెప్పాడు.

నాకూ తాడూ బొంగరం లేదు, నే నెందుకూ పనికిరాని చవటని—నే చేస్తూన్న ఉద్యోగ ప్రయత్నాల్లో అప్పుడప్పుడూ యీ భావన కలుగుతూండేది. అప్పుడు భయం పుట్టు కొచ్చేది.

ముందు నా గతేమిటి ? జీవితాంతం నేనిలా ఉద్యోగం లేకుండా తిని తిరగడమేనా ?—

సరిగ్గా యిలాంటి పరిస్థితుల్లో అమ్మనుంచి నాకు ఉపశమనం కలుగుతూండేది. నా పిచ్చి ఆలోచనలను ఆమె దూరం చేసేది. ధైర్యం చెప్తూండేది.

మొన్న మొన్నటివరకూ మావయ్య సరిగ్గా మాయింటి కొస్తుండేవాడుకాదు. నాకు ఉద్యోగం దొరికిందన్న వార్త విని— ఎందుకోమరి ఆయన గూడా సంతోషించాడు. స్టేషన్ వరకూ వచ్చి నన్ను రైలెక్కించాడు.

నేను వస్తూన్నప్పుడు అమ్మతోపాటు, ఆయనకూ కళ్లల్లో నీళ్లు తిరగడం లీలగా గమనించాను. ఎంతైనా— అనుబంధాల్ని తెంచుకోడం కష్టమంటారు, యిదే కాబోలు.

రాధని పెళ్లిచేసుకోలేకపోయానని నాకై నే నెప్పుడూ బాధపడలేదు. పైగా నాలాటి నిర్భాగ్యుడ్ని పెళ్లిచేసుకుని ఆమెమాత్రం సుఖపడే దేమున్నది ? రాధ అదృష్టంకొద్దీ లక్షాధికారుల యింటో స్థానం చేసుకుంది. అంతేచాలు.

—సిగరెట్టు ముట్టించాను.

కాకినాడ వెళ్లే రైలు మరో గంటగ్గాని ప్లాటు ఫారమ్మీదికి రాదుట.

ఒక రైలు దిగాను—మరో రైలుకోసం ఎదురు చూస్తున్నాను. కాలేజి దాటాను—

జీవితంలోకి ప్రవేశించబోతున్నాను.

ఏమిటీ కవిత్వం ?

నవ్వు పుట్టుకొచ్చింది. అంతలోనే మూర్తి గుర్తు కొచ్చాడు. కవిత్వమన్నా, కథలన్నా వెంటనే మూర్తి గుర్తుకు రావడం రివాజైపోయింది. అతను నాకు యింటర్లో కలిశాడు. అతనిది సైన్సు గ్రూపు, నాది కామర్సూనూ. అయినా యిద్ద రము ఒకటే క్లాసు, ఒకటే బెంచి. అన్నట్టు ప్రతిరోజూ కలిసి తిరుగుతూండేవాళ్లం.

ఇంటర్లో అతనికి క్లాసువచ్చింది. ఆనర్సు చదువు కుందికి విశాఖ వెళ్లాడు. అతను నాకు దూరంగా విశాఖ

పట్టణంలో వున్నా—ఉత్తరాలద్వారా మాత్రం చాలా దగ్గర్లో ఉన్నట్లనిపించేది.

అతని దురదృష్టవశాత్తూ అనర్సు పోయింది. మావాళ్లందరికీ ఆశ్చర్యం కలిగించింది—ఆనర్సెవిటీ పోవటమేమిటీ అని. దానికి కారణాలు మాత్రం చాలా పుట్టుకొచ్చాయి. తలోవిధంగా చెప్తూండేవాళ్ళు. చివరికి ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో కూడా తెలిసేదికాదు. నే నతన్ని అడుగుతే నవ్వుతూ—

'చూడు శంకరం ! మనిషి ఒక్కడే అయినా, వాడు తలోవిధంగా కనుపిస్తూంటాడు. ఇలా జరగడం కొత్తేమీ గాదు. నా గురించి నువ్వు అనుకుంటున్నదీ, మరో దానయ్య అనుకుంటున్నదీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్కటికాదు. ఇంతకీ నా పరీక్ష ఎందుకు పోయిందో మాత్రం నేనూ సరిగ్గా చెప్పలేను. వాళ్లందరూ అనుకుంటున్నకారణాలు ముఖ్యమా కావా అని అడక్కు—ముఖ్యమైన కారణం నా అశ్రద్ధ' అనేవాడు.

అతనిప్పుడు బందర్లో గుమాస్తా గిరి వెలిగిస్తున్నాడు. అతను చక్కటి కథలు రాస్తూంటాడు. అతని కథలూ అతని మాటల్లాగానే చక్కగా ఉంటాయి. ప్రతి కథలోనూ అతను కనిపిస్తూంటాడు. అయితే కథ చదివి 'అతను యిది' అని చెప్పడం కష్టం.

మొన్నమొన్నటివరకూ అతను చేస్తూన్న ఉద్యోగం గురించి యిలా అంటూండేవాడు. 'ఉద్యోగం, ఉద్యోగం అని ఇలా ఎగపడుతున్నావ్‌గాని—అది దొరికిన తర్వాత యిప్పుడున్న స్వేచ్ఛ కాస్తా హారతి కర్పూరమే. ఏదో ఒక సంస్థకి అమ్ముడు పోవటమే ఉద్యోగ మంటె. ఈ అమ్ముడుపోటాల్లో రెండురకా లున్నాయి. జీవితాంతం ఎదుగూబొదుగూ లేని రకం మొదటిదీ నికృష్టమైనదీను. జీవితములో ఎప్పుడో ఒకప్పుడు ఓ స్థితికి అందుకోగలం అనే ధైర్యం చెప్పేది రెండోది ఆశించదగ్గదీను. ఇంక మన మాటకొస్తే—మొదటి రకానికే చెందుతాం. జ్యోతిషం చెప్తున్నా ననుకోవద్దు. ఎందుకో మరి మనల్ని చూస్తోంటే అలా అనిపిస్తుంది. సంవత్సరాలు గడిచినా స్థితిమాత్రం మారదు; సాధించిందేమీ లేకపోయిందనే ఓ గట్టి నిట్టూర్పు తప్ప. పోతే—యీ రెండో రకమున్నది చూడూ—అదిమాత్రం కొందరు అదృష్టవంతులకే ! వాళ్ల జీవితం వడ్డించిన విస్తరి. రికమెండేషన్లూ, అంతస్తులూ గట్టా వెనక హంగుగా నిలబడి ఉండాలి. ఇది వేరే విషయం. ఇంతకీ నే చెప్పొచ్చిం దేవిటంటే—ఉద్యోగం దొరికిన మరుక్షణాన్నే సమస్యలన్నీ పటాపంచలై జీవితం బ్రహ్మాండంగా సాగుతుందని అనుకుంటే మాత్రం పొరపాటే. సాక్ష్యం కావాలిస్తే నేను ! రేప్పొద్దున పెళ్లయి—పెళ్ళాం పిల్లలూ, వేమంటూ నా వెనక నిలబడితే—అప్పుడు తెలిసొస్తుంది—యీ ఉద్యోగం సంపాయించిపెట్టిన అదృష్టంయొక్క విలువ. అందుకే అంటాను—పుడితే రాజభోగా లనుభవించే రాజాలింట్లోనూ లేకపోతే పేవ్‌మెంట్లమీదనూ అని. అంతేగాని స్టెయిన్‌లెస్‌స్టీల్ గ్లాసుతో అంబలి పోసుకుని వూరుకుంటాగే జీవితం మనకొద్దు.''

అతని అభిప్రాయాలు చాలా చిత్రంగా ఉంటాయి. నాకు నచ్చడం, నచ్చకపోవడం వేరే విషయం. అతను అనుకుంటున్నది మాత్రం కుండబద్దలు కొట్టినట్టు చెప్తాడు.

'ఏది ఏమైనా—నే నొస్తూండగా అతను అన్న యీ కొద్ది మాటలూ జీవితపర్యంతం మరిచిపోలేను.

'ఇదో నరిహద్దు శంకరం' ఇప్పటివరకూ నాకు కేవలం కాలేజీ నాలుగ్గోడలూ, యిల్లూ, అమ్మా, తమ్ముడూ—వీళ్లే తెలుసు. ఇప్పుడు నువ్వు తెల్సుకోవాల్సిందీ, నీ అనుభవంలోకి తెచ్చుకోవలసినదీ చాలా ఉన్నాయి. ఇంతకుముందు చెప్పిన నా అభిప్రాయాలూ, అనుభవాలూ మరిచిపో. నీకై నువ్వే తెల్సుకో—విష్ యూ బెస్టాఫ్ లక్ !

—చేతిలో సిగరెట్టు చివరంటా కాలిపోయింది. చేయి చుర్రుమన్నది. సిగరెట్టు అవతలగా విసిరి పారేశాను. హోల్డాలు మీద చతికిలబడ్డాను. చుట్టూ కలియజూచాను.

నాకు కాస్త దూరంలో నవ్వుకుంటూ సరదాగా ఓ యువకుడూ, యువతీ వస్తూన్నారు. నావైపుగానే వస్తున్నారు. చెట్టాపట్టా లేసుకుని కులాసాగా నడుస్తున్నారు. ఆ యువకుడ్ని కాస్త పరీక్షగా చూశాను. శివం గుర్తుకొచ్చాడు.

అతను శివం ! .... అతనే శివం ! .... సందేహంలేదు.

వాళ్లిద్దరూ సెకండ్‌క్లాసు వెయిటింగ్ రూమువైపు వెడుతున్నారు. శివం సూటులో అందంగా కనిపించాడు. చేతిలో కాలుస్తూన్న సిగరెట్టు ముచ్చటగా ఉన్నది. అతను హుందాగా నడుస్తున్నాడు.

ఆమె అతని భార్యయై ఉండవచ్చును. మొన్న వేసవిలోనే పెళ్లయిందని తెలిసింది. ఆమె అతనికి తగినట్టుగానే ఉంది. అతనంత యెత్తూ, ఎత్తుకి తగ్గ లావూను. రెండు జడలూ ఆమె భుజాలమీద ఆడుకుంటున్నాయి అందంగా. పచ్చగా దబ్బపండు ఛాయలో ఆమె మెరిసిపోతోంది.

ఆ యిద్దర్నీ చూస్తూంటే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది !

శివానికి దర్పం ఎక్కువని చాలామంది అనుకునేవారు. అతను నీటుగా, ట్రిమ్మ్‌గా కాలేజీకి వచ్చేవాడు. చివరి బెంచీల్లో కూర్చుని పాఠాలు వినకుండా గోల చేస్తూండేవాడు. ఈ వరస చూసి లెక్చరర్సు మందలిస్తే అతను తల బిరుసుగా సమాధానం చెప్పేవాడు. ఒకటి రెండుసార్లు యిలా జరిగినమీదట లెక్చరర్లూ ఏం చెప్పలేక వూరుకున్నారు.

అతను డి. ఎం. ఓ. గా రబ్బాయి. కాలేజీకి కారు మీద వచ్చేవాడు. ఆ కార్లో యిద్దరు ముగ్గురు ఆత్మీయుల్లాంటి స్నేహితు లుండేవారు. అంటిపెట్టుకున్నట్టు. కాలేజీకి వచ్చే అమ్మాయిల వెనుక కావాలని కారు నడిపి హారను వాయించేవాళ్ళు. వాళ్లు కాస్త బెదిరిపోతే కిసుక్కున అందరూ ఒక్కసారే నవ్వేవారు. ఇలా రోజూ జరుగుతుండేది. ఒక విధంగా యిది వాళ్లకి హాబీ అయిపోయింది.

చదువు విషయంలో అతను బద్ధకంచూపించినా, మిగతావిషయాల్లో మాత్రం చాలా ఏక్టివ్‌గా ఉండేవాడు.

బి. కాం. మొదటి ఫాస్సులోనే పాసయ్యాడు. యం. కాం. చదవడానికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత శివంగురించి నాకు ఎక్కువగా తెలిసింది కాదు—మొన్నీ మధ్యనే అతని పెళ్ళిగురించి తప్ప.

కాసేపటికి అతను ఫ్లాస్కు ఒకటి తీసుకుని సెకండు క్లాసు వెయిటింగు రూమునుంచి బయటకు వచ్చాడు. నేనతన్ని చూచాను. రెండడుగులు అతని వైపు వేశాను గూడా. అతను నాకు దగ్గరయిం తర్వాత—చిన్నగా నవ్వాను. అతనసలు నావైపు చూచినట్టే లేదు. పేరుపెట్టి పిలిచాను. వినిపించుకోనట్టు, విసురుగా వెళ్ళిపోయాడు. ఆశ్చర్యపోయాను, పిలిచినా పలకడేమిటాని. కాలేజీలో ఉన్న దర్పాన్ని యింకా వదులుకోలేదు కాబోలు ....

కాని చాలామంది మారిపోతూంటారు. మా క్లాసులో ఎవర్తోనూ మాట్లాడేవాడు కాదు మా ఆంజనేయులు. వాడికి సిగ్గు ఎక్కువ ఆడపిల్లలా. ఇప్పుడు వాడు కలెక్టరేటులో పనిచేస్తున్నాడు: ఎప్పుడైనా వెళ్ళి వాడ్ని పలుకరిస్తే చాలు—మనల్నలా నిలబెట్టి టకటకా చెప్పుకుపోతాడు గంటలకొద్దీ మధ్యమధ్య విట్లూ గట్రా వాడుతూ. వాడలా మాట్లాడుతుంటే యింకా వినాలనిపిస్తుంది—అప్పు డనుకుంటాను—ఏవిటీ బుద్ధావతారం యిన్ని మాటలు నేర్చిందీ అని. అలాగే చాలా మంది చదువుకున్న రోజుల్లో ఉన్న అలవాట్లు మానుకుని కొత్తవి కొన్ని నేర్చుకొన్నారు. కాని శివంలాంటి బహు కొద్ది మందిమాత్రం అప్పటికి డిటోల్లానే బ్రతుకుతున్నారు.

ఓ పావుగంటలో శివం మళ్ళీ నావైపునుంచే వెళ్ళాడు. ఈ మాటు గూడా అతను నన్ను కన్నెత్తి చూచిన పాపాన పోలేదు. అతను డాక్టరుగా రబ్బాయి, యం. కాం చదివాడు, పరపతి పెంచుకున్నాడు, అంతస్థు ఎప్పట్నుంచో ఉండనే ఉన్నది—అయితే మాత్రం—యీ కారణాలు ఆధారంగా తీసుకుని ఓ క్లాసుమేటుని పలుకరించటానికే 'సిగ్గు' పడుతున్నాడంటే అతన్నేమనాలి ? ఇదేనా సభ్యత ?

మనసుకి కష్టం కలిగింది గాని అంతలోనే తుడిచి పెట్టుకున్నాను.

మరో పావుగంకల్లా రైలు ప్లాటుఫారమ్మీది కొచ్చింది.

బెజవాడనుంచి సాయంత్రం బయల్దేరే యీ రైలుని చాలామంది 'దయ్యాలబండి' అని అనడం కద్దు. ప్రతి స్టేషన్లోనూ ఆగుతుంది. అవసరం ఉన్నా, లేకపోయినా అయిదూ, పది నిముషాలు (మామూలుకంటె) ఎక్కువసేపు ప్రతిస్టేషన్లోనూ ఆగుతుందని ప్రతీతి. అందుచేతనే చాలామందికి యీ బండి అంటే విసుగు, చిరాకూను.

ఖాళీగావున్న ఓ కంపార్టుమెంటును చూచి సామాను సర్దించాను. తర్వాత డోరుదగ్గర నిలబడి మళ్ళీ ఓమారు ప్లాటుఫారమ్ వైపు నా చూపును మరల్చాను. శివం వాళ్ళ సెకండ్క్లాసు కంపార్టుమెంటులో ఎక్కుతూ, అతను నావైపు అదోవిథంగా చూశాడు. అతని ప్రవర్తనకి జాలితోపాటు కోపం గూడా కలిగింది.

కాసేపటికి రైలు కదిలింది.

నా సీట్లోకొచ్చి కూర్చున్నాను. రైలువేగం పెంచుకుంటున్నది. తాళానికి వరస తప్పనట్లు శబ్దం చేసుకుంటూ పరుగెడుతోంది.

సిగరెట్టు ముట్టించి రంగనాథం రాసిన ఉత్తరం తీసి చదివాను 'మరొకసారి.

శంకరం !

నీకు యీవూళ్ళో ఉద్యోగం దొరికిందనీ మరో నాలుగు రోజుల్లో వస్తున్నాననీ రాశావు.. చాలా సంతోషం. నువ్వొ కాకినాడ చేరుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఆదివారం ఉదయం నేను స్టేషనుకొస్తాను, నిన్ను రిసీవు చేసుకునేందుకు. అన్నట్టు మరిచాను—నువ్వు మా యింటోనే మకాం ఏర్పాటుచేసుకోవాలి. తర్వాత కుదరదని అంటే మాత్రం వల్లకాదు.

కాకినాడతోపాటు, మా యిల్లూ నీకు కొత్తవడం మూలంగా నేను స్టేషనుకు రావడం జరుగుతున్నది. ఒకవేళ అయిదూ పది నిముషాలూ లేటయినా, నాకోసం వెయిట్ చేస్తూండు. అంతేగాని ఖంగారుపడకు.

సోమవారంనాటికి నువ్వు జాయినవ్వాలని రాశావు. నువ్వు చేరపోయే ఆఫీసూ వగైరా ఆదివారం సాయంత్రమే చూపిస్తాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే—యీ కాకినాడలో నీకే యిబ్బందీ కలక్కుండా చూచే బాధ్యత నాది. సరేనా—

నీ రాకకోకం ఎదురుచూస్తూ,

రంగనాథం.

ప్రాణంపెట్టే మిత్రులు నాకేం తక్కువ కాదు. నా కోసం, నా శ్రేయస్సుకోసం, వాళ్ళెంత శ్రమైనా తీసుకుంటారు. ఇలాంటి మిత్రుల్ని సంపాయించుకున్నందుకు గర్విస్తూంటాను.

రంగనాథం చదువులో నాకన్న రెండేళ్ళు సీనియరు. వాళ్ల చిన్నాన్నగారింటి పక్కనే ఓ రూము తీసుకుని చదువుకుంటూండేవాణ్ని. రంగనాథం చిన్నాన్న ప్లీడరు గుమాస్తాగా పనిచేస్తూండేవారు.

రంగనాథం వాళ్లచిన్నాన్న దగ్గరే పెరిగాడు. అతనికి తల్లితండ్రులు బాగా చిన్నతనంలోనే పోయారుట. అప్పట్నుంచీ అతన్ని పెంచే భారం వాళ్ల చిన్నాన్న భుజాలపైన పడ్డది.

అప్పట్లో నాకూ, ఎకనామిక్సు సబ్జెక్టుకీ ఏమాత్రం పడేదికాదు. నా కంటికి ఆ సబ్జక్టు ఓ బ్రహ్మరాక్షసిలా కనుపించేది. పైగా — హైస్కూలు వదిలిపెట్టిన కొత్త రోజులేమో — పాఠాలన్నీ యింగ్లీషులో చెప్తూండటం చూస్తూంటే ఖంగారుగా ఉండేది. ఈ ఎకనామిక్సు మరీను. ఎన్నిసార్లు చదివినా వంట పట్టేదికాదు. 'బట్టీయం' వేద్దామంటే—అలవాటులేదు.

సరిగ్గా యిలాంటి పరిస్థితుల్లో రంగనాథం నాకు దేవుడిలా కలిశాడు. మిత్రుడయ్యాడు.

అతను చదువులో ఆరితేరిన ఘటం. పాఠాలు చెప్పడంలో అందెవేసిన చెయ్యి. అతను నాకు ఎకనామిక్సు

బోధించడం మొదలుపెట్టిన రెండు, మూడు నెలల్లోనే— ఆ సబ్జక్టుమీదున్న భయం కాస్తా దూరమయ్యింది.

అతను చెప్పినది విని, అర్థం చేసుకున్న తరువాత అనిపించింది—'ఓసింతేనా ఎకనామిక్సంటే'—అని. ఇప్పటికీ ఆ సబ్జక్టు నాకు గుర్తున్నదంటే ఓవిధంగా రంగనాథమే కారణ మవుతాడు.

అతను నేనంటే ప్రాణాలు పెట్టేవాడు. నన్ను ఓ తమ్ముడిగా చూచుకునేవాడు. అప్పుడప్పుడూ అనేవాడు—

"నాకు తోబుట్టువులంటూ ఎవ్వరూ లేరు. ఊహ తెలిసిం దగ్గర్నుంచీ బాబాయి దగ్గరే పెరిగాను. చిన్నాన్న పిల్లలకి నామీద సదభిప్రాయం బొత్తిగా లేదు. అందరూ నాకు దూరంగా తిరుగుతూంటారు. నేనేదో అన్యాయంగా వాళ్ళనాన్న సంపాదన అనుభవిస్తున్నానని వాళ్ల అభిప్రాయం. వాళ్లందరికీ నేనంటే నిర్లక్ష్యం. అలాంటివారి దగ్గర్నుంచి నేను కోరుకుంటున్న ఆత్మీయత నాకు లభించడం లేదు.—నిన్ను చూస్తూంటే మాత్రం, నాకు తమ్ముడున్నాడనిపిస్తుంది. ఈ భావాన్ని దూరం చేసుకోలేనుశంకరం!"

నిజంగా రంగనాథం చాలాచిత్రమైన వాతావరణంలో పెరిగాడు. ఆ యింటో అతనికి సుఖంలేదు. వాళ్ల చిన్నాన్న అతన్ని ప్రేమగా చూచినంతమాత్రాన సరిపోయిందా ? ఆయనభార్యా పిల్లలూ చాలు రంగనాథం మనసు పాడు చెయ్యటానికి. వాళ్ల చిన్నాన్న యింటో ఉన్నంతసేపూ ఎవరూ మాటాడేవారు కాదు—ఆయన కనుమరుగయితే చాలు ఒకటే సాధింపులు. రంగనాథం అనుభవిస్తూన్న క్షోభని, అతను నాకు అప్పుడప్పుడూ చెప్తూండేవాడు కన్నీళ్లు పెట్టుకుని.

ఎవరెన్ని చెప్తున్నా లెక్కచెయ్యకుండా తనని బి. ఏ. చదివిస్తున్నాడని, అటు వాళ్ల చిన్నాన్నపైనా, యిటు రంగనాథంపైన ఆయింటో వాళ్లందరికీ అక్కసు.

రంగనాథం బి. ఏ. పాసయింతర్వాత, వాళ్ల చిన్నాన్న ఓ తెలివైనపని చేశాడు. ఆయనకి రంగనాథాన్నింకా చదివించాలని ఉన్నది గానీ—యింట్లో పోరుపడలేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఆయనకు పరంధామయ్యగారు గుర్తొచ్చారు.

పరంధామయ్య కాకినాడలో పేరూ, ప్రతిష్ఠలున్న పెద్ద క్రిమినల్ లాయరు. ఆయన తనకి దూరబ్బంధువు. రంగనాథాన్ని వాళ్లమ్మాయి కిచ్చి పెళ్లిచేశాడు. దాన్లో ఆయన ముందు చూపు ఎంతైనా ఉన్నది.

ఈ పెళ్లి కాస్తా జరిగిందనిపించుకుంటే—రంగనాథాన్ని బి. ఎల్. చదివించి, పేరొందిన వకీలుగా తయారు చేయించే భారం, వాళ్ల మావగారే తీసుకుంటారనీ,—యీ విధంగా రంగనాథం అదృష్టవంతు డవుతాడనీ ఆయన పథకం.

అదే నిజమయిం దిప్పుడు. మావగారి ప్రోద్బలంవల్ల రంగనాథం బి. ఎల్. చదివాడు. ఆయన తర్ఫీదులోనే అభివృద్ధికి మెట్లు వేసుకుంటున్నా డిప్పుడు.

రంగనాథం అదృష్టం పండింది !

వాళ్ల చిన్నాన్న కనిన కలలు నిజమయ్యాయి !

—శంగనాథం రాసిన ఉత్తరం మరోమాటు చదువుకుని, మడిచి జేబులో పెట్టుకున్నాను.

అప్పటికి మా రైలు ఏలూరు స్టేషన్లో ఆగిఉన్నది. నిద్ర వస్తూనంటుంది. బెర్తుమీద హోల్డాలు సర్దాను. నడుం వాల్చాను. పది నిముషాల్లో నిద్ర ఆవరించింది నన్ను.

*   *   *   *

మెలుకువ వచ్చేసరికి రైలు రాజమండ్రి స్టేషన్లో ఆగి ఉన్నది. టీ తాగా లనిపించింది. కంపార్టుమెంటు దిగి ప్లాటుఫారమ్మీద కాలుపెట్టాను.

సన్నగా వర్షపుజల్లు—ఈదురుగాలి—చలి.

వెచ్చదనం కోసం సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండు దమ్ములు పీల్చాను. అలా ప్లాటుఫారమ్ మీద కాసేపు తిరిగి టీ తాగి, కంపార్టుమెంటులోకి వెళ్లబోయాను.

"శంకరం" ఎవరో పిలిచారు.

ఉలిక్కిపడ్డాను. అలాగే ప్లాటుఫారమ్మీద నిలబడి పోయాను.

చుట్టూ కలియజూశాను. నాకు తెలిసిన వ్యక్తు లెవరూ కనుపించకపోవడంతో, నన్ను కాదనుకున్నాను. కంపార్టుమెంటులోకి వెళ్లబోయాను.

"ఒరే .... శంకరం ...." ఈమాటు కాస్త బిగ్గరగా పిలిచారు.

ఆగి—ఆ పిలుపు వచ్చినవైపు చూపు నిలిపాను. నాకు ఓ యిరవై అడుగుల దూరంలో ఓ స్థంభాన్ని ఆనుకుని నిలబడ్డ యువకుడు—చేతితో సంజ్ఞ చేస్తూన్నాడు రమ్మన్నట్టు.

అతనివైపు నడిచాను.

తెల్లగా పొడుగ్గా ఉన్న ఆ వ్యక్తి అందాన్ని—సిల్కులాల్చీ, పైజమా, రిమ్‌లెస్ కళ్లజోడూ, ఆకు చెప్పులూ, యివన్నీ రెట్టింపు జేస్తున్నాయి.

వాడు మా చలపతి !

చలపతికి ఒక ప్రత్యేకత ఉన్నది. వాడు నవ్వుతాడు, ఎదటివాళ్లని నవ్విస్తాడు. సీరియస్‌గా మాట్లాడటం చేత కాదు. ఇప్పుడూ వాడి ముఖంలో నవ్వు మిడిసిపడ్తూనే ఉన్నది.

గబగబా నడిచి వాడ్ని చేరుకున్నాను.

"పదినిముషాలనుంచీ నిన్ను గమనిస్తున్నా. నిన్నెప్పుడో పోల్చుకున్నాను. నన్ను 'చూస్తే—నువ్వే పలకరిస్తావనుకుని మవునం వహించాను. అబ్బే—బొత్తిగా నా విషయం పట్టించుకున్నట్టు లేదు." అన్నాడు నా భుజం తట్టుతూ.

వాడివాలకం మారిపోయింది. మునుపటిలా ఖంగున మాటాడలేక పోతున్నాడు. బాగా నీరసించిపోయాడు.

"మళ్లీ ఎన్నాళ్లికి కలిశాంరా !" అన్నాను.

"పెద్ద .... మనం కలుసుకుని యుగాలైనట్టు మాటలూ పేడూను. సరిగ్గా లెక్క కడితే రెండు సంవత్సరాలు కాలేదు." ఎంతో సరదాగా మాట్లాడదామనే వాడి ప్రయత్నం కాస్తా ఆయాసంవల్ల చెడిపోతోంది. మధ్యమధ్య దగ్గుకూడాను.

"నీ ఆరోగ్యం ఎలావుందిరా చలపతీ?"

వాడు పేలవంగా నవ్వాడు.

"ఇంకా బ్రతికే వున్నా నిలా!—నువ్వెక్కడికి బయల్దే రావో చెప్పావుకావు?"

అంతా చెప్పాను.

"ఉద్యోగస్థుడి వయ్యావన్నమాట....గూడ్."

"అదిసరే....నీ సంగతి?"

"చూస్తున్నావుగా....ఇంకా నేనుచావలేదు. ఇంతలో చావను. ఊళ్లు తిరగాలనే సరదాకొద్దీను యిష్టంవచ్చినట్లు తిరుగుతున్నాను. ఎప్పుడో ఎక్కడో ఆగిపోతాను. ఈ కాస్త ప్రాణం—" ఏదోచెప్పబోయాడు కాని, విపరీతమైన దగ్గు రావడం వల్ల మానుకున్నాడు. కొన్నిక్షణాలకికాని దగ్గు కుదుట పడలేదు.

"ఈ వెధవ జబ్బు నాప్రాణాల్ని కొరుక్కు తింటోందిరా శంకరం! ఎందరో డాక్టర్లు మారారు—ఎన్నో మందులు మార్చారు. ఊహూ....ఫలితంలేదు. అయినా ఎవడికెంత రాసిపెట్టివుందో అంతేజరుగుతుంది. కదూ!"

"మొదలెట్టావ్ 'పెసిమిజమ్'. పెద్ద పెద్ద జబ్బులెన్నో—'

"ఆగు. నన్ను నిరాశావాదన్న వాడికి బుర్రలేదు. నిజంగా నేను అలాంటివాణ్ణేఅవుతే యీ సరికే ఛాంమ్మనే వాణ్ని. ఈ వెధవక్షయ 'రాయల్ డిసీజ్' అని తెలిసిగూడా 'కేరేపిక్' అని తోసిపారేసి బ్రతుకుతున్నా కులాసాగా. కానీ..యీ రోగం నా మీద కత్తిగట్టిందో ఏమోగాని—ఎక్కడికక్కడికి నన్ను తొక్కి పారేయాలని చూస్తోంది."

"ఎందాకా నీప్రయాణం?"

"ఈ వూళ్లో రెండు రోజుల పాటుంటాను. ఆ తర్వాత ఒరిస్సా టూర్. ముందస్తుగా పూరీజగన్నాథం దర్శించాలని సంకల్పం—". మళ్లీ దగ్గాడు.

"పోనీ ఎద్దైనా శానిటోరియమ్‌లో చేరక పోయా వుట్రా?"

"ఏడిశావ్‌లే. శానిటోరియమ్‌లో కూలబడి చూడవలసినవీ, అనుభవించవలసినవీ అన్నింటికీ వాయిదా వేసుకొమ్మని సలహా చెప్తావుట్రా. అన్నీ ముగిసాయన్నమీదటనే శానిటోరియమూ, అక్కడ దిక్కుమాలిన చావూను."

"దారుణంగా మాట్లాడేస్తున్నావ్."

"మనిషి చివర్నేమవుతాడు అని మా నాలుగో తరగతి మాష్టరు—ఆయన ఓ పెద్ద వేదాంతిలే—ప్రశ్నవేసి జవాబు గూడా తనే చెప్పేవాడు, మట్టి అవుతాడూ అని. ఆ చిన్న వయస్సులో అదేదో కొత్త పాఠమనుకునేవాడినే గాని నిజమనిపించేదిగాదు. ఇప్పుడు...."

"సర్లే. నిన్ని వేదాంతం ఎప్పుడూచెప్పమని అడగటం లేదుగాని కాస్త నీఅడ్రస్సూ అదీ—"

చలపతి నవ్వుతూ అన్నాడు.

"వూళ్లు తిరిగే సన్యాసిని వాకోఅడ్రస్సేవిటిరా నా తలకాయ్! నువ్వేయివ్వు మీ ఆఫీసు అడ్రస్సు. నేనే రాస్తాను రాయాలనిపిస్తే. అదీగాక నే పోయేముందు మిమ్మల్నందర్నీ పేరుపేరునా కలుసుకుని ఒక్కొళ్లతో నాలుగైదు రోజులు గడిపిపోదామని వుంది."

ఈ మాట విన్న తర్వాత నామనసు చివుక్కుమంది.

"ఛ....అవేం మాట్రా చలపతీ మరీను."

"వీడింకా మునుపటి చలపతి కాడోయ్ భగవాన్లూ!" అన్నాడు ఉద్వేగంగా.

"సరేలే, నాట్రైనుకి టైమవుతున్నది కాబోలు. కాస్త నీ అడ్రసు యీ డైరీలోచెక్కు." అంటూ వాడిడైరీ నాకిచ్చాడు. నేనేం మాటాడలేక పోతున్నాను.

"ఇదేం 'ఆటోగ్రాఫ్' పుస్తకం కాదులే శంకరం! ఆ అలవాటులన్నీ ఎప్పుడో పోయాయి. రాయి త్వరగా నీ అడ్రసు." అన్నాడు.

నా ఆఫీసు అడ్రసు రాశాను.

"వెళ్లింక" అన్నాడు డైరీ తీసుకుంటూ.

నాకు అక్కడ్నుంచి కదలబుద్ధి పుట్టటంలేదు. వాడి తీరు చూస్తుంటే నాకళ్లల్లో నీళ్ళు తిరిగాయి. దాన్ని వాడెల్లా పసిగట్టాడో ఏమోగాని—

"ఛ....ఆడపిల్లలా అలా కన్నీరెందుకురా ? ముందిక్కడ్నుంచి కదులుబాబూ ,.... పోనీలే .... నేనే వెడతాను. జీవితంలో ఓనాడు నాయింటితలుపు తట్టుతాను. సరేనా—అబ్బా....టా....టా...." అంటూ చెయ్యూపుతూ వెళ్లిపోయాడు చలపతి.

రైలు దాని సొమ్మేమైనటో పోయినట్లు గట్టిగా కూత పెట్టింది.

గబగబా వచ్చి కంపార్టుమెంటులో చేరాను. రైలు కదిలింది. నా సీట్లోకొచ్చి కూర్చున్నాను.

చలపతిని చూస్తుంటే భయంగా ఉన్నది. వాడు బ్రతకాలి. వాడు మళ్లీ నవ్వుకుంటూ మా మధ్య తిరగాలి.

చలపతీ, నేనూ క్లాసుమేట్సుమీ, రూంమేట్సుమీ గూడాను. వాడు వస్తుథా బలహీనుడు. దానికి తోడు నిద్ర మేలుకొని బాగా చెరిసగం రాత్రిదాకా చదివేవాడు. సరిగ్గా పరీక్షలముందు రోజుల్లో వాడికి పెద్ద జబ్బు చేసింది.

ఇలా నుస్తీ చెయ్యడం, మా నాలుగేళ్ల చదువుల్లో వాడికి రివాజే కానీ ఆ ఏడాది మాత్రం కాస్త ఉధృతంగా వచ్చింది. కొన్నాళ్లపాటు ఉపేక్షించాడు. అదే పోతుంది లేమ్మన్నట్టు. అది కాస్త ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీసింది. ఈ సంగతి తెలిసి వాళ్లన్నయ్య చలపతిని యింటికి తీసుకువెళ్లిపోయాడు.

ఆ ఏడాది మాతోపాటు చలపతి పరీక్షలు రాయలేదు. తర్వాత నాకు తెలిసింది.—చలపతికి 'క్షయ' అని.

చలపతికి ఆత్మబంధువంటూ వాళ్లన్నయ్య ఒక్కడే. ఆస్థివిషయంలో, పెద్దవాళ్ళు బాగా సంపాయించిపెట్టి వెళ్లారు. చలపతివాళ్లఆస్థివ్యవహారాలు, వాళ్లన్నయ్యే చూస్తుండేవాడు యింటిపట్టున ఉండి. చలపతి చదువు నిమిత్తం డబ్బూ దస్కం పంపుతూండేవాడు.

చలపతి అన్నయ్యకు గంపెడు సంసారం. అతనిగురించి చాలామంది అనుకునేవారిలా — ఆస్థిలో చాలామట్టుకు తమ్ముడికి తెలియకుండానే, తన స్వంతానికి ఉపయోగిస్తున్నాడని. చలపతి యీ మాటలు విని అనేవాడు:

"నాకు కావలసింది అన్నయ్యా—ఆస్తికాదు. నాకు చదువు చెప్పిస్తున్నాడు. నా ఒక్కడి పొట్టనీ పోషించుకోగల సత్తా నాకు ఉన్నది. అలాంటప్పుడు ఆ ఆస్తితో నాకు పనేమిటి. వాడు ఖర్చు చేస్తున్నాడంటే అర్థముంది. వాడికి పిల్లలెక్కువ. సంసారం పెద్దది మరి."

చలపతికి కొన్ని ఆదర్శాలున్నాయి. అవుతే 'నాకీ ఆదర్శాలున్నాయి. నేను అంతటివాణ్ణి, యింతటివాణ్ణి' అని పదిమందిలో చెప్పుకోడంగాని—లేదా—పదిమందిచేత అనిపించుకోడం గాని అతనికి యిష్టంలేదు. ఎప్పుడైనా అలాంటి ప్రసక్తి వచ్చిందంటే, వాడు అక్కడ్నుంచి చివాలున లేచి వెళ్ళిపోయేవాడు.

వాడికి క్షయఉన్నదని నిర్ధారణ అయిన తర్వాత కూడా వాడికి పెళ్ళిచేసి, ఆ పెళ్ళిద్వారా కొంత రాబట్టాలని వాళ్ళన్నయ్య నిశ్చయం. ఈ జబ్బుమాట మభ్యపరచి ఉచ్చులు పన్నాడు. ఈ వలలో ఇరుక్కున్నది రజని కుటుంబం !

రజని మాకు జూనియరు. చలపతిలానే ఆమె కూడా చక్కగా పాడేది. కాలేజీలో జరిగే ప్రతి చిన్నఫంక్షనికీ వీళ్ళ పాటకచ్చేరి ఓ ప్రత్యేకత. చాలామంది వీళ్ళ పాటల్ని వినటానికే హాజరయ్యేవారు. ఇటు శాస్త్రీయమూ, అటు లలిత సంగీతాల్లో కూడా యిద్దరూ ఆరితేరినవాళ్ళు. వాళ్ళ పాటని అభినందించనివాళ్ళు అసలు లేనేలేరు.

కమ్మగా పాడేవారు—వాళ్ళు పాడుతూంటే సర్వాన్నీ మరిచిపోయి వినడం ప్రేక్షకుల వంతు.

వాళ్ళకున్న యీ ప్రావీణ్యత కేవలం కాలేజీవరకే కాకుండా బయటకు కూడా వ్యాపించింది. స్థానికంగా జరుపుకునే ఉత్సవాలకి వీ రిద్దరూ ప్రత్యేకఆహ్వానితులు. వీళ్ళు పాడే పాటలు వింటూ పురజనులు అలా మైమరిచేవారు.

చలపతికీ, రజనికీ పరిచయం యీ రీత్యా ప్రారంభమయింది. కొన్నాళ్ళకి యిద్దరూ దగ్గరయ్యారు. మనసులు కలిశాయి. మేము థర్డ్ యియర్ చదువుతూండగానే యీ విషయాలు యింటిదగ్గర వరకూ వెళ్ళాయి. పెద్దవాళ్ళకి తెలిశాయి. వీళ్ళిద్దరి పెళ్ళి విషయమూ సంప్రదించుకోలేదుగాని—మనస్సుల్లో పెట్టుకుని మవునంగా ఉండేవాళ్ళు పెద్దవాళ్ళు.

ఫైనలియర్ రోజుల్లో చలపతికి 'క్షయ' దాపరించింది. వాళ్ళన్నయ్య అతని భుజం తట్టాడు. లౌక్యంగా మాటాడాడు. ఇటు చలపతికి ధైర్యం చెప్తున్నట్టు నటిస్తూ—అటు రజని పెద్దవాళ్ళని పెళ్ళికి వప్పించాడు.

ఈ విషయం చలపతి వరకూ వచ్చింది. 'నాకున్న జబ్బుని కనిపెట్టి వాళ్ళని మోసం చెయ్యడం తగదని' వాళ్ళన్నయ్యకు చెప్పాడు. 'నువ్వాపిల్లని ప్రేమించలేదా ?' అని ప్రశ్నించా రాయన. "ప్రేమించాను కాబట్టే చెప్తున్నా. నాలాటి దురదృష్టవంతుడికి ఆమె అంకితమై జీవితం దుఃఖమయం చేసుకోడం నేను సహించను." అని జవాబిచ్చాడు చలపతి.

వాళ్ళన్నయ్య రుద్రుడయ్యాడు. ఎన్నో ఎత్తులు వేశాడు. ఒక్కటీ పారలేదు. చివరికి విసిగిపోయి అన్నాడు, "ఈ పెళ్ళి ఎలా జరగదో నేనూ చూస్తాను" అని.

చలపతే స్వయంగా రజనివాళ్ళింటికి వెళ్ళాడు. తన పరిస్థితిని చెప్పుకున్నాడు. ఇంతవరకూ వాళ్ళని మభ్యపరచిన అన్నయ్యని క్షమించమని అన్నాడు.

చలపతికి క్షయ అని తెలిసి రజని ఆశ్చర్యపోయింది.

రజని తండ్రి చలపతి వ్యక్తిత్వానికి చేతులు జోడించారు.

'మనుషుల్లో దేవుడున్నాడని ఋజువు చేశావు నాయనా' అని ఆయన చలపతిని అభినందించారు.

అంతే—

ఆ పెళ్ళి ఆగిపోయింది. దాంతో అన్నా తమ్ముళ్ళ మధ్య సమ్మంధం కాస్తా తెగిపోయింది. ఆస్తి, పంపకం జరిగింది. 'నీ ముఖం చూడనూ' అని ఒట్టు వేసుకున్నాట్ట చలపతి వాళ్ళ అన్నయ్య.

చలపతి యీ విషయాలని పెద్దగా పట్టించుకోలేదు. ఆస్తి పంపకం అయినతర్వాతనుంచీ యిలా వూళ్ళు తిరగడం నేర్చుకున్నాడు.

నేటికి—అనుకోకుండా—ఓ అర్ధరాత్రి—రైల్వే ప్లాటుఫారమ్మీద మళ్ళీ కనుపించాడు చలపతి. చలపతిలాంటి మనుషుల్ని మరిచిపోడం అంత తేలికేంకాదు.

—రైలు పోతూంది వడిగా. చుట్టుపక్కల పరిసరాలన్నీ చీకట్లో కలిసిపోయాయి. అంతా ఏదో ఒక చీకటి ముద్దలా ఉన్నది.

పుట్టి పెరిగిన యిన్నేళ్ళకి మావూరువిడిచి యింత దూరం రావడం జరుగుతోంది. కొత్త వూరు—కొత్త మనుషులు—కొత్త జీవితం !—

నిద్ర తేలిపోయింది.. కళ్ళమాత్రం మంటగా ఉన్నాయి. కంపార్టుమెంటంతా నిశ్శబ్దంగా ఉన్నది. ఉన్న కొద్దిమందీ నిద్రపోతున్నారు. 'ఫాన్' చేస్తున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది.

రంగనాథం, వాళ్ళమావయ్యగారింటో ఉండవచ్చని రాశాడు. కాబట్టి యిల్లు వెదుక్కోడంలాటి ఒక పెద్ద సమస్య తీరిపోయింది. రెండోది భోజనం— హైస్కూలు చదువు వరకూ అమ్మ చేతివంట బ్రహ్మాండంగా ఉండేది. కాలేజీలో మాత్రం యిరవైమంది కలిసి 'మెస్సు' పెట్టుకున్నాం. ఓ ముసలావిడ మా అందరికీ వంట చేసిపెట్టేది. అమ్మ చేసిన వంటలా లేకపోయినా పర్వాలే దనిపించింది. ఆ నాలుగేళ్ళూ భోజనంగురించి పెద్ద యిబ్బందిపడలేదు.

ఇప్పుడిహ హొటలుభోజనం తప్పదులా ఉన్నది. ఈ అనుభవంలేదు నాకు. కాని ఘూర్తి చెప్తూండగా విన్నాను. కాస్త భయంకరంగానే ఉంటుందని.

"మొదట్లో పర్వాలేదనిపిస్తుంది. ఆ తర్వాత మాత్రం—వాడు పెట్టేభోజనం మానుకుని ఎక్కడైనా పారిపోవాలనిపిస్తుంది. వంటలో రుచీ గిట్టా అవతల పెట్టు—శుచీ శుభ్రతా మచ్చుకైనా కనుపించవు.. మనం భోంచేసే ప్రాంతానికి సరిగ్గా ఓ పది అడుగుల దూరంలో 'పాసింజేర్లు' (ఇది హొటలువాళ్ళ వాడుకభాషట—అంటే అక్కడికి భోంచేయడానికి వచ్చిన ఆసాములు అని అర్థంట) కాళ్ళు

కడుగుకోవటాలూ, కాండ్రించి 'ఉమ్మి వూయటాలూ మొదలైనవన్నీ జరుగుతాయి. సిగరెట్లు కాల్చిన చేత్తోనే వడ్డన ప్రారంభిస్తాడు సర్వారావు. హొటలుగేటు దగ్గరే టిక్కట్టు పుచ్చుకుని సినిమా హాల్లోకి జనాన్ని తోసినట్టు తోస్తారు లోపలికి. తింటే తినూ లేకపోతే చావూ అనే పద్ధతి బాగా వంట పట్టింది. నీ రుచి పచీ ఎవడికీ అక్కర్లేదు. వాడు వండింది గబ్‌చిబ్‌గా తినేసి రావడమే నీవంతు. అన్నం పెట్టడం గూడా వ్యాపారపద్ధతిలోకి దిగుతే యిలా అఘోరించక మరేవవుతుందీ''—అంటాడు మూర్తి. పాపం !—ఇంత చెప్తూ ఎలా తింటున్నాడో ఏమో మరి.

తప్పదు మరి .... పరాయిచోటుకి వెళ్లినప్పుడు యిలాంటివి పట్టించుకునీ పట్టించుకోనట్టుండాలి మరి.

ఇల్లూ, అమ్మా, తమ్ముడూ గుర్తుకొచ్చారు. ఈపాటికి అమ్మా, తమ్ముడు మంచినిద్రలో ఉండిఉంటారు. నిశ్చింతగా నిద్రపోవడం యిప్పట్నుంచే ప్రారంభమవుతుంది.

ఆలోచనలు రకరకాలుగా వస్తున్నాయి. ఇప్పు డొకటి ఆలోచిస్తే మరో క్షణంలో ఆ ఆలోచన మారి మరో ఆలోచన చోటు చేసుకుంటున్నది. ఊరికే కూర్చుంటే యింతే మరి. అందరూ గుర్తుకొస్తున్నారు.

పోనీ ఏదైనా చదువుకుంటూ గడుపుదామంటే—బుద్ధి పుట్టడంలేదు. నిద్రైనా వస్తుందా అంటె అదీలేదు.

ఇంకా యిలా ఎంతసేపు కూర్చోవాలో ఏమో ? .....

నాముందు నిశ్చింతగా నిద్రపోతూన్న వ్యక్తుల్ని చూస్తూంటే యీర్ష్య పుట్టుకొస్తుంది. వాళ్ల కసలు ఏ ఆలోచనలూ రావా ? ఎవరూ గుర్తుకు రారా ?

వాళ్లలా నే నెందుకుండలేక పోతున్నాను ?

పోనీ యీ పాడు రైలు వెంటనే నన్ను కాకినాడలో దింపకూడదూ ?

చిరాకు—విసుగు—కోపం. మళ్లీ మొదటి స్థితి. ఆలోచనలు, జ్ఞాపకాలూ.

వూరు దగ్గరవుతున్నకొద్దీ—అసహనం ఎక్కువవుతోంది. ఇదో చిత్రమైన 'సెంటిమెంటు'. ఇంతదూరం వచ్చినవాడ్ని—కాస్సేపు ఓపిక పడితే పోదూ !

2

తెలతెలవారుతోండగా రైలు సామర్లకోట స్టేషన్ను చేరుకొన్నది !

'అబ్బ !—ఎలాగైతేనేం చేరుకున్నాను మొత్తానికి.'

ప్లాటుఫారమ్ మీదికి సామాను దించుకున్నాను. సిగరెట్టు ముట్టించి చుట్టూ ఒకసారి చూచాను. ఇంకా బద్ధకంగానే ఉన్నది. వళ్లంతా పొట్లు పుడుతున్నది. కళ్లు మంట లెత్తుతున్నాయి.

మళ్లీ శివం కనుపించాడు !

అతని పక్కన యిప్పుడామె లేదు. ఎవరో రైల్వే ఉద్యోగి అతనివెంట నడుస్తున్నాడు. ఇద్దరూ కలిసి స్టేషను మాష్టరు గదివైపు విసురుగా వెళ్లారు.

ఇదంతా చూస్తూంటే నాకేదో విడ్డూర మనిపించింది. దీనికి తగ్గట్టు శివం ఎక్కిన కంపార్టుమెంటు దగ్గర జనం గుమిగూడి ఉన్నారు. ఏమిటో తెలుసుకుందామని అక్కడికి వెళ్లాను.

ఆ పెట్టంతా గాలించి చూచినా ఆ యువతి కనిపించ లేదు. ఇది మరీ విడ్డూర మనిపించింది. అదే పెట్టెలో మరో యువకుడు ఎవర్తోనో అంటున్నాడు.

''అనవసరంగా నన్ను నిలదీసి అడిగినట్టు ''మీ జేబులు తనిఖీ చెయ్యాలనీ' అడగటానికి అత నెవరు ? అసలు వీళ్లిద్దర్నీ బెజవాడనుంచి గమనిస్తున్నా. మొదట్లోనే అనుమానం వేసింది. కాని—అతనికి సమ్మంధించిన అమ్మాయేమోనని సరిపెట్టుకున్నాను. ఆమె ఎక్కడ దిగిపోయిందో నాకూ తెలీదు. ఇక్కడికొచ్చింతర్వాత 'నా పర్సు పోయిందని' అతను గోలచేశాడు. ఆ అమ్మాయిమీద నాకు అనుమానం దృఢపడింది. ఆమె యీ కంపార్టుమెంటులో పత్తాలేకుండా పోయింది.—ఏదో సామెత చెప్పినట్టు పర్సు కొట్టేసి పరారయిన ఆ అమ్మడ్ని ఏమీ అనలేడు గాని నవ్వినందుకు నామీద అగ్గిరాము డవుతున్నాడు. ఇదేమైనా బావుందా ? మీరే చెప్పండి ?''

''అస లింతకీ ఆ పిల్లెవ్వరండీ ?'' ఎవరో కలుగజేసుకున్నారు.

''నాకు తెలుస్తేగదా మీకు చెప్పటానికీ ?—ఇలా జరుగుతుందని ఊహిస్తే ముందే హెచ్చరించి ఉండేవాణ్ణి. పూర్ ఫెలో .... '' అన్నాడా యువకుడు.

ఇప్పటిగ్గాని కథ నాకు అర్థంకాలేదు. శివం, తన అలవాటుకొద్దీ ఎవరో ఓ అమ్మడ్ని బెజవాడ ప్లాట్‌ఫారమ్ మీద హడావిడిగా, అర్జంటుగా ప్రేమించేసి ఉంటాడు. నే పిలిచినా పలక్కపోటాని కిదే కారణం కాబోసు. ఆ అమ్మాయి కాస్తా యిలా షోకా యిచ్చేసరికి బెంబేలుపడిపోయి—గేలిచేస్తూన్న యీ యువకుడిమీద విరుచుకు పడిపోయి ఉంటాడు.

ఓ పక్కన నవ్వుగా ఉన్నా—మరోపక్క జాలిగా ఉంది.

మరో పావుగంటలో శివం ఆ కంపార్టుమెంటు దగ్గరికి వచ్చాడు దిగులుగా. నన్ను చూస్తూనే తల దించుకున్నాడు సిగ్గుతో. నేనే పలుకరించాను.

''ఎందాకా ?'' అని.

''విశాఖపట్టణం'' అన్నాడు దైన్యంగా.

''టిక్కెట్టు కూడా పోయిందా ?''

''లేదు. అది వేరే జేబులో పెట్టుకున్నాను.''

అతన్ని చాటుగా పిలిచి—అతని చేతిలో అయిదు రూపాయల కాగితం పెడ్తూ అన్నాను—

''ఇది వాడుకో—దారి ఖర్చులకి.''

అతని అభిమానం దెబ్బతిన్నది కాబోలు—తీసుకోనా వద్దా అని సంశయించాడు. కానీ నా బలవంతంమీద తీసుకోక తప్పిందికాదు.

''పెళ్లి చేసుకున్నావుగదా ! యింకా యీ పసితనం పోకపోతే ఎల్లా శివం ?''

అతను తలదించుకున్నాడు.

"సరే .... ఇంక నేనుంటా. ఒకమాట—అంత తొరగా మమ్మల్ని మరిచిపోటానికి ప్రయత్నించకు." అని చెప్పి వా పెట్టె బేడా కూలిచేతి కిచ్చి, ఓవరుబ్రిడ్జి దాటి కాకినాడ ప్లాటుఫారమ్మీద కొచ్చాను.

కాకినాడకు పోయే 'డూప్లికేటు'లో నా సామాను సర్దాడు కూలి. అతనికి డబ్బులిచ్చి పంపాను.

అప్పుడే కేంటిన్ తలుపులు తెరిచారు. వేడివేడిగా యిడ్లీలు తయారయ్యాయి. ముఖం కడుక్కున్నాను. ఇడ్లీలు తిని కాఫీ తాగాను.

ఇప్పుడు ప్రాణానికి సుఖంగా ఉన్నట్టనిపించింది.

సిగరెట్టు ముట్టించి ప్లాటుఫారమంతా ఒకసారి అటు నుంచి యిటు తిరిగాను. స్టేషనుకుంటూవెడితే, ప్లాటుఫార మంతా ఓసారి సర్వే చెయ్యడం నాకు బాగా అలవాటయ్యింది. శోభనాద్రి యిప్పటిగ్గూడా అంటాడు—"ఏంరా— ఆ అల వాటు యింకా ఉందా పోయిందా" అని. రైలు వచ్చి రాంగానే, సీటు సంపాయించుకుని తిష్ఠవేయడం వాడి పద్ధతి.

మరో అరగంటకి 'డూప్లికేటు' కాకినాడ బయల్దేరింది.

సూర్యోదయం—సరిగ్గా ఆవేళ్లకే కాకినాడ టౌను స్టేషన్లో కాలు పెట్టాను. రంగనాథంకోసం ప్లాటుఫార మంతా వెదకాను. కనిపించలేదు.

స్టేషను బయటనిలబడి రోడ్డువైపు చూశాను. ఒకరిద్దరు రిక్షావాళ్లు అడిగారు—ఎక్కడికి వెళ్లాలి బాబూ— అని. ఏమని చెప్పను. రంగనాథం వచ్చేంతవరకూ నన్నిక్కడే ఉండమన్నాడాయె.

నేను చూస్తూండగానే నాముందు ఓ కారు వచ్చి ఆగింది. చేతితో సైగజేశారు రమ్మన్నట్టు. కారులోకి తొంగి చూశాను.

రంగనాథం !

అతను బాగా మారిపోయాడు. కాస్త లావైయ్యాడు గూడాను. రంగులోగూడా మార్పు కొట్టొచ్చినట్టుంది. అలాగే అతనివంక నేనూ, నావంక అతనూ చూస్తూ ఉన్నాము. చివరికి అతనే అన్నాడు కారునించి దిగి.

"నేనే ఆలస్యంగా వచ్చాను. రైళ్లు ఇంత టంచన్‌గా వడుస్తాయని తెలుస్తే యింకాస్త పెందరాళే వచ్చేవాడ్ని."

"మొత్తానికి వచ్చావ్. అది చాలు." అన్నాను నవ్వుతూ.

కూలీ నా సామాను కారులో పెట్టాడు. కారులో కూర్చున్నాను. కదిలింది.

"రామకృష్ణారావుపేటలో ఉంటున్నాం. ఇక్కడి కది కాస్త దూరం. ఈ కారు మావగారిది. ఇక్కడికి వచ్చిం తర్వాతనే డ్రైవింగు నేర్చుకున్నాను" అన్నాడు రంగనాథం, మలుపు తిప్పుతూ.

"ఇంట్లోవాళ్లందరికీ నిన్నుగురించి చెప్పాను. వాళ్లంతా నిన్ను చూడాలని ఆత్రంగా ఉన్నారు."

అతను చాలా విషయాలు నా ప్రమేయం లేకుండానే చెప్పుకుపోతున్నాడు. నా మనస్సు అతనిమీద లగ్నమయ్యింది. నాకు తెలిసినంతవరకూ అతను వాళ్ల చిన్నాన్నగారింటో చాలా నికృష్టంగానే బ్రతికాడు. ఇక్కడ అతను అనుభ విస్తూన్న హోదా చూస్తూ ఆశ్చర్యపోతున్నాను. మాటా— కారు—మాట తీరు, మనిషిలో హుందాతనం తళుక్కు మంటోంది.

దార్లో అతని ప్రాక్టీసు గురించి అడిగాను.

"మావయ్య కీపూళ్లో పెద్ద పేరున్నది. ఆయన దగ్గర "ఎప్రంటిస్" చెయ్యడమే మహద్భాగ్య మనుకుం టారు చాలామంది. ఈవిధంగా 'అదృష్టం' నాకు దగ్గర పడింది. భవిష్యత్తులో పేరు సంపాయించుకోగలననీ, మావ య్యంత పలుకుబడికి నోచుకోలేకపోయినా—పేరొందిన లాయర్లలో నేనూ ఒహడ్నని అనిపించుకోగలననే నమ్మక ముంది.—అది సరేగాని రైల్లో నిద్ర పట్టిందా" అని అడిగా గాడు.

"అవన్నీ నింపాదిగా చెప్తాను. ముందు యింటికి పద త్వరగా."

రైలుస్టేషనుకి దూరంగా ఉన్నది రామకృష్ణారావుపేట. ఆపేట చివర్లోనే లాయరు పరంధామయ్యగారి బంగళా ఉన్నది. అధునాతనంగా, అందంగా ఉంటుంది. కారు ఆవరణ లోకి తీసుకొచ్చి ఆపాడు.

ఆవరణలో చక్కటి క్రోటన్సు, ఆ బంగళా అందాన్ని మరింత యినుమడింప జేస్తున్నాయి. కారు హారను వినగానే ఓ స్త్రీ గబగబా బయటకొచ్చి వరండాలో నిలబడింది.

ఆవిడ అలంకరణ నాగరికంగా ఒక్కమాటలో 'స్టైయిల్' గా ఉన్నది. పెదిమెలకు లిప్‌స్టిక్, షిఫాను చీర, కళ్లకు జోడు, చేతిలో హేండ్‌బేగ్, కుడిచేతికి మూడు బంగారు గాజులూ, ఎడంచేతికి ఓ రిస్టువాచీ.

మమ్మల్ని చూస్తూ నవ్వుతూ అడిగింది—

"వీరేనా మీ శంకరం ?"

"అని వేరే చెప్పాలా ? ఈవిడ నా మిసెస్ కుసుమ!"

నమస్కారం చేశాను. ఆవిడ అందంగా ప్రతి నమ స్కారం చేస్తే—

"బాగా టైర్డైపోయి ఉంటారు. ఈ రైళ్ల పోకడ ప్రాణాలు తీస్తుంది. పైగా థర్డ్‌క్లాసు ట్రావెల్ ఏమో— మరీ రెష్‌గా తగలడి ఉంటుంది. లోపలికి వెళ్లండి. స్నానం ముగించి కాస్త రెస్టుతీసుకోండి. నాకో చిన్న ఎంగేజ్మెం టున్నది. విష్ యూ మీ టెగ్జైన్ .... " అని నా సమాధానం కోసమైనా ఆగకుండా, చకచకా కారు దగ్గరికి వెళ్లింది కుసుమ. కారు కదిలింది.

ఆమె మాటాడిన యీ కాసేపటిలోనూ, ఆమెలో దర్పంలాంటి గుణం కనుపించింది నాకు. నే నలాగే చూస్తూ నిలబడిపోయాను.

"ఈవిడగారు యిక్కడున్న ఓ మహిళా సమాజానికి సెక్రటరీ ! లేనిపోని పనులన్నీ నెత్తినేసుకుని తిరగడం ఆమెకో హాబీ .... కమాన్ .... లోపలికి పోదాం. నర్సయ్యా .... ఓ నర్సయ్యా .... " అని పిలిచాడు ఎవర్నో.

దాదాపు ఓ నలభై ఏళ్ల నల్లటి వ్యక్తి మా దగ్గరి కొచ్చాడు. రంగనాథం అతనితో అన్నాడు.

"ఈ సామాను దక్షిణవుగదిలో సర్దించు. ఆ గది శుభ్రం చేయించు. ఆ తర్వాత అయ్యగారికి వేన్నీళ్ళు పెట్ట మని చెప్పు. వెళ్ళు."

తర్వాత నా భుజంమీద చేయివేసి లోనికి తీసుకెళ్లాడు. సోఫాలో తాను కూర్చుంటూ నన్నూ కూర్చోమన్నాడు. కూర్చున్నాను.

"ఈ యిల్లు ఎలా ఉంది ?"

"బ్రహ్మాండంగా ఉంది."

"మావయ్య ప్రస్తుతం యీ వూళ్లో లేరు. రేపు వస్తారేమో. పోతే—నీకు పరిచయం కావలసింది మిస్ పద్మా కుమారి. పద్మా .... ఓ పద్మా .... " అని పిలిచాడు.

"ఓయ్. వస్తూన్నా. ఏవిటా గావుకేకలూ .... " అంటూ చేత్తో పుస్తకాలు పెట్టుకుని, పమిట సర్దు కుంటూ ఓ పద్దెనిమిదేళ్ల యువతి హాల్లోకి వచ్చింది.

ఆమెచేతిలో పుస్తకాలు చూచి అడిగాడు రంగనాథం.

"ఇవ్వాళ ఆదివారమని మరచిపోయారులా. ఉంది రాణీ వారు. కాలేజీకి బయల్దేరారు."

"అయ్యో ఖర్మం ! రాత్రేకదుటండీ చెప్పింది. ఇవ్వాళ ఎనిమిదిగంటలకి ప్రైవేటు క్లాసున్నదని లాయరుగారూ! అప్పుడే యింత మతిమరుపా ?" అన్నది సమాధానంగా.

"భేష్ .... నాకు తగిన మరదలు పిల్లవు .... వాడు నా మిత్రుడు శంకరం. ఈ పిల్ల .... ఆఁ .... యింతవరకూ మాకు జరిగిన సంభాషణ విన్నావుగా, యింకా వేరే పరి చయం చెయ్యడ మెందుకూ ?" అన్నాడు నవ్వుతో.

"మీ గురించి బావ చాలా చెప్తూంటాడు. తీరుబడి దొరికినప్పుడల్లా మీ విషయమే తీసుకొస్తాడు. మిమ్మల్ని చూచినందుకు సంతోషం. మధ్యాన్నం తీరుబడిగా మాటాడుకో వచ్చు. ఇప్పుడు నాకు క్లాసున్నది. వస్తానండి" అంటూ ఆపిల్ల కూడా వెళ్లిపోయింది.

నేనలా గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను. నా వాలకం గమనించి నవ్వుతూ అన్నాడు రంగనాథం—

"ఈ యింటో ఉన్న వ్యక్తు లందరూ చాలా తమా షాగా ఉంటారు. ఒకరి విషయం ఒకరు చస్తే పట్టించు కోరు. ఎవరి పనులు వాళ్ళు చకచకా మెకానికల్‌గా చేసుకుపోడం రివాజు. ఉదాహరణకి నేనివ్వాళ ఫోంచెయ్యలే దనుకో .... ఆ సంగతేవిటో వంటావిడ చూచుకోవాల్సిందేగాని కుసుమ కాదు. ఆమె ఫోంచెయ్యకపోయినా అంతే ! ఈ పనులు వీవి, ఆ పనులు నావి అని కేటాయించుకోడం జరిగింది. వాటిని తూ. చ. తప్పకుండా పాటిస్తూంటాం. లాయరు పరంధామయ్యగారు చాలా డిసిప్లిన్డ్. ఆయన పద్దతుల కనుగుణంగానే పెరిగారు యీ యిద్దరూను."

ఈ విషయా లన్నీ చాలా చిత్రంగా ఉన్నాయి.

"ఇంక లే .... స్నానం చేద్దువుగాని. తర్వాత భోజనం. ఆ తర్వాత నిద్ర. మళ్లీ మధ్యాన్నం—ఆ ప్రోగ్రామంతా అప్పుడు చూచుకోవచ్చు. ముందు స్నానానికి లే .... " అని తొందర చేశాడు.

స్నానం ముగించాను. నాకు కేటాయించిన గదిలోకి వెళ్లి బట్టలు. మార్చుకున్నాను. ఆ తర్వాత చాలాసేపు, రంగ నాథం ప్రాక్టీసుగురించీ, పరంధామయ్యగారి పరపతిగురించీ చివరికి కాకినాడలో ఆడుతున్న సినిమాలగురించీ—మాటాడు కున్నాం. వంటయిందనీ, భోజనానికి లేవచ్చుననీ పిలుపు వచ్చింది. భోజనానికి లేచాం.

భోజనాలైన తర్వాత

"ఇంక తృప్తిగా నిద్రపో.... వెళ్లు" అన్నాడు రంగనాథం.

నా గదిలోకి వెళ్లాను. పేవాల్డాలు పరిచి నిద్రపోటా నికి నడుం వాల్చాను. రంగనాథం, కుసుమ, పద్మలగురించీ వాళ్లపైన నా అభిప్రాయాలగురించీ ఆలోచించడం మొదలు పెట్టాను.

అయినా నా పిచ్చికాకపోతే పరిచయమైన గంటన్నర లోనూ వాళ్లగురించి ఏం తెలుసుకున్నాననీ ? నవ్వుకున్నాను.

అలాగే కళ్లుమూసుకు నిద్రపోయాను. కాసేపటికి గమ్మత్తుగా నిద్ర పట్టేసింది.

*   *   *   *

మెలుకువ వచ్చేసరికి నా గదిలో రంగనాథం కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. టైం చూశాను. మూడయ్యింది.

"నువ్వెంతసేపయింది వచ్చి" అని అడిగాను.

"అరగంట గడిచింది. నిన్ను లేపుదామనే వచ్చాను గాని, మళ్లీ నీ నిద్ర పాడుచెయ్యడ మెందుకులేమని వూరు కున్నాను. పాపం ! బాగా అలిసిపోయావేమో మంచి నిద్ర పట్టినట్టుంది."

అవునన్నట్టు తలూపాను.

"రా .... అలా బాత్‌రూంలోకి వెళ్లి ముఖం కడు క్కుని వచ్చేయి. టీ తాగుదాం".

ముఖం కడుక్కుని బయట కొచ్చేసరికి హాల్లో సోఫాల్లో అందరూ కూర్చుని ఉన్నారు.

ప్లేట్లలో బిస్కట్లూ వగైరా ఉన్నాయి. "తీసుకో" అన్నాడు రంగనాథం.

అందరితోపాటూ నేనూ మవునంగా బిస్కట్లు తింటు న్నాను. ఉన్నట్టుండి కుసుమ మధ్యలో అడిగింది నన్ను, నిశ్శ బ్దాన్ని భంగపరుస్తూ—

"బి. ఏ. తోనే ఆపారెందుకూ ?"

"అమ్మ పట్టుదలతో ఆమాత్రమైనా చదవగలిగాను. బి. ఏ. చదవాలని కూడా ఉండేదికాదు."

"ఎందుకనిట."

నేనోసారి రంగనాథంవైపు చూచి అన్నాను.

"ఆర్థికంగా మేము ఏమంత ఉన్నవాళ్లం కాము."

మా మాటల్లో రంగనాథం కలుగజేసుకున్నాడు.

"ఈ సోదితో పనేమిటిగాని .... సాయంత్రం ప్రోగ్రాం ఆలోచించండి."

"ఇవ్వాళ మా సమాజం తరఫున ఓ చిన్న ఫంక్షనుంది. నే నక్కడికి ఎటెండ్ కావాలి" కుసుమ అన్నది.

''మరి నీ విషయం ?'' అని పద్మ నడిగాడు.

''సారీ బావా ! ఇవ్వాళ ఓ ఫ్రెండుతో సినిమాకి వస్తా నన్నాను.''

''బాగానే ఉంది. ఇక పోతే—నువ్వు, నేనే మిగిలింది. పోనీలే .... యివ్వాళ హాయిగా వూరంతా తిరుగుదాం.''

''నడిచే—'' అన్నది పద్మ.

''కారుందిగా'' అన్నాడు రంగనాథం.

''అదేం కుదరదట బావోయ్ ! నే నిందాకే అడిగాను అక్కయ్యని కారుకోసం. ససేమిరా యివ్వనంది. కాబట్టి ...''

''ఏం కుసుమా ! నీకు కారుతో అవసరముందా ?''

''ఉన్నదనేగా పద్మతో చెప్పాను.''

రంగనాథం—కేటిల్‌లో ఉన్న టీని కప్పుల్లో పోసి, తాను టీ తాగుతూ—

''సరే కానివ్వండి. ఈరోజు కాకపోతే మరోరోజు వూరు చూడొచ్చు. ఇవ్వాళ్టికి మాత్రం మా ఆఫీసు చూపిస్తాను. సాయంత్రం ఆఫీసు చూచినతర్వాత పార్కులో సరదాగా కూర్చుని మాటాడుకుందాం. ఏమంటావ్ ?'' అని నన్నడిగాడు.

తలూపాను 'సరే' అన్నట్టు.

మరో పదినిమిషాల్లో టీ తాగింతర్వాత—అక్కా చెల్లెళ్లిద్దరూ, తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు మాటా మంచీ లేకుండానే.

రంగనాథం లేస్తూ అన్నాడు.

''నువ్వు త్వరగా బట్టలు మార్చుకునిరా ! వెడదాం.''

—రిక్షామీద ఆఫీసుకు వెళ్లాం. గాంధీనగరంలో ఓ మూలగా, కొత్తగా కట్టారు మా ఆఫీసు. ఆఫీసు చూచిం తర్వాత యిద్దరమూ అక్కడికి దగ్గర్లో ఉన్న పార్కులోకి వెళ్లి కూర్చున్నాం.

''ఏమి టాలోచిస్తున్నావ్ ?'' అన్నాడు రంగనాథం నా పరధ్యానాన్ని గమనించి.

''అబ్బే ! ఏంలేదు.''

''కాదు. ఏదో దాస్తున్నావ్. చెప్పు. లాభంలేదు.''అన్నాడు.

చివరికి చెప్పక తప్పిందికాదు.

''చక్కటి గది ఏదైనా ఆఫీసుకు దగ్గర్లో తీసుకోవాలని ఉన్నది.''

''అదేమిటోయ్ ! మధ్య గదీ గిదీ అని అంటున్నావ్ ? ఏం—మా బంగళా నచ్చలేదా ఏమిటి ?''

''బ్రహ్మాండంగా ఉన్నది.''

''మరి !''

కాసేపు ఆలోచించి అన్నాను.

''ఆఫీసుకు దూరం. అదే కారణం.''

''దూరమేమిటి దూరం. సరిగ్గా నడుస్తే ఓ పావు గంట పట్టదు. భోజన మంటావా ? — నీ యిష్టమొచ్చిన హోటల్లో చూచుకో. నువ్వు మాత్రం నాతోపాటు ఆ యింటో ఉండాల్సిందంతే .... కాదనకు. రేపు నాకు పనుంది. కాబట్టి నువ్వు కాస్త పెందరాళే ఆఫీసుకు వెళ్లు.''అని అన్నాడు.

దాదాపు అయిదున్నర గంటలక్కాబోలు—

''వెంకటేశ్వరాలో కొత్త సినిమా ఆడుతోంది. పద—'' అని సినిమాహాలుకి రిక్షాని బేరమాడాడు. వెళ్లక తప్పింది కాదు.

3

ఉదయం పదిగంట లయ్యింది.

ఆఫీసులో అడుగుపెట్టాను. ఎవరో కొద్దిమంది మాత్రం సీట్లలో కూర్చున్నారు. చాలాసీట్లు ఖాళీగా ఉన్నాయి. చివరంటూ కూర్చున్న ఓ గుమాస్తా దగ్గరకు వెళ్లి, నన్ను నేను పరిచయం చేసుకున్నాను. నేను వచ్చినపని చెప్పాను.

అతను నాకోవ్యక్తిని చూపిస్తూ అన్నాడు—

''ఆయన హెడ్‌క్లార్కు. ఇంకాస్సేపటిలో ఆఫీస రొస్తారు. హెడ్‌క్లార్కుతో మీరొచ్చినపని చెప్పండి. మీరేం చెయ్యాలో ఆయనే చెప్తారు.'' అన్నాడు.

హెడ్‌క్లార్కు వయస్సుమళ్లినవ్యక్తి. బట్టతల. కళ్ల జోడులోంచి కాగితంలోకి తీక్షణంగా చూస్తున్నారు. ఆయన దగ్గరకు వెళ్లి నిలబడి 'నమస్కారం' అన్నాను.

ఆయన కూడా నమస్కారమని, తలెత్తకుండానే పని చేసుకుపోతున్నారు.

''నాపేరు శంకరం !''

''అవుతే !'' అన్నారాయన రాసుకుంటూనే.

నేనేం మాటాడలేదు మళ్లీ.

''మీపేరు శంకరం .... అవుతే .... '' అని మళ్లీ అడిగా రాయన.

నా ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరూ, సర్టిఫికెట్లూ ఆయన ముందుంచాను. ఆయన అవన్నీ చూశారు. తలెత్తి నావైపు ఒకసారి చూచారు. బాగా యింత ముక్కుపొడుం ముక్కుల్లోకి దట్టించి చేతులు దులుపుకుంటూ అన్నారు—

''కొత్త కేండిడేటు మీరేనా ?''

తలూపాను.

''అలా కూర్చోండి. కాసేపట్లో ఆఫీస రొస్తారు. ఇదుగో మిస్టర్ గుర్నాధం—యీాయన కొత్త కాండిడేటు. కాస్త యీ డిటెయిల్స్ నోటు చేసుకోండి రిజిష్టర్లో. ఆఫీసరు రాగానే పుటప్ చెయ్యండి'' అని తనక్కాస్త దగ్గర్లో కూర్చున్న గుమాస్తాని పిలిచి, నా సర్టిఫికెట్లూ—అప్పాయింట్‌మెంట్ ఆర్డరు యిచ్చారు. అతను నావైపు అదోకవిధంగా చూచి, సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లిపోయాడు.

దాదాపు పదకొండుగంటలకి ఆఫీస రొచ్చారు. ఆయన వచ్చీ రాగానే యిద్దరు ముగ్గురు గుమాస్తాలని పిలిచారు. గంటా, గంటన్నరపాటు వాళ్లతో ఏవో మాటాడారు.

తర్వాత నా యింటర్వ్యూ—అది ఓ అరగంటసేపు జరిగింది. నా సీటూ, నే చేయవలసినపనీ అన్నీను హెడ్‌క్లార్కు గారిని అడిగి తెలుసుకోమన్నారు. అలాగేనంటూ బయట కొచ్చాను.

ఈ కాసేపట్లోనూ ఆఫీసరుపైన నాకు కలిగిన అభిప్రాయం యిది : ఆయన వయస్సులో యువకుడే యింకా. ఎదుటివాడి మాటలన్నీ శ్రద్ధగా వింటారు. ఆయన నాతో

జరిపిన అరగంట యింటర్వ్యూలోనూ మూడు సిగరెట్లు కాల్చిపారేశారు. ఓపక్కన గోల్డ్‌ఫ్లాక్ టిన్నూ, మరోప్రక్క చార్మినార్ సిగరెట్టుపెట్టే ఉంటాయి. ముందస్తుగా గోల్డ్ ఫ్లాక్, తర్వాత చార్మినార్ కాలుస్తూంటారు. ఇది నాకు విడ్డూరమనిపించినవిషయాల్లో ముఖ్యమైనది.

ఒక్క ముక్కలో ఆయనగురించి చెప్పాల్సొస్తే యిది చాలు—ఆయన చాలా ఏక్టివ్‌గా ఉంటారని.

హెడ్‌క్లార్కు నా సీటుగురించిన వివరాలు చెప్పారు. తర్వాత జాయినింగ్ రిపోర్టు నాచేత రాయించారు.

ఉద్యోగానికి అక్షణంలో శ్రీకారం చుట్టాను.

కాసేపటికి లంచవరన్నారు. అందరం కలిసి కేంటిన్ వైపు నడిచాం.

ఆఫీసు దగ్గర్లో—కేవలం మా ఆఫీసు బృందం కొరకే పెట్టినట్టు ఓ చిన్న కేంటి నుంది. లంచ్‌కి కేటాయించిన అర గంటా కేకల్తో, నవ్వుల్తో గడిచిపోయింది.

చాలామంది నాదగ్గరకొచ్చి నా వివరాలు కనుక్కున్నారు. కాని—నేనీ ఆఫీసులో అడుగుపెట్టే, నేనెవర్ని కలుసుకోవాలో చెప్పమని కనుక్కున్న గుమాస్తా మాత్రం, వాళ్లందర్లో కనుపించలేదు.

గుర్నాథం—ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్లో అందెవేసిన చెయ్యిట. అతను చాలావిషయాలు గమ్మత్తుగా మాట్లాడ్తున్నాడు. లంచ్‌కి కేటాయించిన అరగంటలోనూ మా అందరికీ అతను ఓ పెద్దవక్త—మేమందరం శ్రోతల మూను. అతను మాటాడే విషయాలు నిమిషాని కొకటి చొప్పున మారినట్టు, చకచకా మార్చేస్తూంటాడు. ఇప్పుడు రాజకీయాలు, క్షణంలో సినిమాలు, తర్వాత ఆఫీసుపని ఆపైన స్వంతవిషయాలు. ఇలా అనర్గళంగా మాటాడ్డం అతనికి హాబీయేమో ననిపించింది.

కాఫీలు తాగింతర్వాత ఖాతాలు రాశారు. నెలంతా యిలా ఖాతా పుస్తకంలో బిల్లులు రాసి, నెలాఖరుకు డబ్బు లిచ్చుకోవడం వీళ్లందరికీ రివాజుట.

ఆఫీసుకొచ్చాం! ఇంకా 'అతను' అలా కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. ఆఫీసులో అడుగుపెడ్తూనే అన్నాడుగుర్నాథం—

''ప్రేయసికి ఉత్తరాలు రాస్తున్నాడ్రోయ్! .... అయినా యివ్వాళ యింతదిగులుగా ముఖాన్ని తారీఖు ఫోజు వేసుకుని ఉన్నాడేవిటీ ?'' అతనివెంట నున్న నలుగురైదుగురు గుమాస్తాలూ పక్కున నవ్వారు.

ఈ నవ్వు విని అతను తలెత్తిచూచాడు. మళ్లీ అంతలోనే తల దించుకున్నాడు.

నా సీట్లో కూర్చుంటూ అతనివైపు చూశాను. ఎందుకనో అతనిగురించి తెలుసుకోవాలనిపిస్తున్నది. అతను వీళ్లందరికీ దూరంగా తిరగటానికి కారణమేదో ఉంటుంది ?

అందరూ నన్ను పలుకరించారు. నా వివరాలు అడిగారు. కాని అతను మాత్రం తనకేవీ పట్టనట్టు చాలా నిర్లిప్తంగా ఉన్నాడు. ఎందుకని ?—ఏమైనా సరే, అతని గురించి తెలుసుకోవాలనని నిశ్చయించుకున్నాను.

హెడ్‌క్లార్కు నా సీటు దగ్గరికి వచ్చి చెప్పారు.

''వారం రోజుల్లో మిమ్మల్ని తయారుచేసే బాధ్యత నా కప్పగించారు ఆఫీసరు. కాబట్టి సాధ్యమైనంతవరకూ పనంతా నేర్చుకోండి. ఏదైనా అర్థంకాపోతే నన్నడగండి !'' అంటూ ముక్కు తుడుచుకుంటూ వెళ్లారాయన.

దాదాపు నాలుగ్గంటలకాబోలు ఆఫీసరు బయటికి వచ్చారు. ఆయన గౌరవార్థం అందరం లేచి నిలబడ్డాం. ఆయన హెడ్‌క్లార్కు నుద్దేశిస్తూ అన్నారు.

''యస్. మిస్టర్ రాఘవయ్య ! ఐ యామ్ గోయింగ్‌టు క్లబ్—అర్జంటైతే కాగితాలుంటే అక్కడికి పంపించండి. రాజన్నా .... '' జవాన్ను పిలిచారు.

''అయ.''

''నువ్వు యింటికి వెళ్లు. కాస్త లేటుగా యింటి కొస్తానని చెప్పు'' అని సిగరెట్టు కాల్చుకుంటూ ఆఫీసరు వెళ్లిపోయారు.

ఆయనలా వెళ్లారో లేదో ఆఫీసులో కలవరం బయల్దేరింది. నవ్వులూ, కేరింతాలు మొదలయ్యాయి. ఒక్కో సీటుదగ్గర యిద్దరూ, ముగ్గురూ చొప్పున నిలబడి బాతాఖానీ వేస్తున్నారు. ఇది ఆటవిడుపు కాబోలు. ఆఫీస రున్నంత సేపూ బుద్ధిమంతుల్లా నటించి, ఆయనటు వెళ్లంగానే హడావిడి చేసేస్తున్నారు. చాలామంది సిగరెట్లు ముట్టించారు.

ఇక్కడి యీ పద్ధతి చిత్రంగా ఉంది. ఇంత గోల జరుగుతూన్నా యిదేమిటని హెడ్‌క్లార్కు అడగటంలేదు. పైగా—తనూ బాతాఖానీలోకి దిగారు.

అతను మాత్రం—తనకేమీ పట్టనట్టు పనిచేస్తూనే ఉన్నాడు. నేనతని వైపు అలానే చూస్తున్నాను. అప్రయత్నంగా అతనూ తలెత్తి నావైపుచూశాడు. చిన్నగా నవ్వాను పలుకరింపు చిహ్నంగా. అతనూ నవ్వాడు.

అయిదయింతర్వాత బయట కొచ్చేశాం. గుర్నాథం సైకిలు తొక్కుతూ నా పక్కనే వస్తూ అడిగాడు—

''ఎక్కడుంటున్నారు ?''

చెప్పాను.

''భోజనం కూడా అక్కడేనా ?''

''లేదు. హోటల్లో భోంచెయ్యాలని ఉన్నది.''

''అవుతే—వసంతవిహార్‌లో తీసుకోండి. అక్కడ బావుంటుంది.''

రెండు క్షణాలు గడిచాయి మవునంగా.

''మీ రెక్కడ ఉంటున్నారు ?'' అని అడిగాను.

''రామారావుపేటలో.''

''స్వంతవూరు—''

''పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ—ఆఖరికి ఉద్యోగం చేస్తున్నది కూడా యీ వూళ్లోనే.''

ఆతర్వాత మా ఆఫీసులో 'అతని' గురించి కావాలని అడిగాను.

''అతని పేరు సుందరం. టెంపరరీగా ఎపాయింటయ్యాడు. టెక్కు ఎక్కువ. ఎవరితోనూ కలిసీ మెలిసీ

తిరగడు. ఎంత యిద్దైనా మరీ అంత రిజర్వ్‌నెస్ తగదు లెండి. కాస్సేపు కులాసాగా అందర్తోనూ మాటాడితే అతని సొమ్మేం పోయింది గనుక. పలుకే బంగార మయితే ఎలాగండి మరీను. అందుచేతనే అతనంటే మన ఆఫీసులో ఎవరికీ పడదు.'' అన్నాడు గుర్నాథం.

నాతోపాటు, ఆఫీసువిషయాలు మాటాడుతూ కొంత దూరం వచ్చాడు. అంతలో అతని మిత్రు డెవ్వరో కనిపించాడు. అతనితోపాటు కలిసి వెళ్లిపోయాడు గుర్నాథం.

కాఫీతాగి యింటికి బయల్దేరాను.

నే నింటికి వెళ్లేసరికి రంగనాథం తనపక్కనున్న వ్యక్తితో అన్నాడు.

''ఇతనే మా ఫ్రెండు శంకరం. వీరు మావయ్య.''

అని మా యిరువురికీ పరిచయం చేశాడు.

''రంగనాథం మును పెప్పుడో చెప్పాడు మీ గురించి.''

''అతని ద్వారానే మీరూ యిదివరకే తెలిశారు.'' అన్నాను నవ్వుతూ.

''గూడ్ .... చూడండి .... మా రంగనాథంగురించి చెప్పుకోకూడదు గాని—అతను అందర్లోనూ తలలో నాలికలా మెసుల్తుంటాడు. రోజులు కలిసిరావాలేగాని—నన్ను మించిన లాయరవుతాడు. ఈమాట నే నంటున్నది కాదనుకోండి—తోటి లాయర్లు అంటూంటారు రంగనాథం విషయం వచ్చినప్పుడల్లాను. ఆ .... అది సరేగాని నాయినా .... ఆ మీసాలాసామి వచ్చాడా ?'' అని అడిగారు రంగనాథాన్ని.

''రాలేదు.''

''ఎప్పుడు వస్తాట్ట.''

''అది తెలీదు.''

''సరే .... కనుపిస్తే మాత్రం చెప్పు .... ఆ బకాయి పడ్డ పైకం ఎంత త్వరలో యిస్తే అంత మంచిదని. సరే ... నేనలా కామేశం యింటి దగ్గరికి వెళ్లి వస్తాను. మిత్రు లిద్దరూ మాట్లాడ్తూ ఉండండి.'' అంటూ ఆయన వెళ్లిపోయారు.

ఆయన వెళ్లిన కాసేపటికి రంగనాథం ఆయన గురించిలా చెప్పాడు—

''మావయ్య వట్టి భోళామనిషి. ఏదీ దాచుకుని మాట్లాడేరకం కాదు. ఆవేశం వచ్చినా, ఆనందం కలిగినా పట్టలేరు. క్షణంక్రితం కోపంతో ధూమ్‌ధామ్‌లాడే మనిషి మరోక్షణం తర్వాత నవ్వుతూ పలుకరిస్తారు. ఈ మనిషిలో ఏది ఎప్పుడు ఎంతపని చేస్తుందో చెప్పడం కష్టం.''—

పరంధామయ్యగారి వాలకం చూచిన తర్వాత, రంగనాథం వెలిబుచ్చిన అభిప్రాయం నిజ మనిపించింది అక్షరాలా.

భోజనాలవేళకి కూడా ఆ యింటికి ఎవరూ తిరిగి రాలేదు. ఇంట్లో మిగిలున్న నేనూ, రంగనాథం మాత్రమే భోంచేశాం. తర్వాత కాస్సేపు మా ఆఫీసు విషయాలు మాటాడుకుని ఎవళ్లగదుల్లోకి వాళ్లు వెళ్లిపోయాము.

నిద్రపోయేముందు, ఇంతవరకూ జరిగిన విషయాలన్నీ అమ్మకీ, మూర్తికీ ఉత్తరాల్లో రాశాను.

ఎప్పుడో పదకొండు గంటల క్కాబోలు హాల్లో నవ్వులు వినిపించాయి. కుసుమా, పద్మా, పరంధామయ్యగారు మరో కొత్త కంఠం—నవ్వుతూ ఏవో విషయాలు మాటాడుకుంటున్నారు.

వీళ్లందరూ యిప్పుడే వచ్చారు కాబో లనుకున్నాను.

* * *

రోజులు గడుస్తున్నాయి.

మా ఆఫీసులో అందరూ అర్థమవుతున్నారు. ఒకరిమీద మరొకరికి సదభిప్రాయం లేనేలేదు. అవుతే—అందరూ కలిసి ఉన్నప్పుడు మాత్రం ఎక్కడలేని అభిమానాలూ ఒలకపోస్తూంటారు.

ఆఫీసులో అంతా ఒకటి సుందర మొకటీనూ. సుందరం అభిమానంగల మనిషి. అతన్తో కావాలని స్నేహం చేశాను. ఈ స్నేహంవల్ల నేనంటే ఆఫీసులో చాలామందికి 'మంట' గా ఉంయింది. దీన్ని నే నెప్పుడూ పెద్దగా పట్టించుకోనేలేదు.

సుందరానిది రామచంద్రపురంట. బి. ఏ. పాసయ్యాడు. నాలాగే కొన్నాళ్లు నిరుద్యోగం—తర్వాత యీ టెంపరరీ గుమాస్తాగిరి. ఈ ఉద్యోగం ఏక్షణాన వూడపెరికి పారేస్తారో తెలీదు. దానికి తగ్గట్టు ఆఫీసు వాతావరణం అతని మనసుని కలవరపెడ్తోంది.

అవతలివ్యక్తి మనస్సుకు నచ్చినవాడైతే కలిసీ మెలిసీ తిరగొచ్చును కానీ యిలా అవకతవక బుద్ధుల్తో కిందా మీదా పడేవాళ్లంటే నాకు పడదని స్పష్టంగా చెప్పాడు సుందరం.

ఈ కారణాన్ని ఆసరాగా తీసుకుని, అతన్ని గేలి చేస్తూ, అతనిపైన 'స్కేండల్స్' ప్రచారం చేస్తున్నారు ఆఫీసుబృందం.

నా భోజనం హోటల్లో ఏర్పాటు చేసుకున్నాను. కాపురం మాత్రం పరంధామయ్యగా రింట్లోనే. అయితే—యింకా అయింట్లో ఉండ బుద్ధిపుట్టడంలేదు. ఆ యింట్లో పద్ధతి నాకు రుచించలేదు. అక్కడున్నంతసేపూ ఏదో ముళ్లమీద కూర్చున్న ట్టనిపిస్తోంది. ఒక్క రంగనాథం మినహా ఆయింట్లో మరెవ్వరూ నాతో మాటాడరు.

నాకోగది అద్దెకు తీసుకోవాలని ఉన్నదని రంగనాథంతో ఎప్పటికప్పుడు చెప్పాలనుకుంటాను—మళ్లీ యీ మాటతో అతని మనస్సెక్కడ నొప్పి పుడ్తుందోనని వూరకుంటున్నాను.

రంగనాథం—నే నూహించినంత అదృష్టవంతుడేమీ కాదు. అతనికి ఆ యింటి నాలుగ్గోడల మధ్యా స్వేచ్ఛ కరువయ్యింది. ఎవరూ అతన్ని లక్ష్యపెట్టరు. కట్టుకున్న భార్యకి—సమాజాలూ, వాటి సభలూ, వేడుకలూ—యివేగాని, ఒక్కనాడు గూడా అతన్తోపాటు నవ్వుతూ కబుర్లాడటం నేనింతవరకూ చూడనేలేదు.

ఇంక పద్మవిషయం చెప్పక్కర్లేదు. ఆ అమ్మాయెప్పుడూ 'బిజీ' గా ఉంటుంది. పిక్నిక్‌లూ, ప్రైవేటు క్లాసులూ ఆమెనోక్షణంగూడా తీరుబడిగా ఉండనివ్వవు.

అథవా ఏదైనా రోజు యింటిపట్టున కూర్చున్నదంటే, ఆ యింటికి నలుగు రైదుగురు రావడం—గొంతులు చించుకుని మాటాడ్డం, పొట్టలు చెక్కలయ్యేట్టు పకపకా నవ్వడమూను. అప్పుడప్పుడు మోహన్రావనే కుర్రాడు (ఇతను పద్మ క్లాసుమేటుట) పద్మకోసం వస్తాడు. అతను కథలవీ రాస్తూంటాడట—స్థానికంగా అచ్చవుతూన్న పత్రికల్లో. అతను వచ్చిన లగాయితూ, తన కథలూ, వాటి 'థీము' లూ 'ట్రీట్మెంట్లూ' వగైరాలను అనర్గళంగా మాటాడేస్తాడు. పద్మకి అతని కథలంటే యిష్టం కాబోలు, చెవు లప్పగించి శ్రద్ధగా వింటుంది—అతను చెప్పే ప్రతి చిన్నవిషయమూను.

పరంధామయ్యగా రున్నారంటే—ఆయనకు కోర్టు గొడవలూ, రావలసిన ఫీజులూ, వేసిన వాయిదాలు వగైరాలతో నేసరిపోతుంది. ఇంటి విషయాలను అసలు బొత్తిగా పట్టించుకోరు.

చూస్తూన్న నాకే యిలా ఉంటే యింక రంగనాథం విషయం చెప్పనక్కరలేదు. అతను వాళ్ల చిన్నాన్నగారింటో ఎలా బ్రతికాడో యిక్కడా అలాగే బ్రతుకుతున్నాడు—కాకపోతే—అంతన్నా మారిందంతే.

ఓరాత్రి కుసుమకీ రంగనాథానికీ చిన్న వాగ్వివాదం జరిగింది. ఆమె యింటికి లేటుగా రావడమే దీనికి కారణం. రంగనాథం ఆమెను మందలించాడు కాబోలు—ఆమె బిగ్గరగా యిలా అన్నది.

"అయినా మీరెవ్వరు నాకు చెప్పటానికి ? నాకూ స్వేచ్ఛ ఉంది. ఆవిషయం మరిచిపోకండి. మీరు మీ ఫ్రెండ్సుతో సినిమాకు వెళ్లినట్టే, నేనూ నా ఫ్రెండ్సుతో వెడతాను. అయినా యిలా శాసించడం ఎప్పట్నుంచి నేర్చుకున్నా రేమిటి ? ఎందుకిలా మారిపోతున్నారు ? "

ఇంక తర్వాత రంగనాథంమాట నాకు వినిపించనేలేదు. ఓగంటసేపటివరకూ అటు తెలుగులోనూ, యిటు ఇంగ్లీషులోనూ కుసుమ రంగనాథాన్ని దెప్పిపొడుస్తూనే ఉన్నది. వింటున్న నాకే బాధ కలిగింది— రంగనాథ మెంత బాధ పడ్డాడో ఏమో ?

ఆయింటోనుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదని నిశ్చయించుకున్నాను. ఆఫీసయింతర్వాత, గాంధి నగరంలోనే అద్దెగది కోసం వెతికాను. నా అదృష్టం బావుండిపోయింది. ఎవరో ఒకాయన నాకో యిల్లు చూపిస్తూ అన్నాడు 'దాన్లో ఓ పోర్షను ఖాళీగా ఉన్నదని వెళ్లి వాకబు చెయ్యమని.'

ఆయింటిముందు నిలబడి 'ఏమండీ' అని పిలిచాను.

దాదాపు నలభైయేళ్ల వయస్సుగలాయన తలుపు తీశాడు. 'ఎవరు కావాలంటూ' అడిగాడు. నే నొచ్చినపని చెప్పాను. ఆయన బాధపడుతూ అన్నారు.

"అయ్యో పాపం ! మేము మూడు రోజుల క్రితమే యీ పోర్షన్లో దిగామండి. బహుశా యీపోర్షనింకా ఖాళీగా ఉంటుం దనుకుని ఆయన మీతో చెప్పివుంటారు."

నా మనసు చివుక్కుమంది—యీమాట వినడంతోనే. "ఆయన చెప్పగానే గది దొరికినంత సంతోషపడ్డాను" అన్నాను.

ఆయన నొచ్చుకున్నారో ఏమో .....

"మీరంతగా యిబ్బందిపడుతూంటే రేపో మాపో యిటు రండి. ఈతోగా యిక్క డెక్కడైనా గదులు దొరుకుతాయేమో .... కనుక్కుని చెప్తాను" అన్నాడు. థాంక్స్ చెప్పి కదలబోయాను.

"ఒక్క క్షణం—మిమ్మల్నెక్కడో చూచినట్టు బాగా జ్ఞాపకం." అన్నారాయన. కొద్దిసేపు ఆగి "అన్నట్టు—మీపేరు" అని అడిగారు.

చెప్పాను.

"ఎక్కడ పనిచేస్తున్నారు ?"

అదీ చెప్పాను.

"అరె .... నా మతిమరుపు మండిపోనూ .... మిమ్మల్నింకా వీధిలోనే నుంచోపెట్టి మాటాడుతున్నాను. దయచేసి యిలా లోపలికిరండి" అని ఆహ్వానించారు.

ఇంట్లో కూచున్నతర్వాత—

"అచ్చం మీలాగే ఉంటాడు—మా కృష్ణమూర్తి కొడుకు. వాళ్లది పాలకొల్లు. మిమ్మల్ని చూడగానే అతను గుర్తుకొచ్చాడు."

నేనేం మాటాడలేదు.

"ఇదే కాకినాడలో పదేళ్లక్రితం యిళ్లు చాలా సులువుగా దొరికేవి. అద్దె కూడా చాలా తక్కువగూడాను. ఇప్పుడు చూస్తూంటే—అద్దె విషయం అలా పెట్టండి—ముందసలు యిళ్లు దొరకడమే కష్టమైపోతోంది. ఓ మిత్రుడి ద్వారా యీ పోర్షను అతి కష్టంమ్మీద దొరికింది" అన్నారాయన నవ్వుతూ. తర్వాత వంట గదివైపు చూస్తూ—

"అమ్మా సరోజా ! వారికాస్త కాఫీ కలుపుకు రామ్మా" అని అన్నారు.

"అబ్బే .... నే నిప్పుడే కాఫీతాగి వస్తున్నానండీ. ఇప్పుడేం అఖ్కర్లేదు."

"ఫర్వాలేదు. కాఫీయేగా. ఎన్నిసార్లయినా తాగొచ్చు. త్వరగా తీసుకురా తల్లీ."

రెండు క్షణాలు గడిచిం తర్వాత అడిగాను.

"నా వివరాలు అడిగారు గాని—మీగురించి చెప్పనేలేదు."

ఆయనపేరు సీతారామయ్యగారుట. దగ్గర్లో ఉన్న ఓ పల్లెటూరు స్వగ్రామంట. వాళ్ల పెద్దమ్మాయి నాలుగైదు నెలల్నుంచీ కడుపునొప్పితో బాధపడుతూంటే — యిక్కడి హాస్పిటలుకి తీసుకొచ్చారుట. ఆపరేషను చెయ్యాలని అన్నారుట. కేవలం యీ పనిమీదనే తను రెండోకూతురు సరోజతోపాటు యిక్కడి కొచ్చారు.

అంతలో ఆమె కాఫీ తీసుకొచ్చి మా కిచ్చింది. సీతారామయ్యగారు కాఫీ తీసుకొంటూ అన్నారు.

"ఈ పిల్లే మా రెండో అమ్మాయి సరోజా. దీని చిన్నతనంలోనే తల్లి పోయింది. ఇక్క డెలాగో రెండు మూడు నెల లుండవలసి వస్తుందని, వంటా వార్పుకి యీ పిల్లను

గూడా తీసుకొచ్చేశాను. యసల్సీ చదువుతోంది. ఈ పని గురించి, చదువుకూడా స్వస్తి చెప్పించాను.''

సరోజ మాకు దూరంగా, సిగ్గుతో నిలబడి వాళ్ల నాన్నగారు చెప్పుతున్నదంతా వింటోంది. దాదాపు అరగంట పాటు సీతారామయ్యగారు, వారి కుటుంబ పరిస్థితులగురించి మాటాడారు.

ఎందుకో చెప్పలేనుగాని — యీ కాస్త పరిచయంతోనూ, ఆయన నాకో బంధువులా మారిపోయారు.

ఆయనదగ్గర సెలవుపుచ్చుకుని బయటకు వచ్చాను. ''సరే....రేపో మాటిలా వస్తే ఏసంగతీ చెప్తాను.'' అన్నారాయన.

అటునుంచి హోటలుకి వెళ్లి భోజనం ముగించి, పరంధామయ్యగారింటివైపు నడక ప్రారంభించాను. మళ్లీ ఆ యింటికి వెడుతున్నానని గుర్తుకిరాగానే కాస్త చిరాకు కలిగిన మాట వాస్తవం.

నేను యింటోకి అడుగు పెడ్తుండగా—క్రోటన్సు పక్కనుంచి సన్నగా మాటలు వినిపించాయి. నాపేరుగూడా ఆమాటల్లో వినిపించడంచేత అటువైపు నడిచాను.

పద్మా మోహన్రావులు గడ్డిలో కూర్చుని మాటాడుకుంటున్నారు. పద్మ నావిషయం అతనితో చెప్తోంది—

''అతను యీ యింట్లో అడుగుపెట్టిన లగాయితూ మాబావ మారిపోయారు. మరితను బావ కేం నూరిపోశాడో ఏమోగాని, ఆయనగారు అక్కయ్యను సాధించడం మొదలెట్టారు. రాత్రి పెద్దరభస జరిగిందికూడాను. ఎంత యిద్దైతే మాత్రం, ఇల్లరికం అల్లుడ్నని మరిచిపోయాడుకాబోలు. హు....'' అని యింకా ఎదో చెప్తోంది.

అక్కడ ఓ క్షణంకూడా వుండకుండా గబగబా నాగదిలోకి వచ్చేశాను.

రేపెలాగైనా యిక్కడ్నుంచి తప్పుకోడం మంచిది. అంతకీ యిల్లు దొరక్కపోతే—ఎలాగోలా సీతారామయ్యగార్ని వప్పించి, యిల్లు దొరికేంతవరకూ వాళ్ల పంచనే వుండటానికి నిశ్చయించాను.

ఆ రాత్రి నేను నిద్రపోయింది బహుకొద్ది గంటలు. తెల్లవార్తూనే గబగబా స్నానం గట్రాముగించి, బట్టలు మార్చుకుని సీతారామయ్యగారింటివైపు బయల్దేరబోయాను.

ఇంతలో వరండాలో నవ్వులు వినిపించాయి. చూచాను. అంతే....ఉలిక్కి పడ్డాను.

శారద. మరో ఆమెతో కుసుమను కలుసుకుంటానిక్కాబోలు వచ్చింది. శారదని పోల్చుకోడం ఏమంత కష్టంకాదు. కాలేజీ రోజుల్లో ఎల్లా వున్నదో యిప్పుడూ అల్లానేవున్నది.

ఆమెకు కనిపించడం నా కిష్టంలేదు. అందుచేతనే మళ్లీ నాగదిలోకి వచ్చి తలుపులు వేసుకున్నాను. హాల్లోంచి, వాళ్లు కుసుమగదిలోకి వెళ్లేంతవరకూవుండి, వెళ్లిపోయినట్టు గ్రహించి, గబగబా గదినుండి బయటకువచ్చాను.

రోడ్డు ఎక్కేంతర్వాత వేగంగా నడవడం ప్రారంభించాను. మరో పదినిముషాల్లో నావెనుకనుంచి కుసుమ వాళ్లకారు ముందికిదూసుకు పోయింది. వెనకసీట్లో శారద స్పష్టంగా కనిపించింది.

శారద!....

కాలేజీరోజులు నా కళ్లముందు సినిమారీలులా తిరుగుతున్నాయి. జ్ఞాపకాలు, అనుభవాలూ—ఒక్కటొక్కటిగా నాముంగ్గునుంచి కదుల్తున్నాయి.....

శారద నా క్లాసుమేటు. ఆమెకు ఆవేశంఎక్కువ. ఏవిషయాన్ని తరచిచూచే అలవాటు బొత్తిగాలేదు. నేను థర్డ్ యియర్ చదువుతుండగా శారద మాక్లాసులో చేరింది. ఆడపిల్లలు బి. కాం. చదవడమనేది బహు అరుదైన విషయం. ఎక్కడో నూటికీ, కోటికీ ఒక్కరన్నట్టు—ఎవరో చదువుతుంటారు. అలాంటి వాళ్లల్లో శారద ఒక్కర్తె.

వాళ్ల నాన్నగారు ట్రాన్స్ఫర్ మీద యీవూరు వచ్చార్ట... వాళ్లయిల్లు మాకు దగ్గర్లోవుండేది. కాలేజికి వెళ్లేప్పుడూ వచ్చేప్పుడూ ఆమె దార్లో కలుస్తూండేది.

ఓరోజున ఆమె నా జాగ్రఫీ నోట్సు అడిగింది. ఇలా ఓ ఆడపిల్ల నన్ను నోట్సు యివ్వమని అడగడం ఓవిధంగా ఆశ్చర్యమయ్యింది. ఆమె నోట్సివ్వమని అడగటంలో కారణం లేక పోలేదు. క్లాసంతటిలోనూ నా రాత బావుంటుందని, అన్నినోట్సులూ ఓపిగ్గా, నీటుగా రాస్తానని నాకు ప్రతీతి. నా నోట్సు యిచ్చాను. ఆమె రాసుకున్న తర్వాత తిరిగి యిచ్చింది.

ఇలా నాలుగైదుసార్లు జరిగింది. ఆమెకూ నాకూ పరిచయం వృద్ధి అయ్యింది. వాళ్లింటికూడా ఆహ్వానించేది అప్పుడప్పుడూ. వాళ్ల నాన్నగారికి నన్ను పరిచయంచేసింది. ఆయన వయస్సులో పెద్దవారైనా, యిప్పటి యువకుల్లా మాటాడ్డం ఆయకో హాబీ. ఈ హాబీకి నేను సరైన అవకాశమయ్యాను.

సినిమాలూ, నవలలూ,—వీటిగురించి ఆయన ఎక్కువగా మాటాడేవారు. తన చిన్నతనపు రోజుల్లో స్నేహాలు—గురించి చేప్పేవారు. ఆయన చెప్పేవి వినడానికి బావున్నా—ఎందుకనో మరి కాస్త బిడియ పడ్తూండేవాడ్ని ఆయనముందు.

ఒకనాడు స్వయంగా ఆయనే అడిగారిలా........

''నువ్వు బాగా చదువుతావని మా శారద చెప్పింది. అదా మట్టిబుర్ర. నీకేం అభ్యంతరం లేకపోతే, వీలుదొరికి నప్పుడల్లా—దానికి అర్థంగాని పాఠాలు చెప్పరాదుటోయ్.'' అని.

శారద నాగురించి ఆయనకు కాస్త ఎక్కువగా చెప్పి వుంటుంది. లేకపోతే....ఎదో 'ఏవరేజి'గా చదువుకుపోయే నాలాటివాడిగురించి అంత గొప్పగా చెప్పడమేవిటి?

అయితే నాకో ధైర్యమున్నది—శారద చదువులో ఎంత వరకున్నదో నాకు బాగా తెలిసింది—ఆమె మార్కులూ అవీ చూచిన తర్వాత. ఓ విధంగా ఆమెకంటె నేనే మెరుగు.

అప్పుడప్పుడూ చదువుకోడానికి శారద వాళ్ల యింటికి వెళ్లేవాడ్ని. నాకు తెలిసింది ఆమెకి చెప్పేవాడ్ని. ఒక్కోసారి పొరపాటున తప్పు చెప్పడం జరిగినా—అది 'తప్పే' అని గ్రహించ గలిగేదికాదు. మళ్లీ ఆ తప్పును నేనే దిద్దుకునేవాణ్ణి.

నేనేం చెప్పినా వినటంవరకే ఆమెవంతు. అంతేగాని 'ఫలానిది చెప్పండి' అనిగాని 'నాకాపాఠం అర్థం కాలేదని'గాని అడిగేదికాదు.

నేనిలా ఆయింటితో సమ్మంధం పెట్టుకొనడంవల్ల శారద నాన్నగారికీ కాలక్షేపంగా వున్నది. బహుకొద్దిరోజుల్లోనే నేనూ ఆయింట్లో సభ్యుడుగా తయారయ్యాను.

అప్పటికీ, యిప్పటికీ, ఎప్పటికీ కూడా శారదమీద నా కెలాంటి అభిప్రాయమూ లేదు.

కాని—శారద తొందరపడింది. ఆమెనా విధంగా అంతకుముందు వూహించలేకపోయాను.

ఓనాడు—

ఆమె ఉద్రేకం కట్టలుతెంచుకున్నది. అంతా మరిచిపోయింది. తప్పటడుగు వేయబోయింది. మచ్చ తెచ్చుకోపోయింది........

కూడదని హెచ్చరించాను. మందలించాను గూడా.

"ఇంత జరుగబోతోందని తెలుస్తే యీ యింటి గడప తొక్కేవాణ్ణే కాదు. ఇలాంటి పిచ్చిపని మరోసారి తలపెట్టకు. సెలవు .... "

నేను వచ్చేముందు ఆమె కోపంతో వణికిపోతూ అన్నది.

"దీనికి తగ్గ ప్రతిఫలం అనుభవిస్తావ్ !"

ఆమాట విని నవ్వాను.

"ప్రతిఫలంమాట అలా వుంచు — ఓ అర్భకురాలిని నైతికంగా రక్షించాననే గర్వం నా కెప్పుడూ ఉంటుంది శారదా !" అని చెప్పి వచ్చేశాను.

ఆతర్వాత పరీక్షలు—రిజల్ట్సు—అన్నీ జరిగాయి. శారద పరీక్షలో తప్పింది. మరి జీవితంలో ? ....

ఎన్నాళ్ళికో—అనుకోకుండా—ఆమెను చూచాను. పాత గాథ గుర్తుకు వచ్చింది. శారదమీద నా కిప్పటివరకూ కోపంగానే ఉన్నది. ఆమెను పలుకరించడమే కాదు కనీసం ముఖాన్నైనా చూడ బుద్ధి పుట్టడంలేదు.

సీతారామయ్యగారిల్లు చూడగానే నా ఆలోచనలకు బ్రేకు పడింది. ఆశగా ఆ యింటిముందు నిలబడి తలుపు తట్టాను. సరోజ తలుపుతీసింది. "నాన్నగారు హాస్పిటలుకు వెళ్లి చాలాసేపయింది. కాస్సేపట్లో వచ్చేస్తారు. మీరూ అంతవరకూ కూర్చోమని చెప్పారు. రండి లోపలికి." అని నన్ను ఆహ్వానించింది.

లోపలికి వెళ్లి కూర్చున్నాను. నేను కూర్చున్న అయిదు నిమిషాలకి కాఫీ తీసుకొచ్చింది సరోజ.

"ఏమిటండీ యీ కాఫీలు ?"

"పర్వాలేదు తీసుకోండి."

"ఇలాగైతే నేను మీ యింటికి రావడం మానుకోవాలసి వస్తుంది. "

"నాన్న వూరుకోరని తెలుసుగా" అన్నది అసలే పెద్దవైన కళ్లని మరింత పెద్దవి చేసి, నావైపు చూస్తూ.

తీసుకోక తప్పిందికాదు. కాఫీ తాగుతూ అడిగాను.

"నా అద్దె గది సంగతేమైనా తెలిసిందాండీ ?"

"నిన్న మీరలా వెళ్లగానే, నాన్న వాకబుచేశారు. ఈ వీధి చివర్లోనే ఓ పోర్షను ఖాళీగా ఉన్నదట. పాతిక రూపాయలు అద్దెట."

ఎగిరి గంతెయ్యా లనిపించింది.

"చాలా సాయం చేశారు. అదీగాక—మీకు దగ్గర్లోనే యిల్లు కుదిర్చిపెట్టారు."

"మీరు యీ ప్రాంతాల్లోనే ఉండాలని నాన్న ఉద్దేశ్యం."

"ఎందుకనో నేనంటే ఆయనకంత శ్రద్ధ ?"

"నాకు తెలీదు."

"అన్నానని కాదుగాని—నే నెవర్నో ముక్కూ మొగం తెలీనివాడ్ని. పరిచయమైన క్షణంనుంచీ గమనిస్తున్నాను. ఆయనకు నామీదున్న అభిమానాన్ని. కొందరు కలుపుగోలుతనంగా ఉంటారు. ఎదటివాడు మనసుకి నచ్చితే, ప్రాణాలైనా యివ్వటానికి సంసిద్ధు లవుతారు. దానికి పూర్వాపరాలు అనవసరం. ఇలాంటి కోవకి చెందుతారు సీతారామయ్య. నాకోసం శ్రమ తీసుకుని—చిటికెలో అద్దెగది ఏర్పాటు చేశారంటే ఆయన్నేమనాలి మరి ?

ఓ పావుగంటలో సీతారామయ్యగారు వచ్చారు. వచ్చీ రావడంతోనే అన్నారు ఆనందంగా.

"మీ అదృష్టం బావుండిపోయింది శంకరంగారూ ! ఇక్కడికి చాలా దగ్గర్లోనే ఓ పోర్షను కుదిరింది. ఇంటివారు చాలా మంచివారు. భార్యాభర్తలు—ఇద్దరే ప్రస్తుతం ఆ యింటో కాపుర ముంటున్నారు. ఆయనేమొ రిటైర్డు బడి పంతులుట. ఒకరి జోలి పట్టించుకునే తత్త్వం కాదు. మీ రెప్పుడు చేరతారో చెప్పేస్తే యింక నా బాధ్యత తీరిపోతుంది."

"చాలా థాంక్సండీ. నా గురించి యింత శ్రమ—"

"దాన్లో శ్రమ ఏమున్నదండీ .... ఆ .... ఒకసారి ఆ యిల్లు గూడా చూస్తే సరిపోతుంది." అన్నారు.

ఆయనతోపాటు ఆ యింటివైపు వెళ్లాను. ఆవీధికి చివరిగా ఉన్నది. పెంకుటిల్లు. చుట్టూ ప్రహరి. అయిదారు కొబ్బరిచెట్లు, మరింకా పాదులూ, పూలమొక్కలూ—ఆ పరిసరం చూస్తేనే చాలు మనసుకి హాయిగా ఉన్నది.

"జానకిరామయ్యగారూ !" అని సీతారామయ్యగారు పిలిచారు. పిలుపు విన్నంతనే ఓ ఏభైఏళ్ల వ్యక్తి బయటికొచ్చారు.

"వీరికోసమే నిన్న వచ్చాను. కాస్త ఆ భాగం చూపిస్తే వీరుగూడా చూస్తారు."

జానకిరామయ్య నన్ను చూస్తూనే కొయ్యబారిపోయాడు. ఏం మాటాడకుండా, అలాగే నావైపు చూస్తూ నిలబడిపోయారు. కళ్లజోడు తీసి, కళ్లు తుడుచుకుని మళ్లీ అలాగే చూస్తూన్నారు. ఈ పద్ధతి గమనించిన సీతారామయ్యగారు ఆయన్ను అడిగారు.

"ముందు ఆ పోర్షనొకసారి చూపించండి."

అప్పటిగ్గాని ఆయన తన చూపుని మళ్లించుకోలేదు. మమ్మల్ని వెంటబెట్టుకుని లోనికి తీసుకెళ్లారు.

అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉన్నాయి. ఆ పోర్షను చిన్నదైనా నా ఒక్కడికీ అది చాలు. అయినా— యిలాంటి పరిస్థితుల్లో ఆ యిల్లు ఎలా ఉన్నా, అద్దె ఎంతైనా చేరిపోక తప్పదు.

"చూశారుగా .... మీ యిష్టం కూడా చెప్పండి." అని అడిగారు నన్ను సీతారామయ్య.

"సాయంత్రం పెట్టేబేడాతో వచ్చేస్తాను."

"విన్నారుగా జానకిరామయ్యగారూ ! అబ్బాయి సాయంత్రము వస్తారట. ఈలోగా పనిమనిషితో యింటిని కాస్త శుభ్రం చేయించండి."

"అలాగే" అన్నారాయన పరధ్యాన్నంగా.

మేము ఆయన దగ్గర సెలవు పుచ్చుకుని రాబోతుండగా—

"ఒక్కక్షణం ఆగుతారూ .... ఇదిగో ...... ఏమేవ్ .... ఇలా ఒకసారి వస్తావూ" అని ఆయన భార్యని పిలిచారు.

ఆవిడ వచ్చింతర్వాత—

"చూడు యీ అబ్బాయి అచ్చం మన రఘు లా లేడూ' అని అడిగారు.

ఆమె కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి. ఆశ్చర్యపోయాను.

'రఘూ' ఆవిడ మెల్లిగా గొణుక్కుంది లోలోన.

నేనీ విచిత్రసన్నివేశానికి తల్లడిల్లిపోయాను. ఇదేమిటి ? .... నిన్న సీతారామయ్యగారూ, యీవేళ వీళ్లూ— నన్ను ఎవర్తోనో పోలికచేస్తున్నారు.

ఆవిడ కళ్లల్లో నీళ్లు చూచింతర్వాత నా మనసుండబట్టలేక అడిగేశాను.

"రఘూ ఎవరండి ?"

జానకిరామయ్యగారు నిట్టూర్చారు.

"మాకో అబ్బాయి ఉండేవాడు. వాడు అచ్చం నీలాగే ఉండేవాడు. చదువుకుంటున్న రోజుల్లో ఎక్స్‌కర్షన్‌కంటూ రాజమండ్రి వెళ్ళారు. గోదావరిలో స్నానం చేస్తూండగా—ఆ తల్లి .... మావాడ్ని కడుపున పెట్టుకుందిట...." చివర్ని ఆయన కంఠం గాద్గదిక మయ్యింది.

నా మనస్సు చివుక్కుమంది.

"పాపం ...." అన్నారు సీతారామయ్య.

జానకిరామయ్యగారి భార్యచూపు యింకా నామీదనే ఉన్నది. ఆమెముఖంలో దైన్యం స్పష్టంగా కనుపిస్తోంది.

"ఆ .... ఇక పదండి. సాయంత్రం తప్పకుండా వచ్చేయండి." అన్నారు సీతారామయ్య.

"మీ కింతకుముందు అద్దె ఇరవై అయిదు రూపాయ లని చెప్పాను. అంతివ్వక్కర్లేదు. ఓ యిరవై యివ్వు చాలు" అన్నారు జానకిరామయ్య.

ఇది విడ్డూరంగా తోచింది నాకు.

తను పోగొట్టుకున్న ఆత్మీయతను, ఆయన నాలో చూచివుంటారు. ఇది ఎంతపనైనా చేయించగల దనటానికి సాక్ష్యం ఆయ నిప్పుడు చెప్పిన అద్దె ! ....

వస్తానంటూ ఆ దంపతులకు చేతులు జోడించాను. ఆ యింటినుంచి బాగా దూరమైన తర్వాత వెనక్కు తిరిగి చూశాను.

వీధి వాకిట్లో నిలబడి ఆ యిద్దరూ మావైపు ఇంకా చూస్తూనే ఉన్నారు.

"నిజంగా .... స్వర్గం సంపాయించుకున్నారు శంకరం గారూ." సీతారామయ్య, యిప్పటివరకూ జరిగినదాన్నిబట్టి యిలా అన్నారు.

నిజమే ననిపించింది.

ఆరోజు ఆఫీసులో కూడా సరదాగా గడిచింది.

* * * *

నేను ఆ యింటినుంచి వస్తూండగా రంగనాథ మన్నాడు.

"వెళ్లు. నన్ను క్షమించి మాత్రం వెళ్లు శంకరం ! జీవితంలో చాతగానివాణ్ణిగా తయారవుతున్నాను."

అతని మాటల్లో బాధ స్పష్టంగా కనిపించింది.

"ఛా .... అవేం మాటలూ ?"

అతను పేలవంగా నవ్వాడు.

"ఇంటో ఎవ్వరూ లేనట్టున్నారు ?" అడిగాను.

"ఎందుకూ ? వెడుతున్నానని చెప్పటానికా ? పిచ్చి శంకరం—నీ రాకపోకల్తో యిక్కడివాళ్ల కెవ్వరికీ సమ్మంధం లేదు. పైగా—నువ్విక్కడ్నుంచి ఎంతత్వరగా నిష్క్రమిస్తే అంత మంచిదనుకుంటున్నారు—నన్ను చూచిన తొలి క్షణం నా గురించి ఏదేదో తలచిఉంటావు. ఇప్పుడు నే చెప్పకుండానే అంతా గ్రహించగలిగావు కదూ—ఒక సాలెగూడు నుంచి తప్పుకున్నా ననుకుంటే, వచ్చి మరో సాలెగూడులో చేరాను. అదృష్టం అందరిసొత్తూ కాదు. .... ఇంక వెళ్లు. వెధవ సోదితో నిన్ను విసిగిస్తున్నా కాబోలు !"

రంగనాథాన్ని చూస్తుంటే నా గుండె తరుక్కుపోయింది. అతనిదగ్గర సెలవు పుచ్చుకుని జానకిరామయ్యగారింటికి బయల్దేరాను పెట్టె బేడా రిక్షాలో వేయించి.

—ఆయన నన్ను రోడ్డుమీద చూస్తూనే అన్నారు.

"ఇదిగో త్వరగా రా .... అబ్బాయి వచ్చేశాడు. నిన్నే త్వరగా రమ్మనడంతే."

ఆయన పద్ధతి చూస్తుంటే ఇప్పటివరకూ నా గురించి ఎదురుచూస్తున్నట్టుంది. నవ్వుకున్నాను.

రిక్షావాడు సామాను గదిలో పెట్టేడు. డబ్బులిచ్చి వాణ్ణి పంపేశాను. "ఏ దేవుడు పంపించాడో గాని—మళ్లీ యీ యింటో ఆనందం నింపటానికి వచ్చావ్ నాయనా." అన్నదావిడ.

ఆ దంపతుల ఆదరం చూస్తుంటే నాకు మతిపోతోంది. నిజంగా నేను వాళ్లబ్బాయినేమో ననిపించింది.

స్నానం చెయ్యమన్నారు. చేశాను. ఫలహారం, కాఫీ నాముందుంచి తీసుకోమన్నారు. తీసుకున్నాను.

ఆరోజు హోటలు భోజనానికి స్వస్తి చెప్పమన్నారు. ఆమె చేసిన అమృతంలాటి వంటతో కడుపారా భోంచేశాను. ఆవిడపేరు అన్నపూర్ణమ్మ. పేరుకుతగ్గ మనిషి. అమ్మలాటి అమ్మ.

వాళ్ళు చూపించిన వాత్సల్యానికి ముగ్ధుడ్నయ్యాను. నా యీ అదృష్టానికి గర్వించాను.

ఆరోజు రాత్రి సుఖంగా నిద్రపట్టింది.

4

మూడునెలలు గడిచాయి.

జానకిరామయ్యదంపతులు నా పేరెప్పుడో మరచిపోయారు. నన్ను 'రఘూ' అనే పిలుస్తున్నారు. నెల రోజుల్లో ఓ వారం రోజులు తప్పనిసరిగా ఆ యింట్లోనే చెయ్యి కడుక్కోవలసి వస్తున్నది.

అసలీ హోటలు భోజనం మానివెయ్యమని అన్నారు. నే నందుకు సుతరామూ ఒప్పుకోలేదు. "ఈ యింటో యింకా నే నుండా లనిపిస్తే—యీ విషయంలో నన్ను బలవంతం చెయ్యవద్ద"ని చెప్పాను. అంతే—ఆనాటినుంచి నన్నీవిషయంలో వత్తిడి చెయ్యడం మానుకున్నారు.

అద్దె విషయం నేనే జాగ్రత్త తీసుకునేవాడ్ని. అంతే గాని వాళ్ళు అడిగేవారే కాదు. అప్పుడప్పుడూ నే నింటికి ఆలస్యంగా వస్తే చిన్నగా మందలించేవాళ్ళు. నే నొచ్చేవరకూ వాళ్ళు మేలుకుని ఉండేవారు. అక్కడికే రెండు మూడు సార్లు చెప్పిచూశాను కాని వాళ్ళు వినలేదు.

మొదట్లో అన్నపూర్ణమ్మగారిని 'ఏమండి' అని పిలిచే వాణ్ణి. అలా పిలుస్తే పలకననీ పైగా సహించనని కూడా అన్నది. 'అమ్మా' అని పిలవమని కోరుకున్నది. నాలుగు రోజుల పాటు కొత్తయినా యిప్పుడా పదం అలవాటై పోయింది నాకు.

ఇక్కడ నాకు మరో అమ్మ దొరికింది!

ఆమెకు గుండెజబ్బు. రఘు పోయినప్పట్నుంచి ఆమె మానసికంగా కుమిలిపోతోంది. ఎన్నో మందులు వాడారు. వాడుతున్నారు. అయినా ఒక్కోసారి—ఆ గుండెజబ్బు ఉధృతంగా వస్తోంది.

ఆ దంపతులకూ—నాకూ ఉన్న 'అనుబంధాన్ని' తెంచుకోలేను. పగలంతా ఆఫీసు వాతావరణం చిరాకు కలిగిస్తుంది. ఆ చిరాకుని అన్నపూర్ణమ్మగారితో మాటాడుతూ మరిచి పోతూంటాను.

ఇక్కడి యీ విషయాలన్నీ మూర్తికి ఉత్తరంలో రాశాను. అతను జవాబులో యిలా అన్నాడు.

"నువ్వనుభవిస్తున్న తీపిని చెపుతూ నన్ను ఊరిస్తున్నావు. అదృష్టమంటే నీది. ఈ లోకంలో యింతటి అనుబంధానికి మించిందేమీ లేదు. ఏ నాడు చేసుకున్నావో పుణ్యం. ఈ విషయంలో నిన్ను చూస్తూంటే ఈర్ష్యగా ఉన్నది నాకు.

పగలూ, కక్షలూ, కుట్రలూ మధ్య నలిగిపోతూన్న మనకి అలాంటి ఆదరణ నిజంగా ఓ వరం! ధన్యుడివి నువ్వు."

అమ్మ కూడా సరిగ్గా యిలాగే రాసింది.

"కన్నబిడ్డ దూరంలో ఉన్నాడనే దిగులుని మరపింప జేసే ఆతల్లి దేవత నాయనా! ఇంక నీ బాగోగుల విషయంలో నాకే దిగులూ లేదు. ఆ తల్లికి నా వందనాలు అందజేయి."

ఈ విషయంలో నేను అమితంగా గర్వించాను. నా జీవితంలో—అమ్మ తర్వాత యీ జానకిరామయ్య దంపతులకే విలువయిస్తాను.

ఇంక సరోజ వాళ్ల గురించి :

మాటామంచీ చెప్పుకోడానికి సరైన నేస్తం సరోజ. క్షేమ సమాచారములు అనుక్షణం కనుక్కుంటూ, చేతనైన సాయం చెయ్యడంలో సీతారామయ్యగారు వెనకంజ వెయ్యరు. ఆ యిద్దరూ నన్ను గౌరవిస్తారు. వాళ్ల కీవూళ్ళో బాగా పరిచయమున్న వ్యక్తుల్లో నేనే ముఖ్యుడ్ననిపించుకుంటాను.

సరోజకీ, నాకూ ఉన్న పరిచయాన్ని చూచిన యిద్దరు ముగ్గురు పరిచయస్థులు ఏవో చెవాకులు ప్రేలడం జరిగింది. అయినా యిది పట్టించుకునే తత్త్వం, నాకూ సరోజకూ కూడా లేదు. ఒక్కోనాడు సరోజను ప్రేమిస్తున్నానేమోనని కూడా అనిపిస్తుంది. అయినా యిదేం పెద్ద తప్పయిన విషయం కాదుగదా!

ఈమధ్యనే సరోజ అక్కయ్యకు ఆపరేషను జరిగిందిట. మరో పదిహేను, ఇరవై రోజులు విశ్రాంతి అవసరమని ఆతర్వాత డిస్చార్జి చేస్తారనీ సీతారామయ్యగారు చెప్పారు. అప్పటివరకూ యిక్కడే ఉంటారు. ఆతర్వాత వాళ్ల స్వగృహం వెడతారట.

అప్పుడప్పుడూ అనుకుంటాను— సరోజ వాళ్ల వూరు వెళ్లిపోతే నాకేం తోస్తుందని ? .... ఇదీ ఒక రకమైన 'బంధమే' మరి.

ఆఫీసుగురించి చెప్పాల్సొస్తే—యీమధ్య మరీ దారుణంగా తయారవుతోంది వాతావరణం. ఒక 'రూలం' టూ ఏదీలేదు. ఆఫీసరు పదకొండు తర్వాత వస్తారు, మళ్లీ నాలుగు తర్వాత వెళ్లిపోతారు. ఆయనొచ్చేముందూ, వెళ్లింతర్వాతా—అక్కడి గందరగోళం మహాభయంకరంగా ఉంటుంది. అడ్డమైన మాటలన్నీ వినాలి. నిందలు ప్రచారంచెయ్యటంలో సిద్ధహస్తులు చాలామంది ఉన్నారు. రోజూ ఏదో కీచులాట జరగాల్సిందే !

ఆఫీసంతటిలోనూ సుందరంపైన నాకు ఓ సదభిప్రాయం ఉన్నది. అతనిగురించి చాలా తెలుసుకున్నాను. మామధ్య పరిచయం వృద్ధిపొందింది. ఈ పరిచయాన్ని ఆఫీసు బృందం ఆమోదించలేదు. వృధా కారణంగా మామీద కినుక వహించారు. సుందరంతోపాటు నేనూ ఓవిధంగా 'వెలి' వేయ బడ్డానేమో అనిపిస్తుంది వాళ్ల పద్ధతి చూస్తుంటే.

—ఆరోజు ఆఫీసులో ఓ దారుణమైన వార్త వినాల్సి వచ్చింది. సుందరాన్ని 'ఊస్టు' చెయ్యబోతున్నారట. నా మనసు చివుక్కుమన్నది. 'నిజమేనా' అని అడిగాను. నవ్వుతూ నిజమన్నట్టు తలూపాడు సుందరం.

ఆ సాయంత్రం అతనోత్పాటు అతని రూముకు వెళ్ళాను.

"ఓ మంచి స్నేహితుడు నాకు దూరమవుతున్నాడు" అన్నాను.

సుందరం నా భుజాన్ని నొక్కాడు.

"అందరం ఒకేచోట ఉంటామనుకోడం పొరపాటు శంకరం గారూ! ఇలాగే రైలు ప్రయాణీకుల్లా—ఒకర్నొకరం ఎక్కడో ఎప్పుడో కలుసుకుంటాం. మళ్ళీ విడిపోతాం. అవుతే—ఈ యాత్రలో కొన్ని జ్ఞాపకాలుమాత్రం—నిలిచిపోతాయి. నే నెక్కడున్నా మీరు గుర్తుంటారు" అన్నాడు సుందరం.

"ఏవిటో చిత్రంగా ఉంటుంది అంతాను."

"మనం కాలేజీలో చదువుకున్నాం. మన చుట్టూ స్నేహితులుండేవాళ్ళు. జీవితంలో ఏదో సాధించాలనీ, ఏవో లక్ష్యాల్తో బ్రతకాలనీ కంకణం కట్టుకున్నాం. ఇప్పు డవన్నీ సింహావలోకనంచేస్తే, తెలుస్తుంది—ఎవడు గెలిచాడో......ఎవడు ఓడిపోయాడో. 'నువ్వేనేనన్న' కొందరు ఇప్పుడు పలుకరించ రసలు. మరికొందరు అదృష్టవశాత్తూ లభించిన అంతస్థుకి దాసులై, ముఖం చాటుచేసుకోటం—మూతి విరుచుకోడంలాటి పిచ్చిపనులు చేస్తున్నారు. కాలేజి వదిలింతర్వాత ఇలాంటివెన్నో అనుభవంలోకి తెచ్చుకుంటున్నాం."

అతను చెప్తున్నది సత్యానికి దగ్గరగా వున్నట్టు కనుపించింది. "ఈనాడు ఆఫీసులో చాలామంది నన్ను అగౌరవపరిచారు. ఓ చీడపురుగుని చూచినట్టు చూశారు. ఇది నా దౌర్భాగ్యమే శంకరంగారూ.....ఇలాంటి గుమాస్తా పని చేయాల్సివస్తుందని నే నేనాడూ గ్రహించలేదు. ఆ మాటకొస్తే ఈ ఉద్యోగం నా కిష్టంలేదు అప్పట్లో......కాని అదృష్టం కలిసిరాలేదు. దౌర్భాగ్యం నన్ను నేలంబాతొక్కి పారేసింది."

అతను చెప్తున్నది వింటూన్నానంతే. మరికొన్ని క్షణాలు గడిచింతర్వాత అతనే అన్నాడు.

"అదృష్టం ఒకరిసొత్తుకాదు. నే కట్టుకున్న గాలిమేడల కూలిపోయాయి. ఎమ్మేచదివి లెక్చరర్ ఉద్యోగం చెయ్యాలని నా ఆశ. ఎందుకనోమరి అలాంటి పదవంటె నాకు విపరీతమైన మోజు. కానీ—బి. ఎ. పూర్తిచేసింతర్వాత ఆర్థిక ఇబ్బందులు నా అభిప్రాయాన్ని పూర్తిగా మార్చివేశాయి. ఇక్కడ మీకో చక్కటి కథ చెప్పదలచుకున్నాను."

"చెప్పండి. వింటాను."

"ఇది కథకాదు. కథలాటి ఒక అదృష్టవంతుని జాతకం. రామేశమని నాకో క్లాసుమేటు ఉండేవాడు. వాడు ఓ పోస్టుమాన్ కొడుకు. వాళ్ళనాన్న కాలేజీ కుర్రాళ్ళకి ఉత్తరాలిస్తూ అనుకున్నాట్ట 'మా అబ్బాయిని కూడా ఇలా కాలేజీ చదివిస్తే ఎంత బావుంటుందీ' అని. అలా తలవడం ఆలస్యం—తన అభిప్రాయానికి నాందివేసుకున్నాడు. తను సంపాయిస్తూన్న దాన్లోనే కొంత మిగిల్చి కొడుక్కి జీతాలు కడుతున్నాడు. వాడు చదివి ప్రయోజకుడై, తనిని ఉద్ధరిస్తాడనీ—పదిమందిలోను తన 'కృషి'కి విలువ తెస్తాడనీ ఆ తండ్రి ఆశ.

"కాని......వాడు వట్టి అల్లరివాడు. క్లాసుకి వచ్చేవాడు కాదు. వచ్చినా పాఠాలు వినేవాడుకాదు. నాటకాలంటె మోజు. దానికోసం ఎంత ఖర్చైనా చేస్తాడు. ఒక్కోసారి తన జీతం డబ్బులు కాస్తా, నాటకాలకే పెట్టేవాడు. అది చాలదన్నట్టు ఇంట్లోనుంచి దొంగతనంగా డబ్బు తెచ్చేవాడు. సమాజాలంటూ, పరిషత్తులంటూ, పోటీలంటూ—చాలా బిజీగా తిరిగేవాడు.

"వీడి ఈ ధోరణిచూచి ఆ తండ్రిఆశ గప్పుమని ఆరిపోయింది. ఆయన ఎందిరికో చెప్పిచూశాడు వీడిని మంచి దారిన పెట్టమని. ఎవరివల్లా కాకపోయింది. పైగా— చదువుతూన్న మాలాంటివాళ్ళని రామేశం గేలి చేస్తుండేవాడు. 'పుస్తకాల పురుగులూ' అవటాని.

వాడు భ్రష్టుడయ్యాడని అందరం అనుకున్నాం. పరీక్షలు రాశాం. మేము పాసయ్యాము. వాడు తప్పాడు. ఇంటర్‌తోనే వాడిచదువు ఆగిపోయింది.

తర్వాత మేము బి. ఎ. చదవడం, ఇలాంటి ఉద్యోగాల్లో కాలుపెట్టడమూ మొదలైనవన్నీ జరిగాయి. ఇప్పుడు ఆరామేశం గురించి ఆలోచిస్తూంటే మాకందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది."

"ఎందుకనిట."

సుందరం నవ్వాడు.

"వా డిప్పుడు రాంబాబు అనేపేరుతో పెద్ద సినిమా నటుడైపోయాడు. లక్షలుకొద్దీ సంపాయిస్తున్నాడు. వాడు తన 'దర్వాను' కిచ్చేజీతం—మేం సంపాయించలేకపోతూన్నాం. భ్రష్టుడైయ్యాడనుకున్నవాడు లక్షలు ఆర్జిస్తున్నాడు—చదివి ఏదో సాధిద్దామనుకున్నవాళ్ళం ఇలా అనుక్షణం యాతన అనుభవిస్తూన్నాం. ఇప్పుడు చెప్పండి—అదృష్టం ఎవరిది?'

రాంబాబు కథ వినగానే చిత్రమనిపించింది. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతూన్నాయో మరి?

సుందరం—తన కాలేజీరోజులగురించి ఆనాడు చాలా చెప్పాడు. ఇప్పుడు తనకు జరుగుతున్నదాన్ని ఆనాటితోపోల్చి, చెప్పాడు. ఇప్పుడు తనకు జరుగుతున్నదాన్ని అనాటితోపోల్చి, భేదాన్ని వివరించిచెప్పాడు.

సుందరం మాటలు వింటూంటే, మూర్తి గుర్తుకొచ్చాడు. అతనోత్పాటు ఆనర్సు చదివినవాళ్ళలో కొందరిప్పుడు ఫారెన్ కూడా వెళ్ళారట పెద్ద చదువుల గురించి. 'వాళ్ళందరూ గుర్తుకొస్తుంటె ఇంత సైనేడుతిని ఈపాడు బ్రతుక్కి స్వస్తి చెప్పాలనివుంది!' అంటాడు మూర్తి, తన దురదృష్టానికి చింతిస్తో.

ఆ తర్వాత సుందరంతో కాసేపు మాటాడి, ఇంటికి వచ్చేశాను.

స్నానం ముగించి—జానకిరామయ్య దంపతులతో లోకాభిరామాయణం తిరగవేశాను. మా ఆఫీసు విషయాలు చెప్పాను. సుందరంగురించి నే చెప్పినదంతా విని అన్నపూర్ణమ్మగారు చింతించారు.

భోజనానికి వచ్చేముందు రంగనాథం వచ్చాడు. అతనితోపాటు హొటలుకి బయల్దేరాను. సరోజా ఇంటిమీదుగా వెళ్ళాము. ఆ ఇంటికి తాళం వేసివున్నది. ఇలా నాలుగైదుసార్లు చూశాను,

సరిగ్గా ఈ వేళప్పుడే. హాస్పిటల్‌కి వెళ్లేమని చెప్పారు. ఇవ్వాళ గూడా అక్కడికే వెళ్ళివుంటారనుకున్నాను.

దార్లో—సరోజగురించి నన్ను అడిగాడు రంగనాథం. చెప్పాను. అతను అంతా విన్నతర్వాత ఇలా అన్నాడు.

"ఇంతెందుకూ ఆ పిల్లను ప్రేమిస్తున్నానని చెప్ప రాదూ?"

"కావచ్చు."

"నాక్కావలసిన సమాధానం ఇదే. అయితే—నువ్వు ప్రేమించేముందు, వాళ్లగురించి గూడా తెలుసుకోవాలిగా మరి?"

"ఆ అవసరం నాకులేదు."

"అంటె?"

"ఆమె కూడా నన్ను ప్రేమిస్తూ—పెళ్ళి చేసుకుంటూ నని అడుగుతే నిరభ్యంతరంగా ఒప్పుకుంటాను. లేదా—కేవలం 'స్నేహం'గా ఉంటానన్నా సరేనంటాను."

"చిత్రంగా మాట్లాడుతున్నావ్. ఆమె నీ ప్రేమను తిరస్కరించి, స్నేహమేకావాలి అని అడుగుతే కృంగిపోవూ?"

"అవన్నీ కథల్లో—అయినా ఇప్పుడవన్నీ ఎందు కసలు?"

"మనం ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించేవ్యక్తి—మనల్ని నిర్లక్ష్యంచేస్తే ఎలాఉంటుంది?"

"అసలంతవరకూ ఎందుకురావాలి?"

"పరిస్థితుల ప్రోద్బలంవల్ల"

"ఖర్మని దులుపుకుపోతె సరిపోయె."

"అది నాచేత నవుతుందా?"

"అసలింతకీ ఇదంతా ఎందుకు అడుగుతున్నావో చెప్ప రాదూ?"

రంగనాథం రెండుక్షణాలు మవునంగావుండి, తర్వాత అన్నాడు.

"స్వార్థంకానీ లేదా కేవలం నా సుఖంకోసరంగానీ—చిన్నాన్న నా పెళ్లి కుసుమతో జరిపాడు. పెళ్లయిన కొత్తల్లో ఆమెను చూస్తూ నా అదృష్టానికి పొంగిపోయాను. కాని—ఈమధ్య నాకు ఆమెవల్ల సుఖం లేకపోతోంది. నా మాటని ఆ ఇంట్లో ఎవ్వరూ ఖాతరుచెయ్యరు. పైగా, వాళ్ల చెప్పుచేతల్లో బ్రతకాల్సి వస్తోంది."

"సంసారం అన్నతర్వాత అనేకం జరుగుతుంటాయి. అవన్నీ పట్టించుకుక్కూర్చుంటె ఎల్లా......సర్దుకుపోవాలిగాని."

"ఈరోజు నేనో ఫూల్ నయ్యాను శంకరం."

ఏమిటన్నట్టు చూశాను.

"పద్మ మోహన్రావ్‌ని ప్రేమించిందట. అతన్ని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పింది. కుసుమా, మావయ్యా ఇద్దరూ అంగీకరించారు. మోహన్రావ్‌గురించి నాకు బాగా తెలుసు. అతను వట్టి చపలచిత్తుడు. ఈ మాటనే అన్నాను. దాంతో వాళ్లందరూ నా మీద విరుచుకుపడ్డారు. 'మా విషయాల్లో కలుగజేసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాలి' అని విసుక్కున్నారు. చెప్పద్దూ—యీమాట పడిన తర్వాత ఇంకా ఆ యింట్లో వుండా లనిపించడంలేదు. ఎక్కడికైనా పారిపోదామనిపిస్తున్నది."

"ఛా......ఏం మాట లివి!"

"చిన్నప్పట్నుంచీ నా చేతకానితనం నన్ను అడుగడుక్కీ కృంగతీస్తోంది. అసమర్థుడ్నిగా తయారు చేసింది."

"పోనీలే......అన్నీ మరిచిపో. మా హోటల్లో భోం చేసి, సినిమాకి వెళ్దాం పద" అని, అతన్ని బలవంతంపెట్టి ఆరోజు సినిమాకు తీసుకెళ్లాను.

ఇంటర్వెల్లులో రంగనాథం ఇక ఇంటికి పోదామనిలేచాడు. అదేమిటని అడిగాను. 'వద్దు—ఈ సినిమా చూడలేను' అన్నాడు. అప్పటిగ్గాని అర్థం కాలేదు నాకు—ఈ సినిమాకథకీ, రంగనాథం జీవితానికీ పోలికలున్నాయని.

మేము వచ్చేస్తూండగా—శారద కనిపించింది. మరో ఇద్దరు స్త్రీలతో డ్రింకులు తాగుతూ. ఆమెను చూడగానే ముఖం తప్పించి, గబగబా రిక్షాలో ఎక్కేశాను రంగనాథంతో పాటు.

రిక్షా కదిలినతర్వాత అనుకున్నాను 'శారదంటె భయపడు తున్నానా?' అని.

* * * *

మూడుత్తరాలొచ్చాయి.

ఒకటి అమ్మ దగ్గర్నుంచి—తమ్ముడు పరీక్షలకోసం బాగా చదువుతున్నాడని.

రెండు మూర్తి దగ్గర్నుంచి—బందరు విషయాలతో.

మూడు బావ దగ్గర్నుంచి! ఈ ఉత్తరం చూడగానే అదిరి పడ్డాను. ఏదో విశేషముంటుందని ఆత్రంగా చింపి చదివాను. దాన్లోవున్న 'విశేషాన్ని' చదువుతూంటె నవ్వు పుట్టుకొచ్చింది.

వాళ్ల బాబాయికూతురు సుశీల పి. యూ. సి. చదివి మానుకున్నదట. ఆమెకు పెళ్ళి చెయ్యాలని వాళ్ల ఉద్దేశ్యంట. తగిన వరుడు—నేనని బావ నాపేరు సజెష్ట్ చేశారుట. కాబట్టి వెంటనే పెళ్ళిచూపులకి రమ్మని రాశాడు.

ఒకనాడు, నన్నూ నా స్థితినీ యీసడించాడు బావ. ఈనాడు నాకో విలువ ఇచ్చాడు. నేను ఉద్యోగిని, నాలుగురాళ్లు సంపాయిస్తున్నవాడ్ని. ఇంతకంటె కావలసిన క్వాలిఫికేషన్లింకేం కావాలి?

మొత్తానికి బావ లౌక్యుడు! ఎవర్నెప్పుడు ఎలా వాడుకోవాలో ఆయనకు బాగా తెలుసు.

వెంటనే ఆయనకు జాబు రాశాను—ఇంతలో పెళ్ళి చేసుకోవాలనే వాంఛలేదని, అలా ఏనాటికైనా కలుగుతే— నా పెళ్లిక్కావలసిన సంప్రదింపులు చెయ్యటానికి మా అమ్మ బ్రతికే ఉంటుందనీను.

అప్పటిగ్గాని నామనసు స్థిమితపడిందికాదు.

ఆ సాయంత్రం ఈ విషయం సరోజతో అన్నాను పార్కులో. ఆమె అంతావిని అడిగింది.....

"అయితే మీ రీ పెళ్లికి ఒప్పుకుంటారా?"

"నువ్వు చెప్పరాదూ—ఒప్పుకోమంటావా?"

"ఇది మీ స్వంత విషయం."

"ఇంకా మనమధ్య స్వంతవిషయాలేవిటీ?"

ఆమె తలవంచుకున్నది. ఏమీ మాటాడలేదు.

"ఆ......అన్నట్టు మీ అక్కయ్య ఆరోగ్యం ఎలా ఉంది" అని అడిగాను.

"మంచి మనుషులు బహు అరుదు. వాళ్ళలో మీరొకరు."

ఈరకం జవాబుతో బలే ఆశ్చర్యపోయాను.

"నే నడుగుతున్నదేవిటే? నువ్వు చెప్పేదేవిటి?"

"నిజం శంకరంగారూ! మీ స్నేహం నాకు చాలా నేర్పింది. బ్రతికున్నంతకాలం మీరు నాకు గుర్తుంటారు."

"అబ్బా......ఇవ్వాళ చాలా పెద్దమాట లంటున్నావ్. కారణం?"

"ఏమీలేదు. ఎందుకనో ఈ రెండు ముక్కలూ చెప్పాలనుకున్నాను. చెప్పాను. మీరు త్వరగా పెళ్ళి చేసుకుంటె సంతోషిస్తాను."

"ఎవర్ని?"

"ఎవర్నో ఒకర్ని. మీ కిష్టమైనవార్ని."

"చేసుకోమంటవా?"

"వూ.........."

"నన్ను పెళ్లి-చేసుకోమని సలహా చెప్తున్నావ్‌గానీ...... మరి నీ పెళ్ళో?"

"నాకు పెళ్ళా?"

"అవును. ఏం?"

సరోజ పేలవంగా నవ్వేసింది.

"ఏం? ఇంతలో చేసుకోవాలనిలేదా?"

"అదిగాదు......" ఆమె ఆగిపోయింది.

"మరి?"

"అబ్బే......ఏంలేదు."

"ఏమిటి సరోజా......ఇవ్వాళ అదోలా వున్నావ్" అని నిగ్గదీసి అడిగాను.

ఆమె పక్కున నవ్వేసింది.

"భలేవారేనే..........వేనదోలా వుండటమేమిటండీ.... ఇంక పదండి. చాలా పొద్దుపోయింది. నాన్న నాకోసం ఎదురు చూస్తుంటారు" అన్నది.

ఏం మాటాడుకోకుండానే నడుస్తున్నాం. సరోజలో కలిగిన ఈ మార్పుకి కారణం నా పెళ్ళి విషయమే కావచ్చు. అంటె—ఆమె నన్ను ప్రేమిస్తూనే వున్నదనటానికి ఈ నిదర్శనం చాలు......

ఇది జరిగిన రెండు రోజులూ తిరిగి సరోజ నాకు కనిపించనేలేదు. హాస్పిటల్‌కి వెళ్ళిందని సీతారామయ్యగారు చెప్పారు. ఈ రెండురోజుల్లోనూ ఆయన్లో కూడా మార్పు కొట్టొచ్చినట్టు కనుపిస్తున్నది.

కారణాలు అనేకవిధాలుగా ఊహించుకోడంమాత్రమే నావల్లనైనది; చేతయిందీను.

—సుందరం ఊస్ట్ అయ్యాడు.

ఆ సాయంత్రం స్టేషనువరకూ సాగనంపివచ్చాను. దార్లో సరోజ వాళ్ల ఇంటిదగ్గర ఆగిపోయాను. సీతారామయ్యగారొక్కరూ ఆనాటి దినపత్రిక తిరగవేస్తూన్నారు. నా రాక గమనించి లోనికి ఆహ్వానించారు. వెళ్లాను.

"సరోజ ఇంట్లో లేదాండి."

"లేదునాయనా, హాస్పిటలుకు వెళ్లింది. ఇంకాస్సేపట్లో నేనూ వెళ్లాలి."

"ఆమె ఆరోగ్య మెలా వుంది?"

ఆయన నిట్టూర్చాడు.

"ఇంకా దురదృష్టం మమ్మల్ని వెంటాడుతూనే వున్నది నాయనా. కోలుకుంటున్నరోగం కాస్తా ఇప్పుడు తిరగపెట్టింది. మళ్లీ వెనకటిస్థితికి తీసుకొచ్చింది. ఏం జరుగుతుందోనని భయంగావుంది" అన్నా రాయన.

"అరె......మరీ విషయం మాటవరసకైనా నాతో చెప్పనేలేదే?"

ఆయన నాకే జవాబూ ఇవ్వలేదు. అప్పుడనిపించింది. ఈ మూడురోజుల్నుంచీ తండ్రీ కూతుళ్లు ఎందుకు ముభావంగా ఉంటున్నారో......ఆమె అనారోగ్యం వీళ్ల మనసులు కలవరపెట్టిందికాబోలు......

ఆయనగొంతు నా ఆలోచనలమధ్య అడ్డుపడింది.

"ఏమీ అనుకోపోతే నిన్నొకటి అడగాలనివుంది నాయనా"

"అడగండి. ఇంకా సందేహించటమెందుకూ?"

"అహ......మరేమీలేదు. ఇంకా ఇంటిదగ్గర్నుంచి డబ్బు రాలేదు. మొన్న తెచ్చిన పైకం కాస్తా ఇట్టే ఖర్చుయిపోయింది. అప్పుడేమో అమ్మాయి ముందుమాకులకి డబ్బు అర్జంటుగా కావలసివచ్చింది.....అందుచేత......" ఆయన చివరిమాటలు నాన్చి అన్నారు.

"ఎంత కావాలిట?"

"ప్రస్తుతానికి ఓ యాభై చాలు. మళ్లీ ఓ వారం రోజుల్లో సర్దుతాను. నీ దగ్గరుంటేనే ఇవ్వసుమా. లేకపోతే మరోచోట ఎక్కడైనా చూచుకోవచ్చు......"

"అదేంకాదులెండి. నిన్ననే జీతాలిచ్చారు. తీసుకోండి. మళ్లీ మీ చేతిలో డబ్బున్నప్పుడు ఇవ్వచ్చు. ఇంద" అని యాభై రూపాయలూ ఇచ్చాను.

"ఏదో మాలో ఒకడివిగా తిరుగుతున్నావ్‌కాబట్టి— చనువు బాగా వున్నది కాబట్టి అడిగానుకానీ—లేకపోతే అసలు అడిగేవాడ్నేకాను. లేదనకుండా అడగ్గానే ఇచ్చావ్......అదేచాలు" అంటూ, పైకం తీసుకున్నారు సీతారామయ్య.

మరికొంతసేపు మాటాడి, ఆయన దగ్గర సెలవు పుచ్చుకుని, ఇంటికొచ్చాను. నేను గుమ్మంలో అడుగుపెడుతుండగా అన్నపూర్ణమ్మగారు అన్నారు—

"నీకోసం ఎవ్వరో వచ్చారు నాయనా. నీ గదిలోవున్నారు వెళ్ళు."

ఎవరా అనుకుంటూ, ఆత్రంగా గదిలోకి వెళ్లాను. చలపతి!......హోల్డాలుమీద చతికిలపడి, సిగరెట్టు కాలుస్తూ, ఏదో చదువుకుంటూన్నాడు.

"నువ్వా!" అన్నాను ఆనందంగా.

"వచ్చి చాలసేపయింది!"

"ఈ ఇల్లెలా కనుక్కున్నావ్!"

"మీ ఆఫీసు జవాను చూపించాడు. ఎక్కడున్నావ్ ఇంత సేపట్నుంచీ?"

"ఓ ఫ్రెండుని రైలెక్కించివచ్చాను.....లే.....త్వరగా స్నానం చెయ్యి. భోజనానికి వెడదాం."

"అట్నుంచి సినిమాక్కూడా!"

"అలాగే......ముందు స్నానం కానియ్యి."

స్నానాలు ముగించి, బట్టలు మార్చుకుని బజారువైపు బయల్దేరాము. హోటల్లో భోజనంచేసి సినిమాకు వెళ్లాము. సినిమా నడుస్తున్నదన్నమాటేగాని, మేము కబుర్లలో పడ్డాము. చలపతి వాడి యాత్రానుభవాలుగురించి చెప్పాడు. ఆ తర్వాత అన్నాడు.

"ఇంటికి బయల్దేరాను తృప్తితో. ఇంక నాకు ఒకటి మిగిలింది."

"ఏమిటది?"

"చావు."

"ఛా......ఎవర్రా వీడూ......"

"ఏ......ఉన్నమాటన్నాను. క్షయరోగి చిరంజీవిట్రా నీ పిచ్చిగాని. ఇంతకుముందు నీవు సలహా ఇచ్చినట్టు ఏ శానిటోరియంలోనైనాచేరి, దిక్కుమాలిన చావుచస్తాను. బహుశా నీకీ వార్త కూడా తెలీదనుకుంటాను. ఇదే కడసారి దర్శనం—"

వాడిమాటలు వింటూంటే భయం కలిగింది. సినిమా అయింతర్వాత ఇంటికివస్తూ గూడా, వాడు తన చావు గురించే చెప్పడం మొదలెట్టాడు. నాకు కోపం వచ్చింది. ఇలాంటి పిచ్చి మాటలంటే నేను సహించేదిలేదని గట్టిగా చెప్పాను. అప్పటికీ వాడు వినలేదు.

"నేను నీ దగ్గర మూడురోజులు మాత్రమే ఉంటాను. అప్పుడే ఒకరాత్రి గడిచిపోతోంది. ఇంకా రెండు రాత్రిళ్ళుంటాయి. కనీసం ఈ రెండురోజులైనా నన్ను నా ఇష్టం వచ్చినట్టు మాటాడుకోనివ్వు. నీకు గుర్తుందో లేదోగాని—మనం చదువుకుంటూన్నరోజుల్లో నువ్వెప్పుడూ నా మాట కెదురుచెప్పేవాడివికావు. పైగా నామాటే వేదవాక్కుగా భావించేవాడివి. ఇప్పుడూ నీనుంచి అదే కోరుకుంటున్నా" అన్నాడు చలపతి బాధగా.

వాడింత కష్టంగా మాటాడటం విడ్డూరమనిపించింది. అసలు నే నేమన్నానని వాడికింత కష్టం కలగటానికి?

ఇంటికొచ్చినతర్వాత మా ఇద్దరికీ పక్కలు వేశాను. నిద్రపోటానికి నడుం వాల్చాను. అయిదు నిమిషాలు జరిగాయో లేదో చలపతికి విపరీతమైనదగ్గు పుట్టుకొచ్చింది. ఆ తర్వాత ఆయాసం....

కూజాలో నీళ్ళు గ్లాసులోపోసి తాగమని ఇచ్చాను. తాగాడు. గోడ కానుకుని కూర్చున్నాడు. నేనూ వాడిముందు కూర్చుని సిగరెట్టు ముట్టించాను.

"ఈ దగ్గుతో రాత్రిళ్ళు నిద్రపట్టడంలేదు. యమయాతన అనుభవిస్తున్నాననుకో......సరే.....పట్టని నిద్ర ఎల్లాగో పట్టదుగాని, ఏవైనా విషయాలుంటె చెప్పుదూ."

"నా దగ్గరేమున్నాయిరా చెప్పటానికి. చెపితే నువ్వే చెప్పాలి."

"సరిగ్గా ఇలాగే అనేవాడవు చదువుకుంటున్న రోజుల్లో" అని పేలవంగా నవ్వాడు చలపతి.

ఆరోజులు గుర్తు చెయ్యగానే—చలపతిపాట అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది నాకు.

"పోనీ...... పాట పాడగూడదూ" అన్నాను.

"నేనా?"

"అవును."

చలపతి నవ్వి అన్నాడు—

"పాటలు మానుకుని చాలానాళ్ళయింది."

"ఇప్పుడు నా గురించైనా పాడు."

వాడేం మాటాడకుండా తలెత్తి పైకి చూస్తూ కూర్చున్నాడు.

"ప్లీజ్......ఒక్కపాట."

"బతిమాలించుకోడం నా కిష్టంలేదు. సరే.....ఏం పాట పాడనో గూడా నువ్వే చెప్పు."

"చల్లగాలిలో యమునాతటిపై—"

ఇది వినగానే వాడు నవ్వాడు. నా భుజం తట్టుతూ అన్నాడు. "మంచి పాటనే కోరుకున్నావ్......అదే నా కిష్టమైన పాటని గూడా తెలుసు నీకు" అని పాడటం మొదలెట్టాడు—

చల్లగాలిలో యమునా తటిపై శ్యామసుందరుని మురళీ..
ఉల్లము కొల్లగొనే మధుగీతాలు
మెల్ల మెల్ల చెవి సోకునవే......."చల్ల"
తరువు తరువు కడ డాగి డాగి
నన్నలయు కన్నుగవా మురుపులవే..."చల్ల"
మురిసి మురిసి నా వెనుక దరిసి
కనుమూయు చివురు కెంగేళులివే...."చల్ల"

తియ్యగా సాగుతోంది పాట. వాడి గొంతులో పెద్ద మార్పు కనిపించడంలేదు. వాడలా పాడుతోంటె—మా కాలేజీ ఆడిటోరియమూ—ఆ స్టేజీమీద చలపతి, అతని పక్కన రజనీ—అతని పాటను మెచ్చుకుంటూన్న ప్రేక్షకులూ—అన్నీ గుర్తుకొచ్చాయి.

అప్పటి వాడిస్థితిని, ఇప్పటిదాన్తో పోల్చుకుచూశాను. అప్రయత్నంగా నా కళ్ళు చెమర్చాయి.

పాటఅయిన తర్వాత చలపతి కళ్ళువిప్పి నావైపు చూశాడు.

"ఎందుకురా ఆ కన్నీరు?" అని అడిగాడు.

"అబ్బే ఏంలేదు" అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

"దాచకు శంకరం. నాకు తెలుసు నీ మనసు. ఈ అభిమానాలూ, అనురాగాలూ మనిషిని లోబర్చుకుంటాయి. ఎంత తప్పించుకు తిరుగుదామన్నా సాధ్యంకానివని, పోనీలే......ఇక

నిద్రపో.....నాకోసం నీ నిద్ర పాడుచేసుకోకు'' అన్నాడు వాడు నడుం వాల్చుతూ.

నేనింకా అలాగే కూర్చుండిపోయాను.

''లైటు వెలుగుతూంటె నాకు నిద్రపట్టదని తెలిసి గూడా ఇంకా వుంచావేరా? ఆర్పెయ్యి'' అన్నాడు.

లైటు ఆఫ్‌చేసి నిద్రపోటానికి కళ్ళు మూశాను. ఎలా పట్టిందోగాని, గాఢనిద్ర నన్నావరించింది ఆ రాత్రి. తెల్లవార్తూనే నా పక్కన చలపతివైపు చూశాను.

చలపతిలేడు!......

ఆశ్చర్యపోయాను. అన్నపూర్ణమ్మగార్నిపిలిచి వాడిగురించి చెప్పాను. ఆవిడ మరీ ఆశ్చర్యపోయింది.

గది అంతా గాలించిచూశాను. నా తలవైపున ఓ చిన్న కాగితం మడతపెట్టి వున్నది. విప్పి చదివాను.

నాప్రాణంకంటె ఎక్కువయిన శంకరం—

గాలికి కదిలే గడ్డిపరకలా తయారయ్యాను ఈమధ్య. మూడురోజులపాటు నీ దగ్గరవుంటానని చెప్పి, ఓ రాత్రికి రాత్రి పారిపోతున్నాను. కారణం అడగవద్దు.

క్షయరోగిని. నన్నెవరూ తాకరాదు. అలాంటిది నన్ను ఆదరించావ్—నీనామధ్య గడిచిన ఈ కొద్దిగంటలూ చాలు—మన స్నేహాన్ని నిరూపించటానికి.

ఇదే స్నేహం—నీనుంచి వచ్చే జన్మలో గూడా ఆశిస్తూ—

చలపతి.

ఆ ఉత్తరం చదివి కుప్పలా కూలిపోయాను. కుమిలి కుమిలి ఏడిచాను. ''భగవాన్......చలపతిని బ్రతికించు!

అన్నపూర్ణమ్మగారు నా భుజం తట్టింది!

భగవాన్......చలపతిని బ్రతికించు!

అన్నపూర్ణమ్మగారు నా భుజం తట్టింది!

''దిగులుపడకు నాయనా—దైవం అనుకూలిస్తే మళ్ళీ అతను కోలుకోవచ్చు. కాని.....మనిషిలో ఎంత దాచుకుందామని ప్రయత్నిస్తూన్నా, భయం కనిపిస్తూనేవున్నది. ఏదీ నిర్ణయించుకోలేనిస్థితిలో వున్నాడు. అందుకే ఒకరాత్రికిరాత్రి ఇలా వెళ్ళిపోయాడు.....'' అన్నదామె. చలపతి వాలకం ఇప్పటివరకూ గమనించి.

నిజమనితోచింది నాకు.

5

మావయ్య ఉత్తరం రాశాడు.

ఆ ఉత్తరంలో రాధ అత్తవారింట్లో ఎంత బాధపడ్తున్నదీ, ఎన్ని సాధింపులకి గురిఅవుతున్నదీ వివరించి రాశాడు.

''రాధ సుఖాన్ని ఆశించి—గొప్పింటి కోడల్ని చేశాను గాని యిలా దాని సంసారం అఘోరిస్తుందనుకోలేదు. దూరపు కొండలు నునుపన్నమాట నిజం. దానికా యింటో సుఖంలేదు. చూచినవాళ్ళు చాలామంది చెప్పారు—నరకం అనుభవిస్తోందని.

నువ్వోకసారి ఆ ఇంటికివెళ్ళి, రాధను చూచిరా. దాన్నెలాటి పరిస్థితుల్లో చూశారో నాకు రాయి. రాజమండ్రిలో వాళ్ళ అడ్రసుని ఈక్రింద రాస్తున్నాను. జాప్యం చేయవద్దు. వెంటనే రాజమండ్రివెళ్ళి, అక్కడ సంగతులతో నాకు జాబు రాయి.

ఆశీస్సులతో
మీ మావయ్య

ఆ ఉత్తరం చదివిన తర్వాత నేను చాలా నొచ్చుకున్నాను. నాలాటి దౌర్భాగ్యుడ్ని పెళ్ళిచేసుకోకపోటమే ఆమె అదృష్టమని నేనూ అనుకున్నాను. చివరికి రాధ సంసారం ఇలాటి పరిణామము తెస్తుందని కలలో కూడా తలచలేదు.

రాధనుచూచి ఎన్నాళ్ళో అయింది. ఇప్పుడెలావుందో చూచిరావాలి. పైగా—మావయ్య గూడా ఉత్తరం రాశాడాయె. ఓసారి వెళ్ళిరమ్మని.

రెండురోజులు సెలవుకోసం ఆఫీసర్ను అడిగాను. ఆయన ఏ మూడ్‌లో వున్నారోగాని, అడిగిందే తడువుగా సెలవు మంజూరు చేశారు. అన్నపూర్ణమ్మగారితో చెప్పి, రైలెక్కాను.

రాజమండ్రిలో దిగేవేళకి బాగా సాయంత్రమయింది. మావయ్య ఇచ్చిన అడ్రస్సు నొకసారి చూచుకున్నాను. అక్కడికి రిక్షామాటాడుకుని వెళ్ళాను.

ఆఇంటిముందు రిక్షాదిగి, ఆవరణలోకి అడుగుపెట్టాను. ఓ పదేళ్ల కుర్రాడు బొంగరాలాడుతున్నాడు. అతన్ని పిలిచి అడిగాను.

''ఇది రాజారావుగారిల్లేనా?''

అవునంటూ వాడు తలూపాడు.

''ఇంట్లో వున్నారా?''

''లేదు'' వాడు బొంగరానికి తాడుచుడుతూ అన్నాడు.

''ఎక్కడికి వెళ్ళారు?''

నా మాటలు వినిపించుకునే ఓపికా, తీరుబడీ వాడికి లేవేమో మరి—జవాబు చెప్పకుండానే, బొంగరాన్ని నేలమీదికి వదిలాడు. అది గిర్రున తిరుగుతూంటె దానివంక కన్నార్పకుండా చూస్తున్నాడు.

''రాజారావు నీకేమవుతారు.''

ఈ ప్రశ్నలు వాడికి చిరాకు కలిగించాయేమో ''మావయ్య—'' అన్నాడు విసుగ్గా.

''మరి.....మీ రాధత్తయ్య వున్నదా?''

సరిగ్గా ఆ సమయానికే బొంగరం హఠాత్తుగా ఆగిపోయింది. దాంతో వాడికోపం కట్టలు తెంచుకుంది.

''ఏమోనండీ.....అవన్నీ లోపలికెళ్ళి కనుక్కోండి'' అన్నాడు.

మా ఇద్దరికీ జరుగుతూన్న సంభాషణ వినిపించిందేమో, ఇంట్లోంచి రాధ గబగబా వీధిగుమ్మందగ్గరకొచ్చి నిలబడింది. నన్ను చూడగానే అలా బొమ్మలా నించుండిపోయింది. నేను రెండడుగులు ముందుకు వేశాను.

''నువ్వా.......క్షేమమా?'' అని అడిగింది.

తలూపాను నవ్వుతూ.

''రా....లోపలికొచ్చికూర్చో.......'' అంటూ నన్ను ఆహ్వానించింది. గోడకానించివున్న పడక్కుర్చీవేసి, కూర్చోమన్నది.

"ఏమిటిలా ఉత్తరం సత్తరమైనా లేకుండా వూడి పడ్డావ్?"

"మరే........"

రాధ నావైపు పరీక్షగాచూచి అడిగింది. "హోటలు భోజనం కాబోలు—బాగా చిక్కిపోయావు."

"అవును."

"ఒక్కక్షణం! కాళ్లకు నీళ్లు తీసుకొస్తానుండు" అంటూ గబగబా పెరటివైపు వెళ్ళింది.

రాధ!—చేతులనిండా మసి, మాసిపోయినచీర, లోతుకు పోయిన కళ్ళు, తైలసంస్కారంలేక చిందరవందరైన జుత్తు. పాపం........ఎంత ఆస్తివుంటేమాత్రం ఏంలాభం, సుఖమన్నది దూరమైన తర్వాత.

"లే.......కాళ్ళు కడుక్కో" అని నీళ్లచెంబు గుమ్మం దగ్గరపెట్టింది.

కాళ్ళు కడుక్కోడానికి లేచాను. సరిగ్గా ఈ సమయం లోనే ఓ లావుపాటి స్త్రీ, కళ్లజోడు సవరించుకుంటూ నావైపు విచిత్రంగా చూస్తూ అడిగింది.

"ఎవరే?"

"మా బావ" అన్నది రాధ.

"మీ బావ.......ఓహో.....మీ అత్తయ్య కొడుక్కా బోలు. ఎప్పుడొచ్చాడేవిటే?"

"ఇప్పుడే!"

"అహ.....అలాగా......" అంటూ ఆమె ఇంటో కెళ్లి పోయింది.

ఆమె వెళ్లింతర్వాత, నాకు తువాలిస్తూ అన్నది రాధ— "మా అత్తయ్య. పేరు శాంతమ్మ."

ఆ ఇంట్లో జనాభా మొత్తం ఆరుగురుట. రాధ, రాజా రావు, రాధ మావయ్య, అత్తయ్య, ఇందాక బొంగరాలాడుకుం టూన్న కుర్రాడు, వాడి అమ్మాను. ఆమె (రాధ ఆడబడుచు) ఈ మధ్యనే మొగుడితో పోట్లాడి పుట్టింటికి వచ్చిందిట పిల్లాడితో సహా.

ఎంతసేపుకూర్చున్నా—రాధ ఒక్కర్తె నాతో మాటాడు తుంది. అంతేగాని, ఆ యింటోవున్న మరెవ్వరూ కనీసం 'ఎప్పు డొచ్చావూ' అని అడగనైనాలేదు.

అక్కడ కూర్చునివుంటె ఏదో ముళ్లమీద కూర్చున్నట్టని పించింది. అందుచేత అలా బజారు వెళ్లొద్దామని లేచాను.

"ఎక్కడికి......వున్నట్టుండిలేచావూ?"

"అలా బజారు వెళ్లొద్దామని......"

"ఒక్కక్షణం—కాఫీ కాచి తెస్తాను."

"వద్దు......బజార్లోనే తాగుతాను. అది సరేగాని, రాజారావు యింట్లోలేడా?"

"పనిమీద ఏలూరువెళ్లారు. కాసేపట్లో వచ్చేస్తారు."

"ఊహు......అలాగా....సరే ...... మరోగంటలో తిరి గొస్తాను."

అని రాధకిచెప్పి, బజారువైపు నడక సాగించాను. రాధలో కనుపిస్తూన్న కళే చాలు—ఆమె ఎంత నికృష్టంగా ఇక్కడ బ్రతుకుతుందో చెప్పటానికి.

తెలీనివూళ్లో, తెలిసినట్టు తిరగడం నాకో సరదా.. రాజమండ్రిరోడ్లు బాగా పరిచయమున్నవాడిలా నడుస్తూన్నాను దిక్కులు గట్రా చూడకుండా.

"ఒరేయ్ శంకరం" అని పిలిచారు.

ఆగిపోయి చుట్టూ చూశాను—ఈవూళ్లో నన్ను తెలి సిన వాళ్లెవరా అని. ఓ పదిహేను గజాలదూరంలో నాలుగిళ్లవ తల ఓయింటి గుమ్మంముందు పిల్లాడ్నెత్తుకుని నిలబడ్డాడు ముకుందం!........

వాడిని చూడగానే గబగబా వెనక్కువచ్చి అన్నాను. "నువ్వట్రా ముకుందం."

ఎన్నాళ్టికి చూశారా నిన్ను....మొదట్లో నువ్వో కాదో అని సంశయించానుగాని, తీరా నీ నడక గమనించిన తర్వాత నువ్వే అను కున్నాను. ఆ......కులాసా?"

"చాలా మారిపోయావురా ముకుందం. అప్పట్లో వూచిక పుల్లలా సన్నగా వుండేవాడివి. ఇప్పుడేమో—"

"ఏనుగుగున్నలా లావయ్యానంటావ్....రా....రా...... లోపలకూర్చుని మాటాడుకుందాం."

మేము కూర్చున్నగది చిన్నదైనా, నీటుగా అలంకరించ బడివున్నది. రేడియో 'వాల్యూమ్' తగ్గించాడు.

"కాకినాడలో ఉద్యోగం చేస్తున్నావటగా......తెలిసింది"

"అవును."

"ఏమిటిలా దయచేశావ్?"

"చుట్టంచూపుకి వచ్చానుగాని—వీడు నీ సుపుత్రుడా?" అనడిగాను, వాడివడిలో పిల్లాడ్నిచూస్తూ.

"అవున్రా. వంశోద్ధారకుడు. వీడిపేరు అరవసినిమా డైలాగులా ఎంత పెద్దదో తెలుసా......వీరవేంకట శివసత్యపూర్ణ వరప్రసాదశర్మ......మా అమ్మా, నాన్న, మా అత్తయ్యా, మావయ్యా, నేనూ, మా ఆవిడా—ఇంతమందిమి కూర్చుని కూడ బలుక్కుని వీడిపేరు తయారుచేశాం. సంవత్సరం మొన్న డిశం బరులో పూర్తయింది. కాని శంకరం—వీడంత గడుగ్గాయి మా అక్కయ్య పిల్లల్లోకూడా లేరనుకో. ఏడుపు మొదలెట్టినా, కేరిం తాలు ప్రారంభించినా ఇంక ఆపడమంటూ వుండదు. అరేనాన్నా! మీ మావొచ్చాడుగానీ—ఏదీ నీ ప్రతాపం చూపించు......"అంటూ వాడి లేతబుగ్గలమీద ముద్దుపెట్టుకున్నాడు. ఆ పిల్లాడేమో ముకుందం సన్నటి మీసాలవంక దీక్షగా చూస్తున్నాడు.

ముకుందం ఓ బిడ్డ తండ్రయ్యాడు! ఆ పసివాడి గురించి అడక్కపోయినా, పనిగట్టుకుని గడగడా వాగేశాడు! 'నా భార్యా, నా పిల్లలూ' అని చెప్పుకోడంలో గూడా అనిర్వచ నీయమైన ఆనందం ఉంటుందని ముకుందం నిరూపించాడు.

నాలుగేళ్లక్రితం ఈ ముకుందం ఫస్టుక్లాసు గడు గ్గాయి స్టూడెంటు. ఆడపిల్లలకి మారుపేర్లు తగిలించడంలో సిద్ధహస్తుడు. ప్రభావతికి 'సింగిల్ రోజ్' అని నామకరణం చేసింది వీడే. ఆమె రెండు జడలు వేసుకుని, ఒక జడలో మాత్రమే 'గులాబిపువ్వు' పెట్టుకుని కాలేజీకి వచ్చేది. ప్రభావతిఅంటె ముకుందానికి వల్లమాలిన అభిమానం. సర్వవేళలా ఆమె నీడలా అంటిపెట్టుకుని వెంబడించడం ఒక హాబీ. ఓనాడు ఆ అమ్మాయి

వీడి ఆగడంచూచి చెంపపెట్టు పెట్టబోయి, కోపాన్ని సంహరించుకుని, ఛీకొట్టిపంపింది. అంతే—ఆనాటినుంచి మళ్లీ ప్రభావతి పేరెత్తేవాడుకాదు. అంతమాత్రానికే అమ్మాయిలజోలికి పోకుండా బుద్ధిగా వున్నాడాలంటె అదీ కాదు. తర్వాత ఉషారాణిమీద కవిత్వం ప్రారంభించాడు.

అల్లాంటి ముకుందం ఈనాడు గృహస్థు.

"ఏవిట్రా ఆలోచిస్తున్నావ్........మాటా మంచీ లేకుండాను" అన్నాడు ముకుందం.

"ప్రభావతీ—ఉషారాణి గుర్తుకొస్తేనూ!"

"ఉష్! గట్టిగా అరవకురా బాబూ! ఇంటిది విన్నదంటే నా ప్రాణాలు తోడేయగలదు. అన్నట్టు మా ఆవిడ్ని పరిచయం చేయలేదుగదూ........ఇదిగో.......జానకీ......." అని పిలిచాడు లోపల గదివైపుచూస్తూ.

"వస్తూన్నా" అని అంటూ, ఆమె మాగదిలోకి వచ్చింది.

"ఈవిడేరా నా శ్రీమతి. వీడు శంకరమని నా క్లాసుమేటు. ప్రస్తుతం కాకినాడలో అఘోరిస్తూన్నాడు. చూడూ.....రాకరాక మనింటికి వచ్చాడు—ఇప్పుడు మా యిద్దరికీ చాలా అందమైన కాఫీ తయారు చెయ్యాలి మరి. వెళ్లు" అన్నాడు.

ఆమె వంటగదిలోకి నడిచింది.

"నీపేరు చెప్పుకునైనా రెండోమారు తాగుతూన్నా కాఫీ. లేకపోతే సరిగ్గా అయిదు గంటలకన్నట్టు ఒకసారే కాఫీ ఇస్తుంది. ఆతర్వాత చచ్చిగీపెట్టినా కాఫీమాట ఎత్తకూడదు. కాఫీ తయారు చెయ్యడంలో మా ఆవిడని అభినందించాల్సిందే. ఇంకా కాసేపట్లో తాగుతావ్‌గా. తాగింతర్వాత నువ్వే అంటావ్ బ్రహ్మాండమని."

వాడు ఏంమాటాడినా, ఎంతసేపు మాటాడినా కేవలం సంసారం గురించేలా కనుపిస్తోంది. వాడిభార్యా, ఆవిడ తయారుచేసే కాఫీ—వాడి పిల్లాడూ, వాడుచేసే అల్లరీ.....పెళ్లయింతర్వాత ఎవరైనా యిలాగే మారిపోతారు కాబోలు.

"అన్నట్టు ఇక్కడ ఎవరో చుట్టాలింటికి వచ్చానని చెప్పావుకదూ."

"అవును. ఈ పక్కవీధిలోనే రాజారావు అని....."

అతనిపేరు వినగానే ముకుందం కుర్చీలోంచి కాస్త ముందుకుజరిగి అడిగాడు—

"రాజారావా? అంటే ఆ కలప వ్యాపారంచేసే అతను."

"వూ......అతినే. అతనికి మా మామయ్యకూతుర్నిచ్చాం"

"అలాగా."

"నీకు అతను తెలుసా?"

"బాగాను. నా కొక్కడికే అన్నమాటేవిటి? ఈపేటంతటికీ తెలుసు. పాపం! ఆవిడ ఎంత దురదృష్టాన్ని నోచుకుందోగాని యమకూపంలాంటి ఇంట్లో అడుగుపెట్టిందిరా శంకరం!"

"అంటే."

"ఆ యింటివాళ్లు ఆమె నెంత సాధించుకుతింటారో భగవంతుడికే తెలియాలి. రాజారావు తల్లిమాటకు ఎదురు చెప్పడు. అత నొక్కడేకాదు ఆ యింటిల్లిపాదీ ఆమె చెప్పచేతల్లో ఉండాల్సిందే. ఆమె పిసినారితనం ఇంతా అంతాకాదు. చీటికిమాటికి దేవతలాంటి ఆ పిల్లను సాధించడం ఆమెకు బాగా అలవాటు. పైగా—దానికి తగ్గట్టు ఆ రాజారావు వట్టి అనుమానం మనిషి. ఈమధ్య ఆ ఇంట్లో ఓ గది కాలేజీ కుర్రాళ్లకి అద్దెకిచ్చారుట. పాపం—ఏమీ తెలీని ఆమెను అనుమానించాట్ట రాజారావు. దీనికి వంతపాడింది ఆ తల్లి. దాంతో పెద్ద రభస. వెంటనే ఆ కుర్రాళ్లని ఆ గది ఖాళీ చేయించారు. ఈ వార్త కాస్తా అందరి నోళ్లల్లోనూ పడింది. సీతాదేవిలాటి ఆమె తన దుఃఖాన్ని దిగమింగుకుని బ్రతుకుతోంది. ఏనాడూ ఆ ఇంటి గుమ్మందాటి బైట ముఖ్ఖంచూడని ఆ ఉత్తమాఇల్లాలుమీద నింద మోపటానికి అతను మనసు ఎలా వప్పుకుందోగాని, దారుణంరా భాయ్. ఓనెల రోజులక్రితం రాజారావు అక్కయ్య పుట్టింటికి వచ్చిందట. అత్తసాధింపుతోపాటు, ఆడబిడ్డ ఆరడిగూడా ఎక్కువయ్యిందని మా ఆవిడ చెప్పింది. మొత్తానికి ఆ అమ్మాయి అనుక్షణం కుమిలిపోతోందనుకో......" అన్నాడు ముకుందం.

వీడి మాటలన్నీ విన్నతర్వాత ఆ ఇంటివారందరిపీకలూ నులిమి పారేద్దామన్నంత కోపం వచ్చింది. ఇంత జరుగుతూన్నా, ఒక్కనాడుగూడా ఈ విషయాలు ఇంటికి రాయలేదంటే—రాధ మంచితనానిక్కావలసిన నిదర్శనం ఇంతకంటె ఇంకేముంది?

ఇంతట్లో ముకుందంభార్య కాఫీ కాచి తెచ్చింది. పిల్లాడ్ని ఆమెకిచ్చి, కాఫీ తాగుతూ, రాధ సంసారం గురించి తనకు తెలిసినదంతా చెప్పాడు, ముకుందం.

కాఫీలు ముగిసింతర్వాత ముకుందంతోపాటు అలా బజారు వెళ్లాను. రాత్రి తొమ్మిదికాబోలు ఇళ్లకు వచ్చేశాం.

నేను ఆ ఇంట్లో అడుగుపెట్టేసరికి రాజారావు అంటున్నాడు కాస్త బిగ్గరగా. "మీ బావ వచ్చాట్ట? ఎందుకొచ్చినట్టో? నీమీద బెంగపుట్టుకొచ్చిందేమో?—చిన్నప్పుడే అనుకున్నార్టగా మీ ఇద్దరికీ పెళ్ళిచెయ్యాలని."

"అతనొచ్చిందగ్గర్నుంచీ చూస్తూన్నాగా. ఇద్దరూ గదిలో కూచుని ఏవిటో గుసగుసలూ. మళ్లీ అతను బయటకు కదిలేంతవరకూ ఇది అక్కడ్నుంచివస్తే వట్టురా అబ్బీ!" అని తల్లి మాట అందించింది.

"ఎవరికైనా తెలీనివా ఈ వేషాలు! బొందలోపడ్డాం. అనుభవించక తప్పుతుందా మరి?"

ఇంకా వాళ్లమాటలు వినేంత ఓపికలేదు. చివాలున వెళ్లి వాళ్ళందరిమధ్యా నిలబడ్డాను. నన్ను చూచీ, చూడటంతోనే వాళ్ల నోర్లు మూతలుపడ్డాయి.

"రాధ సంసారం ఎంత చక్కగావున్నదో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తూన్నాను. మీ రసలు మనుషులుకారు. రాధగొంతుక కోశాడు మావయ్య. మీరేదో ఉద్ధరిస్తారనీ, తన పిల్ల సుఖపడుతుందనీ ఈ పెళ్లిచేశాడు. మీ మర్యాదకో నమస్కారం. వస్తాను" అంటూ రెండడుగులు వేశానో లేదో రాధ తన ముఖాన్ని చేతుల్లో దాచుకుని ఏడుస్తోంది. ఆగాను.

"నిన్ను చూస్తూంటె నా గుండె తరుక్కుపోతోంది. ఎప్పటికైనా మంచిరోజులొస్తాయని సరిపెట్టుకో రాధా! ఇంతకంటె నువ్వు చెయ్యకలిగిందీ, నేను చెప్పవలసిందీ ఏమీలేదు. వస్తానింక" అని గబగబా ఆ యింటినుంచి బయట కొచ్చేశాను.

చిత్రమేమిటంటే—నేనింత ఆవేశంగా మాటాడినా, ఆ తల్లీ, కొడుకులూ నోరు మెదిపితే వట్టు. అలా బొమ్మల్లా నిల బడి చూడటం మినహా. అవును మరి—తప్పుచేసేవాడు ఎప్పుడూ తలదించుకునే వుంటాడు!

ఆ రాత్రికి రాత్రే రైలెక్కి కాకినాడ వచ్చేశాను.

6

సరోజవాళ్లు ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారని తెలిసింది! ఆశ్చర్యపోయాను! కనీసం వెడుతున్నామని గూడా చెప్ప కుండా వెళ్ళిపోయారేవిటాని ఆశ్చర్యపోయాను. అయినా ఇంత హఠాత్తుగా వెళ్ళిపోవటానికి కారణమేవిటి?

ఆమె ఆరోగ్యం ఏలా వున్నది? ఇన్నాళ్ళూ నన్ను చూడని సరోజ—చివరిసారిగానైనా కనుపించి వెడుతున్నామని చెప్పకపో టానికి కారణమేవిటి? ఏదీ అంతుపట్టడంలేదు. మనసంతా గందరగోళంగా వున్నది.

ఆఫీసులో పనిచెయ్య బుద్ధిపుట్టడంలేదు. రెండు మూడు సార్లు నా పరాకునిచూచి హెడ్‌క్లార్కు మందలించారు గూడాను.

గుర్నాథం నాసీటుదగ్గరకొచ్చి అన్నాడు, "రేపు ఆఫీసరు పుట్టిన రోజుట."

"అలాగా!"

"మన స్టాఫంతా కలిసి ఆయనకో చిన్న పార్టీ ఇవ్వాలను కుంటున్నాం."

"మంచి ఆలోచన."

"తలో రెండు రూపాయలు వేసుకుంటున్నాం."

"తప్పకుండాను. నావంతు ఇప్పుడే తీసుకోండి" అని రెండు రూపాయలు అతని కిచ్చాను.

"థాంక్సు......రేపు ఆఫీసవర్సయింతర్వాత—అంటే అయి దున్నరకి పార్టీ ఏర్పాటుచేస్తున్నాం."

"అలాగే......"

అతను వెళ్ళిపోయాడు. మళ్ళీ సరోజ వాళ్లగురించి ఆలోచనలు ప్రారంభమయ్యాయి.

మొత్తానికి ఆరోజంతా వాళ్లగురించే ఆలోచనలు. ఎన్నో ప్రశ్నలు. ఒక్కదానికీ సమాధానంలేదు. మళ్ళీ విసుగు, చిరాకు.

ఇంటిదగ్గర అన్నపూర్ణమ్మగారికి సుస్తీగా వున్నది. ఈ రెండు రోజుల్లోనూ ఆమె వొక్కసారిగూడా పలుకరించలేదు. ఎంత నొచ్చుకుంటున్నదో ఏమో.......గబగబా ఆవిడ గదిలోకి వెళ్లేను. ఆమె మంచమ్మీద పడుకునివున్నది. నన్ను చూస్తూ నవ్వుతూ అన్నది. "రా.....నాయనా!"

"ఎలాఉందమ్మా!"

"గుండెల్లో బరువుగా ఉంటుంది. ఆయాసం....."

"మంచి డాక్టర్ని......"

"ఎందరో అయ్యారు. నయంచేయలేక పోయారు. ఈ గుండె జబ్బుతో నేననుభవిస్తున్నబాధ పరాయివాళ్ళకూ్కడా వద్దు నాయనా.......ఏ పనీ చెయ్యనివ్వదు. ఒక్కడుగు కదల నివ్వదు. పోనీలే.......ఈరోగం గురించేం మాటాడుతానుగానీ..... రాజమండ్రి కబుర్లు చెప్పు రఘూ"

అక్కడ జరిగిన అన్ని విషయాలూ తూ. చ. తప్పకుండా చెప్పాను. ఆమె అంతావిని నిట్టూరుస్తూ అన్నది—

'మనుష్యుల్లోగూడా రాక్షసులుంటారు బాబూ' అని.

*　　*　　*　　*

—ఆ సాయంత్రం పార్టీకి కావలసిన సదుపాయాలు సేకరించడంలో తలనిండుగా మునిగిపోయారు గుర్నాథం, హెడ్ క్లార్కూనూ. శివానందం రెండు మూడుసార్లు బయటికీ, లోప లికీ కాలుకాలినపిల్లిలా తిరుగుతున్నాడు. అతను ఆఫీసరుకోసం ఎదురు చూస్తున్నాడు.

ఆఫీసుని చక్కగా అలంకరించారు. అన్నీ చక్కగా అమ ర్చారు. మరో అరగ్గంటకి ఆఫీసరుకారు ఆవరణలోకి అడుగు పెట్టింది—

"ఆఫీసర్తోపాటు ఆయన శ్రీమతిగారు కూడా వచ్చా ర్రోయ్" అని ఎలుగెత్తి అందరికీ చెప్పాడు శివానందం.

ఆఫీసరూ, ఆయన సతీమణి లోనికి అడుగుపెట్టారు. ఆమెను చూచిన మరుక్షణంలోనే అదిరిపడ్డాను.

శారద ఆఫీసరు భార్య!

ఆ క్షణంలో ఎందుకో కీడు శంకించాను. ఇన్నాళ్ళూ ఆమెకి దూరంగా ముఖం చాటు చేసుకుని తిరిగాను. ఇంక ఆమె ఎదుట పడక తప్పదు కాబోలు—

అదే జరిగింది.

ఆఫీసరు ఆవిడకు పేరు పేరునా అందర్నీ పరిచయం చేస్తున్నారు.నా దగ్గరకువచ్చి ఆగారు—

"మిస్టర్ శంకరం బి. కాం. నాలుగు నెలల్రకితం ఈ ఆఫీసుకొచ్చారు."

చేతులు జోడించాను. ఆమె నన్నూ చూస్తూనే నిశ్చేష్ట రాలయింది. ప్రతి నమస్కారం చెయ్యాలన్న ధ్యాసలేకుండా నావైపు చూస్తూ, అలా నిలబడిపోయివున్నది. ఈ చిత్రాన్ని ఆఫీసులో అందరూ కళ్లప్పగించి శ్రద్ధగా చూస్తున్నారు.

"నాకు శంకరం తెలుసు! నా క్లాసుమేటు" చివరికెప్పుడో ఆఫీసర్తో అన్నది ఇంగ్లీషులో.

"ఈ ఆఫీసులో పని చేస్తున్నావని ఇప్పటివరకూ తెలీ నందుకు చింతిస్తున్నాను. ఇప్పుడు కలుసుకున్నందుకుమాత్రం సంతోషంగా వున్నది." అని నాతో అన్నది (ఇంగ్లీషులోనే). నేను తలొంచుకున్నాను.

ఆ తర్వాత ఆఫీసరు ఆమెకు మరో గుమాస్తాని పరి చయం చేశారు.

నేను మవునంగా కుర్చీలో కూర్చున్నాను. ఆ కాసేపూ ప్రతివాడూ నన్నో వింతజంతువుని చూచినట్టు చూశారు.

పార్టీ ఘనంగా జరిగింది. చాలామంది ఆఫీసరుగురించి మాటాడారు. శుభాకాంక్షలు తెలియజేశారు. దాదాపు ఎనిమిది గంటలకాబోలు పార్టీ ముగిసింది.

దార్లో శివానందం, గుర్నాథం కలిశారు.

"అదృష్టమంటే నీదే గురూ" అన్నాడు శివానందం అదోలా పోజుపెట్టి.

"కోటలో పాగా వేశారు", గుర్నాథం వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

"ఇక చూచుకో—అటు అంతఃపురంనుంచి వచ్చే అనుగ్రహంవల్ల, ఆఫీసరు నిన్ను ఆకాశాని కెత్తేస్తాడు. జాతక పురుషుడివి" శివానందం అన్న ఈ మాటకి నాకు కోపం వచ్చినమాట వాస్తవం. శివానందం కోరుకునేది ఆఫీసరు 'గుడ్‌లుక్సు' గ్రటాను. దానికోసం అవసరమైతే వెధవ 'కాకా'లూను.

వీడికున్న ప్రపంచమంతా ఇదేను.

"శివానందం......ఇంక ఈ మేటర్సుకి ఫుల్‌స్టాప్ పెట్టమని మనవి" అన్నాను.

"ఇదేమిటండీ మీకు పట్టిన అదృష్టం—" గుర్నాథం ఏదో అనబోయాడు.

"ప్లీజ్.....మీకూ్కడా ఆమాటే చెప్పుకుంటాను. నన్ను విసిగించకండి."

నేనిలా అనగానే వాళ్లిద్దరూ ఒకళ్ల మొహాలొకళ్లు చూచుకున్నారు. ఏమనుకున్నారో ఏమోగాని వెంటనే స్పైకి క్లీనిక్కి వెళ్ళిపోయారు.

—నేనింటో అడుగుపెట్టగానే జానకిరామయ్యగారు ఆదుర్దాగా అన్నారు. ఏమిటని అడిగాను.

"మీ అమ్మకి ఫిట్సు వచ్చింది నాయనా! పావుగంటనుంచీ మాటా మంచీలేదు. నా కాళ్లాడటంలేదు. డాక్టర్ని పిల్చుకొస్తాను. నువ్వు కాస్త కనిపెట్టుకుకూర్చోబాబూ" అని ఆయన వెళ్ళిపోయారు.

అన్నపూర్ణమ్మగారిదగ్గర కెళ్లాను. ఆమెకు స్పృహరాలేదింకా. తలవైపు, బల్లమీద మందుసీసాలూ, గ్లూకోజూ, నారింజ రసం వగైరా వున్నాయి.

మెల్లిగావెళ్లి ఆమె తలవైపు కూర్చున్నాను.

"అమ్మా—" పిలిచాను. ఆమె పలుకలేదు.

పది నిమిషాలు గడిచినా, ఆమెకు స్పృహ రాలేదు. ఆమె స్థితిని చూస్తూంటె నాకు భయంగా ఉన్నది. వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాను.

ఆమెకు స్పృహ వచ్చిందికాబోలు—పెదిమలు కదిపింది ఏదో మాటాడుదామనే ఉద్దేశ్యంతో. నా ఆనందానికి అవధుల్లేవు.

"కొద్దిగా మంచినీళ్ళు ఇవ్వనామ్మా!" అడిగాను.

నా పిలుపు వినగానే కళ్లు విప్పింది. నన్ను చూచింది. అలా చూస్తూనే కన్నీరు పెట్టుకుంది. నా రెండు చేతులూ ఆమె చెక్కిళ్లమీదకు తీసుకుంది. నిమ్మదిగా అన్నది.

"నాకు......చావాలని.....లేదు రఘూ!"

"మంచినీళ్ళు ఇవ్వనా......"

"ఇవ్వునాయనా.......నువ్వుయిచ్చేది అమృతంరా........ త్వరగా ఇవ్వు."

గ్లాసులో నీళ్లుపోసి ఇచ్చాను. ఆమె నింపాదిగా తాగి, తిరిగి గ్లాసు ఇచ్చేస్తూ అన్నది.

"నేనంటె......ఎందుకు నాయనా....ఇంత ప్రేమ?"

"......................."

"నువ్వు నా దగ్గర కూర్చుంటే—నాకే భయమూ వుండదు. అరే.......నువ్వెందుకు కన్నీరు పెట్టుకుంటావ్‌రఘూ"

నే నెవర్ని? ఆమె ఎవరు? మామధ్య ఎందుకీ అమూల్య బాంధవ్యం?

"ఇంతకుమునుపు నేను చచ్చిపోయాననుకున్నాను.... ఎందుకో మరి.........కళ్లు తెరిచాను.......నువ్వు కనుపించావ్..... పోతూన్న ప్రాణాన్ని తిరిగి తెచ్చుకున్నాను......"

అంతలో డాక్టరు రానే వచ్చాడు. ఏదో ఇంజక్షన్‌నిచ్చి, రేపు మామూలుస్థితికి వస్తారని జానకిరామయ్యగారికి చెప్పి వెళ్ళిపోయాడు. జానకిరామయ్యగారు గదిలో మూల నిలబడివున్నారు.

"చూడండి......అబ్బాయివచ్చి....నన్ను బ్రతికించాడు. నేను చెప్పానుగదూ వీడు మన రఘూ అని.....లేకపోతే....... నేనంటే ప్రాణాలెందుకు పెడ్తాడూ......ఏవంటారు......"

"అవును" అన్నారాయన కన్నీరు తుడుచుకుంటూ.

చెరిసగం రాత్రివరకూ ఆమె ఇలాగే మాటాడుతూ గడిపింది. ఆతర్వాత నిద్రపోయింది. ఆరోజుకి నేనూ, ఆవిడగదిలోనే పడుక్కున్నాను.

తెల్లవారిన తర్వాత జానకిరామయ్యగారు అన్నారు. "పాపం! రాత్రి భోజనం, నిద్రా లేకుండా గడిపావు."

నేను నవ్వి వూరుకున్నాను. ఆ ఉదయానికూ్కడా ఆమె కోలుకోలేదు. నా కా రోజు ఆఫీసుకువెళ్లబుద్ధిపుట్టలేదు. సెలవు చీటీ పక్కింటికుర్రాడితో ఆఫీసుకు పంపాను. 'ఇంతమాత్రానికే సెలవెందుకు నాయనా' అని జానకిరామయ్యగారు అన్నారుగాని, నేను వినిపించుకోలేదు.

తర్వాత డాక్టర్ను వెంటబెట్టుకుని తీసుకొచ్చాను. ఆయన అన్నపూర్ణమ్మగార్ని పరీక్షించి, ఇంజక్షను ఇచ్చివెళ్లారు. ఇంక పర్వాలేదని గూడా జెప్పారు.

ఆయన రాసిచ్చిన మందులు కొనుక్కుని తీసుకొచ్చాను. ఆరోజు ఆ మందు వాడాము.

మర్నాటికి ఆమె మామూలు మనిషయ్యింది. గండం గడిచినట్టయింది. జానకిరామయ్యగారు గాలి పీల్చుకున్నారు.

ఆఫీసుకు వెళ్లాను. పరిస్థితులు విడ్డూరంగా తయారయ్యాయి. అందరూ నన్నుచిత్రంగా చూట్టం మొదలుపెట్టారు. హెడ్‌క్లార్క్ నన్ను తన సీటుదగ్గరికి పిలిపించుకుని, ఏదో రహస్యం అడుగుతున్నట్టు, మెల్లిగా అడిగారు—

"మీరు ఆమెకు చదువు చెప్పేవారటగా!"

ఈ విషయం ఆఫీసులో ఎలా తెలిసిందో నాకు ఓ పట్టాన అర్థంకాలేదు. అయినా నే నామెకు చదువుచెప్పిందీ లేనిదీ ఈయనకు ఎందుకు?

ఆయనకేం జవాబు చెప్పకుండావచ్చి, నా సీట్లో కూర్చున్నాను.

ఆఫీసరు తన గదిలోకి వెడుతూ, నావైపు అదోవిధంగా చూశారు. ఆయనలావెళ్ళి అయిదు నిమిషాలైనా జరక్కమునుపే నన్ను పిలిపించారు. ఈ పిలుపు ఆఫీసు బృందాన్ని కలవరపెట్టింది. వాళ్లనేకాదూ—ఒకవిధంగా నన్నూను.

ఆయన గదిలోకివెళ్ళి నిలబడ్డాను.

''మీ పద్ధతేం బాగుండలేదు మిస్టర్ శంకరం.''

ఉలిక్కిపడ్డాను ఈ మాటతో.

''మీ ఇష్టంవచ్చినట్టు సెలవు వాడేస్తున్నారు.''

''నిన్న మా ఇంట్లో—''

''ఐ యామ్ నాట్ ఆస్కింగ్ యువర్ సిల్లీ కాజెస్— ఇలా సెలవలు పెట్టడం నా కిష్టంలేదని అంటున్నాను.''

ఆయన అనవసరంగా మండిపడ్తున్నట్టు గ్రహించాను.

''ఇంకా మీరు కన్ఫరమ్‌కాలేదు. ఇదిమాత్రం గుర్తు చేసుకోండి.''

ఇంత చిన్న విషయానికే ఈయన ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తూన్నట్టు? నే నిప్పుడేం మాటాడినా నేరమే అవుతుంది. అందుకనే మౌనంగా ఉండిపోయాను.

''మీ ప్రోగ్రెస్ ఏమంత బాగాలేదు. నో.....ఐ కాంట్ స్పేర్ దిస్ కైండాఫ్ నెగ్లిజెన్స్.......అండర్‌స్టాండ్.....''

''యస్సార్.''

''ఊ.....యూకెన్గో.''

ఆ గది నుంచి బయటకు వచ్చాను. అంతవరకూ ఆ గది తలుపుల దగ్గర నిలబడి ఉన్నాడేమో, శివానందం—నా రాకను చూచి గబగబా తన సీటు దగ్గరికి పరుగెత్తాడు. ఆఫీసరు నన్నేమన్నాడో విందామని శ్రమపడ్డాడు కాబోలు.

ఈ వింత మనస్తత్వాలమీద నాకు రోత కలిగింది.

నా సీట్లో కూర్చుంటుండగా, టేబిల్‌మీద ఉన్న కవరు నా చూపుని ఆకర్షించింది. నాకు పరిచయంలేని అక్షరాలతో నా చిరునామాను రాశారు. ఎవరాని ఆత్రంగా కవరు చించి చదివాను.

శ్రీ శంకరంగార్కి,

కొందరు మంచిమనుషులుంటారు. వాళ్లని మోసగించడం తలకుమించిన పని. అంతరాత్మ సుతరామూ ఒప్పుకోదు. మీరు నాకు ఏ క్షణంలో కనిపించారో గాని—ఇన్నాళ్లూ మంచీ చెడుల మధ్య యిటూ అటూ అని వూగిసలాడాను.

ఈ పోరాటంలో చివరికి మంచే గెలిచింది.

నేను వేశ్యను. సీతారామయ్య నా తండ్రి కాడు. నాకు అక్కయ్య అనబడే వ్యక్తి యీ లోకంలో ఎవ్వరూ లేరు. ఇవన్నీ మా వ్యాపారం నిరాటంకంగా సాగటానికి, మీలాటి అమాయకుల్ని మోసగించటానికి కల్పించుకున్న సాకులు.

జన్మలో ఒక మంచిపని చేయగలిగినందుకు నే నెప్పటికీ గర్విస్తూంటాను.

నాలుగు రోజుల క్రితం—సీతారామయ్యకీ నాకూ రగడ జరిగింది. అతను మిమ్మల్ని మోసం చెయ్యమంటాడు— నేను చెయ్యనన్నాను. చివరికి, నేనే ఆధారమయిన అతను నామాట వినక తప్పిందికాదు.

ఈ జన్మలో మీకు కనిపించకూడదనే నిశ్చయంతో— దూరంగా పోతున్నాను. మకాం మార్చాను.

ఇన్నాళ్లూ మీతో చెలగాటం ఆడినందుకు మన్నించమని కోరుకుంటూ— సరోజ.

నామతి పోయినట్టయింది. నాలాటివాళ్లనే వలలో వేసుకోవడం వృత్తిగా పెట్టుకున్న సరోజ నాపట్ల యిలా ఎందుకు చేసింది. ఇది జవాబులేని ప్రశ్న.

ఎంత నీచంగా బ్రతుకుతున్నవారైనా—ఒక్కోసారి— ఒక మంచివాడుసైతం చేయలేని మంచిపని చేయగలరని సరోజ నిరూపించింది.

ఆరోజు నా మనసంతా పాడయ్యింది. అటు ఆఫీసరు ప్రవర్తనా—యిటు సరోజ రాసిన ఉత్తరం—యీ రెండూ నన్ను కలవరపెట్టాయి.

ఇంటిదగ్గర అన్నపూర్ణమ్మగారు నాలో కనుపిస్తూన్న కొత్తదనాన్ని గమనించారు. గుచ్చి గుచ్చి కారణం అడిగారు. నేను సమాధానం చెప్పనేలేదు.

రోజులు గడుస్తున్నాయి.

ఒక్కోరోజు, ఒక్కోవింత పరిణామాన్ని వెంటబెట్టు కొస్తున్నది. ఆఫీసులో పరిస్థితులు ప్రతికూలించాయి. కేవలం నన్ను వత్తిడి చెయ్యాలనే సంకల్పంకొద్దీ ఆఫీసరు నన్ను ప్రతి చిన్న విషయంలోనూ మందలిస్తున్నారు. అప్పుడప్పుడూ విపరీతమైన కోపాన్ని గూడా ప్రదర్శించడం కద్దు.

ఇది సహించడం నాకు వాతకావడంలేదు.

—ఆఫీసరిలా మారిపోటానికి శారద కారణం కావచ్చు. ఆనాడు నాపైన కత్తిగట్టినట్టు 'సాధిస్తా' నని హెచ్చరించింది. ఈనాడు ఆ పగ తీర్చుకుంటోంది కాబోలు.

ఏమో మరి !—ఆడది తెగిస్తే ఎంతటి పనైనా చేస్తుందని వాడుక. ఆమె నా గురించి ఆఫీసరుకు ఏమైనా చెప్పి ఉండవచ్చు. ఆడదానిమాట నమ్మడం సులువు.

ఆఫీసులో అందరూ సరిగ్గా వేళకి యింటికి వెళ్లిపోయేవారు. నా విషయంలో యిలా జరగడంలేదు. అంతటి ఆఫీసులోనూ బిక్కుబిక్కుమంటూ నే నొక్కడ్నీ, నాకు కేటాయించిన పనితో రాత్రింబవళ్లూ కూర్చోవలసి వస్తున్నది. ఇంతపనిలో ఏ చిన్న పొరబాటు దొర్లినా ఆఫీసరు సహించేవారు కాదు. పిలిపించి, నన్నూ—నా చదువుని హేళన చేసేవారు. ఈ వింత పరిణామానికి నేను చింతించని రోజు లేదు. ఒక్కోసారి— యీ ఉద్యోగం విడిచిపెట్టి ఎక్కడికైనా పారిపోదా మనిపించేది.

ఓరోజు—రాజన్న నాకో కొత్తరకమైన కబురు తెచ్చాడు. చాటుగా పిలిచి రహస్యం చెబుతున్నట్టు చెప్పాడు.

''మిమ్మల్నివాళ అమ్మగారు రమ్మన్నారు ?''

ఆ ఆహ్వానం నాకు వెగటు కలిగించింది.

''రాలేను. ఆఫీసులో పని వత్తిడిగా ఉన్నదని ఆమెతో చెప్పు.''

''అదేబాబూ ! ఆ విషయం అడగటానికే రమ్మన్నారు.''

''అంటే ?''

రాజన్న వెకిలిగా నవ్వినట్టు కనిపించింది నాకు.

''మీ రిన్నాళ్లూ ఆఫీసులో పడ్తూన్న యిబ్బందంతా అమ్మగారికి చెప్తూన్నా రోజూను.''

''అసలు నా విషయాలు ఆమెతో చెప్పటానికి నీకేం పని ?''

"అయ్యోరామ ! నామీద కోపం చూపిస్తారేటండీ ! అమ్మగారు రోజూ మిమ్మల్నిగురించీ అడుగుతూంటారు. నాకు తెలిసిందంతా నేను చెప్తాను."

ఆశ్చర్యం కలిగింది. శారద నన్నుగురించి తెలుసుకోవాలని ఎందు కనుకుంటోంది ?

"ఇవ్వాళ మీతో అన్ని విషయాలూ మాటాడతారంట. ఆఫీసయిపోంగానే రమ్మని మరి మరీ చెప్పారు."

"సరే. ప్రయత్నిస్తానని చెప్పు" అన్నాను.

రాజన్న వెళ్లిపోయాడు.

శారద నన్ను పిలిపించడంలో అర్థమేమిటి ? నామీద పగ తీర్చుకునేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆమె—నన్ను పరామర్శించాలని ఉన్నదనడంలో 'ఉద్దేశ్య' మేమిటి ? నన్నూ, నా అసమర్థతనీ అవమానిస్తుందా ? లేక—ఈ జరుగుతున్న దారుణానికి సానుభూతి చూపుతుందా ?

ఎన్నో ప్రశ్నలు—అనుమానాలు.

చివరికి ఆ యింటికి వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. ఆరోజు మిగిలున్న పనికి వాయిదావేసి—కొస్త పెందరాళే అందరితోపాటు బయట కొచ్చేశాను.

—నాకోసమే ఎదురుచూస్తున్నది కాబోలు—నన్ను లోనికి సాదరంగా ఆహ్వానించింది శారద.

"రావనుకున్నాను .... అలా కూర్చో" అన్నది సోఫా చూపిస్తూ.

మవునంగా కూర్చున్నాను.

"శ్రీవారు నీమీద కత్తిగట్టారుట నిజమేనా ?"

".... ...."

"ఛీ....వారింత అల్పబుద్ధివా రనుకోలేదు." అన్న దామె.

ఉలిక్కిపడ్డాను.

"అనుమానం మనిషి నెంతటి వాడినైనా తనిష్టమొచ్చినట్టు ఆడిస్తుంది శంకరం ! నువ్వు నా క్లాసుమేటువి, ఇద్దరం కలిసి మెలిసీ తిరిగాం. ఈ రెండూ చాలు ఆయన అనుమానానికి ఆయుధాలు. ఇంత చదువుకున్నా, హోదా పెంచుకున్నా—ఆ మనిషిలో 'క్రుకెడ్నెస్' యింకా దూరం కాలేదు. పాపం ! అన్యాయంగా నీమీద విరుచుకుపడుతున్నారు."

"నన్నెందుకు పిలిపించావో .... "

"ఎందు కేవిటీ ?—నీ గురించి రాజన్న చెప్తున్నది వింటూంటే ఓసారి నీతో స్వయంగా అన్ని విషయాలూ మాటాడాలని .... "

"నే నొకటి అడగా లనుకుంటున్నాను."

"నిరభ్యంతరంగా."

"ఆఫీసరిలా మారిపోటానికి కారణం ?"

"చెప్పానుగా ఆయన అనుమానమని !"

"అంతేనా ?"

"అంతే !"

"దాన్లో నువ్వేం కలగజేసుకోలేదా ?"

"అంటే ?"

"నీకు గుర్తులేకపోవచ్చు. కాలేజీ రోజుల్లో—ఓనాటి నీ ఉద్రేకాన్ని కూడదని హెచ్చరించాను. మందలించాను కూడా. ఆనాడు నువ్వన్నావ్ 'దానికి తగ్గ ప్రతిఫల మనుభవిస్తావ'ని. అప్పట్లో ఆమాటని నేను పట్టించుకోలేదు. మళ్లీ యీనాడు మనిద్దరం కలుసుకున్నాం. నీ పగ తీర్చుకునేందుకు చక్కటి అవకాశం దొరికింది. నీమాట నెరవేర్చుకుంటున్నావ్. ఇది కాదంటావా ?"

ఇంతా విని ఆమె పకపకా నవ్వేసింది !

"ఓయ్ పిచ్చి శంకరం ! నాకు పగేమిటయ్యా మహానుభావా ?—అవి తెలిసీ తెలీని కాలేజీ రోజులు—ఇది జీవితం. ఈ రెంటికీ తేడా చాలా ఉంటుంది. ఒకరిమీద పగ తీర్చుకోటానిక్కాదు జీవితం !—ఏమో ఆనాడు నిన్ను అలా అన్నానేమో. అయినా అప్పటిమాట యింకా గుర్తుంచుకున్నావన్నమాట. గూడ్ .... "

ఆమె అలా అనేసరికి నాకు సిగ్గువేసింది. తల కొట్టేసినంత పని జరిగింది.

"ఒకవిధంగా—నీకు జరుగుతున్న యీ అన్యాయానికి నేనుకూడా ఒక కారణమేమో."

ఏమి టన్నట్టు ఆమెవైపు చూశాను.

"ఆరోజు పార్టీలో నువ్వు నాకు తెలిసినట్టుగా చెప్పాను. పైగా— అప్పుడప్పుడూ మన చనువు గురించీ, నీ గురించీ నీ చదువుగురించీ ఆయనకు చెప్తూండేదాన్ని. ఇవన్నీ ఆయన మనసుని పాడుచేస్తాయని మాత్రం ఊహించలేదు. ఆయన అల్పత్వం యిప్పటిగ్గాని తెలుసుకోలేకపోయాను."

సరిగ్గా శారద యీమాట అంటూండగానే ఆఫీసరు గుమ్మందగ్గర నిలబడ్డారు. మా యిద్దర్నీ ఓ క్షణంపాటు చూచి, నన్ను అడిగారు.

"ఏ .... ఇలా వచ్చారు ?"

"నేనే పిలిపించాను" అన్నది శారద.

"షటప్."

నేను లేచి నిలబడ్డాను.

"గెటవ్‌ట్. మళ్లీ యీ పరిసరాల్లో కనుపించకు" అన్నా రాయన నావైపు గుడ్లురిమిచూస్తూ—

"ఆగు .... నిన్ను శాసించటానికి ఆయనెవరు ? అవన్నీ ఆఫీసులో. ఇది ఇల్లని, నువ్వు వచ్చింది ఓ మిత్రురాల్ని పలకరించటానికని జవాబు చెప్పు .... " అన్నది రోషంగా శారద.

నేనేం మాటాడలేకపోయ్యాను.

"భయమెందుకు శంకరం ?—అలా చెప్పు."

"మందు నువ్వు లోపలికెళ్ళు." ఆయన శారదని గద్దించారు.

"అంత అవసరం రాలేదు."

"శారదా !"

"చాలు. నేను మీ పరిచారికను గాను, మీ కేకలూ, మీ థాంధూంలూ విని భయపడిపోటానికి—అలా నించుండిపోయావే శంకరం .... కూర్చో .... "

"అనవసరంగా నువ్వు జోక్యం కల్పించుకుంటున్నావ్ శారదా !"

"నా ఎదటనే నా ఫ్రెండుని మీరు అవమానపరుస్తున్నారు." అన్నది శారద.

"యూ .... " గట్టిగా అర్చారు ఆఫీసరు.

"ఆవేశం అక్కర్లేదు." తొణక్కుండా అన్నది శారద.

నేను యిరకాటంలో పడ్డాను. ఈ వాగ్వివాదం ఏ దారుణమైన సంఘటనకి దారితీస్తుందోనని భయపడ్డాను. తలొంచుకుని బయటకు రాబోయాను.

"ఆగు శంకరం ! నేనూ వస్తున్నాను—"

మరింత భయం వేసింది. ఏం చెయ్యాలో తోచ లేదు.

"ఈ దిక్కుమాలిన కొంపలో శాంతిలేదు. మనిషికి విలువ యివ్వడం చాతకాదు యిక్కడివారికి. ఛీ .... " ఆమె లేచి నిలబడింది.

"శారదా !"

"ఏం. ఎందుకా గావుకేకలు. చాలిక. మీ బుద్ధి తెలుసుకున్నాను. అమ్మా, నాన్నా యింకా బ్రతికే ఉన్నారు. నే నక్కడకు వెడితే తలమీద పెట్టుకు పోషిస్తారు."

"దట్సాల్‌రైట్ .... వెళ్ళు."

"తప్పకుండా" అంటూ ఆమె వేగంగా మేడ మెట్లు ఎక్కి తన గదిలోకి వెళ్ళింది.

ఆ యింటినుంచి వెంటనే బయటకు వచ్చాను. కొంత దూరం వేగంగా నడిచాను, కొంతదూరం పరుగెత్తాను.

శారద నిప్పుడు అర్థం చేసుకున్నాను. ఆమె కేవలం 'స్త్రీ' యే కాదు. అభ్యుదయానికి ఓ మచ్చుతునక. ఆమె వ్యక్తిత్వానికి చేతులు జోడించాను.

—ఆ రాత్రి భోజనం చేయలేదు. అన్నపూర్ణమ్మగారు కారణం అడిగారు. ఇన్నాళ్ళూ నేను అనుభవిస్తోన్న వేదన చెప్పితీరవలసిందని పట్టుపట్టారు.

ఆమె వడిలో తల పెట్టుకు గావురుమని ఏడిచాను.

ఆమె గాబరాపడింది. నా తల నిమురుతూ అడిగింది.

"చెప్పు రఘూ ! నా బాబువి కదూ ! నువ్వు చెప్పక పోతే నే చచ్చిపోయినంత వట్టు".

"అమ్మా !"

ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

ఇప్పటివరకూ జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించి చెప్పాను. ఆమె నిట్టూరుస్తూ అన్నది.

"వీ టన్నింటినీ మనసులో పెట్టుకుని, మనసు పాడు చేసుకోడం తగదు నాయనా ! పసివాడి వింకా .... లోకం తెలీదు నీకు."

* * * *

నిజమే మరి—

నాకు లోకం తెలీదు. మనిషి మనసు తెలీదు. అంతటి అనుభవం యిప్పటివరకూ లేదు.

అందుకనే—ఇప్పటివరకూ జరిగినదంతా ఒక చక్కటి పాఠం—జీవితం నేర్పిన పాఠాల్లో ముఖ్యమైనదీ, మరిచి పోనిదీ గూడాను.

శారద ఆ రాత్రే పుట్టింటికి వెళ్ళిపోయిందని రాజన్న ద్వారా ఆఫీసంతటికీ తెలిసింది.

ఆరోజు ఆఫీసరు ఆఫీసుకు లేటుగా వచ్చారు. వచ్చీ రావడంతోనే నన్ను పిలిపించారు. ఆనాటి పిలుపుకి నేను భయపడలేదు. సరిగదా, ఏదో పిచ్చిధైర్యం నన్నావరించింది.

ఆయన గదిలో అడుగుపెట్టాను.

"నిన్ను ఫూస్ట్ చెయ్యాలనుకుంటున్నాను." అన్నా రాయన ఇంగ్లీషులో.

"కానీ. ఆ అవసరం రాకముందే రాజీనామా యిద్దామని నేనూ అనుకుంటున్నాను." ఇంగ్లీషులోనే సమాధానం చెప్పాను.

ఆయన గతుక్కుమన్నారు. అర్థంగానట్టు నా ముఖం లోకి చూశారు.

"ఇలాంటి మనుషులదగ్గర ఉద్యోగం చెయ్యడం నాకు చాతకాదు" అన్నాను.

"అంతవరకూ వచ్చావన్నమాట."

"అన్నీ నిశ్చయించుకోడం గూడా జరిగింది. నే వెళ్ళే ముందు ఒక్కమాట—అంతస్థూ, అధికారమూ, యివిగావు మనిషి విలువను కొలిచే కొలతబద్దలు. సంస్కారం ముఖ్యం."

"షటప్ .... ఐవిల్ రిపోర్ట్ దిస్‌టూ—"

గట్టిగా నవ్వాను. ఆయన మాటమధ్యలోనే ఆగి పోయారు.

"ఎవరికో ఎందుకు ? ముందు మీ మనసుకి చెప్పుకోండి. సెల్ఫ్."

ఆ గదినుంచి గబగబా బయటకు వచ్చాను. అప్పటి కప్పుడే నా రెజిగ్నేషన్ రాసి హెడ్‌క్లార్కుకి యిచ్చాను.

* * * *

"ఇంతపని జరుగుతుం దనుకోలేదు." అన్నాడు రంగనాథం.

అన్నపూర్ణమ్మగారి కళ్ళల్లో నీరు తిరగడం తప్ప, ఆమెనుంచి ఒక్కమాటైనా లేదు. జానకిరామయ్యగారు దూరంగా నించుని ఉన్నారు.

గట్టిగా కూతపెట్టి కదిలింది రైలు ....

ఆ ముగ్గురూ నాకు కనుమరుగయ్యేంతవరకూ నేను చెయ్యూపుతూనే ఉన్నాను. రైలు ప్లాటుఫారం దాటుతుం దనగా—అన్నపూర్ణమ్మగారు యింకా నిలువలేక రంగనాథం భుజాలమీద పడిపోయింది.

సీట్లోకి వచ్చి కూర్చున్నాను.

'సరిహద్దు దాటావ్. జీవితంలోకి అడుగు పెడుతున్నావ్. నీకై నువ్వు తెలుసుకోవలసినవీ, నీ అనుభవంలోకి తెచ్చుకోవలసినవీ చాలా ఉన్నాయ్' అన్న మూర్తి మాటలు గుర్తుకొచ్చాయి.

రైలు వేగం పెంచుకుంటోంది.

మహత్తర పరివర్తన పథం – IV

[ప్రాత, క్రొత్త సామ్రాజ్యతత్వాలు]

శ్రీ జాన్ స్ట్రాచీ

పాతవైన, బ్రిటిష్, ఫ్రెంచి, డచ్చి సామ్రాజ్యాలు దాదాపు అంతరించిపోయినాయి. అయితే సామ్రాజ్యతత్వం ఇంతటితో అంతరించినట్లేనా, లేక, ఈ అధికారదండం కేవలం చేతులు మారడంమాత్రం జరుగుతుందా? తూర్పునుంచో, పడమరనుంచో బలమైనదేశం ఒకటి సిద్ధమై, పాతవారి స్థానాన్ని అధిష్టించవచ్చునని అనేకమంది అనుకున్నారు. అమెరికా ఏ విధమైన సంకోచం లేకుండా తనసామ్రాజ్యాన్ని విస్తరిస్తుందని, అపుడు పాత అధిపతులైన బ్రిటన్, ఫ్రాంసు, పశ్చిమ జర్మనీలతో సంఘర్షణ రాకతప్పదని స్టాలిన్ సాక్షాత్తు జోస్యం కూడా చెప్పాడు. కాబట్టి కమ్యూనిస్టు, కమ్యూనిస్టేతరులమధ్య యుద్ధంవచ్చే ప్రమాదంకన్న, తక్కువస్థాయిగల పెట్టుబడి దేశాలకు, అమెరికాకు యుద్ధంవచ్చే ప్రమాదం ఎక్కువఅని ఆయన వివరించాడు. ఇది వాస్తవాన్ని అపారంగా అపార్థం చేసుకోవడమేనని నేను చెప్పాను. స్టాలిన్ జోస్యం చెప్పినప్పాటినుంచి, నేటివరకు జరిగినదిచూస్తే, చివరిరోజుల్లో ప్రపంచస్వరూపం ఎలా వున్నదో కూడా ఆయనకు బోధపడలేదని చెప్పవచ్చు. పాత పెట్టుబడిదేశాలైన బ్రిటన్, జర్మనీ, జపానులు అమెరికా చెప్పుల కిందబడి నలిగిపోతున్నాయన్నది కేవలం వికృతమైన అసత్యం. కమ్యూనిస్టేతర దేశాలలో అమెరికా సాటిలేని మేటి దేశమైనది. అందుకని కొత్తగా అమెరికాసామ్రాజ్యమనేది ఒకటి అవతరిస్తుందా అన్నది చర్చింపదగిన విషయమవుతున్నది. అంతేగాకుండా, కమ్యూనిస్టు—అంటే చైనా లేకపోతే రష్యా—సామ్రాజ్యాలు ఏర్పడే ప్రమాదంకాని అవకాశంకాని వున్నదా అనేది కూడా చర్చనీయ మౌతున్నది.

ముందర అమెరికావిషయం చర్చిస్తాను. అమెరికాను సామ్రాజ్యదేశాలకు మూలవిరాట్టుగా ఇక్కడివారు భావిస్తున్నట్లు, వారితోను, వారితోను మాట్లాడితే నాకు అనిపించింది. ఇలాంటిభావం బ్రిటిష్ దేశస్థుడైన నాకు విచిత్రంగా కనపడుతుంది. ఎందుకంటే, బ్రిటను నిజంగా సామ్రాజ్య సంప్రదాయంగల దేశం. సామ్రాజ్యవాదిఅంటే సిగ్గుపడనవసరం లేదన్నట్లు మా తండ్రి నన్ను పెంచారు. భిడియపడకుండా ఆపేరున పిలుచుకొనడం, సామ్రాజ్యతత్వం చాలా మంచిదని నిస్సంకోచంగా చెప్పడం వుండేది. బ్రిటన్‌లో నిజంగా సామ్రాజ్య(తత్వ) సాంప్రదాయమంటూ ఉండేది. కాని, అమెరికాకు అలాంటిదేమీలేదు. అంతేగాదు. సామ్రాజ్య వ్యతిరేకతత్వానికి అమెరికా ఆదిశక్తి అని వారి నమ్మకం. మహత్తరమైన ప్రథమ సామ్రాజ్య ప్రతికూల విప్లవమునుండి అమెరికా ఉద్భవించినదని, సామ్రాజ్యతత్వంపై జరిగిన తొలి తిరుగుబాటు అదేనని, అందుకని సామ్రాజ్యవిరోధతత్వానికి కర్త తమ దేశమని వారు తమ చరిత్రగ్రంథాలనుంచి నేర్చుకున్నారు. నిజంగా అమెరికా ఉద్భవించింది అలాగే. పద్దెనిమిదవ శతాబ్దం చివర అమెరికాలోని పదమూడు బ్రిటిష్ కాలనీలు, బ్రిటన్‌పై తిరుగుబాటు చేశాయి. ఆ తిరుగుబాటు ఆధునికయుగంలో సామ్రాజ్య ప్రతికూలమైన పెద్ద మొదటి తిరుగుబాటు. అందుకనే, నేటి సామ్రాజ్యతత్వానికి అమెరికా మూల విరాట్ అని ఎవరన్నా విమర్శిస్తే, అమెరికనులు విస్తుపోతారు. అందుకనే ఆఫ్రికావ్యవహారాలను చూచే అమెరికా ఉప కార్యదర్శి మెనిన్ విలియమ్స్, ఆఫ్రికాలో పర్యటిస్తూ, అక్కడి పరిస్థితులు ఎలా వున్నవి అన్నది గమనించకుండానే, ఆఫ్రికనులందరికీ తక్షణం స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ ప్రకటనలు సాగించారు. తమ ప్రకటనలు బ్రిటిష్ ప్రభుత్వ వర్గాలలో చికాకు కలిగిస్తున్నాయన్నది కూడా లెక్క చేయలేదు. సాంప్రదాయకంగా సామ్రాజ్య తత్వానికి తాము వ్యతిరేకులమని తెలియజేయడానికి మాత్రమే ఈ ప్రకటనలు చేస్తున్నామని ఆయన అనుకొని వుండవచ్చు. కాని, తమనుగురించి, తాము అనుకొనేది ఒకటి. వచ్చిన పేరు మరొకటి. ఇదొక వింత స్థితి!

అమెరికాకు సాంప్రదాయకంగావున్న సామ్రాజ్య ప్రాతికూల్య భావాన్ని తేలికగా త్రోసివేయడం సమంజసమని నేను అనుకోను. అది అమెరికా సామ్రాజ్యవిస్తరణకు పెద్ద కరకట్టగా నిలుస్తుంది. అయితే, పూర్తిగా అడ్డలేకపోవచ్చు. కాని గణుతించవలసినదిమాత్ర మవును. ఒకవేళ అమెరికా ప్రభుత్వము సామ్రాజ్య నిర్మాణపు త్రోవను తొక్కినా, అది వారు అంగీకరించరు. అలాంటిది చేయడం లేదనే, తమ ప్రజలకు చెప్పడానికి అనేక విధాలుగా తంటాలు పడవలసి ఉంటుంది.

రాజకీయాలలో ఇలాంటిది సాధ్యమని మీకు తెలుసు. హ్యూలాంగ్ ఉండేవాడు. అతన్ను ప్రమాదకరమైన వ్యక్తి. ఫాసిస్టుల జిత్తులన్నీ ఆయనకు కొట్టినపిండి. ప్రజాస్వామ్య సాంప్రదాయాన్ని బాగా ఆరగించిన అమెరికా ఎప్పుడైనా ఫాసిస్టు దేశంగామారిపోవడం సాధ్యమా అని ఆయనను ఎవ్వరో అడిగారు. "ఓ! సాధ్యమ్. అమెరికా ఫాసిస్టుదేశం అవుతుంది. కాని, అమెరికా ఫాసిజాన్ని, ఫాసిజానికి వ్యతిరేకమైన పేరు పెట్టిపిలవాలి" అని ఆయన సమాధానమిచ్చాడట. సామ్రాజ్యతత్వవిషయంలో కూడా అంతే. తగిన సామ్రాజ్య ప్రతికూల నినాదాలను సృష్టించి, అమెరికా ప్రజలను మోసము చేయవచ్చు. వారు ఉదార హృదయులేకాక, కపట మెరుగనివారు. ఏదైనా తేలిగ్గా నమ్మే సుస్వభావులు.

అయినా, అమెరికా తన శక్తిని సామ్రాజ్య విస్తరణకు ప్రయోగించుననే భావనకు అవకాశమిచ్చేముందు పైన చెప్పిన వాటికన్న గట్టిఆటంకాలు అనేకం ఉన్నాయని నా నమ్మకము. వాటిని కూడా ఆలోచించవలసి వున్నది. అమెరికా ఆర్థికఅభివృద్ధి స్థితినిబట్టిచూస్తే, ఆ దేశానికి సామ్రాజ్యవిస్తరణ అవసరమని తోచదు. 1870 సంవత్సరంనుండి 1914 వరకు ఆధునిక సామ్రాజ్యతత్వానికి లెనిన్ చేసిన రూప వర్ణనను నేను అంగీకరించానని ముందే చెప్పాను. అన్యదేశాలలో భారీఎత్తున పెట్టుబడులను పెట్టడం, అలా పెట్టినవాటిని పెంపొందించి రక్షించడం, సామ్రాజ్యతత్వమని లెనిన్ చేసిన అభివర్ణన తాత్పర్యం. కాని, అన్యదేశాలలో పెట్టుబడి పెట్టడం ముఖ్యమని నేడు అమెరికాలోని పెద్ద కంపెనీలు అనుకోవటంలేదు. స్వదేశంలోనే పెట్టుబడికి చాలా అవకాశం ఉన్నదని వారి అభిప్రాయం. దానికి కారణమేమిటని చెప్పాలంటే, ఆర్థికవిషయాలను చాలా దూరం తిరగవేయవలసి ఉంటుంది. అయినా క్లుప్తంగా చెప్పడానికి ప్రయత్నిస్తాను.

అమెరికా విస్తీర్ణమే దీనికి కొంతవరకు కారణము. కాని చాలావరకు 1930 సంవత్సరంలో "న్యూడీల్" క్రింద సాధించిన సాంఘిక సంస్కరణలు కారణమని నా అభిప్రాయము. అమెరికన్ ట్రేడ్‌యూనియన్‌లు, కర్షకులు, "న్యూడీల్" చేరి జాతీయ ఆదాయాన్ని పునఃపంపకం చేయించకపోయినా, జాతీయ ఆదాయము 1924 వ సంవత్సరములో ఉన్నంత తక్కువ స్థితిలోవున్నా, నాటి భాగ్యవంతులు నేడూ అంతటి భాగ్యవంతులుగావున్నా, బీదవారు అదే బీదస్థితిలో ఉంటూ ఉన్నా, స్వదేశంలోని వ్యాపారం అతి స్వల్పంగా ఉండేది. ఇతర దేశాలలో వ్యాపిస్తేనేగాని, అమెరికా ఆర్థిక నిర్మాణము సాగిపోయేదికాదు. కాని, న్యూడీల్ అమలు జరగడంవల్ల జాతీయాదాయ విభజన జరిగి, ఇతరదేశాలలో పెట్టుబడికి పరుగెత్తనవసరం లేకుండానే, అభివృద్ధి, స్థిరత్వం సిద్ధించినవి. అమెరికా వర్తక ప్రముఖులు కూడా ఇదే అభిప్రాయంలో ఉన్నారు. విదేశాలలో పెట్టుబడులు పెట్టవలసిన అవసరము, అభిలాష, వారికిలేవు. కాబట్టి సామ్రాజ్య తత్వమనేది వారి మనస్సులకు పట్టదు. తట్టదు.

ఇందుకు భిన్నంగా ఆలోచించేవర్గం ఒకటి వున్నది. అది నూనెపరిశ్రమకు చెందినవారివర్గము. అమెరికానూనె విలువలు చాలా వ్యయభారంతో కూడినవి. అందుకని అమెరికా నూనె కంపెనీలవారు అన్య దేశాలలో పెట్టుబడులను పెట్టాలని ఊగుతున్నారు. ఈ సందర్భంలో సాధారణంగా అంకురించే సామ్రాజ్యతత్వం కాస్త తలెత్తింది. అమెరికాప్రభుత్వాన్ని ఆమార్గం పట్టించాలని ఆ పరిశ్రమలవారు ప్రయత్నించారు. ఈ ఒకపరిశ్రమకు చెందినవారు మాత్రమే అలా ప్రయత్నించడం జరిగింది. వేరెవ్వరూ అలాంటి ధోరణిలోలేరు. అయితే కొన్ని ఇతరపరిశ్రమలు ఇలా ప్రవర్తించేవి లేకపోలేదు. యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ వున్నది. ఇది సెంట్రల్ అమెరికాలో సామ్రాజ్యతత్వానికి పేరు తెచ్చుకున్నది. అనేక సందర్భాలలో ఈ కంపెనీని అణచిపెట్టడం జరిగింది. ఇలాంటివన్నీ అక్కడక్కడా లేకపోలేదు. కాని, మొత్తంమీదచూస్తే ప్రధానమైన అమెరికన్ పారిశ్రామికులు స్వదేశంలోనే ముఖ్యంగా తమ కృషిని కేంద్రీకరిస్తున్నారన్నది సత్యం. అమెరికా సామ్రాజ్య వ్యాప్తికి అనేక అడ్డంకులువున్నాయనడానికి నేను తెలిపిన రెండవ కారణము మొదటిదానికన్న దృఢమైనది. మొదటిది కేవలము మనఃప్రవృత్తికి సంబంధించినది. ఈ రెండూకాక, మూడవది ఒకటి ఉన్నది. అది అన్నిటికన్న ముఖ్యమైనది. అది ఇది. ఒకవేళ అమెరికా గనుక నేడు ముందుకువచ్చి, తన ఆధిపత్యాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తే, 1870 వ సంవత్సరంతర్వాత పూర్వ సామ్రాజ్యదేశాలు ఎదుర్కొన్నదానికన్న ప్రబలమైన, ప్రాతికూల్యతను ఎదుర్కొనవలసి వస్తుంది. ఎనభై, తొంభై ఏళ్ల క్రింద, ఫ్రాంసు, బ్రిటన్, జర్మనీలు వలస రాజ్యాలను అతి సులువుగా స్థాపించగలగడానికి ఒకటే కారణం—ఆనాడు వెనుకబడిన ప్రాంతాలలో జాతీయభావము ఉత్పన్నము కాకపోవడమే. నేడు అలాకాదు. జాతీయత అనేది తీవ్రాతితీవ్రమైన శక్తి. ప్రజ్వరిల్లుతున్న మహాశక్తి. వెనుకబడిన ప్రతిదేశంలోను ఇది తాండవిస్తున్నది. ఈ స్వాతంత్ర్యవాంఛ స్వాభావికమయినది. క్రమమైనది. దానివల్ల కొత్త సమస్యలు రావచ్చు. కాని, అది అసలు నిర్దుష్టమైనది. ఏ దేశము కూడా మరొక దేశాన్ని పాలించడానికి తగదు. ప్రపంచమంతటా వెల్లివిరుస్తున్న ఈ జాతీయాభిమానము ఒక అమెరికాకేకాదు. మరెవ్వరికైనాసరే సామ్రాజ్యాన్ని స్థాపించడానికి ప్రబలనిరోధము అవుతుంది. అయినా కొత్తగా

మహత్తర పరివర్తనము - 1

స్వతంత్రులైనవారిని అమెరికా కనుక గట్టిగా తలుచుకుంటే సైనికంగా వారిని ఇట్టే అణచివేయగలదు.

ఇక నాలుగో అడ్డంకునుగురించి చెబుతాను. అది విచిత్రమైనది. అది ప్రపంచస్థితిని గురించి స్టాలిన్ చేసిన వక్ర వర్ణనలోఉన్న సూది మొనంతటి సత్యము. అతని వ్యాఖ్యానము అతిశయోక్తులపుట్ట. అయితే చిన్నదేశాలు, మధ్యతరగతి దేశాలు (ప్రస్తుతం ఇవి అగ్రదేశాలుగా పరిగణింపబడకపోవచ్చు. కాని, అవి బలీయమైనవి, ముఖ్యమైనవి కూడాను.) అమెరికా సామ్రాజ్య విస్తరణను అరికట్టే, ఎదిరించటానికి తోడ్పడుతాయి అన్న ఆయనమాట సత్యము.

అన్నీ చెప్పటము అయిపోయినది కాబట్టి చివరికి అయిదవ అడ్డంకును గురించి చెపుతున్నాను. అది అందరికీ ప్రత్యక్షంగా కనుపడేది. అది రెండు పెద్ద కమ్యూనిస్టు రాజ్యాల ఉనికి. అమెరికా కనుక క్రొత్త సామ్రాజ్యాన్ని సృష్టించ ప్రయత్నిస్తే, దానిని నిరోధించటానికి, మహా శక్తివంతమైన సోవియట్ రష్యా, అంత శక్తివంతము కానున్న చైనా ముందుకు వస్తాయనడానికి సందేహములేదు. ఇలా, ఒకటికిమించి రెండు, మూడు బలీయమైన దేశాలు ఉండటము మూలానే, చిన్న దేశాలూ, బలహీనదేశాలూ, నిలువడానికి సావకాశముంటోంది. పెద్ద దేశాలలో ఏ ఒక్కరూ కూడా అతిబలవంతులుకాకుండా ఈ చిన్న దేశాలవారు ఇరుపక్షాలవారితో మంచిగాఉంటూ, తటస్థంగా వ్యవహరిస్తూవచ్చారు. వారి తటస్థవైఖరి అగ్రరాజ్యాలవారికి నచ్చలేదు. తటస్థవిధానము దుష్ట విధానమన్నారు. అమెరికా మాజీ కార్యదర్శి కీ. శే. జాన్ ఫాస్టర్ డల్లెస్ అలాంటి అభిప్రాయమున్నవాడే. చరిత్ర పొడుగునా చిన్న దేశాలు, బలహీనదేశాలు ఇలా తటస్థంగాఉండే తమస్థితిని నిలువపెట్టుకో గలిగారు. వట్టి తెలివితక్కువవారు కాకపోతే తప్ప వేరే వైఖరిని అవలంబించియుండరు.

అమెరికా కనుక ఒకవేళ సామ్రాజ్యనిర్మాణానికి ఉపక్రమించినా, అది నల్లేరుపై బండి నడకలాగా సాగిపోతుందని అనుకోటం కేవలం తొందరపాటుతో కూడిన ఆలోచన అని, ఈ అయిదు కారణాలనుబట్టి అభిప్రాయపడుతున్నాను. అమెరికనులు "మంచివారా", "చెడ్డవారా" అన్నది అప్రస్తుతము. వారూ మనవంటివారే. వారు దేవతలూకారూ, దెయ్యాలూకారు. వారిసంఖ్య 18 కోట్లు. అనుకోని కొన్ని చరిత్ర సంఘటనలు వారికి అసాధారణ శక్తిని ప్రసాదించాయి. ఆ శక్తిని వారెలా వినియోగిస్తారనే మనం ఆలోచించటం అవసరం. ఉచితం. వారి స్వభావం ఎలాంటిదైనా, నేడున్న ఆటంకాలు కనక లేకపోయినట్లయితే సామ్రాజ్య నిర్మాణము తలపెట్టేవారుకాదని చెప్పను. కాని నేడున్న పెద్ద అవరోధాలమూలంగా, అమెరికా సామ్రాజ్యతత్వమనేది ఆవిర్భవించి, విస్తరించటానికి అవకాశం తక్కువ.

అయితే మరి మరో సామ్రాజ్యం అవతరించే అవకాశం ఉన్నదా లేదా? అంటే అమెరికాదికాకుండా రష్యాదికాని, చైనాదికాని సామ్రాజ్యం అవతరించడానికి అవకాశంఉన్నదా లేదా? ఇలాంటి ప్రశ్న వింటేనేకమ్యూనిస్టులకు,వారిఅభిమానులకు ఎక్కడలేనికోపతాపాలు వస్తాయి. కమ్యూనిస్టుల పరమశత్రువుగాని, కమ్యూనిజమంటే ఏమీ తెలియని మూఢుడుగాని ఇలాంటి ప్రశ్న వేయడని వారంటారు. "కమ్యూనిస్టు సమాజానికి" అసలు సామ్రాజ్యతత్వ భావనే కలగదని వారి వాదము. ఇది కమ్యూనిజమంటే లెనిన్ చేసిన నిర్వచనను అంటివచ్చినవాదము. స్వదేశీయులు, అన్యదేశాలలో పెట్టిన పెట్టుబడులనురక్షించి ప్రోత్సహించటం ఒకదేశ ప్రభుత్వ ప్రధాన వ్యాసంగ మవటమే సామ్రాజ్యతత్వ మవుతే, వారు చెప్పినది ఒప్పుకోవచ్చు. ఎందుకంటే, వారి పౌరులు విదేశాలతో వ్యాపారం చేయటానికి వీలులేదు. విదేశాలలో పెట్టుబడులను పెట్టటానికి వీలులేదు. కమ్యూనిజాన్ని కనుక ఇంత సంకుచితంగా నిర్వచించినట్లయితే, ఆ నిర్వచనం ప్రకారం రష్యానుగాని, చైనానుగాని, సామ్రాజ్య తత్వదేశాలు అనడానికి వీలులేదు. వారిలో ఆ లక్షణాలు ఎప్పుడూ పొడచూపవు. ఈ సిద్ధాంతాన్ని నేనూ నమ్ముతూఉండేవాణ్ణి. కాని గత 20 సం|| లలో వచ్చిన అనుభవం, ఇదిసరికాదని తేల్చిచూపినది. ఇతరరాజ్యాలకున్న సామ్రాజ్యనిర్మాణపు ఊహలే వారికీఉన్నవని, చైనా, రష్యాలు, చేసినవి చూచినపిమ్మట ఒప్పుకోక తప్పందికాదు. నేను అంతకుమించి చెప్పను. తమచుట్టూఉన్న చిన్నదేశాలను, బలహీన దేశాలను లొంగదీసి తమగుప్పిటలో ఉంచుకోవాలనే కాంక్ష ఇతర అగ్రరాజ్యాలకున్నట్లుగానే వారికీ ఉన్నది. దీనికి సాక్ష్యమేమిటని అడగవచ్చు. కావలసిన సాక్ష్యంలో చాలా భాగం రష్యానుంచి వచ్చింది. అక్కడ ఏర్పడిన కమ్యూనిస్టు సమాజం వయస్సులో పెద్దది. బాగా వ్యక్తిత్వము వచ్చినది. అంతేకాకుండా ఆదేశానికి పశ్చిమసరిహద్దులో చిన్నవైన బడుగు దేశాలు అనేకం ఉన్నాయి. అవి 16 సం|| లుగా రష్యాఆధిపత్యం క్రింద ఉన్నాయి. నేను ఐరోపీయుణ్ణి. ఆ ప్రాంతాలలో పర్యటించాను. స్వయంగా జరిగింది చూచాను. కాబట్టి ముఖ్యంగా ఆ ప్రాంతంగురించి మాట్లాడుతాను. ఈ ప్రాంతంలో మీకందరికీ చైనా ముఖ్యమని నాకు తెలుసు. చైనాగురించికూడా మాట్లాడుతాను కాని ఆ దేశాన్నిగురించి రష్యానుగురించి తెలిసినంతబాగా తెలియదు. అందుకని తరువాత కొద్దిగా మాట్లాడుతాను.

తూర్పుయూరపును రష్యా అతిస్వాభావికమైన పద్ధతిలో ఆక్రమించుకొన్నది. అయితే మనకు సంబం

ధించిన ప్రశ్న యిది. "వారిని అంటే తన ఉపగ్రహ రాజ్యాలను (వీరిని ఈ పేరున పిలవటం పరిపాటి అయిపోయింది) బండగా చెప్పాలంటే, తన వలసలను ఎలా చూస్తోంది"? కొంత కాలము అక్కడ ఏమి జరుగుతున్నదీ ఎవరికీ తెలియదు. అందువల్ల ఎవరూ ఏమీ చెప్పటానికి వీలు లేకపోయినది. (వారికి చాలా ఉదారంగా సహాయం చేశామని స్టాలిన్ వ్రాశారు). ఇలా ఉంటూండగా ఒకరోజున యుగోస్లావియాలో అమాంతం తిరుగుబాటు జరిగింది. తమ ఆర్థిక విధానాన్ని తమ సైనిక వ్యవహారాలను, రష్యనులు నిర్వహించటానికి వీలులేదన్నారు. యుగోస్లావియా సంపూర్ణస్వతంత్రదేశంగా ఉండ నిశ్చయించిన దన్నారు. ఇలా వారనేసరికి 1948 సం. లో మీకు జ్ఞాపకమే ఉంటుంది—కొండంత రభస లేచింది. కమ్యూనిజానికి, టిటో, నోట ఉచ్చరించరాని ద్రోహి అని స్టాలిన్ గర్జించాడు. దాంతో టిటో దిగివస్తాడని అనుకున్నాడు. ఇష్టం లేకనో, సాధ్యంకాకనో, మరి ఏ కారణాలవల్లనో కాని సైనిక శక్తిని ప్రయోగించలేదు. ఆయన మాటలు, యుగోస్లావియా కమ్యూనిస్టులను టిటోను విడదీయలేకపోయినవి. ఈవిధంగా యుగోస్లావియా స్వతంత్రమైన కమ్యూనిస్టు దేశంగా రూపొందింది. ఇది అపరూపమైన విచిత్ర పరిణామం. యుగోస్లావియా వ్యవహారాలను నేను ఎప్పుడూ అతిశ్రద్ధగా గమనిస్తూ వచ్చాను. అనేకసార్లు ఆదేశం వెళ్లివచ్చాను. ఆ కారణంగా యుగోస్లావియా ప్రజలు, ఏమనుకునేది నాకు తెలుసు. ఆ విషయమై నా కెలాంటి సందేహాలు లేవు. వా రనుకున్నది తప్పు కావచ్చు. ఒప్పు కావచ్చు. కాని రష్యనులు తమను నిర్దాక్షిణ్యంగా పీడించుకుతిన్నారని వారి నమ్మకము. యుగోస్లావియా ఆర్థికవిధానాన్ని నడపటానికి రష్యనులు ఉభయ దేశస్థులతో స్థాపించిన కంపెనీలు అన్యాయమైన వర్తకపు షరతుల మూలకంగా యుగోస్లావియా ఉత్పత్తిని సంపదను రష్యాకు తరలించుకుపోయారని వారి విశ్వాసము. యుగోస్లావియా సరుకులను చవుకధరకు తీసుకొని రష్యను సరకులను ప్రియమైన ధరకు అంటకట్టేవారు. సామ్రాజ్యాలు వలసరాజ్యాలను పీడించుకుతిన్నట్లు రష్యా తమను పీడించుకు తిన్నదని వారి వాదం.

ఈ నిందను ధృవపరచేవి 1956 సం. లో ఇంకా జరిగాయి. ఆ అక్టోబరు మాసంలో పోలెండు, రష్యాపైన తిరుగుబాటు చేసింది. అప్పుడు నేను (ఆ దేశ రాజధాని) వార్సాలో ఉండటము తటస్థించింది. ఉపన్యాసాలిచ్చే నిమిత్తం నన్నక్కడికి ఆహ్వానించగా వెళ్లాను. నేను అక్కడ కలిసికొన్నది, ప్రభుత్వానికి వ్యతిరేకులైన కమ్యూనిస్టులను కాదు. పోలిషు సెంట్రలు కమిటీ సభ్యులను కలిసికొన్నాను. వారు ప్రముఖులు. ప్రతిభావంతులైన కమ్యూనిస్టులు. కాబట్టి నాకు వచ్చిన సమాచారము కమ్యూనిస్టు వ్యతిరేకులనుంచి వచ్చిన దనటానికి వీలులేదు. తమ దేశాన్ని రష్యనులు దయారహితంగా పీడించుకు తిన్నారని వా రందరూ ఏకగ్రీవంగా చెప్పారు. ఇంతవరకు అనుభవించింది చాలనీ, రష్యను పీడను ఇహ సహించమనీ, స్వతంత్రులము కాబోతున్నామని చెప్పారు. తమకు జరిగిన అన్యాయాన్ని రుజువుచేయటానికి అనేక రకాల లెక్కలను చూపెట్టారు. అంతర్జాతీయంగా బొగ్గు ధర టన్ను 1 కి 20 డాలర్లు అవుతే, రష్యా ఒక డాలరు చొప్పున ఇచ్చేది. తమకు జరిగిన అన్యాయాన్ని కొంత అతిశయోక్తితో చెప్పియుండవచ్చు. ఒకరిని చిన్నబుచ్చాలని కాదు. సాధారణంగా, వలసరాజ్యాలవారు తమకు జరిగిన అన్యాయాలను కొన్ని అతిశయోక్తులతో చెప్పటం పరిపాటి. వలసదేశప్రజల భావన ఎలా ఉన్నదో వారిదీ అలాగే యున్నది. సామ్రాజ్య దేశంపట్ల ఉండే హేయభావమంతా వీరికి రష్యాపైని పెరిగింది.

శ్రీ గోముల్కాను నాయకునిగా ఎన్నుకోమని సెంట్రలు కమిటీని పోలిషుప్రజలు ఆదేశించినరోజు లవి. వాతావరణం అంతా ఉద్రేకంతో నిండిఉన్నది. అప్పుడు నే నక్కడ ఉన్నాను. నటాలిన్ వర్గమువారు రష్యా ఏజెంట్లని వారి అనుమానము. అందుకని వారిని త్రోసివేయమన్నారు. జనరల్ రకోవస్కీ రష్యనులు నియమించిన సేనాధిపతి. అతన్ని తొలగించటం అన్నిటికన్న ముఖ్యమన్నారు. సైన్యాన్ని తమ అధీనం చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చారు. అప్పుడు కాని స్వతంత్రులము కాము అనుకున్నారు. నే నిందాక చెప్పినట్లు వాతావరణం ఉద్రిక్తంగా ఉన్నది. ఒకరోజు అర్ధరాత్రి వార్సాలో ఒక పెద్ద విమానం దిగింది. ఆ విమానంలోంచి కృశ్చేవ్, మార్షల్ కోనివ్ మరి ఎనమండుగురు రష్యను ప్రభుత్వ ఉన్నతాధికారులు, రష్యను సైనిక అధికారబృందము దిగారు. సరాసరి పోలిషు కమ్యూనిస్టుపార్టీ సమావేశం సాగుతున్నచోటుకు వెళ్లారు. వారిని బుద్ధితెచ్చుకోమని హెచ్చరించారు. వారు తొణకక, బెణకక అతి ధైర్యంగా నిలబడి యిలా చెప్పారు. "అలా మాట్లాడితే లాభంలేదు. మీరు వెళ్లిపోండి. మీరు వెళ్లిపోతేనేగాని మళ్లీ యీ విషయం చర్చించను కూడా చర్చించము. అసలు యీ సమావేశాన్నే ఆపివేస్తాము. మీరు విమానంమీద తిరిగి రష్యాకు వెళితేగాని మేమిక్కడ చర్చలు కూడా సాగించము."

అదేరాత్రి నేను ఉపన్యాసం ఇవ్వాలని ఏర్పాటుచేశారు. సెంట్రలుకమిటీసభ్యుడు ఒకరు నాకు ఇలా చెప్పారు.

మహత్తర పరివర్తనము-IV

"ఇవాళ రాత్రి మేము మీ ఉపన్యాసానికి రాలేము. మా సభ చాలాసేపు జరుగుతుంది. మేము అంతసేపూ అక్కడ ఉండి తీరాలి". అయితే తీరా నేను సభావేదికమీద నిలబడితినిగదా ఆయన కూడా సభికులలో కనుపించారు. నా కపుడు కారణం తెలియలేదు. ఉపన్యాసం అయినతరువాత వారు జరిగినది చెప్పారు. రష్యనులు తిరిగి విమానం ఎక్కి వెళ్లిపోయేదాకా తమ సమావేశం సాగించదలచలేదని, అందుకని సమావేశం ఆపివేసి, వ్యవధిని ఉపన్యాసం వింటూ గడపవచ్చుని ఇలా వచ్చామని అన్నారు.

చివరికి రష్యనులు విమానమెక్కి మాస్కోకు వెళ్లారు. పోలిషువారికి కోరినదంతా రాలేదు. రాజీపడ్డారు. రాజీ పడటం చాలా మంచిదని నా ఉద్దేశం. వారు వార్సా ఒప్పందంనుండి విడిపోలేదు. రష్యా సైన్యాలను పోలెండు నుండి పంపివేయలేదు. పరిమితమైన స్వాతంత్ర్యాన్ని అంగీక రించవలసి వచ్చినది. ఆర్థికస్వాతంత్ర్యంకోసం అది అంగీక రించారు. అది మంచిదనే నా అభిప్రాయం. రష్యనులు ఏ నిర్ణయానికీ రాకపోయినా, అప్పటికే రెండు రష్యను సైనిక దళాలు వార్సాపైకి నడుస్తున్నాయి. నగరపు సివారులలో మూడు పోలిషు దళాలు వారిని అటకాయిస్తున్నాయి. వీధు లలో పోయేపోయే ట్రాముబళ్లు, పట్టాలు తప్పిన మోత విన బడేసరికి, తుపాకులు ప్రేలటం మొదలయిందని నేనూ నా భార్య నిద్రనుండి ఉలిక్కిపడి లేచేవాళ్లము. అయితే యుద్ధం రాలేదు. పోలెండు రాజీ ప్రతిపాదనలు ఒప్పుకున్నది. బలీయమైన ఒక దేశము, తమను అన్యాయంగా పీడించుకు తింటున్నదని, దాని గుప్పిటనుండి బయటపడాలనే వాంఛ, ఆ వారం వార్సాలో ఉన్న ప్రతివారికి ప్రతివారిలోను గోచరించేది.

ఆ మరుసటివారమే హంగరీ విషాదగాథ జరిగినది. స్వయంగా నేను మాత్రం జరిగినదానిని చూడలేదు. అందు కని మీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు. అయితే ఒక విషయం మీరుఆలోచించాలి. ఆ తిరుగుబాటు అక్కడి కార్మికులదీ, కర్షకులదీ కాదనీ, అదేదో అమెరికా, బ్రిటను ఇతర పశ్చిమదేశాల ప్రచారకులు, ఆయుధాలు సరఫరాచేసి లేవతీసినదనీ కమ్యూనిస్టులు చెప్పిన కథను మనము డజనుసార్లు వినిఉన్నాము. ఈ రాజ్యాలు రేడియోప్రచారం చేస్తున్నమాట నిజము. ఈ దేశప్రతినిధులు కూడా కొందరు ఆ సమ యంలో హంగరీలో ఉన్నారు. కొద్దిపాటి ఆయుధాలను చేర వేయటం జరిగితే జరిగియుండవచ్చు.

ఇదంతా జరిగిందని అంగీకరించినా, కమ్యూనిస్టులు వడ్డించే కథ మింగుడుపడదు. అసలు జరిగిన కథ ఏమిటి? నాలుగురోజులు బుడాపెస్టులో పెద్ద ఎత్తున పోరాటం జరిగింది. దేశమంతటా అనేకవారాలు తీవ్రమైన గెరిల్లా యుద్ధం సాగింది. ప్రజలలోనూ, కార్మికవర్గాలలోనూ, ఈ ఉద్యమం పెద్ద ఎత్తున వ్యాపించినదన్నమాట. ఫ్యాక్టరీలలో పనివారు చేస్తూ చేస్తూన్న పనులు వదిలివేసి, టాంకులను, తదితర ఆధునిక సైనికశ్రేణిని, నిలబడి ఎదుర్కొన్నారు. ఇదంతా బయటి ఏజంట్ల పని అంటే, వారి శక్తిని నిజంగా పెద్దచేయటమే. అధ్యక్షా! మీరూ, నేనూ ప్రచారం చేసిన వారమే. అలజడిని సాగించినవారమే. వాటి శక్తి ఎంతటిదో మనకు తెలుసు. అన్యులకట్టడినుండి బయటపడవలెననే తీవ్రవాంఛ యుండి, దానికోసం పోట్లాడసిద్ధంగా ఉంటేనే తప్ప, ఒక దేశం యావత్తు ప్రజచేత తిరుగుబాటు చేయించ గలగటం, అసాధ్యం అని అనుభవమున్న ప్రతివ్యక్తికీ తెలుసు.

తాము అతి దురన్యాయానికి గురి అయినామనుకున్న ప్రజల తిరుగుబాటు, హంగరీ విషాదగాథ. దానికి సందేహం లేదు. పోలెండు మోస్తరు, తాము కూడా ఒక రాజీని సాధించటానికి ప్రయత్నించవలసినది. అలా చేయకపోవటం హంగేరియనులది శుద్ధతెలివితక్కువ. అది ఎలా ఉన్నా, ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటె, రష్యా సామ్రాజ్యంలో తాము కేవలం వలసరాజ్యాలుగా ఉన్నామనే ఈ రెండు తూర్పు దేశాలు భావించాయి. ఇతర సామ్రాజ్యాలు వ్యవహరించి నట్లే కమ్యూనిస్టులూ వ్యవహరిస్తారనేది రుజువైనది. వీరిది ఇతర సామ్రాజ్యాలకన్న చెడ్డది అని చెప్పను. రష్యనులు హంగేరియనుల తిరుగుబాటు అణచటం పశ్చిమ రాజ్యాలు చేసిన చాలావాటికన్నా హీనమైనది కాదు. అంతకంటె మంచిగా మాత్రము లేదని మాత్రమే నేను చెప్పేది. అసలు సమస్య యిది : సోషలిస్టుసంఘం ఇలా వ్యవహరించటం అనేది, అసాధ్యమని కమ్యూనిస్టుల వాదానికి మూలాధారం. ఆయా సమయాలలో, ఆయా ప్రాంతాలలో బ్రిటను వ్యవహరించి నట్లే, సమయం వచ్చేసరికి రష్యాకూడా అలాగే వ్యవహ రించింది. ఏమాట కామాట చెప్పాలి. బుడాపెస్టుకు టాంకులను పంపటానికి రష్యనులు చాలా తటపటాయించారు. వారికి అంతగా ఇష్టం లేకపోయినా, తిరుగుబాటుయొక్క తీవ్రతను చూచి పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం కనపడేసరికి "ఘట్టిగా వ్యవహరించా" లనే వారి వర్గానిది పైచేయి అయినట్లుంది. (సామ్రాజ్యవాదులు ఇదే "ఘట్టిగా వ్యవహ రించాలి" అనే పదాన్ని వాడేవారు). తిరుగుబాటును ఒక దెబ్బన అణచిపారేశారు.

మళ్లీ నేను మొదట్లో చెప్పినవిషయానికే వస్తు న్నాను. కమ్యూనిస్టులు ఆశించిన "వ్యాపారమంతా" భగ

మైనదని కాదు. పడిపోయినదని కాదు. కాని "మా దేశం" అని అనుకొనే మరొక పారిశ్రామికదేశాన్ని అవతరింప జేసింది. "మా దేశం" అనుకొనే ఇతర దేశాలకన్న ఇది ఏమీ గొప్పగా వ్యవహరించలేదు. ఇది బ్రహ్మాండమైన కనువిప్పు.

చైనానుగురించి ఆశ్చే చెప్పడానికి నాకు వ్యవధి లేదు. చైనా కూడా సామ్రాజ్య వైఖరిని అవలంబించగలదన డానికి టిబెట్ ఆక్రమణ నిదర్శనం. ఈ ఆక్రమణ అతి స్వాభావికమైనదని నా అభిప్రాయము. చైనా ఐక్యంగాను, బలంగాను ఉన్నప్పుడల్లా టిబెట్పైన తన ఆధిపత్యాన్ని చెలా యిస్తూ వచ్చింది. కాని ఒక తిరుగుబాటును సృష్టించి, దళైలామాను తరిమివేసి, చైనా జీవితపద్ధతిని బల వంతంగా అంటగట్టడం చూస్తే, వారి సద్భావంగురించి నమ్మకం చిక్కడంలేదు. టిబెట్లో ఉన్న ఫ్యూడల్ విధా నము ఈ రోజుల్లో ఉండవలసినదికాదు. దాని చావుకు ఎవ్వరో ఒకరు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. కాని టిబెట్ ప్రజానీకంలో చాలామందికి కోపోద్రేకాలు కలి గించి, ప్రతిఘటించే పరిస్థితిని తెచ్చిపెట్టే పద్ధతిలో చేయడం అవసరమా ? అయితే ఇది సాటిలేని దారుణ కృత్యమని నేను అనను. ఇదే విషయమై పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు ఇతర పెద్దరాజ్యాల నడతకన్న చైనా నడత ఏమైనా ఘనంగా ఉన్నదా అనే నేను అడుగుతున్నది ? టిబెట్నుండి ఇంకా కాస్త ముందుకుపోయి భారత సరి హద్దును భగ్నపరచడం, ఆ ప్రాంతంలో చైనా తీసుకున్న సామ్రాజ్యచర్యకు ముక్తాయింపులాంటిది. ఒకవిధంగా ఇది పెద్ద నేరం కాకపోవచ్చు. మంచుతో నిండిన ఆ ప్రదేశం నివాసయోగ్యంకాదు. దేనికీ పనికిరాదు.

కమ్యూనిస్టేతరదేశాలలో అందరికన్నా కూడా భారత దేశానికే చైనా అంటే ఎక్కువ స్నేహభావం ఉండేది. ఐక్య రాజ్యసమితిలో చైనాను సమర్థించి, సభ్యత్వ మివ్వాలని భారత దేశమే ఎప్పుడూ ప్రతిపాదించింది. పంచశీలసూత్ర ప్రకా రము ఒప్పందము చేసుకున్నది. అలాంటి భారతదేశాన్ని మిత్ర వైఖరినుండి శత్రువైఖరి వహించేటట్టు చేయడం, పశ్చిమ రాజ్యాలు చేసినంత తప్పు కాదంటారా ? ఇది చేయదగినదేనా ? భారతదేశం వెళ్లినవారికి ఈ విషయము తెలియకమానదు. చైనా ప్రభుత్వం తెలివితక్కువప్రజ్ఞకు ఈ చర్య పెద్ద నిదర్శనము ! నేను ఈ విషయాన్నే నెహ్రూతో చర్చించాను. ఎప్పుడూ ఆయనకు ఉండే సహనభావం, దూరదృష్టి, మిత వాదితనం ఈ సందర్భంలో కూడా చూపెట్టారు. చైనా ఆక్రమణను ఆయన ఒప్పుకుంటారని మీరు అనుకో బోకండి. అలా చేయరని నాకు గట్టిగా తెలుసు. ఒకవేళ ఆయన అలా చేయదలచినా భారత ప్రజాభిప్రాయము ఎదురై, చేయనీయదు. చైనాముందుకు త్రోసుకొని రావడం, వారికి చాలా ఆందోళన కలిగిస్తున్నది. ఏమైనాసరే వారిని అరికట్టాలనే కృతనిశ్చయానికి భారతదేశం వచ్చింది. సామ్రాజ్య దేశాలు అనేకసార్లు వ్యవహరించినట్లుగానే, చైనా కూడా వ్యవహరించగలదని వ్యక్తమైనది.

రష్యాదిగాని, చైనాది గాని సామ్రాజ్యాలు అవతరించ డానికి గల అవకాశాలనుగురించి నా అభిప్రాయ మేమిటని చివరికి మీరు అడుగుతారు. అలాంటిది జరగదనుకుంటాను. రష్యనుల, చైనీయుల మంచి చెడ్డలతో దీనికి సంబంధం లేదు. నేడు ప్రతివారికి జాతీయస్వాతంత్ర్యవాంఛ చాలా తీవ్రంగా ఉన్నది. ఇది అన్నిటికన్నా శక్తివంతమైనది. కమ్యూ నిస్టు రాజ్యాలు తమరాజ్యాన్ని విస్తరించి అన్యదేశాలమీద ఆధిపత్యం చెలాయించదలిస్తే, జాతీయ స్వాతంత్ర్యశక్తిని ఎదుర్కొనవలసి ఉంటుంది. ఈ శక్తి పెద్ద అవరోధముగా నిలుస్తుంది. వీరికి, అమెరికాకు ఒక విషయంలో సాపత్యం ఉన్నది. రష్యా, చైనాల కమ్యూనిస్టు సాంప్రదాయము, సామ్రాజ్య ప్రాతికూల్యతతో కూడినది. సామ్రాజ్య నిర్మాణానికి ప్రయ త్నిస్తున్నామని అమెరికనుల మోస్తరే వారికీ అనిపించదు. అలా తమ మనస్సులో అనుకోటం కూడా గిట్టదు. వీరి రాజ్యవిస్తరణకు ఒక తరగతి రాజ్యశ్రేణి ఖచ్చితంగా ఎదురు బారులు తీరుస్తారు. జాతీయాభిమానము గల స్వతంత్ర దేశ ములు ఎదిరి పక్షంవారు అవుతారు. పశ్చిమంలో తమకు ప్రతి కక్షిగా నిలిచిన దేశము ఎదిరించడం తథ్యము. తమ స్వాతం త్ర్యాన్ని నిలబెట్టుకోదలచిన చిన్నదేశాలు వారివైపు మొగ్గు తాయి. అమెరికానుంచే ప్రమాదం వస్తే, రష్యా, చైనాల వేపు మొగ్గుతాయి. రష్యా, చైనాలనుండి వస్తే పశ్చిమ రాజ్యాలవైపు మొగ్గుతాయి.

అందుకనే, నా ఉపన్యాసాన్ని ఆశాజనకమైన స్వరము తోనే ముగిస్తాను. ఆగ్నేయ ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ప్రజలు, అభివృద్ధిచెందని ప్రాంతపు ప్రజలు— వీరినే అప్పుడప్పుడు తటస్థ ప్రాంతప్రజలు అంటారు— తమ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోడానికి పరిస్థితులు చెడుగా లేవనుకోవచ్చు. అయితే దీనికి తగినట్లు సాధన కూడా ఉండాలి. తొందరపడక, జాగ్రత్తగా, గట్టిగా వ్యవహరించే ప్రభుత్వాలు ఉండడం కూడా అవసరము. ఇలాంటి ప్రభు త్వాలు ఉండడం వీరికే కాదు. ప్రతి ఒక్కదేశానికి అవ సరమే. అయితే ఎల్లప్పుడూ అవి రావు. కాని వాటి అవ సరం అవసరమే.

ద ర స్మి త ము

శ్రీ టి. బి. యం. అయ్యవారు

పసితనంపు లేఁదీవియపైన-సొగసు
కుప్పగా విచ్చిన లతాంత గుచ్ఛమీవు
ఎపుడు ననువీడి రాలిపోయితివో! కాని
బ్రతుకు బ్రతుకంతయును మ్రోడువడియె నకట!

నా యధరాంబరాంచలము
నన్ వలపింపుల చంద్రరేఖవై
ప్రేయసుః నన్-సుధామయ మ
రీచుల వెల్లువ పొంగ జేసినా
నీ యెద-నీవు పాసి చన
నేమిక యున్నది-దీర్ఘ వేదనా
ధ్యాయములన్-కఠోర జల
దాకృతి నేడ్చుట తక్క దర్శలన్

ప్రతిపదము నిన్ను కడు బలవంతపఱిచి
తీసుకొనిరాఁ బ్రయత్నింతు-తెలివిమాలి-
కట్ట! నా భయదాకృతిఁగాంచి భీతి
పాఱిపోయెదవా! పసిపాపయట్లు.

లౌకిక చింతలన్నియు-చ
లమ్మున జుంజురు పల్ల వెండ్రుకల్
భీకరభంగి విప్పుకొని
ప్రేల నిశాచరులట్లు-జీవితా
నోకహాశాఖలన్-నిను క
నుంగొన జాలు నదృష్టలక్ష్మి యే
లా కలుగున్?-సహస్రజన
నాంతర పుణ్య పయోదశంపయై.

భాగధేయ డోలాపరిభ్రంశజాత
వేదనోష్మ ధచ్ఛట వేగు వేళ-
నెక్కటిని ప్రాణవాయువు లెగయునప్పు
డస్మదాస్యమ్ముపై-నాట్యమాడగదవె!

కర్ణాటక సంగీత త్రిమూర్తులలో బ్రహ్మ - శ్రీ శ్యామశాస్త్రి

శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

కర్ణాటక సంగీతమునకు ముగ్గురు వాగ్గేయకారకులు చాల ముఖ్యులు. మహావిద్వాంసులు తంజావూరులో వెలసిన రోజులవి. క్రీ. శ. 1775 నుండి 1850 వరకు తంజావూరి పరిసరము లందు 'ఎందరో మహానుభావులు' దైవాంశ సంభూతులు ఉద్భవించిరి. పల్లవి గోపాలయ్యరు, దొరసామయ్యరు, శొంఠి వెంకటసుబ్బయ్య, రమణయ్య, పచ్చిమిరియం ఆది అప్పయ్య ఇంకా పలువురు సంగీత విద్యను ఉపాసించిరి. దేవుడే నాద రూపుడయి అవతరించెనని చెప్పవచ్చును. ఆ సమయమునందే యూరపుఖండమునందు పాశ్చాత్య సంగీతమునకు అనన్య సామాన్య మయిన నాదసృష్టిని చేకూర్చిన మహనీయులు కూడ వెలసి రన్నది గమనించతగిన అంశము. అట్టివారు బీథోవెన్, మోజార్ట్, మెండెల్సన్, ఛోపిన్, వీబర్, షూబర్ట్ మొదలైనవారు. తంజావూరికి సుమారుముప్పదిమయిళ్లదూరముననున్న జంక్షన్-తిరువాలూరు. ఇందుత్యాగరాజస్వామి పేరిట గొప్ప ఆలయమున్నది. 'జననాత్కమలాలయే' అన్నారు. ఈ యూర జన్మించినచాలు— అదే ముక్తినిచ్చునన్న లోకోక్తి కలదు. ఆ పుణ్యక్షేత్రమునందు కర్ణాటక సంగీతమునకు త్రిమూర్తులయివెలసిన శ్యామశాస్త్రి (1763—1827), త్యాగరాజు (1759—1847) ముత్తుస్వామి దీక్షితులు ముగ్గురునూ జనన మొందిరి.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనుబోలిన శ్యామశాస్త్రి, త్యాగరాజు, దీక్షితుల వారి మహాత్మ్యము దైవికమయినది. వారు కర్ణాటక సంగీతమును అత్యుత్కృష్టదశకు దెచ్చిరి. అంతకు పూర్వముగాని, అటుతరువాతగాని అంతటి నాద సృష్టి జరుగ లేదు. ఈ ముగ్గురునూ పరబ్రహ్మ రూపాంతరములా అన్నట్లు అనేక రీతుల పోలియుండుట గమనించతగినది. ప్రొఫెసర్ సాంబమూర్తిగారు "Samasatry and other Composers" అన్న తమ గ్రంథమునందు సూచించిన విషయములను పాఠకులకు జ్ఞాపకపరుచుచున్నాను. "ఆ ముగ్గురునూ జన్మాంతర వాసనా మహిమతో అద్భుతమయిన గంధర్వ అంశముతో జన్మించిరి. వాగ్గేయకారుల లక్షణములు, అధికారము, అర్హతలు ముగ్గురికీ వర్తించియుండెను. రాగస్వరూపము ప్రస్ఫుటీకరించు రచనలు వారి కీర్తనలు. రాగ సంపదతో, భాషలోని అంద చందములతో శాశ్వతముగా నిలచు కీర్తనలు. ప్రాతబడుట లేక



కొత్త కొత్త వైఖరులతో ఎప్పటికినీ నూతనత్వమును వహించి మెరయునట్టివి వారి కీర్తనలు. రాగస్వరూపము వారికి సహజముగా అమరిపోయినది. ప్రసిద్ధరాగములందు అపూర్వరాగము లందు అనేక కీర్తనలను చేసిరి. భావపూరితములయి, ఆత్మానందమునిచ్చు నాదపుష్టితో, దేవుని దరిజేర్చు అప్రాకృతమయిన అనుభవములనిచ్చునవి వీరి రాగ రచనలు. వేద వేదాంత శాస్త్ర గ్రంథములను చదివి, సంస్కృతాంధ్ర భాషలయందు

కర్ణాటకసంగీత త్రిమూర్తులలో బ్రహ్మ - శ్రీ శ్యామశాస్త్రి

ప్రౌఢమయిన పాండిత్యమునుకూడ గడించుకున్నవారు. జ్యోతిశ్శాస్త్రము, మన్త్రశాస్త్రములు వారికి హస్తగతములు. పుట్టినది ఒకే ఊర. పెరిగినది తంజావూరిలో, తిరువయ్యారులో. ముగ్గురూ సమకాలీనులు. ఇక వారి గురువులా మంత్రసిద్ధిని పొందిన మహాపురుషులు. నారదులు త్యాగయ్యకు స్వరార్ణవము నిచ్చిరని ప్రతీతి. శ్యామశాస్త్రి గురువులు చిదంబరనాథయోగి. దీక్షితుల గురువులు 'సంగీతస్వాములు' అను యతీంద్రులు. దేవుని ఆదేశమున అవతరించి భగవత్సాక్షాత్కారమును పొందిన వారు, వారు. ముగ్గురూ ప్రత్యేకమయిన విశిష్టతగల శైలిలో రచించిరి. వారి కీర్తనలకు మెరుగునివ్వడము కలలోనివార్త. పల్లవిలో రాగము ముఖమిదియని తెల్పు కీర్తనలు వారివి. అట్టివి వందలు, వేలుగా రచించిరి. నాదవిద్య మర్మములను ఎరిగి 'నిజ సంగీతము'ను ప్రపంచమునకు అందజేసి, ముక్తిమార్గమునకు సోపానములగు, భక్తిరస పూరితములగు వారి కీర్తనలు ప్రజలలో జ్ఞాన, భక్తి, వైరాగ్యములను వ్యాపింపచేసినవి. అపరోక్ష జ్ఞానమొంది, త్యాగశీలురై, నియమనిష్ఠలతో జీవనము గడిపి, జీవన్ముక్తులయి, 'యోగేనాంతేతనుత్యజాం'అన్నట్లు అవసాన సమయము సమీపించినదని తెలుసుకొని శిష్యులకు తెలిపి, బ్రహ్మస్వరూపమును ధ్యానించుచూ,తప్పక ముక్తినొందురీతిని మరణమొందిరి.'' ఇన్ని సామాన్య మహిమా విశేషములుగల ముగ్గురు మహనీయులను కన్న తిరువాలూరు పుణ్యభూమి యగుటలో ఆశ్చర్య మేమున్నది!

శ్యామశాస్త్రులవారు ముగ్గురిలోనూ వయోవృద్ధులు. ఈ వాగ్గేయకారుల చరిత్రలను క్లుప్తముగా మనకు అందజేసిన వారు సుబ్బరామ దీక్షితులవారు. వారి తరువాత ప్రొఫెసర్ సాంబమూర్తిగారు. ఈ కీర్తనలను రచించిన సందర్భములు, ఆ గాయకు లెట్టి మనోవృత్తిని గలిగియుండిరి, వారికారోజులలో ఏ ఏ మూలవస్తువులు లభ్యములయినవి, వారా వస్తువులనుండి తమ అపూర్వ కీర్తన లెట్లు రచించి రన్న విషయములు తెలుసుకోవడము చాల ముఖ్యము. కాని, పుక్కిటిపురాణములు, సంగీతమునకు ఉపకరించని దైనందిన వ్యవహారములు తెలుసుకొన్నందున ప్రయోజనము బహుస్వల్పము. బొబ్బిలి కేశవయ్య 'భూలోక చాప చుట్టి' యని ఖ్యాతిపడసి, అనేక సంస్థానములందలి విద్వాంసులను, సంగీత విద్యలో ఓడించి వారి తంబూరలను, ఘంటా కంకణములను బండ్లలో నుంచుకొని అపరిమితమయిన అట్టహాసముతో తంజావూరికి వచ్చెనట. రావణ సంహారమునకు మహావిష్ణువే నరాకృతి పొందినట్లు బ్రహ్మమూర్తులు శ్యామశాస్త్రులు వీరికి పోటీ నిలువవలసి వచ్చెననుటచే కేశవయ్య విద్వత్తు తేటతెల్లమగుచున్నది. తానమునందును, తాళముల అమరికలందును అసాధారణప్రజ్ఞగల బొబ్బిలి కేశవయ్య బుద్ధి చమత్కృతులు శాస్త్రిగారి దైవబలము ఎదుట ఆగలేదు. శాస్త్రులవారే రాత్రంతయు, బంగారు కామాక్షమ్మను పూజించి తయారు కావలసి వచ్చెనట. శరభనందన తాళములోని గొడవలలో కేశవయ్యకు వెనుకంజపడినది. అటు తరువాత శాస్త్రిగారే కేశవయ్య తానవైఖరులను కొనియాడిరట. నిజముగా సంగీతములో పోటీకి తావులేదుకదా! ఎవరి గొప్ప వారిది. బొబ్బిలి కేశవయ్య తానపు పంథా అతి విశిష్టమయినదని తంజావూరురాజులు వారి నచ్చటనే నిలుపుకొని ఘనం క్రిష్ణయ్యరు మొదలగువారిని కేశవయ్యగారివద్ద విద్యాభ్యాసమునకు ఏర్పాటు చేసిరట. 'ఆంధ్రుల తానవైఖరి నాకు చాల ఇష్టము. సంగమేశ్వరశాస్త్రి గారు, ద్వారం వెంకటస్వామినాయుడుగారు తానపద్ధతిని పరిపూర్ణముగా సాధించిన ధీరులు. ఇది కేశవయ్య రోజులనుండీ జరుగుతున్న విశిష్టత' అని తంజావూరు పొన్నయ్యపిళ్లేగారు నాతో చెప్పెడివారు. ఇట్టి కథలతో మనకు కొంత వేడుక కలుగవచ్చును. ప్రయోజనము అతిస్వల్పము. సంప్రదాయ ప్రదర్శినిలోని ముక్కలను పాఠకులకు మరొకసారి తెలుపుకొనుచున్నాను. ''శ్యామశాస్త్రులు శ్రీ కాంచి కామాక్షీదేవి యుత్సవమూర్తియయిన శ్రీ బంగారు కామాక్షీదేవి దుష్ట తురకల కలహములవలన పూజకులును, ద్రావిడ బ్రాహ్మణులలో జౌత్తరులునునైన కొన్ని సంస్థానీకులతో వెడలి, శ్రీపురమను తిరువారూరి క్షేత్రమునకువచ్చి, రమారమి ముప్పదియయిదు సంవత్సరములవరకు తంజపురి రాజులవలన నేర్పరుపబడిన పూజోపచారాదుల నంగీకరించుకొనియున్నపుడు ఈ శ్యామాశాస్త్రుల తల్లిదండ్రులు శ్రీ కామాక్షిని అత్యంత భక్తితో పూజించుకొనియుండుటయగాక, తమకు పుత్రుడు లేనందున ప్రతిమాసమునందును, కడపటి స్థిరవారములో వేంకటాచలపతికి ప్రీతిగా బ్రాహ్మణ సంతర్పణలు నడిపించుకొనివచ్చునపుడు, ఒక స్థిరవార బ్రాహ్మణ సంతర్పణ నడచుచో, నొక ముదుసలి బ్రాహ్మణునిమీద వేంకటాచలపతి యావేశించి '' ఓ దంపతులారా! మీకు ఒక సంవత్సరములోపల యశోవంతుడయిన యొక పుత్రుడు గలుగు''నని చెప్పినట్లే, ఇతనితల్లి గర్భవతియయి పదినెలలుండినతోడనే శకాబ్దము 1685, క్రీ. శ. 1763 చిత్రభాను సంవత్సర మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరము అను తిరువారూరిలో ఈ శ్యామాశాస్త్రులు జన్మించెను. కర్నూలుజిల్లాలోని కంభములో శ్యామశాస్త్రుల పితామహులుండిరి. మహమ్మదీయుల దండయాత్రలకు బెదిరి, కంచిక్షేత్రం చేరుకొనిరి. ఆది శంకరుల కరార్చితమగు బంగారు కామాక్షి విగ్రహము వారికి లభించినది. అక్కడనూ రక్షణ చాలక, తంజావూరుజిల్లాలోని తిరువాలూరు చేరుకున్నారు శాస్త్రులవారి పితామహులు. అనేక అగ్రహారములు, రాజ సపర్యలుగల కుటుం

బములో పుట్టిన శాస్త్రిగారికి పేదరికము ఏమిటో తెలియదు. మంచిభోక్త. ఆత్మకింపయిన భోజనము, తాంబూలరసాస్వాదన వీరికి చాల ఇష్టము. తమ కష్ట సుఖములను దెలుపు కీర్తనలు, లేక దైన్యరసప్రధానములగు భక్తిపిలుపులు వీరియందు కానరావు. ఇతనికి నాదము ఆత్మానందముకొరకు ఉపాసించి సాధించిన వస్తువు. ఇతని కీర్తనలందు ఉల్లాసము, ఉత్సాహము, తాళ ప్రదర్శనవలన చేకూరు చురుకుదనము గమనించి తీరవలసిన గుణములు.

శ్యామశాస్త్రిని గురించి ఇంకా ఇలా వ్రాసినారు సుబ్బరామ దీక్షితులు. "ఇతడు బాల్యమందే సంస్కృతాంధ్ర భాషలలో మహా ప్రౌఢుడయి, బంగారు కామాక్షితో తంజావూరికి వచ్చి, తన బంధువులలో (మేనమామ) ఒకరివద్ద సరళి మొదలు స్వరజ్ఞానమువరకు నేర్చుకొనెను. అంతలో శ్రీవిద్యా పరమానుగ్రహమందెను. ఇతని భాగ్య విశేషమువలన ఉత్తరదేశమునుండి సంగీతస్వాములని సంగీత విద్యాపారంగతుడయిన యొక యతీంద్రుడువచ్చి, ఇతనిని అంతేవాసిగా గైకొని మూడు సంవత్సరముల పర్యంతము సంగీత లక్ష్య లక్షణ మర్మములన్నియు క్రమముగా నభ్యసించి, ఇతని గాన సామర్థ్యముల నెరింగి, మిక్కిలి యశోవంతుడవౌదువని అనుగ్రహించి, ఆది అప్పయ్య పాటను కొన్ని దినములు వినుమనిచెప్పి, సంగీతస్వాములు కాశికివెళ్లెను." వాగ్గేయకారులగుటకు భాషా పరిచయము, సుశిక్షితమయిన విద్యాభ్యాసనము, సంగీత విద్యయందు అసామాన్యమయిన ప్రజ్ఞ తప్పనిసరిగా నుండవలయును. నేర్చుకొనుటకు పూనుకొన్న విద్యార్థి తన బుద్ధి వికాసముకొరకు స్వతంత్ర కల్పనలతో పాడగల్గిన పెద్ద గాయకులను, దినముల కొలదిగా వినవలయుననుట నిజము. 'కేళ్లి కొడుత్తగురు, కేళ్విగురు' అని తమిళమహాశయులు తమకు వికాసమునిచ్చిన గాయకోత్తములను పొగడుచుందురు. చెవినిచ్చి, విని, ఇతర గాయకుల ఉత్తమరీతులు అవగాహన చేసుకొగల రసికుడే మంచి కీర్తనలు సృష్టించగలడు. తంజావూరు సంస్థాన విద్వాంసులు, అర్థ సింహాసనము నలంకరించు గౌరవమును పొందిన మహా విద్వాంసులు ఆది అప్పయ్య. ఈ తరమువారికి కీ. శే. పైగరు వరదాచార్యులెట్లో—త్రిమూర్తులకు తత్పూర్వులు ఆది అప్పయ్య. రాగ ఫణితులను చక్కదిద్ది—కర్ణాటక రాగములకు నేటి విశిష్టతను కల్పించినవారని కీర్తి గడించిరి. వారి భైరవిరాగవర్ణము 'విరిబోణి'—తాజమహలులాంటిది. ఇక అట్టి వర్ణము నాదసృష్టిలో గానరాదు. అది అప్పయ్యగారికి తనను శామశాస్త్రి వినడములో చాల సరదా. భైరవివర్ణము పాడి, వినిపించునప్పుడు, మైమరచి పరవశులై శాస్త్రులవారు నోటినిండ తాంబూలమును నములుచునే, "షాభాష్" అన్నారు. నోటి ఎంగిలి ఆది అప్పయ్యగారిపై బడ్డది. దిగులెత్తి, అయ్యో! ఎంత విపరీతము జరిగినదని శాస్త్రులవారు ఇంకా కదలక మునుపే ఆతనిని వారించి, "కామాక్షి అనుగ్రహము నాయనా" అన్నారట. ఆ ఆత్మానుభవముతో ఉట్టిపడుతూ, రాగరస భరితుడై, ఇంటికివచ్చి, "కామాక్షి" అన్న స్వరజతిని చేసిరి. భైరవి రాగమును అంబరూపముగా నూహించి, ఆపాద మస్తకము వర్ణించి నట్లు, అద్భుతమయిన చిట్టస్వరములు, మేలయిన సాహిత్యమాత్రుకలు అమర్చినారు. శాస్త్రులవారి స్వరజతులందు భావరాగ తాళములు మూడును సమముగా మేళవించినవి. రెండుకాలము లందు స్వరములను సాధించిన విన్యాసముతో, రాగభావమును స్పష్టీకరించు ప్రయోగములతో, సంగీతమును స్వాధీనముగా, స్వతంత్రముగా, ధారాళముగా విస్తరించి పాడు వ్యుత్పన్నత ఏర్పడును. ఈ స్వరజతులు యదుకులకాంభోజి, తోడి రాగములలోను దివ్యముగా అమరినవి. తాన వర్ణములను విరివిగా రచించిరట. ఆనందభైరవి, బేగడ రాగముల చిట్టలు మాత్రమే నేడు లభ్యములయినవి. స్వర విస్తారమునకు సర్వలఘుపోషణ చాల అవసరము. రూపకతాళము, ఆదితాళము, మిశ్రచాపుతాళము లందు తాళఘాతములను పాటించు, తిశ్ర, చతుశ్ర, ఖండ మిశ్ర గతుల సంపకములతో అంద చందములను వదలక రాగభావమునకు సరియగు ప్రయోగములను పొందికగా ఏర్చి కూర్చిన చిట్టస్వరములుగల కీర్తనలు గమనించిన రస రహితములయిన రాగము నటుంచి, ఎంతమాత్రము తాళపు నడకలకు నప్పని—వట్టి లెక్కల గడబిడల స్వర విస్తారములోని అసహ్యత, రస రాహిత్యత తేటతెల్లముగా బోధపడగలదు. శ్యామశాస్త్రులవారి స్వరజతులను, విరిబోణిలాంటి వర్ణములను బాగుగా విమర్శించుకొని, ఒక్కొక్క ఆవుర్తములందుగల రాగభావ వైఖరుల ప్రత్యేకతను గమనించవలయును. ఏదైన చిట్టస్వరమును మాతృకగానుంచుకొని, ఆ ధోరణికి—వీలయినంత చేరువగా నప్పునట్టి ఆవుర్తములను 4, 8, 16 ఇంటియందు మనస్సును బాగాలయింపచేసి పాడుకొన్న మేలయిన స్వర విస్తారమును అలవరుచుకొన్నవారము కాగలము. Expand the idea Contained in this saying లాంటి అభ్యాసము.

వేంకటరమణుని అనుగ్రహమున వరప్రసాదియయి పుట్టిన వేంకట సుబ్రహ్మణ్యమునకు శ్యామకృష్ణ అన్నది గారాబుపేరు. ఆ పేరునే 'ముద్ర' లేక అంకితముగాగొని శ్యామశాస్త్రులవారు అనేక కీర్తనలను రచించిరి. వారి గేయ రచనలను గురించి సంప్రదాయ ప్రదర్శినిలో సుబ్బరామ దీక్షితులు ఇంకా ఇలా వ్రాసియున్నారు. "కొంతకాలముపిమ్మట శ్రీకామాక్షీ దేవియనుగ్రహమువలన సాహిత్య చమత్కారములు, గేయకల్పనలు తాళ విషయములు వెలయు "శ్యామకృష్ణ" అను ముద్రతో బహు కీర్తనలు, స్వరజతులు తానవర్ణములు రచించి బహు శిష్యులవలన ప్రకాశపరచి, యశఃకాయులై, శకాబ్దము 1749, క్రీ. శ. 1827 వ్యయ సంవత్సర మకర రవి శుక్ల దశమినాడు శ్రీపురము చేరెను. నాటికి పైనుండు నితని కీర్తనముల నచ్చొత్తునపుడు, ఇతని యద్భుత చరిత్రములనెల్ల విరివిగా వ్రాసెద" అని. అట్టి కోరిక కొనసాగియుండిన ఎంతో బాగుండెడిది.త్యాగయ్య

కర్ణాటకసంగీత త్రిమూర్తులలో బ్రహ్మ - శ్రీ శ్యామశాస్త్రి

కీర్తనలు, క్షేత్రయ్యపదాలు, స్వాజాదులు అనేకములు సస్వరముగా ప్రచురించవలయునని ఎంతో ఆశతో నుండిరి. ఇంతలో సుబ్బరామ దీక్షితుల మరణముతో వారి కోరిక తీరకపోవడముతోబాటు మన సంగీత సంపదకు వెలలేని 'గని' దక్కకపోయెను. శాస్త్రిగారి కీర్తనలు సుమారు ఇరువది బాగా వాడుకలో నున్నవి. శ్రీమతి విద్యా శంకర్ చాల కృషిచేసి, వారి తండ్రి కీ. శే. శ్రీ సి. ఎస్. అయ్యరు గారి ప్రోత్సాహమువలన శాస్త్రిగారి ముని మనుమడయిన 'శ్యామ' శాస్త్రిగారినుండి ముఖాముఖిగా సుమారు అరువది కీర్తనలు నేర్చుకొని, వాటిని సంప్రదాయ ప్రదర్శిని మార్గమును అనుసరించుచూ, గమకపుగుర్తులతో ప్రచురించి, శాస్త్రిగారి కీర్తనలను కొంతవరకూ కాపాడినారు. ఆమె ఇంకనూ కొన్ని కీర్తనలు ప్రచురించదలచినారు. ఇవి ఇంకకొన్ని ఇతర విద్వాంసులవద్ద దొరకవచ్చును. శాస్త్రులవారి కీర్తనలు ఎక్కువగా తెలుగు భాషలో నున్నవి. సంస్కృతము, తమిళములోగూడ కొన్ని కీర్తన లున్నవి. కల్యాణిరాగములో హిమాద్రిసుతే అనే కీర్తనకు 'బిరాన వరాలిచ్చి' అను తెలుగు 'మాతువును' వారే అమర్చియున్నారు. ప్రసిద్ధ రాగములందు వీరి కీర్తనలు ఎక్కువ. కాని, అపూర్వరాగములందుకూడ కీర్తనలు చేసియున్నారు. మాంజి రాగమునకు వారి కీర్తన బ్రోవవమ్మ ఏకైక లక్ష్యము. కల్గడ, చింతామణి రాగములందు శాస్త్రులవారి కీర్తనలు మాత్రమే లక్ష్యములు. తాళమునకు కొంత ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చినను, రాగభావమును, సాహిత్యభావమును చెడనివ్వలేదు. భావ రాగ తాళములందు ఎటువంటి గాయకునికయినా సమానముగు ప్రజ్ఞ లభించుట సాధ్యముకాదు. వాటిలో త్యాగయ్య, దీక్షితులవారు భావ రాగములను ఎక్కువగా పోషించినట్లు, శాస్త్రులవారు తాళమును ఎక్కువగా పోషించిరి. ప్రతి గాయకుడూ, ఈ మూడు వస్తువులను శక్తికొలదిగా ఉపాసించి, అలవర్చుకోవలయును. కొన్ని సందర్భములందు భావ ప్రధానముగాను, మరి కొన్ని సందర్భములందు రాగ ప్రధానముగాను, ఎప్పుడయిన తాళ ప్రధానముగా పాడుటకు సంసిద్ధుడయి యుండవలయును. ఇది ఉత్తమ గాయక లక్షణము.

"శ్యామశాస్త్రుల కీర్తనలను పాడుటకుముందు అతీత అనాగత స్వర ప్రస్తారములందు అలవాటు చేసుకొని, విన్యాసముగా, అంటే ఒక నియమిత ఛందస్సు మేరకు స్వతంత్రముగా స్వరములను నడుపించు శక్తిని సంపాదించుకోవలయును. నిన్ను వినాగ మరి, తల్లి నిన్నునెర, మీనలోచని మొదలగు కీర్తనలందు మిశ్రమును మామూలుగా 3, 4 తకిట తకధిమి అని కాకుండ తకధిమి తకిట అని ప్రయోగించి ఆ తాళ ఘాతములను బహు చాకచక్యముగా నిర్వహించవలయును. రూపక తాళములోని త్రిశ్రలఘు అమరికలు, అందునను అతీత అనాగ స్వర విన్యాసములు శాస్త్రిగారి 'స్కీము' మేరకు నెరవలు, స్వరప్రస్తారము గావించి, పాడుటకు తగిన అధికారమును కష్టపడి సాధించండి" అంటూ, కీ. శే. తైగరు వరదాచార్యుల వారు ఉపదేశించేవారు. శిష్య పరంపర అధికముగా లేకుండుట కొంత, తాళపు గొడవ కొంత, శాస్త్రిగారి కీర్తనలు అధికముగా ప్రచారమునకు రాకపోవుటకు కారణములయినవి. సుబ్బరామ దీక్షితులన్నారు: "ఇతని కీర్తనముల గేయ ఫణతులు, అతీత, అనాగత గ్రహ చమత్కారములతో నారికేళ పాకరీతిగా నుండుట వలన గాయకులలో తెలియని కొందరు సోమరులు రంజనము గలిగించుటకు సామర్థ్యములేక గడుసని చెప్పుచున్నారు. దీనికి శ్రీనాథకవిచే తెనుగింపబడిన శృంగార నైషధ కావ్యములో ప్రథమాశ్వాసమున

చ. పనివడి నారికేళ ఫలపాకమునన్ జవియైన భట్ట హ
ర్షుని కవితాను గుంభములు సోమరిపోతులు కొందరయ్య లొ
నని కొనియాడనేర రది యట్టిద లేజవరాలు చెక్కుగీ
టిన వస వల్చు బాలకుడు డెందమునం గరుగంగనేర్చునే

అను నీ పద్యార్థమే నిదర్శనముగా నున్నది."

శ్యామశాస్త్రిగారి శిష్యపరంపరనుగూర్చి, కొన్ని అంశములు చెప్పదలచితిని. వీరి పుత్రుడు సుబ్బరాయశాస్త్రిగారు తండ్రివంటి కీర్తనకర్తలు. త్యాగయ్యగారివద్ద శిష్యత్వము, దీక్షితులవారివద్ద పాఠాంతరములకృషి, తండ్రివిద్యను పూర్తిగా అవగాహనము చేసుకొన్న ప్రభావముల సమ్మేళనము వీరి కీర్తనలందు కాననగును. ఇదొక దత్తాత్రేయ అంశమనుకోవచ్చును. వీరి శిష్యురాలు వీణ ధనమ్మగారి తల్లి. ధనమ్మఇంట శ్యామశాస్త్రి, సుబ్బరాయశాస్త్రుల కీర్తనలు శ్రద్ధా భక్తులతో నేటికినీ పాడబడుచున్నవి. తాళ ప్రస్తారమునందు మేటియయి అపారమయిన సామర్థ్యమును, పాండిత్యమును గడించిన కీ. శే. నయనాపిళ్లే (కంచీపురం) వారితల్లి కీ. శే. ధనకోటిఅమ్మాల్ శాస్త్రులవారి కీర్తనలను అత్యుత్తమ రీతిని ప్రచారములోనికి దెచ్చిరి. కీ. శే. వేణుగాన విద్వాంసులు తిరుపాంబరం స్వామినాథపిళ్లెగారి కుటుంబమునందునూ, ఈ కీర్తనలు బాగా కాపాడబడినవి. వీటిని బాగుగా స్వరపరచి ప్రచురించిన శ్రీమతి విద్య ధన్యురాలు.

శ్యామశాస్త్రుల కుమారులు సుబ్బరాయశాస్త్రులుగారి చిట్టస్వరములు నిరుపమానములు. రాగమును కుప్పకట్టు మాత్ర లాగ రెండు ఆవుర్తములలో విశదీకరించి, కీర్తనకు మెరుపుతీగ వలె ప్రకాశము నిప్పించునవి సుబ్బరాయశాస్త్రుల చిట్ట స్వరములు. వీరి అన్న పుత్రుడు అణ్ణాస్వామిశాస్త్రులను దత్తు దీసుకొన్నారు. అణ్ణాస్వామిగారు సంస్కృతమున కొన్ని కీర్తనలు చేసియున్నారు. వీ రిరువురిని గురించి సుబ్బరామ దీక్షితులు వ్రాసిన ముక్కలివి:

"ఈ శ్యామాశాస్త్రులకు ఇద్దరు కొమారులు. వారిలో రెండవ కుమారుడైన సుబ్బరాయశాస్త్రులు శతాబ్దము 1725 క్రీ. శ. 1803 దుందభి సంవత్సర సింహ రవి కృత్తికా నక్ష

త్రంలో జన్మించెను. ఇతడు సంస్కృతాంధ్రములందును, సంగీతమందును అతి సమర్థుడు. ఆంధ్ర వాగ్గేయ చమత్కారములు ప్రకాశింపగా నితడు జేసిన బహుకీర్తన స్వరజతులు వాడుకలో ప్రసిద్ధముగా నున్నవి. ఇతడు శకాబ్దము 1784, క్రీ. శ. 1862 దుర్మతి సంవత్సర చాప రవి కృష్ణదశమిలో శ్రీపురమేగెను.

ఈ సుబ్బరాయశాస్త్రుల అన్న కుమారుడైన అణ్ణాస్వామిశాస్త్రులు కావ్య నాటకాలంకార వ్యాకరణములు, సంగీతాంధ్రములు దెలిసిన వాగ్గేయ కారకుడు. ఇతడు అనేక కీర్తన దరు తాన వర్ణములుజేసి యున్నదిగాక, ఫిడిల్ వాద్యములో సతి సమర్థుడు. ఇతడు శకాబ్దము 1822, క్రీ. శ. 1900 లో తన దెబ్బదిమూడవ వయసున కుంభరవి కృష్ణ తృతీయలో శ్రీపురమేగెను.''

సుబ్బరాయశాస్త్రులవారివద్దను అణ్ణాస్వామిశాస్త్రుల వద్దను తంజపురిలో గురుకులవాసముజేసి, సంగీతమునందు గొప్ప పండితులయి వెలసిన తచ్చూరు శింగరాచార్యులను ఒకసారి స్మరించుకొనక తప్పదు. చెన్నపట్టణమందు సంగీతగోష్ఠికి మణియై పుస్తకప్రచురణకు మార్గదర్శియయి, ఫిడేలు వాద్యమర్మములను బాగుగా వ్యాపింపజేసిన ధన్యులు తచ్చూరు సింగరాచార్యులు, వారి సోదరులు. సుబ్బరాయశాస్త్రిగారు వారి సవయస్కులును ముత్తుస్వామి దీక్షితులవారి సహోదరులునునయిన బాలుస్వామి దీక్షితులు, వారి శిష్యులు వడివేలుపిళ్లె—వయలన్ వాద్యమును కర్ణాటక సంగీత ప్రదర్శనమునకు ముఖ్యముగా నుండురీతిని వాద్యమును వాయించు విశేషములను కనుగొనిరి.

త్రిమూర్తులలో శివకేశవులకు లభించు పూజా పురస్కారాదులు, బ్రహ్మకు లభించలేదుకదా! అట్లే తదంశమనదగు శ్యామశాస్త్రిగారి కీర్తనలు త్యాగయ్య, దీక్షితుల కీర్తనలవలె బాగా ప్రచారమునకు రాలేదు. ఆనందభైరవిలో శ్యామశాస్త్రి తరువాతే ఇతరుల కీర్తనలు. తాళ విన్యాసముతో చురుక్కుమనిపించు కీర్తనలు కచ్చేరిలో కనీసము ఒకటయిన నుండి తీరవలయును. మూడు విభిన్న మార్గములందు మూడు శిఖరములయి వెలయు ముమ్మూర్తుల కీర్తనలు—తమ సహజ ఔన్నత్యమును గోల్పోవు దురవస్థ ఏర్పడరాదు. తమ సామర్థ్యమును పెంచుకొనక, తమ శరీరమును సరిగా మర్దించి, స్వాధీనము చేసుకొనక, సరియయిన పాఠములను మహనీయులవద్ద వినక, ఇచ్చకువచ్చినరీతిని పాడిన గాయకులు సంగీతమునకు తీరని నష్టము చేకూర్చుదురు. ముమ్మూర్తుల కీర్తనలను వారి వారి విశిష్టతను చెక్కు చెదరనీయక శ్రోతలకు వినిపించు ప్రయత్నము గాయకులు మరింత దీక్షతో కొనసాగించవలయును. మహనీయుల కీర్తనలు అందజేయు దూతలుగా గాయకులుండవలయును. ఆ కీర్తనలు వారి వారి శక్తికి, మనో ధర్మమునకు, శారీరపుపోకడలకు సర్దోటగొప్పపొరబాటు.ఆకీర్తనలందు త్యాగయ్యగారి భావము, దీక్షితుల రాగము, శాస్త్రులవారి తాళము విన బడిన గాయకుని శైలి ప్రధానముగా నుండుట నేటి కచ్చేరీలలోని ఒక లోపము. దీనికి కారణము శ్రోతలకు ఆ కీర్తనల సరియయిన రూపము తెలియకపోవుటయే. బీథోవెన్ రచనలను మరొకరీతిగా మార్చిగాని, చేర్చిగాని పాడుటకు ఒక్కరూ సమ్మతింపరు. శ్రోతలు అట్టివారిని బ్రతుకనివ్వరు. "రసికులను ఎలాగో మెప్పించి, సభకు రంజకమును చేకూర్చవలయును. లేకున్న జరుగదు" అన్న మాటను శ్రోతలు పాటించవలసి యున్నది. "దీక్షితుల కీర్తనలు విళంబముగా పాడిన వినరు' శాస్త్రిగారి కీర్తనల తాళపు గొడవలు సామాన్యులకు నచ్చవు'! అని కొందరి అపోహ. అట్టివి వినువారికి, ఒకటిరెండు, సభ స్వాధీనమయిన తరువాత గాయకులు పాడిన కచ్చేరి రక్తి మేలుగానుండి వినువారికి ఆత్మవికాసము చేకూర్చును. ప్రజల్లో ఆదర్శప్రాయము లగు సంగీత కచ్చేరీలను ప్రభుత్వమువారు, **Sahitya Natak Academy**, దేవాలయాధికారులు అప్పుడప్పుడు ఏర్పాట్లుచేసి, ఆ కచ్చేరీలందు మంచి రసజ్ఞులతో మేలయిన అంశములివి అన్న ప్రసంగములు జరిపించవలయును. "రష్యాదేశములో వీధి వెంటపోవు సామాన్యునికి శాస్త్రీయ సంగీతములోని బాగోగులు దెలుసును. అందులో వారికున్న అభిరుచి ఆశ్చర్యకరముగా నున్నది" అని ప్రొఫెసర్ సాంబమూర్తిగారన్నారు. అట్టి మంచిరోజులు ఆంధ్రదేశమునందు త్వరగా రాకూడదా! ఇది నా కల.

తెలుగు - ఇంగ్లీషు నిఘంటుకారుడు జె. సి. మారిస్

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

భాషాధ్యయనమునకు శబ్దశాస్త్ర మగు వ్యాకరణ మెంత అవసరమో, పద పదార్థములను తెలియజేయు నిఘంటువు కూడ అంత అవసరము. ఔద్యోగికముగా నైన నేమి, క్రైస్తవమత ప్రచారోద్దేశముతో నైన నేమి మనదేశమునకు వచ్చి మన దేశభాషల నభ్యసించిన పాశ్చాత్యులలో పలువు రీ సత్యమును గుర్తించినవా రగుటచే, ఆయాభాషలలో వారు లక్షణగ్రంథములను, నిఘంటువులను సంతరింప జొచ్చిరి. కాని వీనిలో కొన్ని ప్రామాణికములు కావు. అయినను, వారి ప్రయత్నముమాత్రము కొనియాడదగినది. వా రొనర్చిన కృషియు కొనియాడ దగినదే !

నిఘంటువులు మనకు క్రొత్తవికావు. తెలుగులో వలె, తమిళమునందును, ప్రాచీనులు వెలయించిన నిఘంటువులు పద్యరూపముననే యున్నవి. ఇతర భాషలలోను ప్రాచీననిఘంటువులు పద్యాత్మకము లనియే తెలియు చున్నది. కనుక అకారాద్యక్షర క్రమమున నిఘంటువును కూర్చుటకు మనకు మార్గదర్శకు లీ పాశ్చాత్యపండితులే యనుట అసంమంజసముకాదు. అంతేకాక మన ప్రాచీనులు చిన్నచూపు చూచిన వాడుకభాషకు నిఘంటువులలో పెద్ద పీటవేసినవారు కూడ ఈ పాశ్చాత్య పండితులే యనియు నుడువదగును. నిజమునకు జీవద్భాష యగు వ్యావహారిక భాషనే వీరు మిక్కిలి ఆదరించిరి.

పాశ్చాత్యులు కవిత, వచనము మొదలగు సాహిత్య ప్రక్రియలందు రచనలు వెలయించిరి. కాని అవి యన్నియు ప్రచుర ప్రచారము నందుకొనలేదు. అయినను తమిళము నందు మాత్రము వీరమామునివర్ (బెస్కీ) వంటి పండిత ప్రకాండులు కొందరు చేసిన రచనములు తమిళుల యాదరాభిమానములను చూరగొనినవి. ఈ కారణమున తమిళ నాడున క్రైస్తవ మతమునకు సంబంధించిన సారస్వతము బహుళ వ్యాప్తికి వచ్చెను. డాక్టర్ విన్స్లో తన ఆంగ్ల— తమిళ నిఘంటువునకు (1862) వ్రాసికొనిన యుపోద్ఘాతమునందలి యీ క్రిందివాక్యములను పరిశీలించిన ఈ విషయము సుస్పష్టము కాగలదు.

"...In one respect the Tamil has an advantage over the other vernaculars of India. It has a greater amount of christian literature. As the number of Native christians speaking Tamil is two or three times greater than of those speaking any other vernacular..."

తమిళనాడున క్రైస్తవవాఙ్మయమునకు ప్రచారము లభించిన కారణమున, పాశ్చాత్యపండితులు ప్రవేశపెట్టిన యొక నూతన రచనావిధానము కూడ తమిళమున చోటు చేసికొనెను. ఈ రచనావిధానమున ఇంగ్లీషు పలుకుబడి యెక్కువగా కానవచ్చుచున్నదనుట సత్యదూరము గాదు. ఈ విషయమై సి. పి. బ్రౌనుదొర యిట్లు నుడివెను.

"In Tamil and Telugu, as well as in Greek and Latin, christianity will gradually produce a somewhat new dialect; in Tamil it is already perceptible..."

ఆ నాళ్లలోనే పాశ్చాత్యులు ప్రవేశపెట్టిన ఆ రచనా విధానమునకు తమిళమున స్థానము లభించినను, తరువాతి కాలమున ఆ విధాన మంతగా అభివృద్ధి చెందలే దనియే చెప్ప వలసి యున్నది. తమిళభాషా విషయమే యిట్లుండగా, పాశ్చాత్యులు వెలయించిన తెలుగు రచనలను గురించి నుడువ నవసరములేదు. వారు సృష్టించిన శైలి విలక్షణ మైనదే కాని అందులో తెలుగు పలుకుబడి చాల తక్కువ. ఈ కారణమువలనకాబోలు పాశ్చాత్య పండితులు సంతరించిన తెలుగు రచనలు అంతగా వ్యాప్తిలోనికి రాజాలకపోయెను.

ఇతర సాహిత్య ప్రక్రియల మాట యెట్లున్నను, నిఘంటు రచనా విధానమునందు మాత్రము పాశ్చాత్య విద్వాంసులు కావించిన భాషాపరిశోధనయు, చేసిన కృషియు

నిరువమానములు. తెలుగులో సి. పి. బ్రౌను నిఘంటువులు, తమిళమున విన్‌స్లో నిఘంటువు, కన్నడమున కిట్టెల్ నిఘంటువు, మలయాళమున గుండర్ట్ నిఘంటువు మున్నగు నవి ఆయాభాషలకు అమూల్య భూషలనుటలో సందేహములేదు.

బ్రౌనుకు పూర్వమే పాశ్చాత్యులు కొందరు తెలుగున నిఘంటువులు వెలయించిరి. క్రీ. శ. 1700 ప్రాంతమున ఫరాసు మిషనరీలు ఒక తెలుగు నిఘంటువును (Dictionnaire Telougu) తయారుచేసినట్లు తెలియుచున్నది. వీరే ఒక తెలుగు వ్యాకరణమును కూడ సంతరించిరట. కాని గ్రంథ కర్తృనామములు మాత్రము తెలియ రాలేదు. ఇవి రెండును ప్రామాణికములు కాకపోయినను, నిఘంటువు మాత్రము గ్రుడ్డిలో మెల్ల యనవచ్చును. అటు పిమ్మట విలియం బ్రౌను Vocabulary of Gentoo And English అను నిఘంటువును 1807 వ సంవత్సరమున వెలయించెను. ఇదియే పాశ్చాత్య నిఘంటు పద్ధతిని వెలువడిన తొలి తెలుగు నిఘంటువు. దైనందిన జీవితమున వినవచ్చు పెక్కు మాట లిందు చేర్చబడెను. వాడుకభాషలోని మాటలను స్వీకరించుటయే కాక, ఉచ్చారణ విషయమునందును విలియం బ్రౌను వ్యావహారికభాషలోని ఉచ్చారణ పద్ధతినే ఆశ్రయించెను. అందువలన ఈతని నిఘంటువులో ఇ ఈ ఎ ఏ లకు బదులు యి యీ యె యే లును, ఉ ఊ ఒ ఓ లకు బదులు వు వూ వొ వో లును, ఋ వర్ణమునకు బదులు రి యును వాడబడినవి. విలియం బ్రౌను నిఘంటువు సమగ్రము కాకపోయినను, ఆ కాలమున తెలుగు నభ్యసింప నభిలషించిన తెల్లవారి కిది సహాయపడె ననుటలో సందేహము లేదు.

పిమ్మట 1816 లో మామిడి వెంకయ్యగారు ఆంధ్ర దీపికను సమకూర్చిరి. కాని యిది 1848 లో ముద్రణ భాగ్యము నందెను. ఆ నాళ్లలో పాశ్చాత్యపండితులలో సుప్రసిద్ధులై యుండిన కాంబెల్, ఎల్లిస్, బ్రౌను మొదలగు వారందరు వెంకయ్యగారి విద్వత్తును, ఆయన నిఘంటువును బహుధా ప్రశంసించియుండుట ఎంతేని హర్షింపదగు నంశము. అనంతరము ఎ. డి. కాంబెల్ సంతరించిన నిఘంటువు వెలుగులోనికి వచ్చెను. దీనికి పిమ్మట వ్యాప్తిలోనికి వచ్చిన నిఘంటువే జాన్ కర్నక్ మారిస్ (John Carnac Morris) సంతరించిన ఇంగ్లీషు తెలుగు నిఘంటువు. ఇది రెండు సంపుటములుగా వెలువడెను. మొదటిది 1835 లోను, రెండవది 1839 లోను వెలువడెను. మొదటి సంపుటము నందలి ముఖపత్ర మిట్లు కలదు.

A
DICTIONARY,
English and Teloogoo
By
J. C. MORRIS, F. R. S
of the Madras Civil Service

Vol. I

Madras
Printed At The Asylum Herald Press,
1835

A తో ప్రారంభమై To Knuckle (లాంగు) తో ముగిసిన యీ సంపుటమునందు 586 పుటలు గలవు. ఇది ఫోర్టు సెయింటు జార్జి గవర్నరుగా నుండిన రైట్ ఆనరబుల్ యస్. ఆర్. లూషింగ్‌టన్ దొరకు అంకిత మీయబడినది. ద్వితీయ సంపుటమునందు 532 పుటలు గలవు. కాగా ఇది 1,118 పుటల నిఘంటువు.

ఈ నిఘంటువునకు మారిస్ వ్రాసిన మున్నుడి నుండి తెలియవచ్చుచున్న కొన్ని ముఖ్యాంశములను మాత్రము ఇట ఉదాహరించుచున్నాను : మదరాసులోని ఫోర్టు సెయింటు జార్జి కాలేజీ బోర్డువారి కోరికను మన్నించి యీ నిఘంటువు కూర్చబడెను. బోర్డువారి సిఫారసును పురస్కరించుకొని దొరతనమువారే దీనికి సంబంధించిన సర్వస్వామ్యము లను కొనిరి. తెలుగు నభ్యసింపదలచిన పాశ్చాత్యుల కొరకే కాక, ఆంగ్లము నభ్యసింప నభిలషించిన భారతీయులకు కూడ తోడ్పడగల ఇంగ్లీషు తెలుగు నిఘంటు వొకటి చిరకాల వాంఛితమై యుండెను. మారిస్ కావించిన పెక్కేండ్ల పరిశ్రమకు ఫలముగ వెలసిన యీ నిఘంటువు ఆ వాంఛను కొంతకుకొంత అయినను తీర్చగలదని భావింపబడెను.

నిత్యజీవితమునకు సంబంధించిన మాట లెన్నో ఇందు చోటు చేసికొనెను. అంతేకాని యూరపులోని చెట్లు, చేమలు, ఫలములు, పరికరములు మొదలగువాని పేళ్లు భారతీయులకు నూతనము లగుటచే, అవి యిందు పరిహరింపబడెను. డాక్టర్ జాన్సన్ ఇంగ్లీషు నిఘంటువు ననుసరించి కూర్చబడిన యీ నిఘంటువునందు తొలుత ఇంగ్లీషు మాటలకు గల వివిధములగు అర్థముల నొసగి పిమ్మట వానికి తెలుగున గల పర్యాయపదము లొసగ బడినవి. ఇట్లొనర్చుటలో నిత్య జీవితములో తరుచుగా వినవచ్చు మాటలకు ప్రాధాన్య మీయబడినది. ఇంగ్లీషుమాటలకు సరియైన తెలుగు మాటలు అలభ్యము లగునప్పుడు, ఆ యింగ్లీషు మాటల నెటుల అర్థము చేసికొనవలెనో ఉదాహరణపూర్వకముగా వివరింపబడినది. ఒకే మాటకుగల అర్థభేదమును సూచించుటకు కూడ ప్రయత్నము చేయబడినది. వాడుకలో లేకపోయినను కవి ప్రయోగములుగల తెలుగు మాటలను కొన్నిటిని మారిస్ తన నిఘంటువు నందలి తొలిపుటలలో చేర్చెను. కాని

తెలుగు-ఇంగ్లీషు నిఘంటుకారుడు జె. సి. మారిస్

అనవసరముగా గ్రంథము పెరిగిపోవునను భీతిచే తరువాత ఈ ప్రయత్నము నాతడు విరమించుకొనెను. కాలేజీలో ప్రధానాంధ్రోపాధ్యాయుడు (Teloogoo Master ఆనాళ్లలో తెలుగుమాస్టరనుటయే వాడుక), పండితుడు నగు రావిపాటి గురుమూర్తిశాస్త్రి నిఘంటు రచనావసరమున మారిస్‌కు మిక్కిలి తోడ్పడెను.

కనుక మారిస్ కూర్చిన యీ నిఘంటువు కేవలము పదపదార్థములను తెలియజేయు నిఘంటువు కాదని పయి మాటలనుండి విదితము కాగలదు. నిజమునకు మారిస్ పెక్కుచోట్ల ఉదాహరణము లొసగి యున్నాడు. ప్రయోగము లొసగి అర్థభేదమును చక్కగ తెలియజేసెను. వేమన పద్యములనుకూడ అటనట ఉదాహరించినాడు. అవసరమని తోచినప్పుడు హిందువుల యాచార వ్యవహారములనుకూడ వివరించినాడు. కొన్నిచోట్ల మారిస్ శకటరేఫమును, అరసున్నలను కూడ వాడినాడు. (ఉదా : నెఱవేఱు, వయస్కుఁడు). మారిస్ ఒసగిన కొన్ని ప్రయోగములందు మదరాసు తెలుగు మాటలు కానవచ్చుచున్నవి. అతని వాక్యనిర్మాణమునందును మదరాసు తెలుగుపలుకుబడి కనబడుచున్నది. తెలుగు మాటలలోని దంత్య తాలవ్య భేదమును గుర్తించిన మారిస్ పంచ ప్రాణములు, జంతువు మొదలగువానిని పంౘప్రాణములు, ౙంతువు ..... అని వ్రాసెను. ఇక యీ విషయాదికమును ఉదాహరణ పూర్వకముగా పరిశీలింతము.

Disire=కోరికె, అపేక్ష, అభిలాష, అభీష్టము, కాంక్ష, ఆశ, ఇష్టము, వాంఛ.

Childish desires=పిల్లల కోరికెలు, కఱితలు.

Crane=కొక్కు, కొంగ, కొక్కరాయి, కొక్కెర, బకము.

(కొక్కు అనునది తమిళశబ్దము. కొక్కునకు తెలుగు నిఘంటువులలో కానవచ్చు అర్థము పందికొక్కు.)

An appointment=ఒప్పొచారము, ఒడంబడిక, ఏర్పాటు, కరారు.

(ఒప్పందము వాడుకలో ఉన్నది కాని ఒప్పొచారము మాత్రము నేటి వ్యవహారమున లేదు.)

Unpaid or Compelled labour=వెట్టి, అమంజి.

(తెలుగు నిఘంటువులందు అమంజి రూపము కనబడదు. కాని 'అమిజి' ఉన్నది. నేటికిని మదరాసులో తమిళులు, కొందరు తెలుగులు 'బేవారసుగా' అనుటకు 'అమింజి' ని వాడుచున్నారు. అమంజి, అమింజి—ఈ రెండును తమిళమున సరియైన రూపములే కనుక మన తెలుగు నిఘంటువులందలి అమిజి, అమింజిగా— ఉండవలెనని తలచుచున్నాను.)

Child—బిడ్డ, పిల్ల, పాప, శిశువు, కడుపు.

('కడుపు' నకు మారిస్ యిచ్చిన యీ క్రింది వివరణ పరిశీలింప దగినది :

This word is used only in such phrases as నీ కడుపుకాల=May your child die; నీ కడుపు చల్లగా ఉండని=May your children live happily)

Prosperity is not without many fears and distastes=భాగ్యముతో అనేక భయములున్ను వ్యాకులములున్ను లేకుండా వుండేదిలేదు.

It is just to distinguish between an action done from inadvertence, and that which is done from design= తెలియకచేసిన పనిన్ని తెలిసి కావలెనని చేసిన పనిన్ని వివేచించి తెలుసుకోవలసినది న్యాయము.

(మొదటి వాక్యపుతెనుగుసేతకంటె ఈ తెనుగుసేత బాగుగ నున్నది.)

కొన్నిచోట్ల వాక్యనిర్మాణము సరిగా లేకున్నను ఇంగ్లీషు జాతీయమును ఎటుల తెలుగు చేయవలెనో, తెలుగు మాటలకు సమానార్థకములగు ఇంగ్లీషుమాట లెవ్వియో మున్నగువానిని తెలిసికొనుటకు పాశ్చాత్యులు సంతరించిన యీ నిఘంటువులు మనకు విశేషముగ తోడ్పడుచున్న వనుటలో సందేహములేదు.

ఈ ఒక్కనిఘంటువునే కాక మారిస్ 'Telugu Selections, with translations and Grammatical Analyses...'అను పాఠ్యపుస్తకమును కూడ సంతరించెను. ఇది ఆ దినములలో సుప్రసిద్ధమైన పాఠ్యగ్రంథమట! మారిస్ తెలుగులో పరీక్షాధికారిగా కూడ నుండెననియు తెలియుచున్నది. ఇక అతని జీవితవిశేషాదికమును పరికింతము.

బొంబాయి సివిలుసర్వీసునకు చెందిన జాన్ మారిస్‌కు రెండవ కుమారుడుగా మారిస్ 1798 వ సంవత్సరము అక్టోబరు 16 వ తేదీని జన్మించెను. జాన్ మారిస్ కొంతకాలము తూర్పుఇండియా కంపెనీ డైరెక్టరుగా కూడ పనిచేసెను.

మారిస్ తొలుత రాయల్‌నేవీలో చేరెను. అటుపిమ్మట అతడు హెయిల్‌బరీలోని తూర్పు ఇండియా కంపెనీ వారి కళాశాలలో శిక్షణపొంది 1818 లో మదరాసు సివిలుసర్వీసులో చేరెను. అతని అన్నదమ్ములు కూడ సివిలుసర్వీసులోనే ఉద్యోగస్థులుగ నుండిరి. మారిస్ కొంతకాలము మచిలీపట్టణమునందును, కోయంబుత్తూరునందును ఉద్యోగము చేసెను. 1823 లో పక్షవాతము వచ్చి అతనికి

కాళ్లు పడిపోయెను. తత్ఫలితముగ అతని బుద్ధికుశలత నిరరకమై పోవునేమో యని పలువురు తలచిరట. కాని అదృష్టవశమున అటుల జరుగలేదు. పక్షవాతమునకు గురియై కోలుకొనిన పిమ్మట ఆతనిజీవితకాలము మదరాసు సెక్రటేరియేటులోనే గడచెను.

1832 లో మారిస్ ఇండియా ప్రభుత్వమునకు తెలుగు అనువాదకుడుగా నియమితుడయ్యెను. 1839 లో సివిల్ ఆడిటర్ పదవి నలంకరించెను. ఆ రోజులలో అది బాధ్యతాయుతమైన పదవి యట!

ఔద్యోగికముగా మారిస్ చేసిన సత్కార్యములలో ఒకటి మదరాసు ప్రభుత్వ బ్యాంకుస్థాపనము. అది 1834వ సంవత్సరమున స్థాపింపబడెను. అతడే దానికి మొదటి కార్యదర్శియు, కోశాధికారియును. ఆ మరు సంవత్సరమున అతడు సూపరింటెండెంటుగా నియమింపబడెను. కాని కాలక్రమమున ఆ బ్యాంకు కొందరు వ్యక్తుల యధీనములోనికి వచ్చెనట.

విశ్రాంతి లభించినప్పుడెల్ల మారిస్ తెలుగు హిందూస్థానీ భాషలందు కృషిచేయుచుండెడివాడు. హిందూస్థానీలో కూడ పాండిత్యము గడించినను, తెలుగులోనే అతనికి ఎక్కువ అభినివేశము ఉండెనని సువిదిత మగుచున్నది. కనుకనే ఆనాళ్లలో అతడు తెలుగుపండితుడని పేరుపెంపులు గడించెను. అతడు చాలకాలము 'జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు' అను పత్రికకు సంపాదకుడుగ నుండెను. కనుక ఒక్కసాహిత్యమునందే కాక విజ్ఞానశాస్త్రమునందును మారిస్‌కు అభిరుచి యుండెనని నుడువవగును. ఆనాటి చెన్నపురి సమాజమున అతనికి గౌరవ ప్రపత్తు అధికముగ నుండె ననియు, 1846 లో మదరాసును వీడి స్వదేశమునకు మరలునపుడు మదరాసు ప్రముఖులు మారిస్‌కు ఒక యోగ్యతా పత్రమును బహూకరించిరనియు తెలియుచున్నది.

లండనులో స్థిరపడినపిమ్మట మారిస్ వాణిజ్య రంగమున పరిశ్రమింపజొచ్చెను. స్టీమర్లు నడుపు నౌక కంపెనీని అతడు స్థాపించెను. కాని అది చాలకాలము సాగలేదట. అటుపిమ్మట తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టరు పదవికి అతడు ప్రయత్నించెననియు, కాని విఫలమనోరథు డయ్యెననియు తెలియుచున్నది. అప్పు సొప్పులను తీర్చు నిమిత్తమై తన ఆస్తిపాస్తులను ఒకరి స్వాధీన మొనర్చి మారిస్ 1858 వ సంవత్సరము ఆగస్టు రెండున మరణించెను. సెయింట్ హెలియర్స్ అనుచోట అతని భౌతిక శరీరము ఖననము చేయబడెను.

బ్రౌను, కిట్టెల్, విన్స్లో ప్రభృతులవలె విశేష విఖ్యాతి నార్జింపకున్నను, తెలుగుభాషకు సేవచేసిన తెల్లవారిలో జె. సి. మారిస్ ఒక డనుట అతిశయోక్తికాదు. ఆతని నిఘంటువు తెలుగు నభ్యసింపదలచిన పాశ్చాత్యులకు మిక్కిలి తోడ్పడెను. అది ఆనాళ్లలో ప్రామాణికమైన నిఘంటువుగా పరిగణింపబడెనని Dictionary of National Biography (Vol. XIII) నుండి సువిదిత మగుచున్నది. మొత్తముమీద, పాశ్చాత్యపండిత లోకములో తెలుగుభాషావ్యాప్తికి తోడ్పడిన చిరస్మరణీయుడు జె. సి. మారిస్ !

హేతువాదయుగం

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ఆనందం ఆర్ణవమైతే
అనురాగం అంబరమైతే
అనురాగపు టంచులు చూస్తాం
ఆనందపు లోతులు తీస్తాం

నీ కంకణ నిక్వాణంలో
నా జీవన నిర్వాణంలో
నీ మదిలో డోలలు తూగి
నా హృదిలో జ్వాలలు రేగి
నీ తలపున రేకులు పూస్తే
నా వలపున బాకులు దూస్తే
మరణానికి ప్రాణం పోస్తాం
స్వర్గానికి నిచ్చెన వేస్తాం

వాసంత సమీరం నీవై
హేమంత తుషారం నేనై
నీ ఎగిరిన జీవ విహంగం
నా పగిలిన మరణ మృదంగం
చిగురించిన తోటలలోనో
చితులుంచిన చోటులలోనో
వలయములై చలించినపుడే
విలయములై జ్వలించినపుడే
కాలానికి కళ్లెం వేస్తాం
ప్రేమానికి గాళ్లెం తీస్తాం

నీ మోవికి కావిని నేనై
నా భావికి దేవివి నీవై
నీ కంకణ నిక్వాణంలో
నా జీవన నిర్వాణంలో
ఆనందం ఆర్ణవమైతే
అనురాగం అంబరమైతే
ప్రపంచమును పరిహసిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం

(ప్రవేశం హరి, గిరి)

గిరి : అహో. ఏమి గీతం. ఎంత సొగసుగా ఉంది. కవిత్వాన్ని వడబోసినట్లుందే. ఎవరయ్యా ఈ పాట వ్రాసింది.

హరి : ఈపాట వ్రాసినతని పేరు శ్రీరంగం శ్రీనివాసరావు.

గిరి : ఈ క్రొత్త కవుల్లో ఇంతటిమహాకవు లుంటారా ?

హరి : అట్లా మాటాడితే ఈ క్రొత్తకవుల్లో ఒక్కడే మహాకవి. అతనిపేరు శ్రీ శ్రీ.

గిరి : అతడింకేం వ్రాశాడు ?

హరి : అతడు వేరే చాలా వ్రాశాడు. ఈ క్రొత్త కవితా యుగానికి హేతువాత యుగమని పేరు పెడితే, ఆ యుగం అతని మీద నడుస్తున్నది.

గిరి : అతని దింకొకపాట వినిపించు.

హరి : అది కూడా ఇట్లా ఉంటుం దనుకుం టున్నావేమిటి ? అవన్నీ హేతువాదయుగపు పాటలు.

గిరి : హేతువాద యుగమంటే ?

హరి : నీతో అన్నీ పేచీలే, ప్రతిదానికీ నిర్వచనం చెప్పమంటావు. దేనికీ నిర్వచనాలు సాగవు. హేతువాద యుగమంటే నీకు తెలియవలెనంటే కొన్ని విషయాలు చెబుతాను. కొన్ని పద్యాలు వినిపిస్తాను. వాటినిబట్టి నువ్వూ, నేనూ కలిసి హేతువాద యుగమంటే ఏమిటో నిర్ణయించుకుందాం.

గిరి : మొదట ఏదో కొంచెం చెప్పు. అది సరేగాని హేతువాదమేమిటయ్యా. వాదము హేతువులేకుండా ఉంటుందా ? అది వాదమవుతుందా ?

హరి : అవునయ్యా. హేతువాదమంటే ప్రమాణ మనుకుందాం. ప్రమాణం లేకుండా ఏదీ ఉండదు. ఇది ప్రమాణమని మనం మొదట నిర్ణయించుకోవడంలో ఉంటుంది. బౌద్ధులు ప్రత్యక్షప్రమాణవాదులు. సాంఖ్యులు మూడు ప్రమాణాలే స్వీకరిస్తారు. ప్రత్యక్షానుమాన శబ్దములను స్వీకరిస్తారు. కొందరు అభావాన్ని కూడా ప్రమాణంగా తీసుకుంటారు. మరికొందరు స్వీకరించరు. కొందరు అర్థాపత్తి ప్రమాణ మంటారు. కొందరు కాదంటారు.

గిరి : ఈ హేతువాద యుగం వాళ్లు దేనిలోకి వస్తారు.

హరి : వీళ్లు చరిత్రప్రమాణవాదులు.

గిరి : అంటే ?

హరి : కడచిన మానవజాతి చరిత్ర. అది క్రమక్రమంగా మారుతున్నది. ఒక మార్పు ఇంకొక మార్పునకు కారణం. ఇప్పుడు ఒక మార్పు వచ్చింది. దీనికి తొలినాటి మార్పులు కారణం. ఇప్పటి మార్పు అన్నింటికి ప్రమాణం. అదే హేతువు. దానిని పురస్కరించుకొని

చేసేది హేతువాదం. తత్సంబంధమైన కవిత్వమంతా హేతువాదయుగ కవిత్వం.

గిరి : ఏదో తెలిసినట్లుగా ఉంది కాని విస్పష్టంగా లేదు.

హరి : ఏమైనా ఉదాహరణలమీద తెలుస్తుంది. తెలిసే లక్షణమే అది.

గిరి : అయితే మొదలుపెట్టు.

హరి : ఈ హేతువాదయుగం కవులలో పలుమంది పలు రకాలుగా ఉంటారు. కొందరు విప్లవ వాదులు. కొందరు యుద్ధవాదులు. కొందరు సంప్రదాయ నిర్మూలన వాదులు. కొందరి విప్లవం వట్టి ఛందస్సునకు మాత్రమే సంబంధించి ఉంటుంది. కొందరి వాదం సంఘం మారవలెనని మాత్రమే ఉంటుంది. చూడు.

*　　*　　*　　*

నవమి చిలుక కులుకులూ పలికింది. పలు
కులో నవ్య నవ్య కవిత్వం రాలింది. నవ్య
నవ్య కవిత్వం—ఇది నూతనములో బహు నూతన
కవిత్వం. అందుకనే ఇది పూర్వ కవిత్వం
గాదు ఇది నవ్య కవిత్వంగాదు ఇది భావ
కవిత్వం గాదు.

అడ్డము హిరణ్యా కాశ్యపుడు. శంక హిరణ్యాం
కాశ్యపుడు. అధైర్యము హిరణ్యాకాశ్యపుడు
అస్థిమితము హిరణ్యా కాశ్యపుడు.
మూలము సమూలముగా త్రెంచి హృదయ
సభామంటపస్తంభము పగిల్చి మనస్సు
విజృంభించి నరసింహమూర్తిత్వము తాల్చును
అప్పుడే ప్రహ్లాద కవిత్వం ఆహ్లాదంగా
ఉద్భవిస్తుంది.

అందాము ప్రహ్లాద కవిత్వ మిది అని
అందాము అందుకొని ఆవరిద్దాము
నవమి చిలుక పలికింది ప్రహ్లాద కవిత్వం
ప్రహ్లాద కవిత్వంలో ప్రాఘత్వ మున్నది.
పామరత్వ మున్నది. దేశీ విదేశికి నెపమున్నది
ప్రాహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుంది.
అది పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుంది.
తాను నిలుస్తుంది.

ప్రాహ్లాద కవిత్వంలో సావిత్రీ సత్యవంత జీవిత మున్నది
ప్రాహ్లాద కవిత్వంలోని గాయత్రి అందరికీ తల్లి.
ప్రాహ్లాద బ్రహ్మయే నవమి చిలుక. నవమి
చిలుక పలుకులే ప్రాహ్లాద కవిత్వం అమూల్యమూల
కవిత్వం.

హరి : విన్నావా. ఈగీతం వ్రాసినతని పేరు శ్లిష్టోన్ల ఉమామహేశ్వరరావు. తానేదో క్రొత్తగా చెబుతున్నా ననుకొని తన సిద్ధాంతాన్నిగూర్చి ఇంకొక రీతిగా చెప్పాడు. హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడు వీళ్లమీద ఆరోపించి చెప్పాడు. ఇది ఒక పెద్ద రూపకాలంకారం.

గిరి : ఈ క్రొత్త కవులు, కావ్యాలలో చెప్పబడే అలంకారాలకు విరోధులు కదా.

హరి : వాళ్లు విరోధులే. మనకూ ఇంకొకడికి విరోధం. వాడి దగ్గర ఒకో వస్తువు కావాలనుకో. అది లేకపోతే గడవ దనుకో. తెచ్చుకుంటావూ ? తెచ్చుకోవూ ? అల్లాగే వాళ్లూ అలంకారాలు ఉపయోగిస్తారు. అలంకారాలు లేకపోతే కవిత్వమనేది ఎట్లా ఉంటుంది ? ఉండడమనేది అసంభవం. అలంకారం లేకుండా మనం మాట్లాడలేం.

గిరి : అయితే శ్రీ శ్రీ వంటి నవ్య కవిలో కూడ అలంకారాలుంట వంటావా ?

హరి : అయ్యో. ఉన్నదే అతని కవిత్వంలో. శబ్దాలంకారాలని ఉంటవి. ఒకదానిపేరు వృత్త్యనుప్రాసము. ఈ వృత్త్యనుప్రాసముయొక్క ప్రాబల్యమే శ్రీ శ్రీ కవిత్వంలోని మొదటి సొగసు. అంత్యప్రాసకూడా ఒక శబ్దాలంకారం. అది లేకపోతే వీళ్ల నడక లేదుగా. శ్రీ శ్రీ చంద్రవంకను చూచి కాళ్లు తెగిన ఒంటరి ఒంటెలాగ ఉందన్నాడు. ఇది ఉపమాలంకారం. ఎట్లాంటిది ? మృచ్ఛకటికంలో నీటిలో మునిగి ఏనుగు ఎత్తిన రెండు దంతములవలె చంద్రవంక ఉన్న దన్నాడే అంత గొప్ప ఉపమానం.

గిరి : అయితే శ్రీ శ్రీ మహారథి, అతిరథుడు అన్నమాట. అతని ననుసరించిన వాళ్లెవరైనా ఉన్నారా ?

హరి : అందరూ అతని ననుసరించినవాళ్లే. అందులో ఇద్దరు మాత్రం అతనికి దగ్గిరవాళ్లు. ఒకరిపేరు నారాయణ బాబు. రెండవవారి పేరు ఆరుద్ర.

గిరి : నారాయణబాబుపద్యం ఒకటి చదువు.

హరి : ఆరుద్ర పద్యం పనికిరాదా ?

గిరి : మెతుకు పట్టిచూస్తే తెలుస్తుందిగా.

హరి : అల్లా కాదోయ్. ఇద్దరిది చెరొక మార్గం.

గిరి : అయితే ఇద్దరిది చెరొకటి వినిపించు.

హరి : నీ సొమ్మేం పోయింది. నారాయణబాబు కపాలమోక్షం అనే శీర్షికతో వ్రాశాడు పద్యం. విను.

*　　*　　*　　*

వేద సన్నిహితు, ఆదిశంకరు
తపస్సమాధిని ఓంకారమ్మై
హుంకరించినది
అర్ద్రమైనది ఆ మహామహుని

అంతఃకరణ,
అంతట అక్షులు విప్పి ఆకలి ఆకలి అంటూ
భిక్షాపాత్రకు చేయిచాపినాడు
ఉగ్రతపస్సున గ్రమ్మినది
వేడికంటికి సూడిద పెట్టిన
బ్రహ్మకపాలం,
పటపట కొరికినాడు నటరాజు.

భూతపిశాచాలు బొబ్బరిల్లినవి
వందిమాగధులు వణికారు
భయపడి బసవడు రంకె వేసినాడు
భూలోకమ్ములు తురకల గోరీలందు
క్రైస్తవుల సమాధులలోన, హిందూ శ్మశానవాటుల
కపాలమ్ములు వికవిక నవ్వినవి.

భారతవీరుని కపాలమొక్కటి
కపర్ది చేతికి రివ్వున వాలింది
కెవ్వున కేకేశాడు కంఠేకాలుడు.

ఫాలనేత్రమే స్పందించింది
అండపిండ బ్రహ్మాండమ్మంతా
తాండవనృత్యం చేసింది
ఆనందాశ్రుల నించింది.

శేషుని ఫణాల మెత్తని శయ్య
పుడమి ఒత్తిగిలింది. ఎడారి పుష్పించింది
కపాలమోక్షం
కపాలమోక్షం.

* * * *

హరి : విన్నావా, ఎలా ఉంది ?

గిరి : ఎలా ఉన్నదేమిటి. ఇందాకటికి మల్లేనే ఉంది. ఇదీ సంప్రదాయాన్ని అనుసరిస్తూనే ఉంది. ఛందస్సు మారటమే తప్ప ఇందులో విప్లవమేం కనబడ్డంలా.

హరి : ఆ విప్లవం ఆరుద్రలో ఉంటుంది చదువుకో.

గిరి : అబ్బాయీ నాకు శుష్కవిప్లవ గీతాలు బాగుండవు. ఒక ఊహ, ఒక భావంచెప్పే తరహాలో ఒక నైపుణ్యం, ఆలోచనతో కూడినమాట, అవి ఉండాలి.

హరి : ఇంతకూ నీకు విప్లవస్వరూపం తెలియాలా ? అక్కర లేదా ?

గిరి : తెలియాలి.

హరి : అయితే కొందరివి కొన్నిగీతాలు తప్పకుండా వినాలి. పురిపండా అప్పలస్వామి అని ఒక కవి. ఆయన గీతం అని ఒక పాటవ్రాశాడు. విను. నీకు చాలా అవగత మవుతుంది.

* * * *

తొలినాటి సంద్రాలు
తుహినగిరి శిఖరాలు
ఇంకిపోతున్నాయిలే
క్రుంగిపోతున్నాయిలే.
తాత వేసిన పుంత
దైవమేలిన సంత
పల్లేరు ప్రాకిందిలే
జిల్లేడు మొలిచిందిలే.
రాజు కట్టిన కోట
రాణి మెట్టిన తోట
భూతాలు గెంతాయిలే
బొమికలే నిండాయిలే.
నల్లమందేగాని
కల్లిప్ప నంటావు
రాతి గుళ్లకె కాని
రాను పొమ్మంటావు
సుడిగాలి రేగిందిలే
పిడుగు గర్జించిందిలే.

* * * *

హరి : విన్నావా. ఇది విప్లవగీతం. తొలినాటి సంద్రాలంటే సంప్రదాయాలు, తొలినాటి భావాలు. తుహినగిరి శిఖరాలంటే పూర్వపు ఔన్నత్యాలు. తాత వేసిన పుంత మీద పల్లేరు ప్రాకుతున్నది, జిల్లేడు మొలుస్తున్నది అనగా సర్వసంప్రదాయ విచ్ఛేదం జరుగుతున్నది. రాజుకట్టిన కోటలో భూతాలు గెంతాయి, బొమికలు నిండాయి అంటె రాజ్యాంగం మారిపోతున్నది. రాజులు పోతున్నారు. సామ్యవాదం వస్తున్నది. ఇది విప్లవగీత మంటే. లక్షణాలు చెప్పొడన్నమాట.

గిరి : బాగా ఉంది. అల్లా ఇతమిత్థమని తెలియాలి. ఇంకొక లక్షణం చెప్పు.

హరి : పఠాభి అని ఒక కవి ఉన్నాడు. ఆ పేరులోనే అతని లక్షణం తెలుస్తున్నది గదా. పట్టాభి అన్నది పఠాభి అయింది. రెండు టాలు ఎందుకని ఒత్తూతా పెట్టాడు. ఆయన పుస్తకం చూడాలి. ఆయన పుస్తకంలో చివరి పాట ఉన్నది. ఆ పాటలో వర్ణ క్రమం విపరీతంగా ఉంటుంది. కళ్ళి అని ఉందనుకో. నీవు లీ క్రింద క వత్తు ఇస్తావు. ఆయన కలి విడిగా వ్రాసి కి విడిగా వ్రాస్తాడు.ఇది సరేగాని కొన్నికొన్ని ఇట్లా వ్రాస్తే,

తెలుగు పద్యాలు హిందీ అక్షరాల్లో వ్రాసినట్లు ఇంగ్లీషు అక్షరాల్లో వ్రాసినట్లు ఉంటుంది. అదొక మోస్తరు విప్లవం. విప్లవం అన్న తరువాత ఇది ఔను, ఇది కాదు అన్న నియమ మెక్కడ ?

గిరి : పఠాభి కూడా పెద్ద విప్లవకారుడా ?

హరి : ఆయన విప్లవమంతా పూర్వకవితా సమయాలమీద. జార్జిటౌనులో చందమామని వర్ణించాడు. వీళ్లందరూ పూర్వకవిత్వ సంప్రదాయాలమీద దాడి ఎత్తినవాళ్లు. పూర్వకవిత్వంతో చంద్రుడు, మలయానిలం, మన్మథుడు, కోకిల, వీటిని ఆశ్రయించి వాళ్లు పద్యాలల్లుతారు. ఈ క్రొత్తకవులకు అవంటే ఒళ్లు మంట.

గిరి : ఎందుకబ్బా అంత ఒళ్లు మంట.

హరి : నన్నడిగితే ఒళ్లు మండవలసిందే అంటా. ఎందుచేతనంటే ఈ మలయానిలమూ, చంద్రుడూ ఎవరికయ్యా? మహారాజులకూ, భోగులకూ, మేడలమీద నిద్రపోయేవాళ్లకి—శ్రమజీవులకు మలయానిలమెందుకు ? తినటానికి తిండిలేనివాళ్లకి చంద్రుడెందుకు ? దేశమంతా ఈ దుస్థితిలో ఉంటే ఆ దుస్థితిని చూచి గుండెకరిగేవాళ్లకు వాటిమీద కోపం రావడం న్యాయమే కదా.

గిరి : అయితే ఈ కవులు దేన్నిగురించి పాడతా రంటావు. ఆ శ్రమజీవులనుగురించి పాడతారా ?

హరి : ఒక్క శ్రమజీవులేమిటి ? దుష్టులైన రాజుల నాశనాన్ని గురించి పాడుతారు. యుద్ధాలను గురించి పాడతారు. అందరికి తిండి కావాలన్న విషయాన్ని గురించి, లోకంలో దౌర్జన్యం నశించాలన్నవిషయం గురించి పాడతారు. నా గీతం అన్నది వినిపిస్తా విను.

గిరి : ఇంతకుముందు గీతం అని వినిపిస్తివిగదా ?

హరి : ఇందాకటి గీతం బహిర్విషయం. ఈ నా గీతం అంతర్విషయం. ఈ గీతంలో హేతువాదకవి తనకవిత్వం ఏలా ఉండాలో చెబుతాడు.

* * * *

మానవ మేధస్సుకు
సంకెళ్లను తగిలించిన
గతసాంఘిక శిలాశాసనం
పడగొట్టాను.

పగిలిన నా నిప్పుల కంఠం
పలికిన విప్లవ గీతం
కదలని నవసమాజ హిమాలయంతో
కదిలే నవక్రాంతి బాడబాగ్ని
మండించిన నా గీతం.

యుగాల నుంచి నడచే
నియమపు రైళ్లకు పట్టాలను
పీకేసిన నా గీతం

చీకటిలో పడి మ్రగ్గిన లోకానికి
దూరపు తీరాల్లో
మండే కాగడాలు
చూపించిన నా గీతం

గత సాంఘిక నరబలి నగరంపై
బాంబులు దూకించిన నా గీతం

సంకెళ్లను బంధాలను త్రెంచెయ్యను
నిప్పుల కత్తెరలను
సృష్టించిన నా గీతం

సమ్రాట్టులు చాచిన
నెత్తుటి నాలికలే సరికిందట

హిట్లర్లకు చాణుక్యులకు
గోరీ కట్టిందట

కాలపు దారుల్లో చీకటిముళ్లను
తొలగించిందట
వెన్నెల పూవులు చల్లిందట

శ్రామిక జన ఫాలంపై ఎండని ఘర్మజలం
చల్లని చేతులతో తుడిచిందట

వర్గరహిత సంఘ స్వర్గానికి
పూలనిచ్చెనలు వేసిందట

నరహంతలకు, చెరసాలలకు
ఉరి తీర్పులకు
నిరంకుశ నియంతలకు
తలకొరువులు పెట్టిందట

గత లోకం కాల్చిందట
నవలోకం చూపిందట
నడవండని చెప్పిందట.

గిరి : ఈ గీతం ఎవరు వ్రాశారు

హరి : బెల్లంకొండ రామదాసు వ్రాశాడు. అతడు నిజమైన హేతువాద యుగకవి. ఇతని స్నేహితులు కొందరున్నారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కవిరాజమూర్తి, అబ్బూరి వరదరాజేశ్వరరావు, రాజశేఖరం మొదలైన వాళ్లు. వాళ్లు యదార్థమైన విప్లవశంఖం ఊదిన వాళ్లు. ఇందులో ఇంకొక చమత్కార మున్నది. వాళ్లు రాజకీయాలు, సాంఘికాలు, మతవిషయకాలు అయిన

దౌర్జన్యాలను ఎదిరిస్తారు తప్ప మేం భారతీయుల మన్ననూట మరచిపోరు. ఈ క్రొత్తకవుల్లో అని శెట్టి అని ఒకాయన ఉన్నాడు. వట్టి కవే కాక సామ్య వాద సారస్వత స్వరూపం కూడ చెప్పగలవాడు. అతని ఒక పాట విను. ఆ గీతంయొక్క శీర్షిక వ్యాస సంతతి వాణ్ణి.

* * * *

వచ్చాను వచ్చాను
వ్యాస సంతతివాణ్ణి.
వెళ్లిపోయిన కోటి కోట్ల జీవుల విడచి
కుళ్లిపోయే నేటి కోట్ల జీవులకొరకు
పొల్లి వచ్చే కోటి కోట్ల జీవుల కొరకు
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి.

పగిలించి రణభేరి, పద్మవ్యూహము త్రెంచి
శివమెత్తి విస్ఫులింగములు చిమ్ముతు లేచి
ఈ జగతిలో నూత్న జగతి కల్పిస్తాను
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి.

తలలొగ్గి బానిస సలాము చెయ్యరు మీరు
ధనమదాంధత బలిసి తారసిల్లరు మీరు
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి.

ప్రేమమూర్తుల, నిత్య నృత్యమై, సత్యమై
భువనముల్ సకలముల్ పొంగి ఆడంగా
నిర్ఝరానంద మావిర్భవింపగా
వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి.

* * * *

హరి : విన్నావా వాళ్ల విప్లవం. భారతీయతకు వ్యతిరేక మైంది కాదు.

గిరి : బాబూ ఆ పాట నువు అనుకొన్నట్లు కాదేమో. వ్యాస సంతతివాణ్ణి అని అనడం మూలంగా నువ్వు సంతో షిస్తున్నావు. కాని అతని ఉద్దేశ్యం అది కాకపోవచ్చు. వ్యాసుడెల్లా పూర్వ సంఘాన్ని తీర్మానం చేశాడో ఇప్పటి సంఘాన్ని తా నట్లా తీర్మానం జేస్తానని అతని భావం కావచ్చు.

హరి : ఆ సంగతి నాకూ తెలుసు. కాని వ్యాసుడని అన్నాడుగా నోటితో, నా కంతేచాలు.

గిరి : సరేకాని శ్రమజీవు లన్నావు. వారినిగురించి ఏమీ చెప్పవేం ?

హరి : అసలీ కథంతా దానిమీదనే ఆధారపడి ఉన్నది. కుందుర్తి ఆంజనేయులు అన్న అతను ఆకలియాత్ర అని వ్రాశాడు.

* * * *

కదిలిం దొక మహాయాత్ర
నగం తిండి తిని బ్రతికె
శ్రమజీవుల క్షుధాయాత్ర
కదలిం దొక మహాయాత్ర
కలవారిపై దండయాత్ర.
కూటికి గుడ్డకు వాచిన కోటి
నరుల కోపయాత్ర. కదలిం దొక—

* * * *

హరి : ఆకలినిగురించి ప్రసిద్ధుడైన హేతువాద యుగకవి వ్రాయకుండా ఉండడు. శరీరమాద్యంఖలు ధర్మ సాధనం. శరీర ముండేందుకు అన్నం తినవలె కదా. నిరుద్యోగ సమస్యకి అవధి లేదుకదా. అయితే ఇక ఇలాంటి కవులెందుకు పుట్టుకురారో చెప్పు.

గిరి : అయితే వీ ళ్లందరూ దేశాన్ని బాగుచేస్తా రంటారా ?

హరి : యత్నే కృతే యది నసిద్ధ్యతి కో౽త్ర దోషః .... ఇతర దేశాల్లో ఇటువంటి కవుల మూలంగా విప్లవాలు వచ్చి నవి. చాలచోట్ల నిష్కృతి కలిగింది. వీళ్లవల్ల కూడ జరుగుతుందేమో.

గిరి : ఆదేశాలు వేరు, మన దేశం వేరు. ఒట్టి పాటలతో విప్లవం రాదు.

హరి : వచ్చేవేళకి అదే వస్తుంది.

గిరి : నీవుకూడ విప్లవవాదివేనే.

హరి : నేను కవిత్వంలో మాత్రం కాదు. అది అలా ఉంచు .... మానవునికి కూడూ గుడ్డ సహజమైన హక్కు. ఆ హక్కు పేరు ఇంగ్లీషు చరిత్ర పరిభాషలో చెబితే మాగ్నా కార్టా అంటారు. బాలగంగాధర తిలక్ మాగ్నా కార్టా అని ఒక గీతం వ్రాశాడు.

గిరి : బాలగంగాధర తిలక్కా. అతను తెలుగు పాట వ్రాశాడా.

హరి : ఇతను ఆ తిలక్ కాదు. ఒరేయ్ అబ్బాయి! నువ్వు తెలుగువాళ్ల పేర్లు చూచి భయపడకు. ప్రపంచకంలో ఏ క్రొత్త వచ్చినా మంచినీటికి చేప ఎక్కినట్లుగా, ఎక్కే జాతి ఏది ఉన్నదంటే దానిపేరు తెలుగుజాతి. తిలక్ అన్నదానికే ఆశ్చర్యపోతున్నావే. యూరోపియన్ల పేర్లు పెట్టుకున్నవాళ్లు కూడ తెలుగువాళ్లలో ఉన్నారు. నన్నడిగితే సృష్టి అంతా ఒక్కటి కావాలి. అందరూ ఒకటే అవాలి. భేదాలు ఉండకూడదు—అనే మహాసిద్ధాంతం ఆచరణలోకి వస్తే అది తెలుగు దేశంలోనే మొదలుపెడుతుంది.

గిరి : నిన్నడిగితే ఇది చెబుతావు, అంతేకదూ.

హరి : అవును అంతే.

గిరి : నేను నిన్నడుగను.

హరి : అడక్కపోయినా చెబుతాను. తరువాత విను. ఈ విప్ల వాన్ని బాగా సాధించినవాళ్లు కొంద రున్నారు. సుంకర, తుమ్మల వెంకట్రామయ్య, అవసరాల సూర్యారావు,

రెంటాల రమణారెడ్డి, రాంషా మొదలైనవాళ్ళు. ఇందులో తుమ్మల వెంకటరామయ్య చాలా గడుసైన కవి. గొప్ప కవితాశక్తి కలవాడు. విప్లవాన్ని పరమరమణీయంగా చెప్పగలవాడు. చక్కని పలుకుబడి గలవాడు.

గిరి : అయితే అతని పాట ఒకటి వినిపించు.

హరి : చెల్లీ .... అని ఒక పాట వ్రాశాడు.

* * * *

చెల్లీ కన్నీ రదేల ?
తల్లీ గద్గద మదేల
నీ నెచ్చెలి గుండెనుండి దూసుకున్న తుపాకిగుండ్ల
కఠిన కర్కశ విలయ ధ్వనిలో
నీ గాజుల మంజులరావం
నీ కంకణ నిక్వాణం
నీ నవ్వుల చిరుమువ్వలు వినరావో ? ఇక తల్లీ.
ఈ శోకపు తెర విడిపోయి
ఈ లోకపు వ్యధ తీరిపోయి
దానవలోకం సమయునులే
నవలోకం ప్రభవించునులే
మానవలోకం వెలయునులే
పగపేటికి తల్లీ పగబూనుము
నీ పగ తీరునులే చెల్లీ ......
నీ పగ తీరునులే తల్లీ !

* * * *

హరి : అతని విప్లవ కంఠధ్వని అంతా, నీ పగ తీరునులే చెల్లీ, నీ పగ తీరునులే తల్లీ .... అని అనడంలో ఉంది. నిజం మాట్లాడితే తుమ్మల వేంకట్రామయ్య అచ్చమైన తెలుగుకవి. ఇతరులు వ్రాస్తారు. శబ్దాలంకారా లుంటవి, ఫిరంగి ఘాంకారా లుంటవి. పాశ్చాత్యుల కవిత్వాలలోని కవి సమయా లుంటవి. ఇతని కవిత్వంలో అచ్చమైన తెనుగుదన ముంటుంది. యదార్థమైన విప్లవ భావముంటుంది.

గిరి : నా కిప్పుడు విప్లవమంటే చక్కగా అర్థమైంది. ఈ 'యుగధర్మపు కవిత్వంలో షోకు లేమైనా ఉంటే చూపిస్తావా ?

హరి : అట్లా అడుగు. మనిద్దరి ప్రాణం కాస్త తెరిపిన పడుతుంది. వట్టి హేతువాదయుగకవిత్వరచనాచమత్కారోల్లసనము కావాలంటావా. కో కొల్లలు. చూడు ఆవంత్స సోమసుందర్ .... సమధర్మం అని ....

* * * *

తన చరిత్ర తనే పఠించి—ఫక్కున నవ్వింది ధరణి
తన గాథను తనే స్మరించి—భోరున ఏడ్చింది ధరణి
వృద్ధజగతి సమాధిపై—సమధర్మం ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల—వేకువ మొలకువ పుట్టును.

* * * *

ఇది నడకలో ఒక సొగసు. ఇతడు రచనలో నడక సొగసులు చాలా చూపించగలవాడు. మనూనా, బైరాగి నడక సొగసులు లేకపోయినా క్రొత్తకవుల్లోని వాళ్ళు. అబ్బాయీ, నేను విప్లవవాదినైనా నా విప్లవం ఒక తరహాది. ఇందులో ఒక రహస్యం ఉంది. పూర్వ కవుల సమయా లున్నాయి కదా ?

గిరి : అవి యేమిటి ?

హరి : ఇందాక చెప్పాను కదయ్యా. శుక్లపక్షపు వెన్నెల, చందమామ, మలయమారుతము, చిలుక, కోకిల తుమ్మెద, నదులలో తామరపూలు, ఇవన్నీ. అవి చూచి విరహంపొందే పూర్వ నాయికల యాథార్థ్యం ఎక్కడో గాఢమైన, లోతైన శిలంలో దాగిఉంటుంది. అందరికీ తెలియదు. ఇలాగా ఈ క్రొత్త కవులకు కూడా కొన్ని సమయా లున్నవి. ఇనుపసంకెళ్ళు, ముళ్ల కిరీటం, ఫిరంగి మ్రోత, ఆకలి మొదలైనవి. పూర్వ కవులలో ధారాళంగా వాడే శబ్దాలు, సమాసాలు ఉంటవి. వాటిని ఈ క్రొత్త కవులు ఆక్షేపిస్తారు. ఈ క్రొత్త కవుల్లో కూడా ధారాళంగా వాడే శబ్దజాలం ఉంది. ప్రతివాడూ దాన్ని వాడుతూనే ఉంటాడు. వాళ్లందరూ అక్కడ ఎట్లాగో ఇక్కడ వీళ్లందరూ అట్లాగే. రెండో రకానికి, మూడో రకానికి చేరుతారు. ఆకలి, శ్రామికులు, తలుపులు విరుగదన్నుతాను, డొక్కలు చీలుస్తాం —ఇలాంటి మాటలు వీళ్లలో ఎక్కువగా ఉంటవి. ఆ పూర్వకవుల్లో ఇవతళించుట, అవఘళించుట మొదలైన శబ్దాలుంటాయి. వీ టన్నింటిని వదలి పెడితే అక్కడా ఇక్కడా కూడా భావుకులైన కవుల సంఖ్య కొద్దిగానే ఉంటుంది. పూర్వ కవులు ఆ శబ్దజాలాన్ని ఉపయోగించుకొని గ్రంథాలువ్రాసి ఎవరికైనా అంకితాలిచ్చి డబ్బు సంపాదిస్తారు. ఈ క్రొత్త కవులకు మాత్ర మాప్రయోజనంలేదు. వాళ్లను తిడుతూండటం, విప్లవాన్ని వాంఛిస్తూండటం. అది వీళ్ల చేస్తూంటారు.

గిరి : నడకలసొగసు లింకా చూపిస్తానంటివి కదా.

హరి : ఆఁ. అన్నాను. సంపత్ అని ఒక కవి ఉన్నాడు. అతడేం విప్లవవాది కాడు. అతడు ఈ రచనల్లో చాలా నడకలు చూపినవాడు. అతడు విప్లవవాది కాదనడానికి మేఘసందేశం ఈ ఛందస్సులో తెలుగు చేశాడు. ఒక పద్యం విను.

* * * *

తన్వి, యౌవని, శిఖరిదశను మధుబింబోష్ఠి,
తను మధ్య, చకితహరిణనేత్ర, నతనాభి,
పృథుల శ్రోణీభరాలసగమన, నరూఢ
కఠిన కుచభారమున కిందివనతవక్ష

ఆవిధాతృనియువతి గతమైన ప్రప్రథమ
శిల్ప మనదగు దాని నచట దర్శించెదవు.
ఆభరణశూన్యమై, ఆ అబల మృదులమై
తరచు శయ్యోత్సంగనిహితమగు తన మేను
అతి కష్టమున ఎట్లో ధరియించుచుండగా
గుండె చెరువై పోయి నీకు తప్పక కనుల
నీరు జలజలరాలు, ఆర్ద్రహృదయులకెల్ల
దీనకరుణావృత్తి ఎల్లపుడు నుండు కదా.

* * * *

గిరి : ఇంకెవరైనా ఉన్నారా.

హరి : పుట్టపర్తి నారాయణాచార్యులని ఉన్నాడు. ఆయన గొప్ప కవి. పండితుడు. అతడు శివతాండవం వ్రాశాడు. అది క్రొత్త గమనంలో ఉంటుంది.

* * * *

తలపైన చదలేటి అలలు తాండవమాడ
అలల త్రోపుడుల క్రొన్నెలపూవు కదలాడ
మొనసి ఫాలముపైన ముంగురులు చెరలాడ
కనుబొమ్మలో మధుర గమనములు నడయాడ
కను పాపలో గౌరి కసి నవ్వు బింబింప
కనుచూపులను తరుణకౌతుకము చుంబింప
కడగి మూడవకంటి కటికనిప్పులు రాల
కడుపేర్చి పెదవిపై కటికనవ్వులు వ్రేల
ధిమిధిమి ధ్వని సరిద్గిరి గర్భములు దూగ
అమిత సంరంభ హాహాకారములు రేగ
ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు.

కినల జటాచ్ఛటలు మునరుకొని వ్రేలాడ
బునలుకొని తలచుట్టు భుజగములు పారాడ
భుగభుగ మటంచు నిప్పులు క్రుమ్మ ఊరుపుల
ధగధగిత కాంతి తంద్రములుగా కకుభములు
అజుడు కేల్గవమోడ్చి హరహరాయని వేడ
ఝణత తధిఝణత తధికిణతో అను మద్దెలల
రణనమ్ము మేఘ గర్భముల దూసుకపోన
ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు.

* * * *

గిరి : సరేకాని, తెలంగాణావాళ్లను ఎవరిని చెప్పలేదేం.

హరి : బాగా జ్ఞాపకం చేశావ్. నారాయణరెడ్డి అని ఒక కొత్త కవి వచ్చాడు. తళతళ లాడుతున్నాడు. విను. అతడు మాత్రాచ్ఛందస్సు నవలంబించి రెండు గొప్ప గ్రంథాలు వ్రాశాడు. నాగార్జునసాగరం, కర్పూరవసంతరాయలు అని.

గిరి : అతని కవిత్వంయొక్క వైశిష్ట్యం ఏమిటంటావ్ ?

హరి : అతడు తెలంగాణావాడు. తెలంగాణాలో ముషాహిరాలు జరుగుతవి. ఎప్పుడన్నా విన్నావా ? ఉర్దూ కవులు గజళ్లు పాడతారు. ఆ పంపిణీమీద నారాయణరెడ్డి తన కవిత్వాన్ని వృద్ధి చేసుకున్నా డనుకుంటాను. గజలు యొక్క సొగసు అంత్యప్రాసలో ఉంటుంది. ఈ క్రొత్త కవులందరూ వా డేదైనా నారాయణరెడ్డి దానికో వైలక్షణ్యం తెచ్చాడు. అతడు చదవడం కూడా అంతరమ్యంగా చదువుతాడు. ఇందులో కాళోజి అని ఒక కవి ఉన్నాడు. గజలు కవిత్వానికి మరీ నకలు. అతని ఆక్షేపణ ఇంత సున్నితంగా ఉంటుం దనటానికి వీలుండదు. మేము గాంధిని అనుసరిస్తున్నాం అని ఒక పాట ఉంది. అది వింటే తెలుస్తుంది. దాశరథికూడా ఆ జాతిలోనివాడేనని చెప్పాలె కాని ....

గిరి : కాని, గీనీ లేదు కాని నీవు అతణ్ణి గురించి నాకేమీ చెప్ప వద్దు. అతడు వ్రాసిన శిల్పి పద్యాలు రెండు చదువు.

హరి : ఓరి, నీ తస్సాగొయ్యా. వీళ్లనిగురించి నాకంటే ఎక్కువే తెలుసు. నా చేత వాగిస్తున్నావన్నమాట.

నినుగని కొండలన్ని రమ
ణీకుచపాళికలై, కపోల మో
హన ఫలకమ్ములై భ్రుకుటు
లై కుటిలాలక జాలమై సురాం
గనలయి రూపు దిద్ది కొన
గా, ఉలితో నమృతంబుచల్లి జీ
వనములుపోసి పోయెదవు
బ్రహ్మవు శిల్పి కులావతంసమా
సుత్తెల మ్రోతతో అలసి
చొక్కిన కొండల పిండులెల్లనో
రెత్తి ఎలుంగవెట్టి, ఇపు
డీ వెటువంటి మనోజ్ఞరూపకం
బెత్తు మటన్న ఎత్తెదము
ఎందుల కిట్టుల మట్టిమట్టిగా
మొత్తెదవోయి? శిల్పి కుల
భూషణ శైలశిలా ప్రవేషణా.

గిరి : పద్యం ఎంత చక్కగా వ్రాస్తాడయ్యా.

హరి : అసలు మూలపురుషు డున్నాడు. ఆయన పద్య మెంత బాగా వ్రాస్తా డనుకున్నావ్.

గిరి : ఎవరాయన.

హరి : ముందర పద్యాలు విను.

చక్కని రాచబాట బడి
సొగుచుఁబోవ అశోకవృక్షముల్
చిక్కని పూవుతేనియలు
చింది పయింబడ కార్చుచుండగా
మక్కని జంపు జొంపముల
మాటున దాగిన పూవుగుత్తులున్
చిక్కణమైన రీతి విర
జిమ్ముచునుండెను కమ్మదావులన్

చల్లని మ్రాకుల నీడను
మల్లాడుచునుండ మార్గ మధ్యమునందున్
తెల్లని ఉడుపులు తొడిగిన
గల్లంతులమారి జాణ—కకవిక నవ్వెన్.

వలిపంపు చీర కట్టియు
కలపంబును పూసి కర్ణికారము చెవులన్
వెలయగ సొగసుగ నిల్చిరి
వలభీ పార్శ్వంబులందు పల్లవపాణుల్.

కలకల నవ్వుచు దిశలన్
కలకల మను నెమ్మొగంబు కాంతులు పర్వన్
కలకంఠ స్వరములతో
కలవాణులు పాడుచుండగా విని యంతన్.

రాచబాటను విడనాడి ప్రక్కనున్న
చంద్రకాంత శిలాచయ స్థగితమైన
వీధిబడి పోవుచుండ త్రివిష్టపమున
కానరాని విడ్డూరముల్ కానవచ్చె.

గిరి : ఎవరయ్యా. ఎంత మధురమైన కవిత్వం. ప్రబంధ కవులకవిత్వమల్లే ఉందే? ఈయన విప్లవ వాదేమిటి ?

హరి : ఆయన విప్లవవాదం తరువాత పద్యంలో చూడు. ఇదిగో ....

శ్రోత్రియవరుడైన—సోమయాజులు సాని
కొంపతల్పులుచేత కొట్టుచుండ
పీరగంధముతోడ—పెనగి కూలిన మల్ల
సానివాడ పచారు—సల్పుచుండ
యజ్ఞయాగాదుల—నాచరించిన యోగి
రోపడుంతుల ఇండ్ల—రోయుచుండ
నిర్జించి తపములో—నిగ్గిన జటిలుండు
బొణుగు బోటుల పొజ—పొంతనుండ
జాడ తెలియక జడదారి—తారుచుండ
కొంటె తెరగంటి కన్నెడ—న్గొట్టుచుండ
వనువుకాడట్టె పెడనవ్వు—నవ్వుచుండ
నల్లకల్లోలమైపోయె—నాకపురము.

గిరి : ఓరి బాబోయి. చెప్పావు కావే.

హరి : ఇప్పుడు తెలిసిందా ? అసలీ హేతువాద యుగానికి మూలపురుషు డాయన. ఆయనపేరు త్రిపురనేని రామ స్వామిచౌదరి. ఆయన సూతనపురాణమని మహాగ్రంథంగా వ్రాశాడు. ఆయన పద్యరచనా శైలి అంత మధురంగా ఉంటుంది. భావాలన్నీ పురాణాలకు వ్యతిరేకం. మొదట విప్లవం తెచ్చింది ఆయన. ఈ విప్లవాదులు నిజంగా విప్లవాదులైతే, ఆయన కొక శిలాప్రతిమ వేయవలె.

గిరి : ఆయన నాటికి యుద్ధాలు లేవుగా. అందుకని వెయ్యరు. ఇంతకూ నీవు ఆయన పక్షమా యేమిటి ?

హరి : నేను ఎవరిపక్షమూ కాదు. ఊరికే చరిత్రకారుణ్ణి. ఇది ఈలా ఉంది, ఇది ఇలా ఉంది అని చెప్పేవాణ్ణి. పరమేశ్వరుని అనుగ్రహంవలన ఏ గుణమన్నా గ్రహించ గలవాణ్ణి.

గిరి : పరమేశ్వరుడని అంటున్నావు. నీవు విప్లవవాదివి కావు.

హరి : ఓరి పిచ్చివాడా. విప్లవము కూడ పరమేశ్వర స్వరూపమే. నీ చరిత్రలో నీ యుద్ధాలు, నీ సంఘ సంస్కారాలు, నీ విప్లవాలు, నీ ద్వేషాలు, నీ అన్యాయాలు, నీ ఉపకారాలు, నీ కవిత్వాలు సర్వమూ పరమేశ్వరునియొక్క విలాసం. నీవు ఒప్పుకోవు. నేను ఒప్పుకుంటాను. నేను ఒప్పుకున్నా నీవు ఒప్పుకోకపోయినా జరిగేది ఏలాగా అల్లాగే జరుగుతుంది. ఒకవిధంగా జరగాలని నీ వనుకుంటావు. అల్లా జరిగితే జరగవచ్చు. ఎవడు చెప్పగలడు. పరమేశ్వరుని అనుగ్రహం ఉండాలి.

గిరి : అయిపోయిందా ఇంకేమన్నా చెబుతావా ?

హరి : ఈ యుగాన్నిగురించి చాలా చెప్పాలి.

గిరి : నాకు నిద్రవస్తుంది. నేనింక వినలేను.

హరి : టూకీగా నాలుగు మాటలు విను.

గిరి : ఇంక ఏమైనా ఈ యుగంలో జరిగిన సాహిత్య ప్రక్రియలుగురించి చెబితే వింటాను.

హరి : నేనదే చెప్పబోతున్నాను. ఒక యుగంలో ఒక ప్రత్యేక లక్షణం ఉండటంచేత తక్కిన లక్షణా లుండవని అనుకోకూడదు. .... సర్వమతాలనూ నిర్మూలించిన రష్యాలో బౌద్ధులు కూడా ఉన్నారట. ప్రబంధ యుగం పోయిందనుకుంటాం. పోలేదు. గడియారం శేషశాస్త్రి శివభారతం వ్రాశాడు.. తిక్కనవంటి కవి తుమ్మల సీతారామమూర్తిచౌదరి ఆత్మకథ వ్రాశాడు. ఆయనది స్వచ్ఛమైన భాష. పింగళి, కాటూరులు సౌందరనందం వ్రాశారు. ముక్కు తిమ్మన్న అవతారము లనవలె. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి ఆంధ్రపురాణం వ్రాశాడు. మధురంగా, తీవిగా, చక్కగా వ్రాస్తాడు. దుర్భాక రాజశేఖర శతావధాని

రాజశేఖర చరిత్రము, రాణా ప్రతాపసింహ చరిత్రము, అమరసింహ చరిత్రము మొదలైన గ్రంథాలు వ్రాశాడు. వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు మునిత్రయ చరిత్రము, శంకర విజయము అన్న మహాగ్రంథాలు వ్రాశారు. పూతలపట్టు శ్రీరాములు రెడ్డి కంబరామాయణం తెలుగు చేశాడు. అచ్చమైన తెలుగు పద్యం ఎల్లా ఉండాలంటే ఆయన పద్యం ఉదాహరణంగా చూపాలి. పూర్వకవిత్వంయొక్క లక్షణా లన్నీ సరిపోయేట్లుగా వ్రాసే కవులు నెల్లూరులో, చిత్తూరులో, ప్రొద్దుటూరి దగ్గర వందమంది ఉన్నారనుకో.

గిరి : బాగా ఉంది, విమర్శ ఏమీ లేదా ?

హరి : లేదా ? బలేవాడవే. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, నండూరి బంగారయ్య మొదలైన విమర్శకాగ్రేసరు లున్నారు. మొన్నమొన్నటిదాకా కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి మొదలైనవాళ్లు ఉండేవాళ్లు.

గిరి : ఇంకా ఏమైనా చెప్పాలా ?

హరి : నిద్ర వస్తుందా ?

గిరి : నిద్ర పోయింది-చెప్పు.

హరి : అసలు విషయం చెప్పలేదు. చెప్పవలసిన విషయాలు రెండు ఉన్నవి. ఒకటి నవలలుగురించి, రెండు చిన్న కథలను గురించి. ఇవి రెండూ హేతువాద యుగంలో ఇంతింతై వటుడింతయై మరియు తానంతై నభో వీథిపై అంతై, తోయద మండలాగ్రమున కల్లంతై అన్నట్లు వెళ్లుతున్నవి. అడవి బాపిరాజు, ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులు, నోరి నరసింహశాస్త్రి, గోపీచందు, బుచ్చిబాబు, కొడవటిగంటి కుటుంబరావు, చలం, మొద లైన రచయితలు మార్గాలు భేదమైనా, ఒక్కొక్కడు దిగ్గజము వంటివాడు. తెలుగునవలా ప్రపంచాన్ని సమృద్ధిగా పండించినవాళ్లు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈమధ్య కొన్ని నవలలకు బహుమతు లిచ్చినది. మల్లాది వసుంధర, ధూళిపాళ శ్రీరామమూర్తి, పాటిబండ మాధవ శర్మ మొదలైనవారి నవలలకు. అవి దివ్యములైన గ్రంథాలు. ఈ కాలము అఖండమైనది. పలునిఘంటు వులు, సర్వస్వములు బయలుదేరినవి.

గిరి : చిన్న కథలనుగురించి చెప్పవేం.

హరి : దానిని గురించి చెప్పటానికి వీలులేదు. వారపత్రికలలో వస్తున్నవి. ఓ కథలు కోకొల్లలు. మరి హాస్యరస కథలలో ముని మాణిక్యం పెద్దమాణిక్యం అని చెప్పాలి.

గిరి : ఇవన్నీ నిలుస్తవంటారా ?

హరి : ఆమాట ఇప్పు డనకూడదు. అది కాలం నిర్ణయించే పని.

గిరి : ఇంతకూ ఇందాక చెప్పావే ఈ యుగాధి పురుషుడని, ఆ త్రిపురనేని రామస్వామిచౌదరి, ఆయన మార్గాన్ని అనుసరించినవాళ్లు ఎవరైనా ఉన్నారా ?

హరి : చాలామంది ఉన్నారు. ఆయన పాండిత్యం కాని, ఆయన యొక్క ఔదార్యం కాని, ఆయన పద్యరచనా మాధుర్యం కాని లేనివాళ్లు, పద్యరచనాశక్తి కలవాళ్లు మాత్రం ఉన్నా రనవచ్చు.

గిరి : ఇంతకూ ఈ యుగపురుషు డెవరంటావు.

హరి : ఎవరేమిటోయ్ పిచ్చివాడా. ఈ చివరి గీతం ఎవడు వ్రాశాడో వాడు.

గిరి : ఎవడు వ్రాశాడు ?

హరి : నేను చెప్పను. గీతం విను.

* * * *

మరో ప్రపంచం, మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది.
పదండి ముందుకు, పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి

కదం త్రొక్కుతూ పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ—
పదండి పోదాం, వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం

పదండి ముందుకు, పదండి త్రోసుకు
ప్రభంజనంవలె హోరెత్తండి
భావ వేగమున ప్రసరించండి
వార్షుకాభ్రముల ప్రళయఘోషవలె
ఫెళఫెళఫెళఫెళ విరుచుక పడండి

పదండి, పదండి
పదండి, ముందుకు
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణమండే త్రేతాగ్ని మరో
త్రాచుల వలెనూ, రేచులవలెనూ,
ధనంజయునిలా సాగండి

కనబడలేదా మరో ప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు
హోమజ్వాలల భుగభుగలు.

మరో ప్రపంచం, మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి.

మామిడి వేంకటార్యుని శబ్దార్థ కల్పతరువు : సమగ్ర సమీక్ష

శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

ఇది 80 వేల సంస్కృతపదములు గల బృహన్నిఘంటువు. దీని రచయిత "పండితరాజ, బాలామర, సాహిత్యచక్రవర్తి" యను బిరుదములు గల్గిన కీ. శే. శ్రీ మామిడి వేంకటార్యులు. పరిష్కర్త శ్రీ శుద్ధ చైతన్యస్వామి. 36 వేల రూపాయలు వెచ్చించి, యీ గ్రంథమును ముద్రించి ప్రకాశకులైనవారు మచిలీపట్టణ (బందరు) వాసవీ గ్రంథ ప్రచారణ సమితివారు. చక్కని గ్లేజుకాగితములమీఁద ముద్దులొలుకు ముద్రణముతో సొగసైన క్యాలికోబైండుతో 1644 పుటలు గలది. "ఈ నిఘంటురాజము సంస్కృతశబ్దార్థములకు నిజముగా కల్పతరువే" యనియు, "నేఁటికి బయలుపడుట యెల్లర యదృష్టవిశేష" మనియు, పూజ్యులు 'ఉపరాష్ట్రపతి' శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణమహోదయుల వంటి పెద్దలు, పండితులు తమతమ యమూల్యములగు నభిప్రాయముల నంపినారు.

అసాధారణ పాండితీజన్యమగు నిట్టి నిఘంటురత్న మిన్నాళ్లదాఁక నజ్ఞాతముగా నుండుట సంతాపకరమైనను, శ్రీ శుద్ధచైతన్యస్వామి పరిశ్రమమహిమమున సర్వాంగసుందరముగా బయలువెడలి నందులకు నాంధ్రులపక్షముననే కాక, యావద్భారతీయుల పక్షమునను స్వాగతమునిచ్చుచున్నాము.

గ్రంథము విప్పఁగనే విజ్ఞాననిధులగు పెద్దల ప్రశంసాపత్రములు కనఁబడును. పిదప నిఘంటుపరిష్కర్తలగు శ్రీ శుద్ధ చైతన్యస్వామి కృతములగు (1) సమర్పణము (2) ఏఁబదినాలుగు శ్లోకములలో శ్రీ వేంకటార్యుని జీవిత చరిత్రము. (3) భూమికయును గోచరించును. ఆ భూమిక యందు (1) పరబ్రహ్మము—శబ్దబ్రహ్మము, (2) బ్రహ్మము అనాది—శబ్దముఅనాది. (3) బ్రహ్మము నిత్యము—శబ్దము నిత్యము (4) శబ్దజ్ఞానముల సామాన్య విశేష రూప వివేచనము (5) బ్రహ్మ విస్తారము — శబ్దవిస్తారము (6) బ్రహ్మమువలె శబ్దమును వ్యాపకమే (7) బ్రహ్మమువలె శబ్దమును సర్వప్రకాశకము (8) నిఘంటుశబ్ద నిర్వచనము (9) ప్రాచీన నిఘంటువులు (10) ఈ నిఘంటు స్వరూపము (11) పరిష్కర్తలు చేసిన మార్పులు (12) గ్రంథనియమములు (13) గ్రంథము చూడవలసిన పద్ధతి (14) క్షకారవిషయము—మున్నగు నమూల్య విషయములు గోచరించును.

శ్రీ వేంకటార్యులు రెండువందల యేండ్ల క్రిందట జన్మించెననియు, నూటముప్పది యేండ్ల క్రిందట యశశ్శేషులైరనియు జీవితచరిత్రమునఁ దెలియుచున్నది. ఆయన బిరుదత్రయమునుబట్టి, పండితప్రకాండుఁడు, అమరకోశాది సకలసంస్కృత నిఘంటువులను కరతలామలక మొనర్చుకొనిన విద్యాతపస్వి, బగళాదేవ్యుపాసకుఁడై, కవితా విశారదుఁడై కీర్తిచంద్రికల దశదిశల మెఱిసిన కళానిధి యనియు, విదితమగు చున్నది. జన్మస్థానము గోదావరీ మండలాంతర్గతమగు పాలకొల్లు. అయినను జీవితమున హెచ్చు కాలము బందరుపురముననే గడపిన ట్లగపడును. సంస్కృతాంధ్రభాషలు కూలంకషముగా నేర్చినందులకు శ్రీ వేంకటార్యుఁడు "(1) శబ్దార్థ కల్పతరువు (2) ఆంధ్రదీపిక (3) ఆంధ్ర లక్షణము (4) పర్యాయ రత్నమాల (5) అలఘురేఫ నిర్ణయము (6) వేంకయార్య వ్యాకరణము (7) సశేషామర కోశము (8) ఆచార సుధామణి" యను లక్షణ గ్రంథములను సంస్కృతాంధ్రములందు రచించి, లాక్షణికశిరోమణియను ప్రసిద్ధినందిన ధన్యచరిత్రుఁడు—మఱియు అష్టశతావధానము లొనర్చి యానాఁటి దొరతనమును మెప్పించిన మేధావి యని జీవిత చరిత్రము తెలుపుచున్నది.

అన్నివిధముల నంతటి నిండుఁదనము గలవాఁడు కావుననే శబ్దార్థకల్పతరువు వంటి బృహత్కోశరాజము నొక్క చేతిమీఁదుగా సంతరింపఁ గల్గినాఁడు. ఆ మహనీయుని వ్యాకరణ శాస్త్ర మార్మికత "భగవతాభాష్యకారేణ "వాక్శబ్ద" ఏకాక్షర ఇత్యుక్తత్వాత్, అబ్విశిష్టహలేవాక్షరః" అను వ్రాఁత ప్రతియందలి యుపోద్ఘాతవాక్యమే వెల్లడించుచున్నది. శబ్దస్వరూపనిర్ణయమున నట్టి వ్యాకరణ వైదుష్యమును, అర్థనిర్ణయమున సకల సంస్కృత నిఘంటువుల పరిశీలనా నైపుణ్యమును గల మేటికావుననే అసాధారణ పద్ధతిని నిఘంటు నిర్మితికిఁ గడంగినాఁడు.

సంస్కృతమున శ్లోకనిబద్ధములై ప్రాచీనములగు అమరకోశాది నిఘంటువులు పెక్కు గలవు. అందు కొన్ని పర్యాయపదములను, కొన్ని కేవల నానార్థములను దెలుపును. అవి ధేనికవి యపర్యాప్తములు. వానిలో నానార్థనిఘంటువులు అంత్యాక్షర నియమముతో (కాంతములు, ఖాంతములు గాంతములు ఇత్యాదిగా) రచింపఁబడి, ఏకాక్షర, ద్వ్యక్షర, త్ర్యక

రాది క్రమమున నున్నవి. కాని ఆంగ్లనిఘంటు పద్ధతిని (అకారాది) వర్ణమాలాక్రమముతో , వచనరూపమున నున్న నిఘంటు వొకటియును లే దనియే చెప్పవచ్చును.

బ్రిటిషుపరిపాలన కాలమున ఆంగ్లనిఘంటువుల పద్ధతిని "శబ్దకల్పద్రుమము, వాచస్పత్యము, మోనియరు విల్యమ్సు నిఘంటువు, ఆప్టే నిఘంటువు" మున్నగు కొన్ని సంస్కృత నిఘంటువులు వెలసినవి. కాని వానిలో కొన్నిట సంస్కృత పదములకు సంస్కృతముతోను, కొన్నిట ఆంగ్లముతోను, అర్థాదికము వివరింపఁబడుటచే సంస్కృతముగాని, ఆంగ్లముగాని నేర్వని భారతీయుల కవి యందని మ్రానిపండ్లయినవి.

ఇట్టి లోపమును గ్రహించి నూటయేఁబది యేండ్ల క్రితము శ్రీ వేంకటార్యుఁ డాంధ్రుల కెల్లరకును, ఇతర దేశీయులగు సంస్కృతపండితులకును సుగమముగా నుండు నట్లు సంస్కృతాంధ్రవివరణముల రెండిటితో నీ కల్పతరువును నిర్మించినాఁడు. అమరకోశాది ప్రాచీననిఘంటువులలో నానార్థములు గల పదములు ఏక, ద్వి, త్రి, చతు, రాద్యక్షర సంఖ్యతోను, అంత్యాక్షర ప్రధానముగాను, నుండుటచే అభీష్ట పదమునకై, అంత్యాక్షరమును మనసున నుంచుకొని యా జాతి పదముల నన్నిటిని వెదకవలసి వచ్చుచున్నదని వేంకటార్యుఁ డా ప్రాచీన సంప్రదాయమును విడువకయే, ఆంగ్ల నిఘంటు సంప్రదాయానుసారము పదాది నుండు నక్షరముల క్రమము నిందు ప్రవేశపెట్టి, కొంత సౌలభ్యము చూపి, ఆంధ్రదేశమందలి నిఘంటుకారులకు మార్గదర్శకుఁడైనాఁడు. ఆంగ్లభాషా వివరణములతో ఆంధ్రనిఘంటువును వర్ణమాలా క్రమమున మొదట రచించినవాఁడని ప్రతిష్ఠ వహించిన బ్రౌను దొరగారు తన నిఘంటువున శ్రీ వేంకటార్యుని స్మరించినారనుటచే ఆంధ్రనిఘంటు నిర్మాతలలో వర్ణమాలా క్రమమనుసరించిన ప్రప్రథముఁడు వేంకటార్యుఁ డన్నట నిస్సంశయము.

అకారాది పద నిఘంటువులగు "శబ్ద కల్పద్రు"మాదు లందు వలె నీ నిఘంటువున "కావలె" ననిన పదము సులభముగా చూడ వీలుగాదు. ముం దాపదమున కాదియం దేయక్షర మున్నదో అంతమున నే యక్షర మున్నదో తెలిసికొని అకారాది వర్ణక్రమములో అంత్యాక్షరమును విడువక చూడవలెను. "అమరః" అను పదము చూడవలె ననిన అకారాదులు రేఫాంతములు నగు మూఁ డక్షరముల పదములలో చూడఁగా అచట అర్థములతో నా పద మగపడును. ఈ రీతిగా శ్రీ వేంకటార్యుఁడు తన నియమములు చెక్కు చెదరకుండ— తెనుఁగు లిపిలోనే సంస్కృతపదములను, వానికి సంస్కృత వివరణమును, ఆంధ్రవివరణమును, తా నేనిఘంటువునుండి యాపదము గ్రహించెనో యా నిఘంటునామమును గూర్చెను. ఈ పద్ధతిని గూర్చి పరిష్కర్తలు భూమికలో "ఈ పద్ధతిచేత ఎన్ని యక్షరములు గల పదము కావలె ననిన ఆవిధమగు పద సమూహములో వెదకవలసిన శ్రమ లేకుండ ఒక్కచోటనే చూచుటకు వీలుపడును. అదియును గాక అందమైన గద్యపద్యాత్మక మగు కవిత్వ మల్లుటకును ఈ పద్ధతి చాల ఉపకరింపఁగలదు" అని వ్రాసిన దానిపై "కాని మామూలు నిఘంటువును చూచినదానికంటె నిది సులభపద్ధతి కాదనవలసి యున్నది" అని 1962 మార్చి 25 వ తేది ఆదివారమునాఁటి యాంధ్రపత్రికా సారస్వతానుబంధమున గ్రంథసమీక్షలో శబ్దార్థ కల్పతరువును ప్రశంసించుచు శ్రీ వావిలాల రామమూర్తిగారు వ్రాసినారు.

శ్రీ వేంకటార్యుని యసాధారణ పాండితీపరిశ్రమ ఫలమగు నీ నిఘంటువు ఖిలము గాకుండ రూపొందించిన శ్రీ శుద్ధచైతన్యస్వామి మూలగ్రంథమునఁ గల రమారమి పందొమ్మిదివేల పదములకు, నలుబదివేల పదము లధికముగాఁ జేర్చియు, ఆంధ్రలిపిలో నున్న ప్రధాన పదములను నాగర లిపిలో వ్రాసి, తెలుఁగర్థము వ్రాయునపుడు మూలమున లేకున్నను ఆ శబ్దమునకుఁ గల అచ్చతెలుఁగు పర్యాయపదములను జేర్చియు, మూలమున లేని ధాతురూపములు, కృత్తద్ధిత ప్రత్యయ వివేచనమును ప్రత్యేకముగాఁ జేర్చియు వివిధ పరిష్కారము లొనర్చుచు, ఆంగ్ల నిఘంటువుల మార్గమున కల వడిన యాంధ్రులకెల్లరకు సుగమ మగున ట్లీయంత్యాక్షరనియమము మాని, ఏకాక్షరాది విభాగము మాని ప్రతి పద గత వర్ణానుక్రమముగా పరిష్కరించిన నెంతయో బాగుగ నుండెడిది. అట్లుగాక వేంకటార్యుని నిర్మాణ పద్ధతియే చూపఁ దలఁచినచో, ఉన్నది యున్నట్లు ముద్రించినచో ఆ మహనీయుని శక్తి స్పష్టమగును గాదా ?

"శబ్దార్థ కల్పతరువు" వ్రాతప్రతి యొకటి రాజమహేంద్రమున శ్రీ రాజా కాంద్రేగుల జగన్నాథగోపాలరావు పంతులుగారిచే నెలకొల్పఁబడిన శ్రీ గౌతమీ విద్యాపీఠగ్రంథాలయమందుఁ గలదు. శ్రీ వేంకటార్యుఁడు బందరులోఁ జీవితము గడపుచున్నకాలమునఁనో, అనంతరావ్యవహితకాలమునఁనో కాని బందరునివాసి లక్ష్మయ్య యను నాయన వ్రాసికొనినట్లు నిఘంటువు తుదిని గలదు. ప్రాతప్రతి యగుటచే ఉపోద్ఘాత శ్లోకభాగమునను తుట్టతుది కాగితమునను గ్రంథపాతములు కనఁబడుచున్నవి. ఆ వ్రాతప్రతితో ముద్రితప్రతిని సరిచూడఁగా అందలి 18832 పదములకు ముద్రితమున సుమారు 40 వేల పదములు అధికముగా జేర్పఁబడుటయు, అర్థవివరణమున నెన్నియో మార్పులు (పెంచుట, కుదించుట)ను కనఁబడినవి. గ్రంథకర్త తనియమావళినిగూర్చి సంస్కృత శ్లోకములలోఁ జెప్పిన భాగమును, ఆరంభమును నీ క్రింద పొందుపఱిచెదను.

వ్రాతప్రతియందు మొట్టమొదట త్రిమూర్త్యాత్మకుఁడగు పరబ్రహ్మను ధ్యానించుశ్లోకములు మూఁడును సపరివారుఁడగు శివుని స్తుతించిన శ్లోకములు పదునైదును గలవు. ఆ వెనుక—

"అహం వైశ్య కులాంభోధి సోమః సోమ పదాశ్రితః
సంభూతో మామిడికులే వేంకటార్య సమాహ్వయః."

అని తన్నుఁగూర్చి చెప్పుకొనిన శ్లోక మొకటియును,

"సశేషామరకోశశ్చ తస్య నానార్థకాపిచ
విశ్వో విశ్వప్రకాశశ్చ నిఘంటుర్విశ్వమేదినీ
నానార్థ రత్నమాలాచ పర్యాయార్ణవ ఏవచ
శబ్ద శబ్దార్థమంజూషా శబ్దలింగార్థ చంద్రికా
పర్యాయ రత్నమాలాచ శబ్దరత్నం విషామృతం
సరస్వతీ విలాసశ్చ విద్వద్భిః సముదాహృతాః
విచార్యైతాన్ నిఘంటూంశ్చ శబ్దార్థా నాకలయ్యాచ
శబ్దార్థకల్పతర్వాఖ్యా కృతిరద్య విరచ్యతే"

అని తా నేయే నిఘంటువుల నుండి పదజాలముగ్రహించి యర్థ నిర్ణయమునకుఁ బూనుకొనెనో విశదముగాఁ జెప్పి, 'శబ్దార్థ కల్పతరు' వనుపేర నీ నిఘంటు విపుడు రచించుచున్నాను' అనెను.

తరువాత నిఘంటునియమములను దాదాపు పది శ్లోకములలో వివరించెను. కాని ప్రాఁతప్రతి యగుటచే కొన్నిభాగములు చినిగిపోయినవి. గ్రంథపాతములుగలచోట్ల కొన్ని యూహించియు, వీలుగానిచోట్ల కుండలీకరించుచు నీ దిగువ చూపెదను.

"ఏ తద్గ్రంథ స్త్రిభాగశ్చా చ్చకృతయాద్యంత భేదతః
కాండాస్తు పంచత్రింశశ్చ పదాంత్యాక్షర సంజ్ఞయా
ఏకైకకాండే వర్గాశ్చ యావదక్షర మానతః
వర్గేషువై ప్రకరణాని త్వాదివర్ణానుసారతః
ప్రకరణేషు సర్వత్ర గృహీతో గుణితక్రమః
నాక్షర క్రమ సంఖ్యాభ్యా మృతే కుత్రాపి వర్తతే
ప్రాతిపదికాంత్యవర్ణాన్ గృహీత్వాం తాః స్మృతాః పునః
పదాంతాస్త్వత్ర కాండేషు శబ్దానా మాదిభాగినాం
ప్రథమైక వచనాంత పదాంత్యా చ్చార్వగాన్ హలః
సంగృహ్యా వ్యవహ్రియంతే న పదాంత హల్వంత్వితః
అత్రాక్షరాణాం సంఖ్యాతు యావంతోఽచః స్థితాః పద్యైః
తావత్యైవ విజానీయా నాంత్యహల్ గృహ్యతేక్వచ"

—అక్షర నిర్ణయే అన్యచ్చ—

"అకారాద్యా అచః ప్రోక్తాః కకారాద్యా హలః స్మృతాః
సర్వేఽపి వర్ణాః పంచాశ దజ్విశిష్టహలోఽక్షరాః*
అచశ్చా ప్యక్షరా* ఉక్తా నానా మంత్ర విశారదైః"

భగవతా భాష్యకారేణ "వాక్శబ్ద" ఏకాక్షర ఇత్యుక్తత్వాత్, అజ్విశిష్టహలే వాక్షరః*, నిఘంటుకారై "రర్క, శుక, పికాది శబ్దాః కకారాంతా ద్వ్యక్షరా ఇ(తి గృహ్యంతే. మంత్రశాస్త్రప) రైః పంచాక్షరోఽయం మనుః. అష్టాక్షరోఽయం మంత్ర ఇతి ప్రతిపాదితత్వాచ్చ. అత్రగ్రంథే అజహిత పదాంత్యహల్ అక్షరత్వేన (సార్థక్యే) నచ నగృహ్యతే."

"పుంలింగశబ్దే పుంసీతి స్త్రీ లింగేతు స్త్రియామితి
నపుంసకే క్లీబ ఇతి త్రిలింగే త్రిష్వితీర్యతే
స్త్రీపుంలిం (గే ద్వయోరితి) క్లీబ పుంలింగకేఽస్త్రియాం
స్త్రీ క్లీబ లిం (గే) వాపుంసీ త్యేవం సంకేతితో మయా
శబ్దాంతానిచ లింగాన్యప్యర్థం వై పూర్వ సూరిభిః
(..............)క్ష్యంతే సంతస్తుష్యంతు మానసే

అస్మిన్ గ్రంథే విశేషోయం యశ్శబ్దః కామితో భవేత్
శబ్ద గ్రథన చాతుర్యా (.. ... ...)

అని కలదు. — తుట్టతుదినిగల కాగితముకూడఁ జినిఁగి పోయినది. అందీ యక్షరములు మాత్రము కనఁబడు చున్నవి. (.......... ంబా .... శుక్తి భలేన వేంక ...... త్రిశంత్కాండ గర్భత్రిభా .... కాండాత్మిక స్తృతీయో భాగస్స .... యీ గ్రంథకర్త అయిన మామిడి వెంకయ్య . . . . . క్ష్మయ్య వ్రాసెను. సర్వం శ్రీ లక్ష్మీనారాయణా.... అని మాత్రము కలదు.

తుదిభాగ మెట్లయినను మొదటి భాగమునఁ గల నియమావళి నంతయు నాగర లిపియందు ముద్రించి సంస్కృతమున వివరించినచో వేంకటార్యుని శక్తి భారతదేశమునకే కాక ప్రపంచమున కంతయు వెల్లడి యగును గదా! పరిష్కర్తలీ భాగమున నొక్క యక్షరమును ముట్టక తెలుఁగులో నించు మించు పై శ్లోకముల భావమును మాత్రమే వ్రాయుటకు హేతువేమో తెలియదు. ఒకవేళ వారికి లభించిన వ్రాత ప్రతిలో నీ భాగము లేదేమో!

శ్రీ రాజావారి వ్రాత ప్రతికిని పరిష్కర్తల వ్రాత ప్రతికిని భేదము లేనట్లు "శక్తిః" మున్నగు శబ్దములను (21) పీఠికలో చూపి 'యివి వ్రాతప్రతియందు వరుసగా లే' వని వా రనినట్లే రాజమహేంద్రపు ప్రతిలోఁ గూడ నుండుటచే స్పష్టమగుచున్నది. అట్టియెడ నింత తారుమా అగుటకుఁ గారణము దురూహముగా నున్నది. మఱియు విశాల హృదయులగు పరిష్కర్తలు "ఈ నిఘంటువులో ఆయా పదముల కడ సందర్భానుసారముగా తెలుఁగు పదము లచ్చటచ్చట జేర్చియుంటిమి. వీనిలో ఎచ్చటనైనను (గ్రామ్యపదముల వంటివి) లోపము లుండవచ్చును. వీనిని గాని లేదా ఏవిధమైన దోషములను గాని, లోపములను గాని దయతో వాసవీ గ్రంథ ప్రచార సమితి పేర మాకుఁ దెలియఁ జేసిన యెడల పునర్ముద్రణమున వానిని అవశ్యము సవరణ చేసికొనెదమని సవినయముగా విన్నవించుకొనుచున్నాము" అని యభయ మొసఁగిరి. కాన అందందు గోచరించు ప్రమాదము లనుకొన్నవి చూప సాహసించెదను.

ప్రమాదము లనునవి యెంతవారికిని నుండవచ్చును. నేను ప్రమాదములని చూపునవి భ్రాంతిమూలకములు కావచ్చును.

---

* "అక్షరాః" అని రెండు మూఁడు తావులను పుంలింగ ప్రయోగము. ఈ యర్థమున నపుంసకమని నిఘంటువు లన్నిటను గలదు. వ్రాతప్రతియందు (శ. క. త) "అక్షరం— అదంతః పుంసి—అమరః + మోక్షే–నానార్థ రత్నమాలా. క్లీబే— ప్రణవే—ధర్మే—ప్రకృతౌ—తపసి—క్రతౌ — అకారాద్యక్షరే + పుంసి — శివే — విష్ణౌ — విరించౌ — విశ్వః. క్లీబే— పరమాత్మని" అనియు, ముద్రితమున—"అక్షరం–అ. న. మోక్షే, ప్రణవే, ధర్మే, ప్రకృతౌ, ... అకారాది క్షకారాంతవర్ణే" అనియు నుండుగా—పుంలింగముగా వేంకటార్యుఁ డెట్లు గ్రహించెనో విచార్యము.

అయినను స్నేహార్ద్ర హృదయముతోఁ దెలియఁజేసినపుడు సహృదయు లందఱి సత్యాసత్యములను పరిశీలించి సత్య మేయుంచుకయైన నున్నయెడ గ్రహింతురుగాని యా గ్రహింపరను ధైర్యముతో కడంగుచున్నాను.

"ఆన్వీక్షకీ" శబ్దమీ నిఘంటువునఁ గాని పరిశిష్టమునఁ గాని గ్రహింపఁబడలేదు. 'ఆన్వీక్షకీ దండనీతి స్తర్కవి ద్యార్థ శాస్త్రయోః' అని అమరము. వ్రాతప్రతియందు—"ఆన్వీక్షకీ—ఈకారాంతస్త్రీయాం, అమరః, అక్షపాదాది కృత తర్క విద్యాయాం" అని కలదు. ఈ పదముతో కూడ నున్న 'దండనీతి' పదము గ్రహింపఁ బడినది. దండనీతిః—ఇ. సీ. గురు శుక్రాది ప్రణీతే అర్థ (నీతి) శాస్త్రే అని 700 పుటయందుఁగలదు. దానిసంబంధమునన్నైన నీ ఆన్వీక్షకీపదము స్ఫురింప వలసినది. ఇట్టిముఖ్యపదము లెన్ని చేయిదాఁటినవో యనిపించుటలో తప్పేమి?

ఆకృతి గణః—శబ్దసమూహః. అని సంస్కృతమున నర్థము తెలిపి, ఏకవిధము లగు శబ్దరాశి అని తెలుఁగున నర్థముతెలిపిరి. తెలుఁగురాని యన్యదేశీయులు శబ్దముల ప్రోఁగు అని యనుకొని వాఙ్మయ మంతయు నని భ్రాంతి నొందవచ్చును. పోనిండు ఏకవిధ శబ్దములని తెలిసికొనినను, సందేహము తీఱునా ? వ్యాకరణశాస్త్రమున నొక సంజ్ఞ అని వ్రాయవలసినది. ఈ పదము వ్రాతప్రతి యందు లేదు.

"ఆశ్రపణః" అను పదము ప్రధానముగా గ్రహించి, ఆ పదము క్రింద—'శ్రయణ' పద మీయఁబడినది. అర్థముతో సంబంధము లేకున్నను, ప్రధాన పదములోని మొదటి రెండక్షరములును—శ్రయణ పదమువంటి క్రింది పదములకుఁ జేర్చుకొనవలెనని పరిష్కర్త యొనర్చిన నియమమును బట్టి 'ఆశ్రపణ' లోని "ఆశ్ర" అను రెండక్షరములును "శ్రయణ" అను దానికిఁ జేర్చినచో "ఆశ్రశ్రయణము" అగును. పరిష్కర్త యాశయము ఆశ్రయణ పద మనియే కాని "ఆశ్రశ్రయణ" పదము కాదని యర్థమునుబట్టి తెలియుచున్నది. మఱి యెచ్చటను 'ఆశ్రశ్రయణ' పదము లేకపోవుటచే నిది "ఆశ్రయణ" పదమే అనుకోవలయును. ఈ రెండక్షరములు చేర్చు నియమము 'ఆదికావ్య' పదము వద్ద సరిపడుచున్నది.—తేయః. అ. పుం. సూర్యే, సూర్యుఁడు. దేవే, దేవత. అనియు,—దైత్యః. అ. పుం. హిరణ్యకశిపౌ, హిరణ్యకశిపుఁడు అనియు—ఆదికావ్య పదము క్రింద నున్నవి. కాని ఆదితేయః అనఁగా సూర్యుఁడు, దేవత యని రెండర్థములై యుండ 1. సూర్యుఁడు, 2. దేవత అని స్పష్ట ప్రతిపత్తికై సంఖ్యలతో చూపఁబడలేదు. సంఖ్య తెలుపనిచో జిజ్ఞాసువులకు భ్రాంతి యనివార్య మగునే ! ఆదికావ్య, ఆదితేయ శబ్దములందు అక్షరముల కలయిక తప్ప, ఆదికావ్య లోని ఆది శబ్దమునకును, ఆదితేయ—లోని ఆది శబ్దమునకును, ఎట్టి సంబంధమును లేదు. కాన నిట్టి క్రమము సవరించుట యుచితము.—కావలెనన్న 'ఆది' శబ్దము ప్రధానముచేసి, దాని క్రింద "ఆదికావ్య, ఆది దైత్య" మున్నగు శబ్దములను వివరించి ప్రధానపదముల వరుసలో నీ సమాసముల నిచ్చి అర్థ వివరణమునకు చూ. ఆది అని చూపుట యొక పద్ధతి. అది హెచ్చైన పని యని తోఁచినచో ప్రధాన పదముల వరుసలో నీ సమాసముల నిచ్చి, ఆది+కావ్యము అని కాని, r ఆది అని కాని చూపుట మఱొక పద్ధతి. ఈ రెండును కాని పరిష్కర్తల పద్ధతి ఇతర నిఘంటువుల పద్ధతియుఁ గాదు. వేంకటార్యుని పద్ధతియుఁ గాదు. మొదటి యక్షరమును తుది యక్షరమును తెలిసికొని, తుది హల్లును విడిచి, వెనుకటి హల్లుతో ఎన్ని యక్షరములు గల పదమగునో తెలిసి, చూచుటయే శ్రమకర మనుకొనుచుండ—నిరుపయోగమగు నీ శ్రమము జిజ్ఞాసువులకుఁ గలిగించుట యుచితముగాదు. ఇట్టివే 'అభ్యుపాక్త, ఆవరక, ఆవశ్యక, చక్రగణ' శబ్దములు.

సమాస పదములను (Compound words) చూపు పద్ధతి విల్సన్సు, ఆప్టేల నిఘంటువులందును, కిట్టేలు కన్నడ నిఘంటువునను, Tamil Lexicon లోను, సూర్యారాయాంధ్ర నిఘంటువునను ప్రధానపదసంబంధముతో స్పష్టముగా నుండఁగా—మూలమున నిట్టి తికమకలు లేకయే పదమున కా పదము వేఱుగా నుండఁగా, పరిష్కర్తలీ నూతన సంస్కారమునకేల పూనుకొనిరో, దానిలోని సౌలభ్యమేమో యగమ్యముగ నున్నది.

"సంవర్తి, సంవర్తికా" శబ్దములు రెండును సంవర్త, సంవర్తక శబ్దములక్రింద అప్రధాన పదములుగా చూపఁబడినవి. ఇవి సమాసపదములు కావు. అయినను పరిష్కర్త నియమానుసారము సంవర్త శబ్దము క్రింద—ర్తిః అని అప్రధాన పదముగా సంవర్తి శబ్ద మీయఁబడి అర్థము విషయమున చూ. 'నవదళమ్' అని యీయఁబడెను. అనఁగా సంవర్తి శబ్దమున కర్థము నవదళ శబ్దమువద్ద అర్థము గ్రహింపవలె నన్నమాట. ఇఁక "సంవర్తికా" శబ్దమో, సంవర్తక శబ్దము క్రింద—ర్తికా అని యీయఁబడి, అర్థమునకు చూ. సంవర్తిః అని సంవర్తపదముక్రింద అప్రధానపదముగా నున్న 'సంవర్తి' పదము చూచుకొమ్మనుట జిజ్ఞాసువునకు శ్రమము కాదా ? ఇందలి సౌలభ్యమేమో తెలియదు. సంవర్తికా శబ్దమున కర్థమేమి యని జిజ్ఞాసువు సకారాదియు, కకారాంతము నగు చతురక్షర పదముల వరుసలో చూచును. ప్రధానపదముగా కనఁబడకపోఁగా, శ్రమపడి వెదకి సంవర్తక శబ్దముక్రింద పట్టుకొని అర్థము చూడఁబోఁగా చూ. సంవర్తిః అని కనఁబడును. అంతట సకారాదియు, తకారాంతము నగు త్ర్యక్షర పదములవరుసలో సంవర్త శబ్దము క్రింద, అప్రధానముగా నున్న—ర్తిః అని కనఁబడ అర్థమేమని చూచును. అచ్చట అర్థములేక చూ. నవదళమ్ అని యుండుటచే నకారాదులును ళకారాంతములు నగు చతురక్షర పదములలో 'నవదళ' శబ్దము కనుఁగొనఁగా—"నూతనే పత్రే, క్రొంజిగురు, సంవర్తికాయాం తామరరేకు" అని యర్థములు కనంబడును. క్రొంజిగురు అను నర్థము కూడ సంవర్తి, సంవర్తికా శబ్దములకుఁ గలదా యని సందేహించి, యితర నిఘంటువుల కేఁగవలసి వచ్చును. "సంవర్తికా నవ

దళమ్'' అని కోశమువలన సుగమ మగు పదమున కింత క్లిష్ట కల్పన మెందులకో ? వ్రాతప్రతియందు కాక్షరాంత కాండ మున చతురక్షరవర్గమునందు సాది ప్రకరణమున 'సంవర్తికా —ఆకారాంతస్త్రీయాం (అమరః) పద్మ నవదళే' అని మాత్రము గలదు. నవదళ శబ్దమునకు క్రొంజిగురు అర్థము కావచ్చును. సంవర్తికాశబ్దము పద్మసంబంధి పదములలోని దగుట చేతను—''నవదళమ్'' అని దాని యర్థబోధకపద మగుట చేతను, తామరపూవులోని క్రొత్తరేకు అని గ్రహింపదగి యుండగా—నవదళ, సంవర్తికా శబ్దములు పర్యాయములుగా చూపుట ప్రమాదము. నవదళ శబ్దము సంవర్తికా శబ్దమున కర్థబోధక పదముగాని పర్యాయపదము కాదని యెఱింగిన వేంకటార్యుఁడు నవదళ పదమును గ్రహింపలేదు. సంవర్తికా శబ్దమునకు నూతనపత్త్రార్థమును చెప్పలేదు. సంవర్తి శబ్దమును గ్రహింపలేదు. పరిష్కర్త గూడ ''నవదళ'' పదమును ప్రధానముగా గ్రహింపకున్నచో ఎట్టి ప్రమాదము లేక సమంజసముగ నుండెడిది.

'ఉపావృత్తః' అను పదము ఉపాకృత శబ్దము క్రింద —వృత్తః అని గ్రహింపఁబడి అ. త్రి. పునరాగతే, మరలి వచ్చినవాఁడు, అని యొక్కయర్థము మాత్రమే చూపఁబడినది. పొర్లాడునది అను రెండవ విశేషణార్థము లేదు. ఇఁక విశేష్యమని కాని అకారాంతపుంలింగమని కాని చూపక, శ్రమ పరిహారాయ లుఠితేఽశ్వే—శ్రమ తొలఁగుటకై పొర్లాడెడి గుఱ్ఱము అని విశేషణార్థమునకు పిమ్మట చూపఁబడినది. ''త్రిషూపావృత్త లుఠితౌ పరావృత్తే ముహూర్భువి' అని అమరకోశమున ఉపావృత్త లుఠిత శబ్దములు పర్యాయపదములు గదా యని 'లుఠిత' శబ్దము తీసి యీ నిఘంటువున చూడఁగా—లుఠితమ్—పొర్లాడునది, పొర్లాడుట యను విశేషణ, విశేష్యార్థములు రెండుమాత్రమే చూపఁబడి, పొర్లాడు గుఱ్ఱము, ఉపావృత్తము అను నర్థము గ్రహింపఁబడ కుండుటచే పూర్వాపర సందర్భము లేక అపరిపూర్ణమైనది.

శ్రుతశ్రేణి—పదము వద్ద—సీ. ద్ర(స్ర) వంత్యాం, ద్ర (స్ర) వించునట్టిది అని మాత్ర మర్థము గలదు. దీనికై ద్రవంతీ శబ్దము చూడఁగా—ఈ. స్త్రీ — ద్రవించునట్టిది. నద్యాం=నది, మూషిక పర్ణ్యాయాం = ఎలుకచెవిచెట్టు—అని కలదు. వ్రాతప్రతియందు ద్రవంతీ—ఈకారాంతస్త్రీయాం అమరః మూషికపర్ణ్యాం, ఎలుక చెవిచెట్టు అని మాత్రమే కలదు. అందు శ్రుతశ్రేణిపదము లేనేలేదు. కాని 'సుత శ్రేణీ' శబ్దము మూషికపర్ణి యను నర్థముతో నున్నది. వేంకటార్యుఁడు వ్రాతప్రతియందు 'అమరః' అని ప్రమాణ మిచ్చెఁ గదా యని అమరకోశము చూడఁగా—''చిత్రోపచిత్రాన్య గ్రోధీ ద్రవంతీ శంబరీ వృషా ప్రత్యక్ శ్రేణీ సుతశ్రేణీ రండామూషిక పర్ణ్యపి. అని ద్రవంతీ, సుతశ్రేణీ శబ్దము లుండుటయు, శ్రుతశ్రేణి శబ్దము లేకుండుటయు చూడ నీ శబ్దము భ్రాంతి మూలక మనిపించినది. శబ్దకల్పద్రుమమందున శ్రుతశ్రేణీ—స్త్రీ. ద్రవంతీ—ఇతి భావప్రకాశః అని అన్ని శబ్దములకు ప్రకృతిప్రత్యయ విభాగముతో వ్యుత్పత్తిని చూపక—సుతశ్రేణీ—స్త్రీ (సుతా ఉత్పన్నా శ్రేణ్యో యస్యాః। ఏకత్ర బహూ జాతత్వాత్ తథాత్వం) మూషిక పర్ణ్యాం (ఇత్యమరః) తత్పర్యాయాః ద్రవంతీ...ఇత్యాది. అస్యాః గుణాః—చక్షుష్మత్వం। ఆఖు విష, వ్రణదోష, నేత్రామయ నాశిత్వంచ। ఇతిరాజనిర్ఘంటుః—పుస్తకాంతరే శ్రుతశ్రేణీ తిపాఠః। అని చూపఁబడినది. రాజనిర్ఘంటువున సుతశ్రేణీ పదమే కలదనియు, శ్రుతశ్రేణి పదము వ్యుత్పత్తి కంకనిదనియే అపపాఠమని యనక పాఠాంతరమని నిరసించిన ట్లగపడుచుండలేదా ? అట్టియెడ కరతలామలకముగా నిఘంటువు లెల్ల నెరింగిన వేంకటార్యుఁడు శ్రుతశ్రేణి పదమేల విడిచి యుండునని పరిష్కర్త యాలోచింపవలదా ? శబ్ద కల్పద్రుమము పాఠాంతర మనుచుండఁగా రెండు శబ్దములను గ్రహించుట ప్రమాదము కాదా ?

మఱియు సుతశ్రేణీ శబ్దమువద్ద—మూషిక పర్ణ్యాం, ఎలుక చెవి చెట్టు అని మాత్రమే యిచ్చియు, శ్రుతశ్రేణీ శబ్దమువద్ద ఈ. స్త్రీ. ద్ర (స్ర) వంతీ, ద్ర (స్ర) వించునట్టిది—అని చూపుట ఏవిధమునను సంబంధములేక యున్నది. శబ్దమా, పాఠాంతరము; వ్యుత్పత్తియా, సంబంధములేక(స్రవించనట్టిది) విపరీతార్థ ద్యోతకముగా నున్నది. ఇట్టియెడ సుదీర్ఘముగా పరిశీలింపక ప్రమాణభూతమగు నిఘంటువున నిచ్చుట ప్రమాదము.

సంజ్ఞప్తి—అను పదమునకు అర్థమునకై చూ. సంజ్ఞపనమ్ అని చూపఁబడెను. అచట చూడుగా 'మరణము'' అను నొక్క యర్థము మాత్రమే కలదు. త్ర్యక్షరమును, సాదియు, తాంతపదము నగు సంజ్ఞప్తిని వెదకి పట్టుకొని అర్థమునకై చతురక్షరమును, సాదియు, నాంతము నగు ''సంజ్ఞ''పదమే వెదకిచూడుగా ''మరణము'' అను నర్థమే కదా కానిపించునది. ఆ అర్థమే రెండుచోట్లను చూపవచ్చును గదా! ఇట్టి క్లేశ కల్పనము తొలంగించుట మంచిది.

గమ్యా—శబ్దము వ్రాతప్రతిలో లేదు. ముద్రితమున భార్య అను నర్థమున నున్నది. వ్రాతప్రతిలో ''గమ్యమ్'' అను పదము విశేషణముగా మాత్రము గలదు. 'గమ్యా' పదము శబ్దకల్పద్రుమమునఁ గాని, ఆప్టే నిఘంటువునఁ గాని, అమర, విశ్వ, నానార్థ రత్నమాలా నిఘంటువులందుఁ గాని—భార్య అనునర్థమునఁ గనఁబడదు. దీని కే కవి ప్రయోగమేని యున్నయెడ చూపుట మంచిది. శబ్దమునకు వ్యుత్పత్తినైనఁ జూపక సంజ్ఞాపరముగా నిచ్చుట యుచితముకాదు.

ఆత్మసాత్—అవ్య. ఆత్మాధీనతాయాం, ఆత్మాధీన మగుట, కృతాత్మాధీనతాయాం, ఆత్మాధీనము చేయఁబడుట—అని కలదు. సాతిప్రత్యయాంతము కృ, భూ ధాత్వంతముగానే తఱచుగా నుండునని యిందు లేకపోవుట ప్రమాదము. ఆప్టే నిఘంటువున—ఆత్మసాత్-Ind. In one's own possession, one's own; mostly in combination with కృ or భూ. అని చూపఁబడెను. దీని ననుసరించియే కావచ్చును, ''ఆత్మసాత్'' పదము గ్రహించి దాని ప్రయోగవిధానము చెప్పక పోవుట లోపము. ఆత్మాధీన మగుట—ఆత్మసాద్భవనం—అనియు, ఆత్మాధీనము చేయుట—ఆత్మ సాత్కరణం' అని యగునే

కాని "ఆత్మసాత్" అని ప్రత్యేకప్రయోగము కూడదనియు, వ్యవహితముగానో అవ్యవహితముగానో కృభ్వస్తియోగము తప్ప దనియు సూచించిన లెస్సగా నుండెడిది. సాతిప్రత్యయము అభూత తద్భావమున వచ్చు చ్విప్రత్యయమునకు వికల్పముగా వచ్చు ననియు, తదధీన వచనేచ అను సూత్రమున అధీనార్థమందును, అభివిధి యందును వచ్చుననియు, అందు అభివిధియందు 'సంపత్' తో కూడియుండు ననియు ఇచ్చటఁగాని "సాతి" పదము గ్రహించి యచ్చటఁ గాని, చిట్టచివర నిచ్చిన తద్ధిత ప్రత్యయములందుఁ గాని చూపవలసినది. నిఘంటువులం దిట్టి వ్యాకరణ రహస్యములకుఁ దా వుండరాదు. ఉన్నచో పరిపూర్ణము గాను, అసందిగ్ధముగాను, అవిరుద్ధముగాను నుండవలెను. కాని న్యూన మనిపించుకొనరాదు.

ఆనృశంసి :—నృశంసుఁడు అనఁగా క్రూరుఁడు, క్రూరుఁడు కానివాఁడు అనృశంసుఁడు, అనృశంసుని సంతానమగు పురుషుఁడు ఆనృశంసి అగును. ఈ పదము బహుశః ఆనృశంస్యము= కనికరము అను పదమునకై యీయఁబడి యుండును. అట్టియెడ ఆ రెండు శబ్దములకుఁ గల సంబంధము చూపింపఁబడక దేని కది స్వతంత్రము లైనట్లు గ్రహింపఁబడుట నిష్ప్రయోజనము.

ఇదంతా—అ. స్త్రీ. ఇదమర్థే. ఇది అని ముద్రితమున గలదు. వ్రాతప్రతిలో లేదు. అ. స్త్రీ. అని యుండుటచే అవ్యయము కాదు. ఇఁక 'తత్' ప్రత్యయాంతము కావలెను. 'ఇదమః భావః' అనియా 'అస్యభావః' అనియా ? ఈ రెండును గాక ఇది యర్థము చెప్పఁబడినదికావున స్వార్థమున వచ్చిన తత్ ప్రత్యయమా ? ఇవి యేవియును గాకఅవ్యుత్పన్నమగు స్వతంత్రపదమా ? దీని కేదేని ప్రయోగమున్నదా ? వివరించిన బాగుగా నుండెడిది.

గతప్రత్యాగతుఁడు (—1) వెడలిపోయి మరల వచ్చినవాఁడు, అను విశేషణార్థము ముందు చూపి (2) విరక్తితో వెళ్లి మరలి వచ్చువాఁడు' అనునర్థము చూపిన బాగుగ నుండును. ఈ రెండవయర్థము వ్రాసి సంన్యాసి విశేషము అని కాని, మరి యేదేని విశేష మున్నయెడ దానిని గాని తెలుపవలసినది. లేకున్నచో గతుఁడు ప్రత్యాగతుఁడు అను పదములతో నీ సమాస మిచ్చుట నిరుపయోగమగును. కాన విరక్తుఁడై వెళ్లి మరలి వచ్చినవాఁడను విశేషార్థము తెలుపు నట్టి ప్రమాణ మిచ్చిన సమంజసముగ నుండును.

అయుగ్మపర్ణః—అ. పుం. గుచ్ఛపత్రే, ఏడాకుల పొన్న అని యున్నది. సమానార్థము గదా అని గుచ్ఛపత్ర శబ్దము చూడఁగా—అచట 'తాలే, తాడిచెట్టు' అని యొక్క యర్థము మాత్రమే కలదు. ఇది పరస్పరవిరుద్ధము. వ్రాతప్రతి యందు ఈ రెండు శబ్దములకును 'ఏడాకుల పొన్న' అని యొక్క యర్థమే అవిరోధముగా నున్నది. గుచ్ఛపత్ర శబ్దమున కే యితర నిఘంటువులయందైన "తాడిచెట్టు" అను నింకొక యర్థము కనఁబడినయెడ 1. ఏడాకుల పొన్న 2. తాడిచెట్టు అని చూపిన బాగుగా నుండును.

గోరసః—ఆవుపాలు, పెరుఁగు, మజ్జిగ, వ్రాగసము అని నాలుగర్థములు ముద్రితమునఁ గలవు. వ్రాతప్రతి యందుఁ గల "దేవదారు బంకతోఁ జేసిన ధూపద్రవ్యము" అను నర్థము గ్రహింపఁబడలేదు. వ్రాతప్రతియందు క్షీరము, పాలు—చల్ల, అని యుండగా—గోక్షీర మిత్యాదిగా గో సంబంధము చేర్చుట సముచితము. కాని అమరః అని ప్రమాణముతో నిచ్చిన "ధూపద్రవ్యవిశేషము" అను నర్థము విడుచుటకు హేతువు తెలియదు.

చమరపుచ్ఛః—అ. పుం. కోకడము,. న. చామరము. అని మాత్రము కలదు. కోకడ మన నేమియో యని చూడ నచ్చట 'బిలేశయ మృగభేదే' అని యొక యర్థమును, 'చమరీ మృగే' అని రెండవయర్థమును గలవు. చమరపుచ్ఛ శబ్దమున కీ రెండర్థములును గలవా ? ఉన్నచో చూ. "కోకడము" అని " " యిట్టి గుర్తుండవలదా? పరిష్కర్తల నియమమున కిది భిన్నముగా నుండుటచే అర్థ మెట్లు గ్రహించుటయో తెలియదు.

తామ్రశిఖి—'తామ్రచూడ' పదము వేఱే యుండ సమానార్థపదముతో పదమును సృష్టించుట నిరుపయోగము. పరిష్కర్త భూమికలో "............ పుండరీక + అక్ష — అనఁగా పద్మములవంటి కన్నులు గలవాఁడు అను నర్థమున—పద్మాక్ష, కమలాక్ష కంజాక్ష, ... " అని యిట్లు పదములను నిర్భయముగా సృష్టించుకొనవచ్చును. ఈవిధమున పదములను కల్పించుకొనియే శబ్ద కల్పద్రుమము, శబ్దార్థచింతామణి, తారానాథ వాచస్పత్యము పెద్ద నిఘంటువులై పోయినవి—అని వ్రాసినదాని కిట్లు విరుద్ధముగా నిట్టి పదములను చేర్చుట న్యాయ్యముకాదనుకొందును.

తిర్యఙ్ముఖః—అశ్వినీ రేవతీ హస్త చిత్రా స్వాతీ పునర్వసూ జ్యేష్ఠా మృగానూరాధాసు—అని చెప్పి నక్షత్రచిహ్నము లేకుండుట నియమమునకు భంగము. అచ్చు తప్పైనను కావచ్చును.

అధోముఖః—ఇచ్చటఁగూడ నక్షత్ర చిహ్నము లేకయే 'మూలాశ్లేషా ..... మఘా పూర్వత్రయే' అని మాత్రము గలదు.

ఊర్ధ్వముఖం— అ. న. నక్షత్రవిశేషేషు, అని మాత్రము గలదు. ఏకజాతికములగు నిట్టి పదములు పరస్పరము సంబంధము లేకుండుట పెద్దప్రమాదము. ఈ మూఁడును నక్షత్రవిశేషములను దెలుపునవే. తిర్యఙ్ముఖాధోముఖము లేయే నక్షత్రములో వివరించి ఊర్ధ్వముఖ నక్షత్రములను వివరింపకుండుటయు, తిర్యఙ్ముఖశబ్దము పుంలింగము, అధోముఖ శబ్దము త్రిలింగము, ఊర్ధ్వముఖ శబ్దము నపుంసకము అనుటయు నిఘంటు నిర్మాణసూత్రములకు విరుద్ధము. ఈ మూఁడు పదములును గూడ త్రిలింగములనినచో అధోముఖః తారాగణః, అధోముఖీ తారా, అధోముఖం నక్షత్రం అని యుపయోగించును. ఇట్టి లింగవ్యత్యయము, విశేష్య విశేషణ భేదరాహిత్యమును, జిజ్ఞాసువులను తప్పుత్రోవఁ బట్టింపవచ్చును. వ్రాతప్రతియం దీ మూఁడు పదములును లేవు. ఇవి జ్యోతిశ్శాస్త్ర పదములని సూచించుటయు ముఖ్యము.

కాలముఖ—శబ్దము క్రోశీ యని యీయబడినది. కాని "కాలాముఖ" శబ్దము గ్రహింపఁబడలేదు. చాణక్య శిష్యుఁడని అప్రసిద్ధమును నిరుపయోగము నగు పేరు చూపియు, సుప్రసిద్ధ శైవప్రభేదమునుజెప్పు కాలాముఖ శబ్ద మేల విడువఁబడెనో తెలియదు.

చతుర్ముఖః—అను పదమునకు వ్రాఁతప్రతియందు 'తాళ ప్రాణకళా భేదే, హిరణ్యగర్భే'—అని రెండర్థములు కలవు. ముద్రితమున 'బ్రహ్మ' యను నొక యర్థము మాత్రము చూపఁబడి, అచ్చతెలుఁగు పర్యాయపదములు నాలుఁగు గ్రహింపఁ బడినవి. తాళ ప్రాణకళాభేదము అను విశేషార్థము లేనేలేదు.

నిరర్థః—పుం. వ్యర్థే, వ్యర్థము—అర్థరహితే, అర్థము లేనిది, అని విశేష్యమైనట్లు పుం. అని యిచ్చుట ప్రమాదము. ఆ పదము క్రిందనే—స్థి. (అనఁగా నిరస్థి) ఇ. త్రి.ద హాఁ కృతాస్థికే, ఎముకలు తీసిన (లేనట్టి) ది, అని కలదు. నిరర్థః పుంలింగ మనుటయు, నిరస్థి త్రిలింగమనుటయు పొరపాటు. రెండును విశేషణములే. ఒక పదము వద్దనేయిట్లు తబ్బిబ్బు లుండుట నిఘంటు ప్రామాణ్యమునకుభంగము కాదా ?

తుండిల, తుందిల—శబ్దముల కర్థము చూ. తుంది అని చూపఁబడినది. తుంది శబ్దముకడ పెద్ద బొజ్జగలవాఁడు అని యొక్కటే యర్థము గలదు. అట్టియెడ 'చూ. తుంది' యనుటకంటె పెద్ద బొజ్జ గలవాఁడు అని తుండిల,తుందిల శబ్దములవద్ద వ్రాసినచో సుకరముగ నుండును గదా !

ఈ రీతిగా శబ్దస్వరూపములందును, అర్థ విశేషము లందును, వివరణము లందును, లింగ విశేషనిర్ణయ మందును, పదముల పరస్పర సంబంధ సూచన యందును, సవరించుకోఁదగ్గ వెన్ని కలవో యనిపించుచున్నది. ఎనుబది వేల పదములు గల గ్రంథము నాద్యంతము చూడ నసాధ్య మగుటచే స్థాలీపులాకన్యాయమునఁ గొలఁదిపాటి పదములు చూపఁబడినవి. అట్లని గ్రంథమంతయు ప్రమాద బహుళ మని భావింపఁదగదు. ఇయ్యది ప్రమాణ గ్రంథమగు నిఘంటువు కావున నిం దేపాటి శైథిల్య మున్నను, పండితులేమి, పామరులేమి యెల్లరును నపమార్గమునఁ బడిపోదురనియు, పరిష్కర్తలుగూడ విశాల హృదయముతో "పొరపా ట్లే వేని కనఁబడినచో తెలుపుఁ డనుట"యు హేతువుగా ప్రమాదము లని తోఁచినవి యెత్తిచూపఁ బడినవి. వీనినిగూడ పరిష్కర్తలు బాగుగ పరిశీలించి భ్రాంతిమూలకములైనచో వానిని విడిచి, గ్రాహ్యము లేవేని యున్నచో గ్రహించి, గ్రంథము నంతయు పునః పునర్విమర్శములఁ గావించి, పునర్ముద్రణమున నిష్కళంకస్వరూపముగా కల్పతరువును వెలువరించి, లోకారాధ్య మొనర్తురు గాక.

ప్రతిపదమును సప్రమాణముగా నిఘంటువును రచించిన వేంకటార్యుని యాశయములను గుఱుతించి, పరిష్కర్త, యాయన యడుగుజాడలలో నడచుట ధర్మము. రమారమి యిరువది వేలకు, అఱువదివేల పదము లధికముగాఁ జేర్చి, వేంకటార్యునిదే యీ గ్రంథమంతయును అనుట సమంజసమా ? నూట యిరువది యేండ్ల క్రిందటనే కీర్తికాయుఁడైన వేంకటార్యుని నిఘంటువున గాంధి, రాధాకృష్ణ, జవహరు లాలు, అబ్దుల్ కలామ్ అజాదు, ప్రకాశం, నాగేశ్వరరావు, పొట్టి శ్రీరాములు ప్రభృతి దేశనాయకుల నామములు పది పండ్రెండు కానఁబడుట యుచితమా ? వేంకటార్యుని యస్తమయమునాఁటికి వీరిలో కొందఱైన జన్మించిరో లేదో ? ఇట్టి యకారణమగు పెరుగుదలచే ఈ నిఘంటువు వేంకటార్యునిదా ? శ్రీ శుద్ధచైతన్యస్వామిదా ? అనిపింపదా ?

వేంకటార్యుని రచనయందు అమరకోశాది నిఘంటువుల లోఁగల పదజాలము కృదంత, తద్ధితాంత, సంజ్ఞావాచకములు మాత్రమే గ్రహింపఁబడినవి. వ్యాకరణశాస్త్ర పారిభాషిక పదములుగాని, ధాతురూపములు గాని, కృత్ప్రత్యయములు, తద్ధిత ప్రత్యయములుగాని గ్రహింపఁబడలేదు. శ్రీ శుద్ధ చైతన్య స్వామి సంకలితము లగు నీ కృత్తద్ధిత ప్రత్యయములు సమగ్రముగా లేవనియే కాదా శ్రీ వావిలాల రామమూర్తిగారు కొఱవడిన ప్రత్యయముల నెత్తి చూపినారు ? వానితో మాత్రము పూర్ణమైనదా ? తర్క, వేదాంత, మీమాంసాది శాస్త్ర పారిభాషిక పదముల నన్నిటిని చూపవలదా ? అట్లు చూప మొదలిడిన నిది వేంకటార్యుని గ్రంథమనుట యెట్లో తెలియదు.

ఆ పండితమౌళి సామాన్యముగా ప్రతి పదము నొద్దను ఎన్ని యర్థములు వ్రాసెనో అన్నిటికిని ఏదియో యొక నిఘంటు నామమును, అమరః, విశ్వః, నానార్థరత్నమాలా ఇత్యాదిగా ప్రామాణ్యమునకై విడువకుండ నిచ్చియుండ, పరిష్కర్తలు తాము చేర్చిన అరువదివేల పదములతో సమానముగా నుండుటకుఁ గావచ్చును, వానిని తొలఁగించి, యేకాకార మొనర్చిరి. నిఘంటువున నే పదము గ్రహించినను ప్రమాణము చూపనియెడ ప్రాజ్ఞలోకము విశ్వసింపదని సాధారణముగా కవి పరంపరాప్రయోగవిశేషములను చూపుచు, అట్టివి దొరుకక, ఆ పద మసాధారణమైన యెడల సుప్రసిద్ధ కోశముల నుదాహరించుట నిఘంటుకారుల సంప్రదాయము. పరిష్కర్తలు తాము చేర్చిన పదములకు ప్రమాణములీయ మానినను సరే, వేంకటార్యుని పదజాలమునకైనను ప్రమాణములుగా నాయన యిచ్చిన నిఘంటునామములను యథాతథముగా ముందు ముద్రణముననైనను జూపించి, యా మహనీయుని కాశయసిద్ధి కలిగింతురుగాక ! ఈ కల్పతరువు ప్రాజ్ఞలోకమునకే కాదు, ఎల్లరకును కల్పతరువై అభీష్టార్థములను కరతలామలక మొనర్చుఁగాక. శ్రీ శుద్ధచైతన్యస్వామి పర్యవేక్షణమున శ్రీ వేంకటార్య వాఙ్మయము నంతయు యథాతథముగ వాసవీ గ్రంథప్రచారణ సమితి అచ్చొత్తించి యాంధ్రుల కృతజ్ఞతకు పాత్రు లగుదురుగాక !

శబ్దార్థకల్పతరువు : ఆద్యంతములయందు అక్షరానుక్రమముగల సంస్కృతాంధ్ర నిఘంటువు; రచయిత: శ్రీ మామిడి వేంకటార్యులు; పరిష్కర్త: శ్రీ శుద్ధ చైతన్య స్వామి; ప్రకాశకులు : శ్రీ వాసవీ గ్రంథప్రచారణ సమితి, మచిలీపట్టణము; వెల: 20 రూపాయలు.

గాలిగోపురం

శ్రీ అంగర సూర్యారావు

(గత సంచిక తరువాయి)

మూడవ అంకం:

(స్థలం:— పాతయింటి ముందుభాగం. మొదటి అంకంలోనిది. సమయం:—అదే రాత్రి 11 గంటలు.)

దూరాన్నుంచి రంగస్థలంమీదికి కాంతి ప్రసరిస్తోంది. ఇంటి తలుపులు మూసిఉన్నాయి. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. రంగస్థలానికి కుడి చివర యింటికి చేర్చి గడ్డిమోపు ఉంది. దీనవదనంతో పాడుతూ స్వామి ప్రవేశిస్తాడు.

స్వామి:—ఆపదలే కోరుకొని

ఆశయాలు నిలుపుకొని
ఎన్నాళ్లో యీ పయనం
నిలిచిచూడు ఒక నిముషం ......

నారాయణ:—(ఆకస్మికంగా తలుపు తెరచి) భరతవాక్యం పాడుతున్నావా ? నాటకం ముగిస్తున్నావా ?

స్వామి:—వెలుగుతో ప్రారంభమైన మానవజీవితం చీకటితో ముగుస్తోంది. చీకటిని చూసి కలవరపడకు నాయనా ! నిద్రపో !

(నారాయణ నిష్క్రమించి తలుపులు మూసేస్తాడు. స్వామి ముందుకు నడుస్తూ ఉంటాడు. ఎడమవైపు నుంచి మారుతి, గౌరి తొందరగా వస్తారు.)

మారుతి:—(వస్తూనే) స్వామీ ! (స్వామి ఆగి వెనక్కి తిరుగుతాడు. మారుతి గౌరితో సహా స్వామికి నమస్కరించి) దీవించండి.

స్వామి:—సుఖీభవ ! (పరిశీలించి చూసి) అయ్యో నాయనా ! యిదేమిటి ? నీ కాలికి బంధం తగిలించుకున్నావా ? యిక నువ్వు పూర్వంలా తప్పించుకుపోలేవు నాయనా ! యీ లోకపు మాయావాగురులలో చిక్కుకుంటున్నావు. నిన్ను భగవంతుడు రక్షించుగాక !

(స్వామి కుడివైపు నిష్క్రమిస్తాడు—మారుతి గౌరి చెయ్యి పట్టుకుని ద్వారం దగ్గరకు తీసుకు వెళతాడు.)

మారుతి:—(తలుపు తట్టుతూ) నాన్నా ! నాన్నా ! (ఎడమవైపు ఆత్రుతతో చూస్తూ) తలుపుతియ్ నాన్నా !

నారాయణ:—(తలుపు తెరచి) వచ్చావురా నాయనా !

మారుతి:—చూడు నాన్నా ! నీ పగవాడి కూతుర్ని తీసుకు వచ్చాను.

నారా:—(సంతోషంతో) మహామంచిపని చేశావురా నాయనా ! యిక పావురాలజంటలాగ హాయిగా ఆకాశంలోకి ఎగిరిపొండి. ఊం !—యిక ఆలస్యం చెయ్యకండి. (లోపలికి వెళ్లి తలుపులు మూసేస్తాడు.)

మారు:—రా ! త్వరగా రా ! వెళ్లిపోదాం.

గౌరి:—ఎక్కడికి ?

మారు:—ముందువూరుదాటి పోదాం. తర్వాత ఆలోచిద్దాం.

గౌరి:—(వెనక్కి లాగుతూ) ఆగు బావా ! నాకు భయంగా ఉంది. మనం పెద్దపొరబాటు చేశామేమో అనిపిస్తోంది.

మారు:—మనంచేసింది పొరబాటు కాదు. మీ నాన్నమీద తిరుగుబాటు !

గౌరి:—యీ అర్ధరాత్రివేళ—దొంగలా—యింట్లోంచి పారిపోవడం తప్పుకాదా ?

మారు:—ఇప్పుడా నువ్వు కళ్లుతెరిచావ్ ?

గౌరి:—చెప్పు బావా ! యిప్పుడు మనం ప్రమాదంలో చిక్కుకోలేదా ?

మారు:—చిక్కుకున్నాం. తప్పకుండా చిక్కుకోవాలి. ప్రమాదానికి సిద్ధపడి ఎదురు నిలిచినవాళ్లే తిరుగుబాటుదార్లు. తెలిసిందా ? ఊం ! రా !

గౌరి:—వద్దు. ఎక్కడికీ పోవద్దు. యిక్కడే ......

(నేపథ్యంలో కేకలు—"హొహొహాయ్"— "యిలాగ— యిలాగ"—"ఓ .... రి .... పుల్లయ్యా !")

మారు:—(ఎడమవైపు చూస్తూ) అరుగో! వస్తున్నారు. ఇక మనం పారిపోవడానికైనా అవకాశంలేదు. (చెయ్యి పట్టుకు లాగుతూ) త్వరగా కదులు. నిన్ను యిక్కడ చూస్తే వాళ్లు తిరిగి యీడ్చుకుపోతారు. రా !

(ఇద్దరూ తొందరగా కుడిచివర గడ్డిమోపు వెనకదాక్కుంటారు.—ఎడమవైపు నుంచి రత్తయ్య పరుగెత్తుకు వస్తాడు.)

రత్తయ్య:—(వస్తూనే—బిగ్గరగా) మారుతీ ! మారుతీ ! పారిపో! పారిపో ! వస్తున్నారు.

నారాయణ:—(తలుపు తెరిచి) ఎందుకురా అరుస్తావ్ ? వాళ్ల ఎగిరిపోయారు. (తిరిగి తలుపు మూసేస్తాడు.)

రత్త:—(ఆయాసపడుతూ) హమ్మయ్య ! బతికించావ్ !

(ఎడమవైపు నుంచి కొండయ్య, బసవయ్య, పుల్లయ్య

మరొక నలుగురు మనుషులు పరుగెత్తుకు వస్తారు. అందరివెనక లచ్చన్న వస్తాడు.)

కొండయ్య:—(వస్తూనే రత్తయ్య మీదికి అమాంతంగా దూకి పట్టుకుని) దొరికాడు వెధవ !

రత్త:—(భయంతో) బాబోయ్ ! నేనేం చెయ్యలేదు.

కొండ:—(రత్తయ్యని పుల్లయ్యమీదికి విసిరి) వీణ్ణి వొదిలెయ్యకు. పట్టుకో !

లచ్చు:—(కోపంతో) వీడెందుకురా మనకి ?

కొండ:—వీడూ వాడూ తోడుదొంగలు.

లచ్చు:—వాణ్ణి వెతకండి. ఆ మారుతిని పట్టుకోండి. చెట్టుకి తలక్రిందులుగా వేలాడగట్టి—చచ్చేవరకూ కొట్టండి.

(కొండయ్య, బసవయ్య మిగిలిన మనుషులతో యింట్లోకి వెళ్లిపోతారు. లోపల పెద్ద చప్పుడు అవుతూ ఉంటుంది.)

రత్త:—(బతిమాలుతూ) ఒరే ! ఒరే ! పుల్లయ్యా ! వదిలెయ్‌రా బాబూ !

పుల్ల:—నోరెత్తేవంటే తన్నేస్తాను.

రత్త:—మద్దిని నే నంట్రా నీకు లోకువ !—నీకు పౌరోషం ఉంటే ఆ మారుతిగాడి జోలికెళ్లు ! ముక్కు విరగ దన్నేస్తాడు. హె హె .....

పుల్ల:—(కోపంతో) నోర్ముయ్ ! (ఒక్కటేస్తాడు.)

రత్త:—బాబోయ్ !

(లోపలినుంచి కొండయ్య, అతని అనుచరులు—నారాయణను మోసుకొని వస్తారు.)

కొండ:—లేడు. పారిపోయాడు. ఈ ముసలా డొక్కడే ఉన్నాడు లోపల !

నారాయణ:—(సంతోషంతో) ఒరేయ్ ! నాకు బ్రహ్మరథం పడుతున్నార్రా ! (నేలమీదకి దించేస్తారు. లచ్చన్నను సమీపించి) యిక నువ్వేమీ చెయ్యలేవు. రుక్మిణీ కల్యాణం జరిగిపోయిందిరా లచ్చన్నా !

(ఇంట్లోకి పరుగెత్తుకుపోయి తలుపులు మూసేస్తాడు.)

కొండ:—(రత్తయ్యని చొక్కా పట్టుకొని) వాడు యెటు పోయాడ్రా ?

రత్త:—నే న్చూళ్లేదు.

పుల్ల:—ఈడూ ఆడూ ఒకటే !

లచ్చు:—(కోపంతో) నిజం చెప్పు !

రత్త:—(బెదురుతూ) నే .... ను .... చూళ్లేదండి.

కొండ:—అలాగ మర్యాదగా నిజం చెబుతాడా ?

అందరు:—(ఒక్కసారిగా) తన్నండి ! తన్నండి ! (కర్ర లెత్తుతారు.)

రత్త:—(బిగ్గరగా) బాబోయ్ ! ఆగండి ! నిజం చెప్పేస్తాను ! (అందరూ ఆగిపోతారు.)

కొండ:—ఊం ! చెప్పు !

రత్త:—మారుతి గైరమ్మగారి చెయ్యి పట్టుకొని .... (లచ్చన్నకేసి భయంతో చూస్తాడు.)

లచ్చు:—(కోపంతో మీదికి వెళ్లి) చెప్పరా !

రత్త:—(కుడివైపు చూపిస్తూ) ఆ కొండకేసి పారిపోయేడు.

లచ్చు:—(తొందరగా కొండయ్యతో) వా డలాగ చుట్టూ తిరిగి యిలాగ రావచ్చు. (ఎడమవైపు చూపిస్తూ) నువ్వూ పుల్లయ్యా మనవాళ్లతో కలిసి ఆదారి కాయండి. (కుడివైపు చూపిస్తూ) మేం యిటువైపునుంచి వస్తాం. యేమైనా సరే ! యివేళ వాడిఅంతు చూడాలి. నేను నిద్రపోవాలి.

కొండ:—మావా! ఆ మారుతిగాణ్ణి యెప్పటికైనా నేనే కొట్టాల్నీ. మేమే (కుడివైపు చూపిస్తూ) యీదారిని పరుగెత్తి వాణ్ణి మధ్య దారిలోనే పట్టేస్తాం. మీరే (ఎడమవైపు చూపిస్తూ) యీ దారిని రండి.

లచ్చు:—(కోపంతో) నోర్ముయ్. నిన్ను నమ్ముకుంటే గంగలో దిగాలి. కబుర్లుతప్ప పనిమాత్రం శూన్యం. నో రెత్తకుండా ఆ దారిని వెళ్లు. కనిపించీ కనిపించగానే వాణ్ణి కాళ్లు విరగ్గొట్టెయ్యండి. తరవాత నా దగ్గరికి తీసుకు రండి. వాడు మాకే దొరికితే వాడి అంతు మేం చూస్తాం. త్వరగా కదలండి. పరుగెత్తండి.

(కొండయ్య, పుల్లయ్య ఎడమవైపు వెళ్లిపోతారు. లచ్చన్న, బసవయ్య అనుచరులతో సహా కుడివైపు నిష్క్రమిస్తారు. మారుతి గడ్డిమోపు వెనకనుంచి నెమ్మదిగా ప్రవేశిస్తాడు. అతని వెనక గౌరి వస్తుంది.!

మారుతి:—(రత్తయ్య భుజం తట్టి) మంచిపని చేశావ్! వాళ్లని దారి తప్పించావు. మరొక గంట వరకూ నిశ్చింతగా యిక్కడే గడపవచ్చు. ఇంతకూ నీకీ సమాచారం యెలా చేరింది ?

రత్త:—నా కొక్కడికే నేంటి ? వూరంతా మోతెక్కిపోయింది. చిన్నా చితుకు, ముసలీ ముతకా—అందరూ నిద్రలోంచి లేచిపోయి ఒకటే చెప్పుకోడం.

మారు:—ఏమని చెప్పుకుంటున్నారు ?

రత్త:—ఇంకేం చెప్పుకుంటారు ? లచ్చన్నగారి కూతుర్ని నువ్వు యెత్తుకుపోయేవని ఒకటే గుసగుసలు.

మారు:—మంచిది. నాకు కావలిసింది అదే. ఈ సంగతి వూరందరికీ తెలిసిపోవాలి. లచ్చన్న పరువు ప్రతిష్ఠలు నిలువునా కూలిపోవాలి. నువ్వు త్వరగా వెళ్లి—యింకా యీ సమాచారం తెలియనివాళ్లెవరైనా ఉంటే—వెంటనే చెప్పెయ్. యింటింటికీ తిరిగి నిద్రపోతున్న వాళ్లను కూడా లేపి ......

గౌరి:—(కోపంతో) మారుతీ !

మారు:—(వెనక్కి తిరిగి) యేమిటి కథ ?

గౌరి:—నువ్వు నామీదప్రేమతో నన్ను తీసుకు వచ్చావా ? లేక మానాన్నపరువుతియ్యడం కోసం తీసుకువచ్చావా ?

మారు:—ఆవేశపడకు. కూర్చో ! ఆ విషయం తరవాత మనం యిద్దరం తేల్చుకుందాం. (రత్తయ్యతో) వెళ్లు,

ఆ కొండయ్యని ఒకకంట కనిపెట్టి చూస్తూవుండు. (రత్తయ్య ఎడమవైపు నిష్క్రమిస్తాడు.)

గౌరి:—(గద్గద స్వరంతో) బావా! ఇది నీ కేమైనా న్యాయంగా ఉందా ?

మారు:—ఉష్! మాట్లాడకు. (క్షణం ఆగి ఆకాశంలోకి చూస్తూ) యీ రాత్రి ఎంత హాయిగా ఉంది. చంద్రుడు మనపైని తెల్లని పట్టు శాలువ కప్పుతున్నాడు. నక్షత్రాలు మనమీద తలంబ్రాలు పోస్తున్నై. పక్షులు మంగళగీతాలు పాడుతున్నై. ప్రపంచమంతా అందంగా అలంకరించబడిన పెళ్లి పందిరిలా కలకల లాడుతోంది. (అరుగుమీద గడ్డి మోపుకు చేరబడి పరవశత్వంతో) నామనసు తేలిపోతూంది. నా తలపైని బరువంతా ఒక్కసారిగా దిగిపోయినట్లు—ప్రశాంతంగా హాయిగా ఉంది. (కళ్లు మూస్తాడు.)

గౌరి:—బావా !

మారు:—మాట్లాడకు! యీ ప్రశాంతతని—యీ హాయిని—కొంతసేపు అనుభవించనియ్. తీయని కలలపై ఒక క్షణం తేలిపోనీ.

గౌరి:—మరి నా మాటేం చెప్పావు బావా ?

మారు:—లోపలికి వెళ్లి హాయిగా నిద్రపో. ఊం! వెళ్లు.

(గౌరి తలవంచుకొని యింటిలోకి వెళ్లిపోతుంది. క్షణంలో తిరిగి ప్రవేశిస్తుంది.)

గౌరి:—(గుమ్మం యివతల నిలబడి) భయం వేస్తోంది. బావా!

మారు:—(హేళనగా) భయం! భయం అన్న మాటకు అర్థం లేదు. నేను యిక్కడే ఉంటాను. నువ్వు నిశ్చింతగా నిద్రపో !

(గౌరి యింట్లోకి వెళ్లిపోయి తిరిగి నెమ్మదిగా యివతలికి వస్తుంది. దూరాన్నుంచి శ్రావ్యంగా పాట వినిపిస్తూ ఉంటుంది)

* * *

నీకూ నీ వారు లేరూ నాకూ నా వారులేరు
యేటి వొడ్డున యిల్లు కడదాం పదరా
చల్ మోహనరంగా
యేరు వస్తే ఎగిరిపోదాం పదరా
చల్ మోహనరంగా
నీకూ నాకూ జోడు కలిసెను కదరా.!!

* * * *

గౌరి:—(సమీపిస్తూ) బావా !

మారు:—(చిరాకుతో) అబ్బబ్బా ! నిద్రపో !

గౌరి:—నిద్ర రావడంలేదు బావా ! (అతని ప్రక్కని కూర్చుంటుంది.) నా మనసు సరిగా లేదు. యేదో తెలియని దిగులు. నీకు దగ్గరగా ఉంటే చాలు. నాకు యిప్పుడు కొంత ధైర్యంగా ఉంది.

మారు:—నువ్వు దగ్గర ఉంటే నాకు చిరాగ్గా ఉంది.

గౌరి:—(అనుమానంతో) ఏమిటి బావా ?

మారు:—నాస్వేచ్ఛకు అడ్డు—నా ఆలోచనలకు అంతరాయం ...

గౌరి:—(వెంటనే) నేనా ?

మారు:—ఔను !

గౌరి:—(ప్రాధేయపూర్వకంగా) అలాంటి మాటలకు యిది సమయం కాదు బావా ! నాకు అసలే భయంగా ఉంది. నా బతుకు దారంతెగిన గాలిపటంలా ఉంది. అది ఎటు పోతోందో తెలియడంలేదు. (అతని చేతులు పట్టుకొని) మంచి మాటలు రెండు చెప్పు. మనసా ఒకసారి నవ్వు. నా భయం పోగొట్టి—నన్నొక వొడ్డుకు చేర్చు.

మారు:—(నిర్లక్ష్యంగా) తీరికలేదు. నీ గురించి ఆలోచించడానికి—నీతో మాట్లాడ్డానికి తీరికలేదు.

గౌరి:—(బెదురు చూపులతో) అదేమిటి బావా—చూస్తుండగా యిలా మారిపోయావు ? యింతలోనే యింత మార్పా ? (భయంతో) నీ ముఖంలో నవ్వు కనిపించదేం? నీ కళ్ళు ఎర్రబడ్డాయి. ముఖం జేవురిస్తోంది. (రెండు చేతులతో అతని ముఖాన్ని నిమురుతూ) నీ మనసులో...

మారు:—(చేతులు విసిరికొట్టి) దూరంగా ఉండు.

గౌరి:—(ఒక్కసారిగా లేచి నిలబడి) నన్ను చూసి అసహ్యపడుతున్నావా ?

మారు:—(నిర్లక్ష్యంగా) అవును.

గౌరి:—నే నంటే నీకు యిష్టంలేదా ?

మారు:—లేదు !

గౌరి:—(ఉద్వేగంతో) నన్ను అందమైన ప్రపంచంలోకి తీసుకపోతా నన్నావు. నన్ను ప్రేమించా నన్నావు. నన్ను చూసి నవ్వావు. ఏవేవో తీయనిమాటలు చెప్పావు. అదంతా అబద్ధమేనా ?

మారు:—(ఆకస్మికంగా లేచి నిలబడి) శుద్ధ అబద్ధం! అదంతా నటన! నూటికి నూరుపాళ్ళు నటన! నువ్వంటే నాకు ప్రేమ లేదూ! లేదు! లేదు!—యిక చాలా?

గౌరి:—(రోదనస్వరంతో) అయితే నన్నెందుకు మోసంచేశావు? నా బతుకు యెందుకు పాడుచేశావు? నేను నీకేం అపకారం చేశాను?

మారు:—నువ్వు నాకేమీ అపకారం చెయ్యలేదు. నిజమే!—నీతండ్రిమీద పగతీర్చుకోడానికి నిన్ను తీసుకువచ్చాను. యీసారి అర్థమయ్యిందా?

గౌరి:—తండ్రిచేసిన నేరానికి పిల్లల్ని శిక్షిస్తావు?— నువ్వు మనిషివా? రాక్షసివా?

మారు:—అమ్మాయీ ఆవేశపడకు! ఆగు! లోకంలో తండ్రి చేసిన నేరానికి, దుర్మార్గానికి బిడ్డలే శిక్ష అనుభవిస్తున్నారు. తండ్రితాగుబోతూ, జూదగాడూ అయి ఆస్తి సర్వస్వం తగలేస్తే—ఆ ఫలితం అనుభవించేదెవ్వరు? పిల్లలుకారా?—దొంగవాణ్ణి పట్టుకొని సమాజం, న్యాయస్థానాలూ జైల్లో పెడుతున్నాయి. నిజానికి

ఆ శిక్ష దొంగకా? యెంతమాత్రంకాదు. అతనిసంతతికి! దొంగ రాజలాంఛనాలతో జైల్లోకి వెళతాడు. అతని పెళ్లాంబిడ్డలు చిప్పచేతపట్టుకొని రాజవీధికి వస్తారు. యిది తరతరాలనుంచి వస్తున్న మానవ సమాజపు న్యాయశాస్త్రం! లోకనీతి!—యిప్పుడు బోధపడిందా?

గౌరి:—నువ్వు నీ పగ తీర్చుకోవడానికి నన్ను ఉపయోగించుకుంటున్నావా?

మారు:—అవును! పగతీర్చుకోవడమే నా కోరిక!

గౌరి:—(ప్రాధేయపూర్వకంగా) వద్దుబావా! నీమనసుమార్చుకో! మంచివాళ్లెప్పుడూ మనసులో పగపెట్టుకోరు.

మారు:—దుర్మార్గులే పగసాధిస్తారంటావా?

గౌరి:—అవును. మూర్ఖులూ దుర్మార్గులే పగసాధించడానికి ప్రయత్నిస్తారు.

మారు:—నువ్వు న్యాయశాస్త్రాన్ని ధిక్కరిస్తున్నావు! దొంగకు ఖైదువిధించడంలో న్యాయశాస్త్రం ఉద్దేశం యేమిటి? పగతీర్చుకోవడంకాదా? హంతకుడికి ఉరిశిక్ష వెయ్యడంలో అర్థంయేమిటి? పగసాధించడం కాదా? యేం? మాట్లాడవేం?

గౌరి:—నాకు అదంతా అవసరంలేదు. నేను నీగురించి మాట్లాడుతున్నాను.

మారు:—నేను ప్రపంచంగురించి మాట్లాడుతున్నాను.

గౌరి:—నీ ఉద్దేశం మార్చుకోవా?

మారు:—మార్చుకోను. మార్చుకోవలసిన అవసరం నాకులేదు.

గౌరి:—పగతీర్చుకోడానికే నిశ్చయించావా? అయితే వెంటనే కానియ్! యిక్కడ నువ్వూ నేనే! మరెవ్వరూ లేరు. (ఆవేశంతో) పగతీర్చుకో! పదునైన కత్తితో పొడిచెయ్!

మారు:—(నవ్వుతూ) నిన్నా? నేనా?—వెర్రిదానా! ఆవేశపడకు!—నీమీద నాకు పగలేదు. కోపంలేదు. (కోపంతో) మీనాన్నమనసుకు శాంతిలేకుండా చెయ్యడమే నా ఉద్దేశం. అతనిని నలుగురిలో తలయెత్తకుండా చెయ్యడమే నాకోరిక.—నాకోరిక తీరిపోయింది. నిన్ను విడుదల చేస్తున్నాను. వెళ్ళిపో!

గౌరి:—(చకితయై) ఎక్కడికి?

మారు:—(నిర్లక్ష్యంగా) ఎక్కడినుంచి వచ్చావో అక్కడికే వెళ్ళిపో!

గౌరి:—(సూటిగా) తిరిగి మాయింటికి వెళ్ళిపొమ్మనా నీ ఉద్దేశం?

మారు:—అవును.

గౌరి:—(కోపంతో) తీసుకు రావడానికీ — తిరిగి పొమ్మనడానికి నీయిష్టమేనా?

మారు:—(ఒక్కసారిగా) నువ్వు వెళ్ళవా?

గౌరి:—(దృఢనిశ్చయంతో) వెళ్ళడానికి వీల్లేదూ? వెళ్ళను!

మారు:—ఏం? యెందుకని?

గౌరి:—నాకు అటుదారిలేదు. నేను ఆ యింటినుంచి యివతల అడుగుపెట్టగానే ఆ దారికి మూతపడిపోయింది.

మారు:—ఒకవేళ మీనాన్నే స్వయంగావచ్చి నిన్నుతీసుకువెళితే?

గౌరి:—(దృఢనిశ్చయంతో) ప్రాణాలు పోయినావెళ్ళను. వెళితే లోకంనన్ను వేలుపెట్టి చూపిస్తుంది. చెడ్డదాన్ని అంటుంది. నేను భరించలేను. అంతకంటే ఆత్మహత్య నయం!

మారు:—(పరిశీలనగాచూస్తూ) ఓహో! చాలా దూరం వెళ్ళిందే కథ! (సూటిగా) యిక్కడవుంటే నీకు కళంకంరాదా?

గౌరి:—రాదు. నేను నిన్నే కోరుకున్నాను. నీతోవచ్చాను. లోకం దృష్టిలో మనయిద్దరికీ శాశ్వతంగా ముడిపడిపోయింది.

మారు:—(కంగారుగా) లేదు. లేదు. నాకు నీమీద ప్రేమలేదు. నేను నిన్ను మరొకందుకు తీసుకువచ్చాను. నా పని అయిపోయింది. యికవెళ్ళిపో! (కుడివైపు నడుస్తూవుంటాడు.)

గౌరి:—(అతన్ని అనుసరిస్తూ) వెళ్ళకు! ఆగు! ఆగు! నువ్వు నన్ను మరొకందుకు తీసుకొచ్చావు.—కానీ నేనుశాశ్వతంగా నీతోకలిసి వుండడానికే వచ్చాను. యిక ప్రేమైనా! చావైనా నీతోనే నాకు! నా సర్వస్వం యిటుపైని నువ్వే! నీతోనే నాకు జీవితం.

(అతనిచెయ్యి పట్టుకుంటుంది.)

మారు:—(వెనక్కితిరిగిచూడకుండా) ఆగు! ఆగు! నన్ను విడిచిపెట్టు! కొంచెం ఆలోచించుకోనియ్! నే నేమైనా పొరపాటుచేశానా?

గౌరి:—(అతనిని తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తూ) వద్దుబావా! యిక ఆలోచించకు! ఎంత ఆలోచించినా మరొకదారిలేదు. మన యిద్దరిదీ ఒకటేదారి. యిటు తిరుగు! నాముఖంలోకి ఒక్కసారి చూడు.

మారు:—(కోపంతోబిగ్గరగా) విడిచిపెట్టు! (బలవంతంగాచెయ్యి విడిపించుకుంటాడు.) నన్ను దారితప్పించడానికి ప్రయత్నిస్తున్నావా? (వికలచిత్తంతో తిరుగుతూ) యిదేదో కొంచెం కొత్తగానేకనిపిస్తోంది నాకు. బాగా ఆలోచించాలి. ఆలోచించకుండా యేమీ చెయ్యలేను. (కలవరంతో—లాభంలేదన్నట్లు తలఆడిస్తూ) ఊఁ హుఁ! నాకేమీ తట్టడంలేదు. గాలిగోపురంలోకి వెళ్ళాలి. అక్కడే నాకు ఆలోచన దొరకాలి. (ఒక్కసారిగా) నువ్వులోపలికి వెళ్ళిపో! నేను యిప్పుడే వస్తాను.

గౌరి:—ఎక్కడికి?

మారు:—గోపురంలోకి!

గౌరి:—నేనూ వస్తాను.

మారు:—(అకస్మికంగా వెనక్కితిరిగి) ఏమిటీ? యీ అర్ధరాత్రివేళ యీ గాఢాంధకారంలో నువ్వు నాతో గోపురంలోకి వస్తావా?

గౌరి:—అవును. చీకట్లైనా, వెలుగైనా నీతోనేవుంటాను. అడివిలోకైనా, సముద్రంలోకైనా నీతోనే వస్తాను. నిన్ను విడిచిపెట్టను.

మారు:—(కోపంతో నఖశిఖపర్యంతం చూస్తూ) శిఖండిలా పట్టుకున్నావే!

గౌరి:—బాగా చెప్పావు. అంబ కూడా—యిప్పుడు నేనువున్న స్థితిలోనే—శిఖండిగా మారింది. నామాట విను బావా! ఈ సమయంలో నువ్వు పైకివెళ్ళడం మంచిదికాదు.

మారు:—ఏం? ఎందుకు?

గౌరి:—వాళ్ళందరూ ఆవేశంతో తిరుగుతున్నారు. నువ్వు పైకి వెళితే నన్నేమైనా చేస్తారు.

మారు:—నువ్వు అటువంటిభయం ఎప్పుడూ పెట్టుకోకు! వాళ్ళు నన్నేమీ చెయ్యలేరు. (కుడి చివరకు వెళతాడు).

గౌరి:—(వెంటనే అతనికి దారికి అడ్డువచ్చి) నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. నిన్ను వెళ్ళనివ్వను.

మారు:—(కోపంతో ఒక్కసారిగా) ఆడదానివని ఆలోచించేకొద్దీ—నువ్వు హద్దు మీరుతున్నావు. (ఆమె రెండు బుజాలు పట్టుకొని) ఇక మాటలతో లాభంలేదు. నిన్ను......

చంద్రయ్య:—(సరిగా ఈ సమయంలో ఎడమ చివర కనిపించి—బిగ్గరగా) మారుతీ!

(మారుతి ఉలికిపడి చంద్రయ్యకేసిచూసి—వెంటనే గౌరిని గడ్డిమోపుమీదికి విసిరి కుడివైపు పారిపోతాడు)

చంద్ర:—(గౌరిని లేవనెత్తి) ఎంత పొరబాటు చేశావమ్మా! (ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి) మీ ఇంటికి—మా ఇంటికిమధ్య పచ్చగడ్డివేస్తే భగ్గున మండేరోజులివి. ఈ సమయంలోనా ఇటువంటి పని చేస్తావ్? వాడినా నమ్ముతావు? (నిట్టూర్పు విడిచి) జరిగిందేదో జరిగిపోయింది. విచారించకు. ఎంత విచారించినా ఇక ప్రయోజనంలేదు. ఇది మంచికే వచ్చిందో—చెడుకే వచ్చిందో!—అంతా దైవనిర్ణయం. (ఎడమవైపు చూస్తూ) ఎవరో వస్తున్నారు! లోపలికి వెళ్ళిపోఅమ్మా! నేను దూళ్ళకు గడ్డివేసి యిప్పుడే వస్తాను.

(గౌరి లోపలికి వెళ్ళిపోతుంది. చంద్రయ్య గడ్డిమోపు తలపై పెట్టుకొని, కుడివైపు నిష్క్రమిస్తాడు. ఎడమ వైపునుంచి సూట్‌కేసు చేత్తో పట్టుకొని రఘుపతి, హోల్డాలు భుజంమీద వేసుకొని శ్యామసుందరం—ముఖాలు తేల వేసుకొని ప్రవేశిస్తారు. ముందుకు నడుస్తూ వుండగా దూరాన్నుంచి పల్లెపదం వినిపిస్తూ వుంటుంది)

నేపథ్యంలో:— యేడు గంటల బండిమీద
సిరిసిరిమువ్వా
నువ్వు—ఏ వూరు పోతావూ
సిరిసిరి మువ్వా!

(పాటఆగిపోతుంది. బిగ్గరగా) చామకందరంబాబూ! చామకందరంబాబూ! (పిలుపు వినిపిస్తుంది)

శ్యామసుందరం:—(కోపంతో వెనక్కి తిరిగి) యెవడ్రా వాడు?

రత్తయ్య:—(టోపీ చేత్తో పట్టుకొని ఎడమవైపునుంచి ప్రవేశించి) చామకందరంబాబూ! నీ టోపీ మరిసిపోయేవు (టోపీ ఇస్తాడు).

శ్యామ:—(టోపీ తీసుకొని) థాంక్యూ! (వెళ్ళిపోబోతాడు)

రత్త:—చామకందరంబాబూ!

శ్యామ:—(కోపంతో వెనక్కితిరిగి) నాపేరు చామకందరంకాదోయ్! శ్యామసుందరం!

రత్త:—పోనీ—యేదోఒకటిగానీ—మీరు దొరల్లాగ వచ్చి దొంగల్లాగ యెళ్ళిపోతన్నారు—యేంటీ కతా అని?

శ్యామ:—మీ పల్లెటూరివాళ్ళని నమ్మకూడదురా బాబూ నమ్మకూడదు!

రఘుపతి:—(కోపంతో) ఎంతమాత్రం నమ్మకూడదు.

రత్త:—ఆమాట నేను సచ్చినా ఒప్పుకోను.—మీ పట్నపోళ్ళనే అస్సలు నమ్మకూడదు. జేబులుకత్తిరించేవోళ్ళు—దగాసేసేవోళ్ళు—రైలు పెట్టెల్లోంచి మూటలెత్తుకుపోయేవోళ్ళు—ఈళ్ళందరూ ఎవరు? మీ వోళ్ళా? మావోళ్ళా?

రఘు:—(ఉక్రోషంతో) సంతోషించాంగానీ, దయచెయ్! (శ్యామసుందరంతో) పదరాబాబూ! పద!

రత్త:—ఇంత నడిరేత్రికాడ యెళ్ళిపోతన్నారేం?

శ్యామ:—(కోపంతో) ఇంకా మేం ఇక్కడ వుంటామటోయ్—పెళ్ళి చూపులకోసం రమ్మంటే వచ్చాం.

రఘు:—ఆ పెళ్ళికూతుర్ని ఎవడో ఎత్తుకుపోయాడు!

శ్యామ:—ఇంకా నయం! వాడి ధర్మమా అని పెళ్ళిఅయ్యాక ఎత్తుకుపోయాడుకాదు!!

రఘు:—మహా బాగా చెప్పావు! ఆ పిల్లను యెత్తుకుపోయిన కీచకుడెవరో—మనల్ని రక్షించాడనే చెప్పాలి!

శ్యామ:—(రత్తయ్యతో) అతగా డెవరో నీకు కనిపిస్తే మా 'కంగ్రాచ్యులేషన్సు' తెలియచెయ్!—ఇక మేం పోతున్నాం. నువ్వు ఎప్పుడైనా పట్నంవస్తే నాకు కనిపించు!

రత్త:—మరి మీరెక్కడుంటారు?

శ్యామ:—(జేబులోంచి ఒక కార్డుతీసి) ఇదిగో! నా ఎడ్రస్! (చదువుతూ) మిస్టర్ శ్యాం! ఆర్టిస్టు, కేరాఫ్ టర్నర్ చౌల్ట్రీ! (కార్డు యిస్తాడు.)

రత్త:—(కార్డు తీసుకొని) చెవులు ట్రీ యేంటండి?

శ్యామ:—చౌల్ట్రీ అంటే సత్రం!, నువ్వు సరాసరి అక్కడికేవచ్చి మకాం వేసెయ్. ఆ తరవాత అక్కడ యెవర్నడిగినా నా గురించి ఇట్టే చెప్పేస్తారు.

(ఎడమవైపునుంచి కొండయ్య, పుల్లయ్య వస్తారు)

కొండయ్య:—(వస్తూనే) ఓహో! పెళ్ళివారు తరలిపోతున్నారేమిటి?

రఘు:—(తొందరపడుతూ) పదరాబాబూ! పద!

రత్త:—నేను ఆ వంతెనదాకా వస్తాను.

(ముందు రఘుపతి, వెనక శ్యామసుందరం నిష్క్రమిస్తారు. వారివెనక రత్తయ్య వెళ్ళబోతూవుంటాడు)

కొండ:—(బిగ్గరగా నవ్వుతూ హేళనగా) హహ్హహ్హా! పాపం! పెళ్ళివారు!—ఆశపడి మోసపోయారు! (ముందుపోతున్న రత్తయ్యను చొక్కా పట్టుకొని వెనక్కిలాగి) నువ్వు ఆగరా! ఆగు! వాళ్ళనిపోనియ్! (పుల్లయ్యతో) ఒరేయ్! నువ్వు (ఎడమవైపు చూపిస్తూ) ఆరోడ్డుమూలని నిలబడి చూస్తూవుండు. ఎవడైనా వస్తుంటే వెంటనే నా దగ్గిరికొచ్చి చెప్పెయ్. వెళ్ళు. (పుల్లయ్య ఎడమవైపు వెళ్ళిపోతాడు.)

రత్త:—కొండయ్యబాబూ! ఆళ్ళని అక్కడిదాకా సాగనంపేసి వస్తాను.

కొండ:—వాళ్ళ మొహాలకి సాగనంపడం కూడానా? వాళ్ళమానాన్ని వాళ్ళనిపోనియ్—యిప్పుడు నీతో నాకు చాలా పనుంది.

రత్త:—(బెదురుతో) బాబోయ్! నాతోనే!

కొండ:—(కోపంతో) ఎందుకురా వెధవజడుపూ నువ్వూను? (నెమ్మదిగా) నువ్వు నాతోనేవుండి నాకు సహాయం చెయ్యి. అలా చేస్తే నీకు మంచి ఈనాం ఇస్తాను.

రత్త:—(సంతోషంతో) బలే! బలే! అలాగయితే సేస్తాను.

కొండ:—వాడు గౌరిని ఎక్కడ దాచేడో నీకు తెలుసునా?

రత్త:—అది తెల్దుకానీ మారుతివుండే సోటులన్నీ నాకు తెలుసును. నాకూడా వచ్చేవంటే నీకు ఆయన్నీ సూపించేస్తాను. రా మరి!

కొండ:—వద్దొద్దు. ఆ బైరాగి వెధవతో నాకేం పని? ముందు గౌరిని వెతికి పట్టుకోవాలి. గౌరి దొరికిపోతే వాడి ఆయువు పట్టు మనకి దొరికినట్టే లెక్క!

రత్త:—నీ పిచ్చిగాని—ఆళ్ళిద్దరూ నీకు దొరుకుతారా కొండయ్య బాబూ!

కొండ:—యేం? యెందుకు దొరకరు?

రత్త:—అళ్ళిద్దరూ కలిసే పారిపోయేరుకదా! నీ కింకెలాగ దొరుకుతారు సెప్పు?

కొండ:—నాకు నమ్మకంలేదు. యిందాకటినుంచీ నాకు అనుమానంగానేవుంది. వాళ్ళిద్దరూ ఈ చుట్టుపట్ల ఎక్కడో దాక్కొనివుండాలి. చంద్రయ్యను కూడా ఒక పట్టు పట్టి చూస్తాను. అతను లోపలవున్నాడా?

రత్త:—యేమో! నాకు తెల్దు.

కొండ:—చంద్రయ్య నిజం చెబుతాడో లేదో చూడాలి.

(తొందరగా తలుపు దగ్గరకు వెళతాడు)

రత్త:—(ఆత్రుతతో) వద్దొద్దు, కొండయ్యబాబూ! తలుపు కొట్టొద్దు.

కొండ:—(వెనక్కి తిరిగి) యేం? యేరా? యెందుకురా గాబరా పడుతున్నావ్?

రత్త:—(భయంతో) ఆ తలుపుకొడితే తలకాయలు తెగిపోతాయి. (కుడి చివరకువెళ్ళి నిలబడతాడు)

కొండ:—(అనుమానంతో) అయితే ఇందులో ఏదో కిటుకుంది. దీని సంగతేమిటో తేలుద్దాం.

(తలుపు నెమ్మదిగా రెండుసార్లు తట్టి—వెంటనే ద్వారం పక్కని గోడకు చేరబడి—దొంగలా చూస్తూవుంటాడు. నెమ్మదిగా తలుపులు తెరుచుకుంటాయి. గౌరి ఇవతలకు వస్తుంది. తిన్నగా ఎవరూ కనిపించరు.)

గౌరి:—(ముందుకునడిచి చుట్టూ చూస్తూ ఉంటుంది)

కొండ:—(అమాంతంగా ద్వారానికి అడ్డు నిలబడి బిగ్గరగా) దొరికావ్! ఇంకెక్కడికి పోతావ్?

గౌరి:—(ఆకస్మికంగా వెనక్కి తిరిగి భయంతో) కొండయ్యా! (రత్తయ్య ఒక్క దూకుదూకి, కుడివైపు పారిపోతాడు. అతనిని ఎవరూ గమనించరు.)

కొండ:—నేనే! నేను కాకపోతే ఈ అపరాత్రివేళ ఇంకెవడొస్తాడు? కలేజా వుండొద్దూ!

గౌరి:—(తీక్షణంగా) ఎందుకు వచ్చావ్?

కొండ:—ఎందుకా? నిన్నిడ్చుకెళ్ళడానికి?

గౌరి:—తెలివి తక్కువగా మాట్లాడకు. మర్యాదగా వెళ్ళిపో!

కొండ:—వెళ్ళకపోతే?

గౌరి:—చిక్కుల్లో పడతావు.

కొండ:—నేనా?

గౌరి:—ఔను! నువ్వే!

కొండ:—బెదిరిస్తున్నావా?

గౌరి:—లేదు. నిజం చెబుతున్నాను.

కొండ:—(నిర్లక్ష్యంగా) ఏయ్! పిల్లా! అలాంటి బెదరింపులికి జడుస్తాననుకోకు—నువ్వు మాటాడకుండా నాతోరా!

గౌరి:—(హేళనగా) నీతోనా? ఎక్కడికి?

కొండ:—ఇంటికి! నిన్ను గుట్టుగా ఎవరూచూడకుండా ఇంటికి చేర్చేస్తాను. ఇంకేమీ అల్లరివుండదు. ఆ మారుతిగాణ్ణి—ఇలాంటిపని ఎప్పుడూ చెయ్యకుండా—మేం పదిమందిమీ కలిసి ఒక పట్టుపట్టేస్తాం.

గౌరి:—ఇందులో అతని తప్పేమీలేదు. నా అంతట నేనే ఇష్టపడి అతనితో వచ్చాను.

కొండ:—ఆ సంగతి నా కొక్కడికే తెలుసును! మిగిలినవాళ్ళందరూ ఆ మారుతిదే తప్పనుకుంటున్నారు. అదీ ఒకందుకు మంచిదే! అనుకోనియ్!—ఇక ఆలస్యం చెయ్యకు. నాతో రా! మనం ఇద్దరం దాటిపోదాం. (మీదికి వస్తాడు)

గౌరి:—(వెనక్కి అడుగువేసి) దూరంగా వుండు.

కొండ:—నువ్వు ఇంటికి రావా?

గౌరి:—రాను.

కొండ:—ఎప్పటికీ రావా?

గౌరి:—రాను.

కొండ:—ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతావా?

గౌరి:—ఇక్కడేవుంటానో, మరోచోటవుంటానో—అదంతా నీకు అనవసరం!

కొండ:—నా మాట విను. చెడిపోకు. నువ్వు తిరిగి ఇంటికి రావడానికి ఇదే సమయం. ఈ రాత్రి దాటిపోయిందంటే ఇక శాశ్వతం నీ ఇంటికి నువ్వు దూరమైపోతావు.

గౌరి:—ఆసంగతి నాకు తెలుసు! నువ్వు వృథాగా ప్రయాసపడకు! నేను ఆ ఇంటినుంచి అడుగు ఇవతల పెట్టగానే దానికీ నాకూ సంబంధం తీరిపోయింది.

కొండ:—మారుతి నువ్వంటే పడిచస్తున్నాడనుకుంటున్నావా? నీ మీద యిష్టంతోనే నిన్ను తీసుకొచ్చాడనుకుంటున్నావా?

గౌరి:—అది అతనూ, నేనూ తేల్చుకోవలసిన విషయం—నీకేం సంబంధంలేదు.

కొండ:—కళ్ళు తెరిచిచూడు. బాగా ఆలోచించుకో!—నీ ముక్కూ ముఖం నీ అందంచూసి వాడు నిన్ను తీసుకురాలేదు. నీ డబ్బుమీద మోజుపడి నిన్ను తీసుకువచ్చాడు.

గౌరి:—అబద్ధం! అతని దృష్టిలో డబ్బుకు విలువలేదు. అతను నీ లా డబ్బుకోసం గడ్డికరవడు. అతని మనసు నాకు బాగా తెలుసు. నువ్వు నాకు నీతిబోధ చెయ్యవలసిన అవసరంలేదు.—తక్షణం ఇక్కడినుంచి దయచెయ్!

కొండ:—అనవసరంగా పాడైపోతున్నావ్! ఆ తరవాత నీ ఇష్టం. ఈరాత్రి దాటిపోయిందంటే యిక నిన్నెవ్వడూ పెళ్ళాడడు!

గౌరి:—(చురచురా చూస్తూ) ఇంతేనా? ఇంకా నువ్వు చెప్పవలిసిందేమైనావుందా?

కొండ:—ఓ! బోల్డువుంది. కాని నువ్విప్పుడు మైకంలో వున్నావు. నీ కళ్ళకి మంచీ చెడ్డా, చిన్నా పెద్దా, భూమీ ఆకాశం ఏమీ కనిపించడంలేదు. మేం పెద్దవాళ్ళం అందరంవుండి, నిన్ను చూస్తూ, చూస్తూ వదిలేస్తామనుకోకు! మర్యాదగా, అల్లరిచేయకుండా నాతోరా! ఇక్కడ ముష్టి బతుకు బతికేకంటే హాయిగా, జమీందారిణిలాగ బతకొచ్చు. రా! నాతో!

(ఆమె చెయ్యి పట్టుకోబోతాడు)

గౌరి:—(తప్పించుకుంటూ) దగ్గరకురాకు! అక్కడేవుండు!

కొండ:— (హేళనగా) సాక్షాత్తు సీతాదేవిలాగ మాట్లాడుతున్నావు! ముట్టుకుంటే శపిస్తావా?

గౌరి:—ఛీ! నీతో మాట్లాడ్డమే పొరబాటు!

(తొందరగా ఇంట్లోకి వెళ్ళిపోబోతుంది.)

కొండ:—(ఒక్క దూకుతో ద్వారానికి అడ్డు నిలిచి) ఆగు! నీ ఆటలు సాగుతాయనుకోకు. ఇక్కడ నిన్ను విడిచిపెట్టి వెళతాననుకోకు. (బిగ్గరగా) పుల్లయ్యా!

పుల్లయ్య:—(నేపథ్యంలో) హాయ్! వస్తున్నా!

(ఎడమవైపునుంచి వస్తాడు)

కొండ:—(పుల్లయ్యతో) నువ్వు ఇక్కడ ఈ గుమ్మానికి అడ్డంగా నిలబడు. (పుల్లయ్య అడ్డంగా నిలబడతాడు. కొండయ్య ఆమెను సమీపిస్తూ) ఇప్పుడు నువ్వు మా చేతుల్లోంచి తప్పించుకుపోలేవు. నువ్వు మాతో మర్యాదగా వస్తావా? సరేసరి! లేదా నిన్ను మేం అమాంతంగా మోసుకుపోతాం. యేం? ఈసారి వస్తావా? రావా?

గౌరి:—(దృఢనిశ్చయంతో) రాను! ఏమైనాసరే నేను రాను! నా బతుకునాశనంఅయిపోయినా, నా ప్రాణాలుపోయినా ఇక ఈదారి విడిచిపెట్టను. ఎక్కడికీరాను! చావైనా, బతుకైనా, చెడైనా, మంచయినా ఇక్కడేవుంటాను. నా ప్రాణాలు ధారపోసిఅయినా మారుతిని మంచిదారికి తెస్తాను. లేదా అతనితోనే కలిసి నాశనం అయిపోతాను. ఈ దారి తప్పదు. మరొకచోటికి రాను.

కొండ:—(కోపావేశంతో) నువ్వెందుకురావో నేను చూస్తాను. నిన్నేకాదు! నీ తలమీది జేజమ్మనైనా ఈడ్చుకుపోతాను. (అమాంతంగా ఆమె రెండు చేతులూ పట్టుకొని లాగుతూ) కదులు. (పుల్లయ్యతో) ఒరేయ్! పుల్లయ్యా! నువ్వు కాళ్ళు పట్టుకో! దీన్ని సాయంపట్టి బండిమీద పారేద్దాం. (పుల్లయ్య గౌరిని సమీపిస్తూవుంటాడు. గౌరి కొండయ్య చేతులు విడిపించుకోడానికి ప్రయత్నిస్తుంది—సరిగా ఆ సమయంలో కుడివైపునుంచి—ఆకస్మికంగా మారుతి, రత్తయ్య ప్రవేశిస్తారు. రత్తయ్య వస్తూనే పుల్లయ్యను కర్రతో ఒక్కటి వేస్తాడు).

పుల్ల:—(బిగ్గరగా) బాబోయ్! (ఒక్క దూకుదూకి కుడివైపు పారిపోతాడు.)

మారుతి:—(అమాంతంగా కొండయ్యచెయ్యి పట్టుకొని) పెళ్ళికొడుకులాతయారయి వచ్చావా? మంచిది.

రత్తయ్య:—కొండయ్యబాబూ! నీకు గుర్రం కావాలా? గాడిద కావాలా?

కొండ:—(కోపంతో) ఎందుకు?

రత్త:—ఎందుకేంటి! వూరేగడానికి!!

కొండ:—పొగరుగావుందా? (దురుసుగా మీదికి వెళ్ళిబోతాడు).

మారు:—(కొండయ్య చెయ్యి పట్టుకుని కుదిపి—అపుచేసి) ఆవేశపడకు కొండయ్యా! అది నీ వొంటికి అంత మంచిదికాదు.

గౌరి:—(మారుతిని సమీపించి) అతనిని విడిచిపెట్టేయ్‌బావా!

మారు:—(పక్కకు తిరిగి) నువ్వు కొంచెం ఆగు! నీ సిఫారసు వినే సమయం యింకారాలేదు.

గౌరి :—(కోపంతో) నన్ను అవమానిస్తున్నావా?

మారు :—(చిరునవ్వుతో) ఓహో! అప్పుడే నీ కోపతాపాలు నా మీద ప్రయోగిస్తున్నావా?—సరే! యింతకూ యితను యెందుకువచ్చినట్టు?

గౌరి :—నన్ను బలవంతంగా తీసుకొనిపోవడానికి!

మారు :—(ఒక్కసారిగా సంతోషాన్ని అభినయిస్తూ—కొండయ్యతో) ఓహో! యింకా చెప్పావుకాదేం? (గౌరిని చూపిస్తూ) యీ శిఖండిని ఎలా వదిలించుకోవడమా?—అని గంటసేపటినుంచి బుర్రబద్దలు కొట్టుకుంటున్నాము. సరిగ్గా నువ్వు సమయానికి రావణాసురుడిలా వచ్చి నన్ను రక్షించావు. వెంటనే యీమెను తీసుకుపో! అవసరమైతే నేనుకూడా ఒక భుజంవేస్తాను.

గౌరి :—(కోపంతో) బావా!

మారు :—(వెనక్కితిరిగి) ఏం? నీకిష్టంలేదా?

గౌరి :—నీలాంటి చపలబుద్ధికాదు నాది!

మారు :—(నిర్లక్ష్యంగా) ఊం! ఆ తర్వాత?

గౌరి :—నేను నిన్ను విడిచిపెట్టి వెళ్లను.

మారు :—పోనీ నన్ను వెళ్లనిస్తావా?

గౌరి :—నిన్నూ వెళ్లనివ్వను.

మారు :—(నిస్పృహతో) అదీ! యిప్పుడువచ్చిన చిక్కంతా అక్కడేవుంది.—గౌరీ! వేళాకోళంకాదు. నిజంచెబుతున్నాను బాగా ఆలోచించుకో! నా కోసం నీ జీవితం పాడుచేసుకోకు!

రత్తయ్య :—(ముందుకువస్తూ) ఒరేయ్! మారుతీ! నీకు బుద్ధీ గ్యానం వుందట్రా?

మారు :—(రత్తయ్యకేసి తిరిగి) నువ్వుకూడా నాకుబుద్ధిచెబుతున్నావా?

రత్త :—బంగారంలాంటి పిల్లని అన్యాయం సేస్తావంట్రా.

మారు :—బంగారం ఎప్పుడూ దాని విలువ తెలిసినవాడిదగ్గరే వుండాలి. (గౌరితో) యికనన్ను విసిగించకు! మాట్లాడకుండా మీ యింటికి వెళ్లిపో! ఎప్పటిలా హాయిగా కాలంగడుపు!

గౌరి :—నేను నీకు అడ్డుగావున్నానా?

మారు :—అవును.

గౌరి :—నీదగ్గర కత్తివుంటే యిలా తే!

మారు :—ఎందుకు?

గౌరి :—నీ అడ్డు శాశ్వతంగా తీర్చడానికి!

కొండయ్య :—(హేళనగా) యిక నీ సరదా తీరిందా? నడునడు! యింకా నువ్విక్కడ వున్నావంటే నిన్ను తీసుకువెళ్లి వీడు గంగలోముంచేస్తాడు. మర్యాదగా కదిలిరా! లేకపోతే నిన్ను బలవంతంగా తీసుకుపోతాను.

(ఆమెచెయ్యి పట్టుకుంటాడు.)

మారు :—(అతని చెయ్యిమీద ఒక్కటివేసి) విడిచిపెట్టు!

కొండ :—(కోపంతో) నువ్విందులో కలగచేసుకోకు!

మారు :—యిక నువ్వువెళ్ళిపో! ఊం!

కొండ :—(కోపంతో) అలాంటి బెదిరింపులు మనదగ్గరసాగవ్ నేను వుట్టి చేతులతో వెళతాననుకోకు! అడ్డువచ్చిన వాడి తలకాయ తీసి మరీవెళతాను. (ఆవేశంతో ముందుకు వస్తాడు—రత్తయ్య వెనకనుంచివచ్చి కొండయ్యను గట్టిగా పట్టుకుంటాడు. యిద్దరూకలిసి కొండయ్యను ఎడమవైపు యీడ్చుకుపోతూవుంటారు.)

కొండయ్య :—(బిగ్గరగాఅరుస్తూ) ఒరేయ్! వుల్లయ్యా! రారా! రారా! (ముగ్గురూ ఎడమవైపు వెళ్ళిపోతారు.—గౌరి భయంతో అటుచూస్తూ వుంటుంది. నేపథ్యంలో బిగ్గరగా కేకలు వినిపించి ఆగిపోతాయి.)

మారుతి :—(ఎడమవైపునుంచివస్తూ) చావు దెబ్బలుతిని పారిపోయాడు. (గౌరిని సమీపించి) ఎందుకోసమో తెలుసునా? కేవలం నీ కోసమే!

రత్తయ్య : (ప్రవేశిస్తూ) బలే! బలే! యియ్యేళతో నా సరదా తీరిపోయింది.

మారు :—యీ రాత్రి దీపావళిలావుంది. వూరంతా అలజడి. కలకలం. యిటువంటి అర్ధరాత్రివేళ యీవూరు ఎప్పుడూ యింతకళగాలేదు. లచ్చన్నకు జరిగిన ప్రాయశ్చిత్తానికి ప్రజలంతా లోలోపల సంతోషిస్తున్నారు. (కుడివైపు చూపిస్తూ—రత్తయ్యతో) చూడు అటువైపు! జనం ఎందుకో పరుగులెత్తుతున్నారు.

రత్త :—(అటుచూస్తూ—ఉత్సాహంతో) అవున్రోయ్! సూసొస్తాను. (కుడివైపు తొందరగా వెళ్ళిపోయాడు.)

గౌరి :—(ప్రాధేయపూర్వకంగా) యిది నీకుమంచిపనేనా మారుతీ! నీ చుట్టూ అశాంతిని సృష్టించుకుంటున్నావు. యిక లాభంలేదు. వాళ్ళు మనల్ని విడిచిపెట్టరు.

మారు :—(నిర్లక్ష్యంగా) మనల్ని పట్టుకొని కట్టేస్తారంటావా?

గౌరి :—(తనధోరణిలో) వాళ్ళు నిన్నేమైనా చేస్తారు. నువ్వు తిన్నగా వుండడంలేదు. ప్రతినిమిషానికి ఉద్రేకాన్ని పెంచుతున్నావు. పగను రెచ్చగొడుతున్నావు. మరొక దారి లేకుండా నీచుట్టూ గొయ్యితీసుకుంటున్నావు. నా మాటవిను. యిదేసమయం. ఎక్కడికైనా వెళ్ళిపోదాం పద! కొద్దిక్షణాలలో వాళ్ళంతావచ్చి పడిపోతారు. ఆ తరువాత......

మారు :—ష్! మాట్లాడకు. (కుడివైపుచూస్తూ) అదుగో! దూరాన్ని కాగడాలు కొరవిదెయ్యాలలా కనిపిస్తున్నాయి. — అకొండవైపు పరువెత్తుతున్నారు మనుషులు!

గౌరి :—(అటుచూస్తూ భయంతో అతనిభుజంమీద చెయ్యివేసి) రా! బావా! ఆలస్యంచెయ్యకు. వాళ్ళందరూఒక్కక్షణంలో వచ్చిపడతారు. ఎక్కడికైనా వెళ్ళిపోదాం.

మారు:—యిద్దరం కలిసి వెళ్ళడానికి యిదిసమయంకాదు. నీ దారిని నువ్వు వెళ్ళిపో! నువ్వు నాతో రాలేవు. నేను యే మూలకైనా వెళ్ళిపోగలను. మెరుపులా మెరిసి మాయమవ్వగలను. ఏమాత్రం అవకాశందొరికినా ఎదురు తిరిగి వాళ్ళని ఒకచూపు చూస్తాను. నేను వెళుతున్నాను. బతికి బాగుంటే మరొకసారి ఎప్పుడైనా కలుసుకుందాం. (తొందరగా కుడివైపు వెళ్ళిపోబోతాడు.)

గౌరి:—(కోపంతో అతనిని చెయ్యిపట్టుకొని ఆపుచేసి) ఆగు.

మారు:—నన్ను వెళ్ళనివ్వవా?

గౌరి:—నీమాయమాటలు యిక నాదగ్గర పనిచెయ్యవు. నన్ను మోసగించి పారిపోదామనుకుంటున్నావా?

మారు:—గౌరీ! యిది నా చివరిమాట! జాగర్తగావిను! మర్యాదగా వెళ్ళిపో! యిక జీవితంలో నే నెప్పుడూ నీకు అడ్డురాను. నువ్వు స్వేచ్ఛగా, హాయిగా ఎవరినైనా పెళ్ళిచేసుకొని......

గౌరి:—(కోపావేశంతో) మారుతీ! (బలంగాచెయ్యెత్తి అతని చెంపపై చెళ్ళున వేస్తుంది.)

మారు:—(చేతితో చెంపసవరించుకొని తీక్షణంగా) గౌరీ! ఎవ్వరూ చెయ్యలేనిపని—నువ్వు చేశావు. నీమీదనాకు కోపంరావడంలేదు. నాకు ఆశ్చర్యంగావుంది.

గౌరి:—(తనరెండుచేతులతో అతని ముఖాన్ని సవరిస్తూ) కోపంతో ఆవేశంతో నాకు వళ్ళు తెలియలేదు. ఎంతపని జరిగింది! నాకళ్ళలోకిచూడు బావా!

మారు:—(ముఖం పక్కకుతిప్పుకుంటూ) వద్దు గౌరీ!—నీముఖం చూపించకు. నాకు భయంగావుంది. నేను చూడలేను. నాకు పరిస్థితులు యిపుడిపుడే బోధపడు తున్నాయి. నేను నీకు అన్యాయంచేశాను. నిజమే.

గౌరి:—అన్యాయానికి విరుగుడు నీచేతిలోనేవుంది. నాముఖం లోకిచూడు. మనసారా ఒకసారి మాట్లాడు.

మారు:—వద్దు! వద్దు!—నామీద నీకువున్న అభిమానాన్ని తొలగించుకో! దానివల్ల ప్రయోజనంలేదు. నేను యీలోకంలోని దుర్మార్గానికి బలియై యేనాడో చెడిపోయాను. నేను చెడ్డవాణ్ణని తెలిసికూడా నువ్వు నన్ను విడిచిపెట్టడంలేదు.

గౌరి:—మంచి మాటలతో నమ్మించి నన్ను కొండశిఖరం ఎక్కించావు. యిప్పుడు నువ్వునన్ను అక్కడినుంచి ఒక్కసారి కిందికి విసిరేస్తున్నావు. యిదినీకు మంచిదేనా?

మారు:—ఇందులో యింత ప్రమాదంవుందని నాకుతెలియదు.

గౌరి:—యిప్పటికైనా తెలిసినందుకు సంతోషం! నువ్వు లోకందృష్టిలో దుర్మార్గుడివి. కాని నాదృష్టిలో (పరవశత్వంతో) యింకా కళ్ళుతెరవని పసివాడివి. యిక అడ్డు చెప్పకుండా నాతోరా! నువ్వు చెప్పినట్లు అందమైన ప్రపంచంలోకి వెళ్ళిపోదాం. దుర్మార్గానికి, పాపానికి, వంచనకు, ద్రోహానికి చోటులేని ప్రదేశానికి వెళ్ళిపోదాం. యీ ప్రపంచాన్ని మరచిపోదాం. రా బావా! యిక నన్ను కష్టపెట్టకు.

మారు:—యిక లాభంలేదు. నువ్వుమంచిమాటలతో వినవు.—నీ శ్రేయస్సుకోసం నేను మరొకసారి దుర్మార్గుణ్ణి కావలసివుంది. (కోపంతో) యిక తప్పదు. నిన్నుకాళ్ళూ చేతులూ విరిచికట్టి నేను పారిపోవాలి. మరొకదారిలేదు (చుట్టూ చూస్తాడు.)

గౌరి:—(ప్రాధేయపూర్వకంగా) వృథాగా ఆయాసపడకు! నువ్వు నాకాళ్ళూ చేతులూ కట్టకలవు కానీ నామనస్సును కట్టలేవుకదా! (అతని సమీపిస్తూ) ఎంత అమాయకుడవుబావా! (అతనిచేతులు పట్టుకొని అతనిముఖం లోకిచూస్తూ) అందమైన నీకళ్ళుయింతలో ఎంత భయంకరంగా మారిపోయినై! (భయంతో) నీముఖంలో ఆ యెరుపు......(బిగ్గరగా—రోదనస్వరంతో) వద్దు వద్దు! అలాచూడకు! నీముఖంమీద దుర్మార్గపు నీలినీడలు కనిపిస్తున్నాయి! త్వరగా నీమనసు మార్చుకో! ఒక్కసారి నవ్వు! (అతనిని రెండుచేతులతో పట్టుకొని వూపుతూ) అయ్యయో, మాట్లాడవేం బావా!?

మారు:—(ఒక్కసారిగా తిరిగి) నవ్వమంటావా? (బిగ్గరగా నవ్వుతాడు.) హహ్హహ్హా! నువ్వు పిశాచానివి! నా పాలిట మృత్యు దేవతవు!!

(గౌరిని రెండుచేతులతో దూరంగా విసిరేస్తాడు. గౌరికిందపడిపోతుంది. మారుతి కుడివైపు పారిపోతాడు. రత్తయ్య కేకలు వేసుకుంటూ కుడివైపునుంచి అతనికి ఎదురువస్తాడు.)

రత్తయ్య:—(వస్తూనే బిగ్గరగా) మారుతీ! మారుతీ! పారిపో! పారిపో!

మారు:—(తొందరగా) ఎవరు? ఎటునుంచివస్తున్నారు?

రత్త:—(కుడివైపుచూపిస్తూ—ఆయాసపడుతూ) అరుగో! దగ్గరికొచ్చేరు! ఒక్కదూకుదూకేయ్! (ఎడమవైపు చూపిస్తూ) అటుకేసి పారిపో!

(రత్తయ్య కుడివైపునుంచి యింటివెనక్కి పారిపోతాడు. మారుతితొందరగా ఎడమవైపు పారిపోతాడు. గౌరి ఆకస్మికంగా లేచి ఎడమవైపుచూసి భయంతో కెవ్వున అరుస్తుంది. వెంటనే మారుతి వెనక్కి తూలుతూ వస్తాడు. అతని తలనుంచి రక్తంకారుతోంది. అతనిని వెంటాడుతూ ఎడమవైపునుంచి ముందు కొండయ్య అతనివెనక మరోనలుగురు మనుష్యులూ కర్రలువేసుకొని "తన్ను",— కొట్టేయ్!"— "చంపు"!— అనికేకలు వేస్తూ ప్రవేశిస్తారు. కొండయ్య తలకు కట్టువుంది. తూలుతూ పడుతూ మారుతి కుడివైపు పరుగెత్తుతాడు. కుడివైపునుంచి లచ్చన్న, పుల్లయ్య, బసవయ్య మరికొంతమంది అనుచరులతో అరుస్తూ ప్రవేశిస్తారు. మారుతి — బోనులోచిక్కిన పులిలా — అటూ యిటూ చూసి చూరులోంచి కర్రలాగుతాడు. గౌరి మారుతిని తనవెనక్కి తీసుకొని అడ్డునిలుస్తుంది.)

గౌరి:—(బిగ్గరగా) ఆగండి !ఆగండి! అతని నేమీ చెయ్యకండి. తప్పంతానాదే! నేనే యితనిని బలవంతంచేశాను. నా అంతట నేనే యితనితోవచ్చాను. యిక మా జోలికి రాకండి. మమ్మల్ని బతకనివ్వండి!

లచ్చన్న:— (కోపావేశంతో) ముందు దీని జుట్టు పట్టుకొని యీడ్చెయ్! (కొండయ్య గౌరిని పట్టుకోబోతాడు. గౌరి మారుతిని విడిచిపెట్టదు. లచ్చన్న ఉద్రేకంతో) ఊం! కానివ్వండి!

(లచ్చన్న ఆజ్ఞవినగానే అందరూ ఒక్కసారిగా కర్రలు ఎత్తుతారు.—ఆకస్మికంగా రంగస్థలాన్నిచీకటి ఆవరిస్తుంది. కేకలు—కర్రలు చప్పుడు—పెద్దకోలాహలం—వినిపిస్తుంది.—ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరిస్తుంది. రంగస్థలంమీది చీకటిని చీల్చుకుంటూ నీలికాంతి ప్రసరిస్తుంది. — యువతీయువకుల రూపాలురెండు అస్పష్టంగా కనిపిస్తాయి. యిద్దరూ జంటగా ముందుకు వెడుతూ—క్రమంగా చీకటిలో కలసిపోతారు.——తెర!)

తెలుఁగులో బుడతకీచు నుడులు

శ్రీ తూమాటి దోణప్ప

[గత సంచిక తరువాయి]

[ప్రధానారోప పదమునకు తప్ప ఏతద్రూపాంతరములకు వరుస సంఖ్య వేయలేదు.

పదపట్టికయందలి ఆరోపరచనా రీతికి డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి—తెలుఁగు రీడరు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి—గారి సంపాదకత్వమున ఆంధ్ర ప్రదేశ సాహిత్యఅకాడమీ, హైదరాబాదు వారిచే ప్రచురితము కానున్న 'వ్యవసాయ వృత్తిపదకోశము' న డా. కృష్ణమూర్తిగారు రూపొందించిన విధానము ప్రధానాధారము. డా. కృష్ణమూర్తిగారికి కృతజ్ఞతాభివందనములు.

పదపట్టికలో వ్యవహృతములయిన సంకేతముల వివరణము.

కోశాదికములు :

ఆం. భా. ఆంధ్రభాషార్ణవము; ఆం. భాచ. ఆంధ్రభాషాచరిత్రము; ఆం. భా. వి. ఆంధ్రభాషావికాసము; ఆం. వాచ. ఆంధ్రవాచస్పత్యము; కాంబెల్—ఎ. డి. కాంబెల్, తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు, 1821; కిట్టెల్—డా. కిట్టెల్, కన్నడ—ఇంగ్లీషు నిఘంటువు 1894; గుండర్టు—డా. గుండర్టు, మలయాళ—ఇంగ్లీషు నిఘంటువు, 1872; బ్రౌ. బ్రౌను; A Dictionary of Telugu and English, బ్రౌ; ఇం.తె.-బ్రౌను, ఇంగ్లీషు—తెలుఁగు నిఘంటువు, 1895; బ్రౌ. రి.-బ్రౌను, తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు, రివైజ్‌డ్, 1903; మిశ్రబ్రౌ.—బ్రౌను, మిశ్రభాషా నిఘంటువు, 1854; వి. బ్రౌ.—విల్లియంబ్రౌను, తెలుగు—ఇంగ్లీషు నిఘంటు, సంస్కృతి ప్రచురణ, 1953; శ. ర.—శబ్దరత్నాకరము 1912; శ. ర. అను. శబ్దరత్నాకరము, అనుబంధము (అనుబంధకర్త:—శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు); సూ. ని.—సూర్యరాయాంధ్ర నిఘంటువు; MAMP—Manual of Administration of the Madras Presidency, 1885; Port. Voc. - Influence of Portuguese Vocables in Asiatic Languages; TL. Tamil Lexicon.

సాహిత్యము :

ఆముక్త. ఆముక్తమాల్యద; ఉ. రా. ఉత్తరరామాయణము; కళా. కళాపూర్ణోదయము; కువల. కువలయాశ్వ చరిత్రము; చెన్నపురీ. చెన్నపురీ విలాసము; దశా. దశావతార చరిత్రము; ద్వి. పరమ. ద్విపద పరమయోగి విలాసము; నానా. నానారాజసందర్శనము; బేరీజు. బేరీజు పద్యములు; బై. తెలుఁగు బైబిలు (1810—1960) మధ్య వెలువడిన అనేక ముద్రణములు; భీమ. భీమేశ్వరపురాణము; యయాతి. యయాతిచరిత్రము; రంగరాట్. రంగరాట్ ఛందము; రంగా. రంగారాయచరిత్రము; విజయ. విజయ విలాసము; శుక. శుకసప్తతి; హంస. హంసవింశతి.

భాషలు :

ఇం. ఇంగ్లీషు; ఇటా. ఇటాలియను; కన్నడ. కన్నడము; గుజ. గుజరాతి; తమిళ. తమిళము; తె. తెలుఁగు; ప్రా. ప్రాకృతము; ఫ్రె. ఫ్రెంచి; బు. బుడతకీచు; మరా. మరాఠీ; మల. మలయాళము; సం. సంస్కృతము; స్పా. స్పానిషు; హిం. హిందీ.

మండలములు :

అనంత. అనంతపురము; కర్నూ. కర్నూలు; కృ. కృష్ణా; గుం. గుంటూరు; గో. గోదావరి; చిత్తూ. చిత్తూరు; నెల్లూ. నెల్లూరు; విశా. విశాఖపట్నము; శ్రీకా. శ్రీకాకుళము.

ఇతరములు :

అన్యదే. అన్యదేశ్యము; ఉ. ఉచ్చారణ భేదము (లు); క్రి. క్రియావాచకము; చూ. చూడుు; దే. దేశ్యము; పర్యా. పర్యాయపదము; పు. పుట; మొ. మొదలగు; రూ. రూపాంతరము (లు); వి. విశేష్యము; విశ. విశేషణము; వై. వైకృతము; fn. foot note; p. pp. pages; —దీనికి పరమునఁ గలదాని నుండి అనుటకు గుఱుతు; — దీనికి పూర్వమునఁగల దానినుండి అనుటకు గుఱుతు; ° ప్రధానారోపపదమును దీనికి పూర్వభాగమున కలిపి చదువుకొనవలయును.]

81. పస్కా : రూ. పస్ఖా, పాస్క, పాస్కా. ఐగుప్తుచక్రవర్తులదాస్యమునుండి విముక్తులయి ఇశ్రాయేలీయులు తరలివచ్చిన ముహూర్తము సంస్మరణార్థము చేసెడి ఏడురోజులపండుగు; మేషసంక్రాంతి పౌర్ణిమనాఁడు మొదలయి వరుసగా ఏడుదినము లీ పండుగ జరుగును. '...రెండుదినములైన పిమ్మట పస్కాపండుగ, అనగా పులియని రొట్టెల పండుగవచ్చెను' (మార్కు. అధ్యా.14); 'అది యెహోవాకు పస్కాబలి' (నిర్గమ. అధ్యా. 12); 'పస్కాపశువును వధించుడి' (పైది); 'మొదటినెల (అబీబునెల) పదునాలుగవదినము యెహోవాకు పస్కాపండుగ' (సంఖ్యా. అధ్యా. 29); 'పస్కాపండుగలోని

బలిసంబంధమైన మాంసమును ఉదయకాలమువరకు ఉంచకూడదు' (నిర్గమ. అధ్యా. 34); 'యూదుల పస్కాపండుగ సమీపింపఁగా' (యోహాను. అధ్యా. 2); 'ఇది పస్కాపండుగనుగూర్చిన కట్టడ....అన్యుడెవడును దానిని తినకూడదు....పరదేశియుడును కూలికి వచ్చిన దాసుడును దానిని తినకూడదు' (నిర్గమ. అధ్యా. 12); —బు. పష్కోఆ; స్పా. పాస్కూఆ=క్రిస్మసు పండుగు, క్రీస్తుపునరుత్థాన చిహ్నముగా జరుపఁబడు పండుగు. పస్కాపండుగువారమునందే ఏసు సిలువ వేయఁబడుట; ఆ వారమునందే ఆయన పునరుత్థానమును. కావున పస్కా, ఈష్టరులు సమానార్థకములయినవి; ఫ్రె. పేక్ (పే లోని 'ఏ' మామూలు 'ఏ'కంటె వివృతము); తెలుఁగు లోని ఈ 'పస్కా' లాటిన్ భాషా పదమని బ్రౌను. (A few Latin words are used as... Pascha, Baptisma etc...' C.P.Brown, Madras Journal of Literature and Science, No. 28, July 1840).

పష్కా : చూ. పస్కా (బ్రౌ. ఇం. తె., 877).

పాదరి : చూ. పాదిరి (బ్రౌ. ఇం తె.) '....పాదరులున్....' (చెన్నపురీ. పు. 14); పాదరీలు (బ్రౌ. ఇం. తె.).

82. పాదిరి : రూ. పాదరి. క్రీస్తుమతబోధకుఁడగు గురువు; °గుళ్ళు (చెన్నపురీ పు. 53); °తనము °వారు, °వృత్తి, పాదిరులు, పాదిర్లు (బ్రౌ. ఇం. తె.); గ్రామపాదిరి, చిన్నపాదిరి, పెద్దపాదిరి ఇత్యాదులు ప్రచుర వ్యవహారము కలవి.—బు. పాద్రి; స్పా. పాద్రే; ఇటా. పాద్రె; ఫ్రె. పెర్ ('ఎ' 'ఎ'కంటె వివృతము). బుడతకీచుఁలకంటెను భిన్నులయిన క్రైస్తవమతబోధకులకును 'పాద్రి'యను వ్యవహారముండినట్లు ఎడ్వర్డు టెర్రీ (1616—1619) అను ఆంగ్లమత ప్రచారకుని వ్రాఁతలు (Early Travels in India, p. 331). ఇటాలియను 'పాద్రె', ఇంగ్లీషు ద్వారమున తెలుఁగున జేరినదని గాలెటి, (263). గాలెటి ఇటాలియను జాతీయుఁడగుటయు, ఆ భాషలో 'పాద్రే'యను పద ముండుటయు ఈ నిర్ణయమునకు హేతువులు. ఇది చరిత్రను మఱచి చెప్పినమాట; ఫ్రె. లేక ఇం. (బ్రౌ. రి., 743)—బు. (MAMP, ఆంభాచ. అం. భా. వి.); కన్నడ. పాదరి, పాద్రి—బు. (కిట్టెల్ 971); మల. పాదిరి—బు. (గుండర్టు, 644); పాదిరి మావు, పోర్చుకిమావు = జీడిమామిడి (MAMP); తమిళం. పాతిరి—బు. (TL, 2608).

83. పాపు (గారు) : కాతలిక్ క్రైస్తవ జగద్గురువగు పోపు. (కొత్తనిబంధన, నెల్లూరిప్రతి; కర్నూ., నెల్లూ.) —బు. పాపా=పోపు; స్పా. పాపా.

పాస్క : చూ. పస్కా; °గొర్రెపిల్ల, °పండుగ, °బలి, °యజ్ఞము, °యాగము, °వ్రతము,పాస్కోత్సవదినము(పూర్వనిబంధన)

పాస్కా : చూ. పస్కా; °మహోత్సవము (పూర్వనిబంధన).

84. ?పిరంగి : రూ. పిరంగీ, పీరంగి, ఫిరంగి. 'సిపాయిలు యుద్ధమప్పుడు మందుగుండు వేసిగట్టించి కాల్చెడి ఇనుపక్రోవి' (శ. ర.); పిరంగి (శుక. 2—410,హంస. 5—59), పిరంగుల బారులు (చెన్నపురీ. పు. 26), పిరంగులు (శుక. 1-222)—ఫ్రె. (గాలెటి, ఆం.భావి); గ్రామ్యమనీ పరంగుల సంబంధము కలదికావున పిరంగి అనీ కాంబెల్ (చూ. 367).

పిరంగీ : చూ. పిరంగి దే. వి. (శ. ర.).

85. పీత : నాడా, బద్దె (మిశ్ర బ్రౌ.)—బు. ఫీతా=నాడా; స్పా. పీతా; ?పెరూవియను పదము; ఒకదినుసు కలబంద (agave) మొక్కనుండి తీసిన నారతో వేసిన త్రాడు.

86. పీపా : రూ. పీపాయ, పీపాయి. కొయ్యచెక్కలకూర్పుతో, ఉక్కురేకు బిగింపుతో పెద్ద మద్దెలరూపుగా నిర్మించిన భాజన విశేషము; °కట్టు=మూఁత పలకల నడుమవేసెడి ఇనుపబద్ద; ఇట్టి బిగింపు (కృ.,); °రేకు=సరంబీ బల్ల కూర్పులో బల్లలనడుమ అదుకుగా వేసెడి ఉక్కురేకు; జేలుకట్టు (విశా.)—బు. పీపా; స్పా. పీపా; కన్నడ. పీప, పీపాయి, పీపు—బు.(కిట్టెల్ 988); మల. పీప్ప—బు. (గుండర్టు '670); తమిళం. పీప్పా, పీప్పాయ్—బు. (TL, 2735); మరా. పీప—బు. (మరాఠీ వ్యుత్పత్తిపదకోశము, 502); గుజ. పీప—బు. (బెల్సారె, గుజరాతీ వ్యుత్పత్తి పదకోశము, 488); హిందీపదమని ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము, పు. 255.

పీపాయ : చూ. పీపా, పీపాయలు (బ్రౌ. ఇం. తె.).

పీపాయి : చూ. పీపా; °కట్టు, °గిండి, °నోరు, °బిరడా, పీపాయిలు (బ్రౌ. ఇం. తె.)

87. పీపీ : రబ్బరు బూరా (అనంత)—బు. పీపా.

పీరంగి : చూ. పిరంగి (ఆం. భా. 2—218).

పుడతకీసు : చూ. బుడతకీచు; 'ప్రాన్సు పుడతకీసు హారబి పార్సి తెనుఁగు — నరవమును మొదలయిన భాషాంతరముల—మాటలాడఁ జదువ వ్రాయ మేటియగుచు.... తిరువేంగ డేంద్రుఁడమరె' (రంగరాట్. పీఠిక, 81).

88. పురతకాలు : రూ. బురతకాళి, బురతకాలు. విశే. పోర్చుగాలు దేశీయము, పోర్చుగాలులో తయారయిన (—పట్టుమొదలయినవి); ఒకరకము పట్టుగుడ్డ. 'ధరణీశ్వరునకు గుందనపుఁ బీఠమునఁ బరపుగాఁబురతకాల్పఱపు ఘటించి' (తంజాపుర విజయరాఘవ (1633 1673) కృతమగు రఘునాథనాయకాభ్యుదయము, పు. 54), 'పురతకాల్ పట్టు పాపోసులుతెచ్చి—

మురువుగా నొక యుంతి మునివేళ్ళఁజేర్చి' (వైది. పు. 74), 'మృదుహంసతూలికా. మిళితంబులైన—పురత కాల్ తలగడల్....' (వైది. పు. 80), 'పురతకల్పు పతిమలుపట్టు చావలు..' (కామేశ్వరకవి (1670) కృతమగు సత్యభామాసాంత్వనము, 3—4). — బు. పొర్చుగాల్; ఇటా. పొర్చుగాల్లో; పొర్చుగాలు నారింజ; మల. పొర్చుగాల్, ప్రతుగాల్; మరా. పూర్చుగాల్= పొర్చుగాలు దేశము; పారసి—పురుఘాల్. వారింజలో ఒకదినుసు; తుర్కీ. పొర్చుగాల్; నారింజలో ఒకదినుసు.

పురతకీశు (లు) : చూ. బుడతకీచు;—ఇం. (శ. ర. అను).

పురతకేశు (లు) : చూ. బుడతకీచు 'ప్రాంసు హింగ్లీజు దిన మార్గ యెలందా యంపరు దొరు పురతకేశు మొదలయిన జాతిభాషా విశేషంబులు....' (రంగరాట్. పీఠిక. 81).

89. పురోయి : ఒడంబడిక పత్రము; ధ్రువపత్రము (మిశ్ర బౌ.)—బు. ప్రోవా; ప్రమాణము, దృష్టాంతము; స్పా. ప్రూయేబా=నిదర్శనము; రుజువు; గుఱుతు, తార్కాణము; ఫ్రె. ప్రెవ్=రుజువు; మరా. పురావా=సాక్ష్యము; గుజ. పురావో; కన్నడ. పురావె; తార్కాణము, రుజువు.

90. పేనా : ఊటకలము. రావిపాటిగురుమూర్తి శాస్త్రి గారి (1770—1837) తెనుగు వ్యాకరమున అన్యదేశ్యముల పట్టికలో 'పేనా' పేర్కొనబడినది (పు. 69, వావిళ్ళవారి ప్రతి, 1951).—బు. పేనా; —ఇం. (మిశ్రబౌ., బౌ. రి., శ. ర., ఆం. వాచ., ఆంభాచ., గాలెటి).

పొప్పడ : ఉ. పొప్పడి చూ. బొప్పాయి 'పొప్పడికాయ మన దేశానిదికాదు. దక్షిణ అమెరికానుంచి 17 వ శతాబ్దాంతమందు మనదేశానికి వచ్చెను....' (సు. ప్ర. రెడ్డిగారు, ఆంధ్రుల సాంఘికచరిత్ర, ద్వి. ముద్రణ. పు. 486).

91. పొప్పళి : రూ. పప్పళము, పప్పళి, పప్పిళి, పొప్పిళి. స్త్రీలుధరించు గళ్ళుగల సన్నని వస్త్రవిశేషము (సూ.ని), చచ్చౌకపు టెండ్లగుడ్డ; 'ఎరుపుతెలుపు మళ్ళుమళ్ళుగా వుండేచీర' (మిశ్రబౌ); 'చిఱుతపొప్పళి' (శుక. 1—237), 'పసరుపొప్పళి'(వైది); 'ముయ్యంచుఁపొప్పళ్ళు' (హంస. 5—359);—బు. పాపిలీనా; స్పా. పోపెలీనా; ఫ్రె. పోపేలీ; డచ్చి. పొపెలిన్; ఇం. పాప్లిన్; కన్నడ. పప్పళి, పొప్పళి, పొళ్ళి—ఇం. (కిట్టల్, 940).

పొప్పాయి (పండు) : చూ. బొప్పాయి (మిశ్రబౌ.)

పొప్పిళి : చూ. పొప్పళి (అనంత).

92. ప్రాంచీ (లు): బహువ. పరాసువారు, ఫ్రెంచిజాతీయులు; —బు. ఫ్రంసేష్=పరాసువ్యక్తి; స్పా. ఫ్రాంచేస్=ఫ్రెంచి వ్యక్తి; ఫ్రె. ఫ్రాఁసె; మల. పరందిరియన్సు—బు. francez (గుండర్టు, 617).

ఫత్తేరి : చూ. బత్తేరి (మిశ్రబౌ).

బంకజీ : చూ. బంకు (మిశ్రబౌ), 'బంకశీ' యని (Port. Voc., p. 37).

93. బంకు : రూ. బంకజీ. హజారము, మొగసాల (రంగరాట్. పీఠిక, 116); కక్ష్య, ఇంటిలోపలిభాగము 'కొదుకక బంకు బంకులు దాటి చనుచు, (తిమ్మకవి ద్వి. సారంగ. పు. 129); 'బంకంవాకిలిగుండా....' (Annals of Hande Anantapuram, p. 23.); సందువీథి (శ. ర.); 'తలవాకిటి పహారా' (మిశ్రబౌ); కిళ్ళీ, బీడీకొట్టు (విశా.); జూదసాల (కృ., గుం); పెట్రోలుబంకు; — బు. బంకు=కొయ్యపీట, బెంచి; ఖజానా; స్పా. బంకా=బెంచి; బ్యాంకు; ఇటా. బంక; డచ్చి. బంక్=బెంచి; కిళ్ళీకొట్టు; తమలపాకులంగడి; మరాఠీ పదమగు 'బంకా' నుండియని (శ. ర. అను. 108); మరా. బంక=పహారా, చౌకీ, గస్తు; పారసి. బంకీ.

బత్తాసు : చూ. బొత్తాము (బౌ. ఇం. తె.).

94. బత్తేరి : రూ. ఫత్తేరి, బత్రి. ముట్టడిదిబ్బ; 'ఫిరంగులు పెట్టికాల్చుడమునకు యెత్తుగావేసిన దిబ్బ' (మిశ్రబౌ); అరగడి బత్తేరి.—బు. బతేరియా; స్పా. బాతేరియా డచ్చి. బత్తెరియ్.

బత్రి : చూ. బత్తేరి (మిశ్రబౌ);—?ఫ్రె. బెత్రీ.

బంబాస : చూ. బొంబాసు (మిశ్రబౌ).

95. ?బరమా : రూ. బర్మా, బురమా, బురుమ, బురుమా. పిడిసాన, తొరపణము, కండాణము; 'పండ్రంగిమున్నగు వారు కొయ్యలు మొదలగువానికిని, ఆలపనివారు రత్నములకును బెజ్జముపేసెడు సాధనము' (సూ. ని.) —బు. వెఱ్ఱుమా=తొరపడము; స్పా. బర్రేనో, బెఱ్ఱీమా; —పారసి. హిం. (కాంబెల్ 409);—హిం. (బౌ. రి., ఆంభాచ.); దేశ్యము (శ. ర., ఆం. వాచ);? సం. భ్రమర.

బర్మా : చూ. బరమా (మిశ్రబౌ.).

బసి : చూ. వెసల (మిశ్రబౌ). బు. బసీయు, బాసి=భోజన పాత్రము; స్పా. బాసీయా=పళ్ళెరము, సానిక;? సం. భాజన.

96. ?బాతు : జలపక్షివిశేషము. బాతువులు (ఆముక్త. 1—65); బాతులున్ (చెన్నపురీ. పు. 37); 'కలంబు (బేరీజ. పు. 31) 'కోడి=బాతు (సేలము); గూడబాతు (హంస. 3—12); చింకుబాతు (మిశ్రబౌ); పెద్ద బాతు (గాలెటి); పొట్టిబాతు, బాపనబాతు=చక్రవాకము (MAMP, III, 337);—బు. పాతు; స్పా. పాతొ, పాతా=బాతు; పాతీకా=చిన్నబాతు; కన్నడ. బాతు, బాతె; తుళు. బాతు; తమిళ. వాత్తు; హిం. బతఖ్, బదక్; గుజ. బతక్; మరా. బదక్; పారసి. బతక్; అరబ్బీ బత్; దేశ్యము (కాంబెల్, శ. ర., ఆం. వాచ.)-హిం. (MAMP, బౌ. రి., గాలెటి, ఆంభాచ.).

బాడ్లీ : చూ. బాల్డి;—బెంగాలి (మిశ్రబౌ.).

బార (కచేరీ) : చూ. బారకాసు. సైనికులుండు వసారా యిండ్లు. (ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము. పు. 258); 'బారకాసు'తో 'కచ్చేరి' చేరుటచే'—కాసు' జారిపోయి 'బార (కచేరి)' అను క్రొత్తమాట సృష్టి యయినది.

97. బారకాసు : ఉ. బార్కాసు, బార్క్యాసు, బార్క్యాచు; రూ. బారకీసు, బ్యారకును (లు); పర్యా. బార (కచేరీ) =సైనికులుండు నివాసములు ; 'సిపాయిలువుండేశాల' (మిశ్రబౌ.); °లంజ=దండులంజ (మిశ్రబౌ.). —బు. బర్రాకాష్=గుడిసె; గుడారము; డేరా; స్పా. బారాకాస్=పాక, కుటీరము; పందిరి; బర్రాకా = కుటీరము; బారాకోన్=గిడ్డంగి; బానిసల నివాసములు; ఫ్రె. బెరెక్= పాక; సంతగుడారము;డచ్చి.బరక్=పాక;-ఇం.(మిశ్రబౌ., శ.ర., ఆంభాచ); కాని 1686కు పూర్వ మీమాట ఆంగ్లమున వాడుకలో నున్నట్లు సాక్ష్యములేదు; రొమాన్సు భాషలనుండి పదునేడవు శతాబ్దాంతమున ఆంగ్లమునఁ జేరినదని పరిశీలకులసిద్ధాంతము.

బారకీసు : చూ. బారకాసు, 'బుడతకీసులు సోల్జరుల్ పొదలుచుండ —బారకీసుల గదుల పెంపారునందు' (చెన్నపురీ. పు.24) 'సోజర్లవి బారకీసులు' (పైది).

బాలిత : చూ. బాల్డి (మిశ్రబౌ.).

బాలిది : చూ. బాల్డి (మిశ్రబౌ.).

బాల్చి : చూ. బాల్డి (గో.,విశా., శ్రీకా., ఆంభాచ., ఆం.భా.వి).

బాల్టి : చూ. బాల్డి (తూర్పుగో., విశా., శ్రీకా., కోరాపుట్టి ఖర్గపూరు, రాయపూరు).

98. బాల్డి : రూ. బాడ్లీ, బాలిత, బాలిది, బాల్చి, బాల్టి· బొక్కెన—బు. బల్డి=బొక్కెన; స్పా. బాల్డి=బొక్కెన; కొయ్యతొట్టి; గుజ. బాలదీ=తోలుబొక్కెన;—బెంగాలి (మిశ్రబౌ.).

99. బిలిబిలి : ఊరగాయకు పనికివచ్చు పుల్లనికాయల చెట్టు, పులుసుకాయచెట్టు (MAMP, III, 98), — బు. బిలింబిమ్ = బిలింబి చెట్టు పండు; కన్నడ. బిలింబి; తుళు. బింబులి; కొంకణి. బిలంబి; మలయా. బ్లిమ్ బ్లింగ్; Averrhoa bilimbi, Linn;బుడతకీచులు మలయానుండి తెచ్చియుందురు.దీని జన్మదేశమేదో తెలియదఁట. (Flora of Madras, Vol. I, p. 95).

బిస్కత్తు : ఉ. బిసకత్తు; చూ. బిస్కోతు (అనంత., కృ.,గో).

100. బిస్కోతు : రూ. బిస్కత్తు, బిసోకతు (బౌ .ఇం.తె) —బు. బిషోకయ్తు; స్పా. బిథ్ కోచో (ఇందలి 'థ్', ఇంగ్లీషు thank, think— లలోని 'th-' ను పోలిన ఉచ్చారణముకలది; దంత్యోష్మము, శ్వాసము, మహాప్రాణము); ఫ్రె. బీస్క్వి; బుడతకీచులరాకతో 'బిస్కత్తులు'ను వచ్చినవి. 'పరంగులు' అప్రాచ్యులు కావున వారు తెచ్చిన ఈ'బిస్కోతు'ను బంగాళీలు (విష కూటము)గా భావించి, వీనిని 'బిష్కూట్' అని వ్యవహ రించిరఁట!; బిస్కట్—ఇం.

బిసోకతు : చూ. బిస్కోతు (ఆంభాచ. 618).

101. బుడతకీచు : రూ. పుడతకీసు, పురతకీశు, పురతకేశు పోర్చుగ్గాలు దేశసంబంధి; పోర్చుగాలు దేశపుభాష; బుడత కీచుజాతి. 'బుడతకీసులు సోల్జరుల్ పొదలుచుండ' (చెన్నపురీ. పు. 24); — బు. పోర్చుగీజ; ఫ్రె. పోర్చ్యుగె; ఇటా. పోర్తొఘీస్; డచ్చి. పోర్చు గీస్; అరబీ. బుర్తుకాన్=తీయని నారింజ; హిం. పుర్తు గీస్ = 'బుడతకీచు—భారతీయ' సంసర్గముచే కలిగిన మిశ్రజాతి; మరా. పూర్తకేశ= బుడతకీచు; మల. పోర్చుకి (మావు) పడుమటి ఇండియా దీవులనుండి బుడతకీచులు తెచ్చిన జీడిమామిడిచెట్టు. బుడతకీచు లను 'పోర్చుంగలేస్' అని నికోలస్ విథింగ్టన్ (1612—1616, Early Travels in India, p, 203).బుడతకీచులో 'త', 'ద'లకు పూర్వముననుండ. రేఫము భారతీయ భాషలో 'డ', 'డ'లుగా మారినది.

బుడిదీ : చూ. బుడుదు; 'బుడిదీ వేయుట'—సీసపు ముక్కను నీటిలో వదలి లోతు కనుగొనుట (ఆంభాచ., 638).

102. బుడుదు : రూ. బుడిదీ. నీటిలోతును కనుగొనుటకు నావికులు వాడు సీసపుగుండు. '....ఓడవారు....బుడుదు వేసి చూచి యిరువది బారలలోతని తెలిసికొనిరి' (అపొస్తలుల. అధ్యా. 28); 'నెళవుసూత్రము' అని బైబిలు నెల్లూరిప్రతి;—బు. బొర్డు; స్పా. బోర్డో.

బుతాము : చూ. బొత్తాము (మిశ్రబౌ.)

బురతకాళి 1 : చూ. పురతకాలు. వస్త్రవిశేషము; పోర్చుగాలు దేశపుపట్టుగుడ్డ. 'బురతకాళిలు మహామూదులు నిలా చీలు—సరిసేయరాని హంసావళులు లాకీలు' (హంస. 5—360, శృంగారకావ్యగ్రంథమండలి వారిప్రతి); 'బుడతకాసీలు మహముదుల్లు నిరాసీలు—సరిసేయరాని హంసావళులు లాకీలు....' (వావిళ్లవారిప్రతి 1920); 'బుడతకాసీలు మహముదులు నిరాసీలు—సరిసేయరాని హంసావళులు లాకీలు....'అని వావిళ్లప్రతి ననుసరించి

---

1. ఒక తాళపత్ర ప్రతితో 'పురుతకాళలు' అని కలదు.

" .... పురుతకాళలు మహాముదులు నిలాకీలు
సరిశేయరాని హంసావళులు లాకీలు
మాదళములు...." (హంస వింశతి, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, వారి గ్రంథాలయమునందలి తాళ పత్ర ప్రతి, నెం. 70; 130 వ పత్రము, రెండవవైపు, చివరి పంక్తి.)

సూ. ని. పాఠము. ఈ పాఠమున ప్రాసభంగమును సూ. ని. కారులును గమనించినట్లులేదు. (చూ. సూ. ని.లో 'బుడతకాసీలు' అను ఆరోపము క్రింద), 'బుడతకాళిలు' క్రొత్త ప్రతిపాఠము అని సూ. ని.

బురమా : చూ. బరమా (ఆం. వాచ.)

బురుతకాలు[2] : చూ. పురతకాలు; 'కొమరొందునేకరంగు మెఱుంగు తలగడల్ బలితంబు బురుతకాల్పట్టు బటువులమరు మగఱాలపని చప్పరము....' (ఉ. రా. 6—160, క్రీ. శ. 1650,); 'బలితంపు బురుక కాల్పట్టె బటువులమరు....' అని రాయలువారి ప్రతి (చూ. పు. 245); '....బలితంబు బురుక కాల్పట్టె బటువులమరు....' అని సూ. ని. పాఠము. పోర్చుగాలు దేశసంబంధియగు పట్టు 'బురుతకాలు' మనవారి చేతులలోఁబడి బుడక (=చిన్న), కాల్ (=కాలు) అగుట లేఖక ప్రమాదమును; ముద్రారాక్షసమును.

బురుమ : చూ. బరమా (మిశ్ర బ్రౌ.).

బురుమా : చూ. బరమా (కాంబెల్, బ్రౌ. రి., శ. ర., సూని., ఆం. వాచ.).

103. బురుసు : కుంచె, తూలిక; 'ఒళ్ళుతోముకొనే బురుసు' (బ్రౌ. ఇం. తె.);—బు. బ్రూస=గుడ్డలమీఁది దుమ్ము దూళి తుడుచు పనిముట్టు; స్పా. బ్రోచా=తూలిక;—ఇం. (ఆం. భాచ.); Port. Voc. లో తె. 'బరుసు' ప్రదర్శితము. ఇది ఇంగ్లీషు 'brush' కు వికృతి.

104. బేస్తు : పేక, జూదము లోనగువాని యందలి కొద్ది గెలుపు, బొటాబొటిగెలుపు. బేస్తుకంటే తగ్గిన కుందేలు, బేస్తుకంటే హెచ్చిన ఆట. చిన్నబేస్తు, పెద్దబేస్తు, పైబేస్తు అనివాడుక.—బు. బస్తు=చీట్లాట లోని పరిభాష; స్పా. బాస్తో=చీట్లాటలోని పరిభాష; కాకితములలో కళావరు; బాస్తోస్=కళావరుకాకితము అపోస్తర్=పందెమువేయు.

బొంగు : చూ. బొంబు. ఎండిన లావుబోలు వెదురు (శ. ర.); 'కీచకసంజ్ఞయై తోఁచు బొంగన....' (ఆం. భా. 2—74); ఓడ బేహారియగు విష్ణుదాసుఁడు 'జాతి విలాయతీ' దీవులనుండి తెచ్చిన సామానులలో ..'పాలు పొందు నందలపు బొంగులును....' (హంస. 5—360) ఉండినవి; డేరాబొంగు, పాలకీబొంగు (వి. బ్రౌ. 247).

బొత్త : చూ. బొత్తాము. బొజ్జము (బ్రౌ. ఇం. తె.).

బొత్తాను : చూ. బొత్తాము (మిశ్ర బ్రౌ., శ. ర.).

105. బొత్తాము : రూ. బత్తాను, బుతాము, బొత్త, బొత్తాను, బొత్తాయి, బొత్తాను. గుండి. (తూర్పుగో. శ. ర., మిశ్ర బ్రౌ., ఆంభావి., ఆం. వాచ.); కాను బొత్తా=చుక్కాణి ఉండుబొజ్జము (ఆంభాచ);—బు. బొతాము (ను); స్పా. బోతోన్; ఫ్రె. బూతోఁ;—ఇం. బటన్-ఇం.; (శ. ర., గాలెటి); – ఫ్రె. (మిశ్ర బ్రౌ.); గుజ. బుతాన—ఇం. (బెల్సారి, 547); బొత్తాము, ఏత ద్రూపాంతరములు బుడతకీచు జన్యములు; 'బటన్' ఇంగ్లీషులనుండి ఎరువుతెచ్చినది. 'గుండీ' హిందీనుండి దిగుమతి యయినది. గుండీని వైకృతముగా శ. ర. (పు. 332) చూపినది; కాని వైకృత దీపికలో దీని అడపొడలేదు. 'గుంద్రముగానుండు వస్తువుకాన గుండీ'యని వ్యుత్పత్తి చెప్పి దీనిని దేశ్యముగా నిరూపింపయత్నించినవారు గాలెటి (చూ. పు. 48); పూర్వము బందుల చొక్కాలు అనఁగా తాళ్ళతో ముడివైచుకొనునవి—ఉండెడివి. బారా బందీ చొక్కాలు ప్రసిద్ధములు.

బొత్తాయి : చూ. బొత్తాము, బొత్తాయిలు (బహువ) (శ్రీకా.).

బొత్తాసు : చూ. బొత్తాము (మిశ్ర బ్రౌ., ఆం. వాచ.)

బొప్పర : చూ. బొప్పాయి. (నల్లగొండ).

బొప్పాయ : చూ. బొప్పాయి (మిశ్ర బ్రౌ) °పండు=వై. వి. ఒకజాతి ఫలము (శ. ర).

106. బొప్పాయి : రూ. పపయ, పప్పాయ, పొప్పడ, పొప్పాయి, బొప్పర, బొప్పాసి, బొప్పాయ (పండు), బొబ్బాయి (కృ., గుం., నెల్లూ.); పర్యా. పరంగికాయ. ఒకజాతి ఫలము, మదనానప. కారు బొప్పాయి = బొప్పాయిలో ఒకదినుసు. 'అబ్బాయిగారి దొడ్లో బొప్పాయికాయ

---

2. పెక్కు తాళపత్ర ప్రతులలో నిట 'బురుత కాల్పట్టు' అనియే కలదు.

".... కొమరొందునేకరంగి మెరుంగు దల్గడల్ బలితంపు బురుత కాల్పట్టు బటువులమరు మగరాతి పని చప్పరము..." (ఉత్తర రామాయణము, ఆంధ్ర విశ్వకళాపరిషద్గ్రంథాలయము లోని తాళపత్ర ప్రతి, Acc. No. 29204; పత్రములు, 202, 203).

" ..... కొమరొందు నేకరంగి మెరుంగు తలగడ బలితంపు బురుత కాల్పట్టు బటువులమరు మగరాతి పనిచప్పరము ...." (ఉ. రా. : ఆం. వి. క. గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతి, Acc. No. 29702; పత్రములు 208, 209.)

" .... కొమరొందు నెకరంగు మెరుంగు తలగడ బలితంపు కాల్పట్టు పటువులమరు మగరాది పని చప్పరము" (ఉ. రా., ఆం. వి. క. గ్రం. తాళపత్ర ప్రతి, Acc. No. 29413; పత్రము, 199, మొదటివైపు)

"....కొమరొందు నెకరంగి మెరుంగు తలగడల్ బలిదంపు పురత కాల్పట్టు బటువు లమరు....."(ఉ. రా., ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, వారి గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతి, నెం. 42, పత్రము, 254, మొదటి వైపు, 1, 2 పంక్తులు).

(అకాడమీ ప్రతులను పరిశీలింప ననుమతించిన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి కృతజ్ఞతాభివందనములు).

పడితే పరుగెత్తలేక పదిమందివచ్చారు' — పిడుగు· ఈపాడుపుకథ అర్వాచీనము.—బు. పప్పైయా (Carica Papaya, Linn.; Caricaceae కుటుంబములోని ఒకేఒకమొక్క- Flora of Madras, Vol. I, p. 371); దక్షిణ అమెరికా ఫలవృక్షము; కరీబ్ మాండలిక మీ పదము; కన్నడ. పప్పాయి; మల. పప్పాయం; తుళు.ఒప్పం గాయి; కొంకణి. పాప్పాయి; మరా. పపఈ, పోపఈ; గుజ. పపవూ, బపాయో; వివరములకు చూ. 'బొప్పాయి' 'క్రమమహారాజా' పత్రిక, అనంతపురము 1938.

బొప్పాసి : చూ. బొప్పాయి (తూర్పుగో.).

బొబ్బాయ (పండు) : చూ. బొప్పాయి (గాలెటి).

బొబ్బాయి : చూ. బొప్పాయి. (ఆం. వాచ.)

బొంబసు: చూ. బొంబాసు(మిశ్రబౌ); °గుండు (మిశ్రబౌ).

107. బొంబా : తండా—ఓడలోపలి ప్రదేశము — లోని నీటిని వెలికితోడుగొట్టము (అంభాచ.)—బు. బొంబా =నీటికుళాయి.

108. బొంబాయి : కిరసనాయిలుతోడుగొట్టము, చెవ్వంగము (అనంత);నీరువెలువరించుగొట్టము,కుళాయి(ఆం. వాచ); —బు. బొంబా=నీటికుళాయి. స్పా. బొంబా=కుళాయి; ఫ్రె. పోంప్=కుళాయి; బోంబ్=బాంబు; డచ్చి. పొంప్; ఇం. పంప్.

బొంబాస : చూ. బొంబాసు (మిశ్రబౌ.).

109. బొంబాసు : రూ. బంబాస, బొంబసు, బొంబాస. రోటివంటి పిరంగి (మిశ్రబౌ);—బు. బొంబా=బాంబు, బొంబాష్;స్పా. బోంబాసి=పిరంగి—ఇం. బాంబ్ (బౌరి).

110. బొంబు : రూ. బొంగు, వెదురు (సేలము, కన్నడ ప్రభావద్యోతకము); కాలునపుడగు ధ్వనిని అనుకరించి పుట్టిన శబ్దమట (MAMP III, 65).—బు. బంబూ; స్పా. బంబూ; ఫ్రె. బాఁబా; ఇం. బేంబూ; మలయా. సమాంబా; కన్నడ. బంబు, బొంబు; మరా. బాంబూ=వెదురు—కన్నడ. బంబు; జావా. బాంబు (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము 544).

111. ? బొరిగ=:రూ. బొరిగము, బొరిగె. గడ్డి త్రవ్వు చిన్న సాధనము (అంభాచ); గోకుడుపార, త్రవ్వుకోల; గడ్డి పెల్లగించెడు గుద్దలి (శ. ర., సూ. ని., ఆం. వాచ)—బు. బొరోగ (అంభాచ., 619), కాని బుడత కీచుకోశములలో ఈమాట మృగ్యము.

బొరిగము : చూ. బొరిగ (మిశ్రబౌ.)

బొరిగె : చూ. బొరిగ (వి. బ్రౌ; కాంబెల్, మిశ్రబౌ.).

బోడ : చూ. బోడిద; ఉజియబోడ=ఓడ కుడిపక్క; దావు బోడ=ఓడ ఎడమపక్క (మిశ్రబౌ).

112. బోడిద, : రూ. బోడ. ఓడ పక్కవైపు. జమ్నా బోడిద=ఓడ కుడితట్టు, డావుబోడిద = ఓడ ఎడమతట్టు; మేబోడిద=గాలి వీచువైపు కాక రెండవ వైపు ఉన్న పక్క (అంభాచ)—బు. బొర్దు=ఓడ పార్శ్వభాగము; స్పా. బోర్డో = ఓడ పార్శ్వభాగము; బోర్దే=అంచు, చివర. బుడతకీచులోని 'ర్త' ర్ద' లు భారతీయ భాషలలో 'డ్త', 'డ్ద' లుగా మారుట ధ్వని సూత్రము; మరా. బోడద్=ఓడపక్కవైపు.

113. బోము : చూ. బొంబు. జీబీలు (తెరచాపలు) తగి లించు పెద్ద కఱ్ఱ (అంభాచ).

114. బోయా : 'ఇది ఒక పెద్దపీపా, లేక కర్రదుక్క; దీనిని లంగరుకు కట్టుదురు. దీని స్థానమును బట్టి లంగరు నీటిలో ఎక్కడున్నదో తెలియును' (అంభాచ. 639)—బు. బోయా=తరండము, స్పా. బోయా; °కస్టె=లంగరు గుఱుతు; 'లంగరు మొదలైనవి మునిగిపోయినచోటు గురుతు తెలిసే నిమిత్తమై తేలికగా నుండే కొయ్య కొణతలకు బరువుకట్టి నీళ్లలో వేసిన గురుతు' (బ్రౌ. ఇం. తె. 132); °చుట్టు=పడ వమునుకలలోను, తక్కిన అక్కఱలలోను, ఆపదల లోను ఉపయోగించు ఈతకాయ, life - buoy.

బ్యారకుసులు : చూ. బారకాసు (ఏనుగు వీరాస్వామయ్య కాశీ యాత్ర చరిత్ర, పు. 64).

115. మణేలా : పేకాటలోని పరిభాష, ఏలము ఆటలో తొమ్మిది—బు. మనిల్యా=పేకాటలోని పరిభాష; పేకాట పందెములోని ఏడు పాయింట్లు.

116. మనేలా : రత్నాల వర్తకుల జాతి. 'మనేల' యను ప్రాంతమునుండి వచ్చి వర్తకము చేసినవారు కాన ఈపేరు' అని బ్రౌను (మిశ్రబౌ. 88). —బు. మనిల్యా=కడియము; స్పా. మానిల్లా = కడియము; మానో=చేయి; మానోహెూ=పిడికెడు, °వాండ్లు=పైన పేర్కొనిన రత్నాలవర్తకులు (మిశ్రబౌ.); బు. మనిల్యా+తె. వాండ్లు అని Hobson-Jobson p. 558.

117. మన్నా : క్రైస్తవమత పరిభాష, అమృతము, దివ్య ప్రసాదము, ఐగుప్తుదాస్య విముక్తులయి ఇశ్రాయే లును గూర్చి వలస వెడలుచుండిన యూదులకు యెహోవా ప్రసాదించిన ఆహారము. 'ఆహారమునకై ఆయన (యెహోవా) వారిమీద మన్నాను కురిపిం చెను. ....' (కీర్తన, 78); 'ఇశ్రాయేలీయులు నివ సింపవలసిన దేశమునకు తాము వచ్చువరకు నలు బదియేండ్లు మన్నానే తినుచుండిరి .... (నిర్గమ. అధ్యా. 17); 'ఆ మన్నా కొతిమెర గింజలవలె నుండెను .... జనులు తిరుగుచు దాని కూర్చుకొని తిరగట విసిరి లేక రోటదంచి పెనముమీద కాల్చి రొట్టెలు చేసిరి. దానిరుచి తైలభక్ష్యముల రుచివలె నుండెను.' (సంఖ్యా. అధ్యా. 11); 'దాని (మన్నా) రుచి తేనెతో కలిపిన అపూపమువలె నుండెను ....' (నిర్గమ.

అధ్యా. 16); '.... మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి ....' (యోహాను. అధ్యా. 6); °గింజలు, °పాత్రము, °భోజనము, °సంకటి; 1841 కలకత్తాలో అచ్చయిన క్రొత్తనిబంధన గ్రంథము —సంస్కృతానువాదమునందును 'మన్నా' ప్రయుక్తము;—బు. మానా=దివ్యప్రసాదము; స్పా. మనా; హిబ్రూలోని 'మాన్' వీనికి మూలము.

118 మయూరు (లు) : ఒక సైనికోద్యోగి (రంగా. 1—145)—బు. మయోర్; స్పా. మయోర్=ప్రధానాధికారి, ముఖ్యుఁడు; ఫ్రె. మజెర్;-ఫ్రె. (మిశ్రబ్రౌ. కొ. వీరభద్రరావుగారు); —ఇం. (శ. ర., అను.,)

119. మరియ : ఏసుక్రీస్తు తల్లియగు మరియ. 'అనుపమితార్చశిష్ట మరియాంబకు నందనుఁడై ......' (వేదాంతరసాయనము, పీఠిక), బైబిలు నెల్లూరి ప్రతిలో 'అపొస్తలు' అనుమాట 'అర్చ్యశిష్ట' గా అనూదితము. 'అర్చ్యశిష్ట మత్తేయుని సువిశేషము'; '.... మరియా కుమారునిన్ ....' (వేదాంత. 4 ఆశ్వా.); 'మరియ భర్తయైన యోసేపు ....' (మత్తయి. అధ్యా. 1); '.... ఇతఁడు మరియ కుమారుఁడు కాఁడా ....' (మార్కు. అధ్యా. 6); 'మగ్దలేనే మరియయు, వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి ....' (మత్తయి. అధ్యా. 28); 'ఆ కన్యక పేరు మరియ...' (లూకా. అధ్యా. 1). —బు. మరియా; స్పా. మరీయ; ఫ్రె. మరీ; ఇం. మేరీ; అంతోనీ, అంద్రె, ఇన్నయ్య, ఎలీనా, తోమాసు, దలీలమ్మ, దానియేలు, దావీదు, దోరతి మొదలగు వ్యక్తిబోధకనామములను ప్రత్యేకారోపములుగా నొసఁగలేదు.

120. మరియాన్న (ఆట) : పేకాటలో ఒక రకము. బుడతకీచు మూలకమగు పదము కానోపునని బ్రౌను (మిశ్రబ్రౌ.).

121. మల్గోబా : ఉ. మల్గూబా, మల్గోవా ? (మలయా+గోవా) మామిడిలో ఒకదినుసు. మామిడికి నేర్పుగా అంట్లు కట్టుట బుడుతకీచులనుండి నేర్చిన విద్య అఁట. ఆయా పద్ధతులను దెలుపుటకు బుడతకీచు మాటలే వాడఁబడినవఁట. (Port. Voc. p. 7)

122. మాదా (గుడి) : 'మరియ' పేర అంకితమయిన ప్రార్థన మందిరము. మాదా కోవిల్, మాదాగుడి (మిశ్రబ్రౌ.); 'మాదాగుడి మూఁడు సాల్వులుగా నుండును' (బ్రౌ. ఇం. తె. 28); 'మాదా' మీఁద 'మాతృ' శబ్ద ప్రభావము ఉన్నట్లు తోచుచున్నది. —బు. మాద్రి=క్రైస్తవ సన్యాసిని; స్పా. మాద్రే.

123. మాదిరి : ఒకదినుసు శేకు; 'చదరముగా వుండే పెద్ద శేకుమాను' (మిశ్రబ్రౌ).—బు. మాదేరా=కొయ్య, కలప; స్పా. మాదేరా=కొయ్య, కలప; మాదేరో=కొయ్యదూలము; కలపవర్తకుఁడు; ఫ్రె. మద్రీఏ=దూలము, దంతె, గట్టిబల్ల.

124. మిస్సయాన్ : సంఘము, సమాజము. 'చర్చి=మిసయాన్ ప్రెస్సులో అచ్చు వేయించబడ్డది' (రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారి (1770—1837) తెలుఁగు వ్యాకరణము, ప్రథమ ముద్రణ పీఠిక. 1836); —బు. మిస్సయాను = ధర్మప్రచారకసంఘము; స్పా. మీసియోన్.

125. ముర : తెరచాపక్రింది యంచు ? (మిశ్రబ్రౌ.) —బు. అమూరా=తెరచాపల మూల కొసలను బిగుతుగా కట్టియుంచు త్రాడు; స్పా. ఆవరారా=ఓడ దూలము; ఆమూరాదా = ఓడ లోపలియంచు; మూరో=గోడ; అలంగము.

126. మెలావు : రూ. మొలావు (పండు) = కలంగడిపండు —బు. మెలావ్ఁ; స్పా. మెలోన్; ఇం. మెలన్.

127. మేజా (—జ—జా) : బల్ల; 'మేజాపల్క' (రంగరాట్. పీఠిక, 59)—బు. మేజా; స్పా. మేసా=బల్ల; పీఠభూమి; —ఇం. మెస్=వడ్డించిన విస్తరి (బ్రౌ. రి.); —పారసీ. (కాంబెల్); —హిం. (శ. ర., ఆంభాచ.); ఉత్తరహిందూస్థాన భాషలన్నింటను 'మేజ్', 'మేజ', 'మేజా' శబ్దములున్నవి; కన్నడ. మేజా —పారసి (R. Narasimhachar, History of Kannada Language, 119); మరా.—పారసి (మరాఠీవ్యుత్పత్తి పదకోశము); గుజ. మేజ —పారసి (ఔల్సారె); మల. మేశ — బు. మేజా; అరబ్బి. మేజ (గుండర్టు, 863); తమిళ. మేచై —బు. (TL, 3350).

128. మే (జోడు) : మేజోళ్ళు (బహువ.) = పాదరక్షలకు లోపల కాలికివేయుజోడు (శ. ర) — బు. మేయస్; —హిం. (బ్రౌ. రి., గాలెటి); మెయి+జోడు అని కొందఱు విడఁదీసిరి. మేజోడును 'మే—జోడు' అని విఱిచి కిట్టెల్ కన్నడములో దేశ్యముగా ఉట్టంకించినాఁడు (పు. 1295); మే+తె. జోడు.

129. ?మేత్రాణులు : క్రైస్తవ పీఠాధిపతి, ఏలినవారు (కర్నూ., నెల్లూ.). కాతలిక్ క్రైస్తవ వ్యవహారము; సిరియను క్రైస్తవులలో విపుల ప్రచారముగల ఈమాట బుడతకీచు పాదిరీలద్వారమున ఆంధ్రదేశమునకు వచ్చినది.

130. మేస్త్రి : రూ. మేస్త్రి, మేస్త్రీ, మేస్రి. అన్యదే. వి. పనివారలమీఁదపెద్ద (శ. ర), నేర్పరియగు పనివాఁడు. —బు. మేస్త్రి=ముఖ్యుఁడు; స్పా. మాఏస్త్రి=చేతిపనుల కొట్టులో ప్రధానశిల్పి; మాఏస్ట్రో=నేర్పరి. ఫ్రె. మెత్ర్; —బు. లేక ఫ్రె. (మిశ్రబ్రౌ); —ఇం; (బ్రౌ. రి.); కన్నడ. మేస్త్రి—బు. (కిట్టెల్, 1300). మల. మేస్త్రి — బు. (గుండర్టు, 863); తమిళ మేస్త్రి=పర్యవేక్షకుఁడు; ప్రధానశిల్పి; చిప్పవాఁడు; కొని;

కులములలో పట్టపుపేరు; ఇం. మెయ్‌స్త్రి (1798) =నేర్పరియగు పనివాఁడు (G. V. Subbarao, Indian words in English, p. 121).

మేస్త్రరు : పరంగిజాతి పురుషుల పేర్లకు ముందుచేర్చుగౌరవ సూచకపదము. 'మే స్త్ర రు కుళులోదొరగారు' (పుదూరి సీతారామశాస్త్రిగారి (1852) ప్రశ్నోత్త రాంధ్ర వ్యాకరణపీఠిక); పరవస్తు శ్రీనివాసాచార్య విరచితమగు సర్వశబ్ద సమ్బోధిన్యాఖ్య పీఠిక (1875) లో 'మేష్టరు' అనియు; సంస్కృత పీఠికలో 'మేస్త్రరు' అనియు ప్రయుక్తము. 'మేస్త్రర్ కార్మైకల్ నామక ప్రభుణా....' పు. 7; 'మేస్త్రర్ హేనాప్నస్త్రప్రభు....' పు. 9; 'మేస్త్రర్ చార్లెసు పాఖో ల్యాంరీడాఖ్యస్త్ర...' పు. 9; 'మేస్త్రర్ కార్మైకైలాఖ్యస్త్ర ప్రభు....' పు. 10; 'మేష్టర్ కార్మైకల్ దొరవారి....' పు. 14; 'మేష్టర్ డీ. యఫ్. కార్మైకల్ దొరవారు....' పు. 15; 'మేష్టర్ హేదొరగారి......' పు. 17; 'మేష్టర్ చార్లిస్ విల్లియంరీడ్సు దొరవారు....' పు. 17; 'మేస్త్రర్, బుడతకీచు భవము; 'మేష్టర్' ఆంగ్లజన్యము.—బు. మేస్త్ర=అధ్యాపకుఁడు; యజమాని; స్పా. మాఏస్త్రో.

మేస్త్రి : చూ. మేస్త్రరి (మిశ్రబొ.); వడ్రంగిమేస్త్రి (Arden's Telugu Grammer. p. 354); —ఇం. (గాలెటి).

మేస్త్రీ : చూ. మేస్త్రరి (బ్రౌ. రి., ఆంభాచ.)

మేస్త్రి : చూ. మేస్త్రరి (అనంత.).

131. మొలాము(పండు): చూ. మెలావ: (మిశ్రబొ); - ఇం. (బ్రౌ.రి.)

మొస్త్రరు : చూ. మోస్త్రరు (మిశ్రబొ., గాలెటి., శ్రీకా.) ఒకమొస్త్రరు, కొత్తమొస్త్రరు (శ్రీకా.).

132. మోస్త్రరు : రూ. మొస్త్రరు. మాదిరి, విధము, రీతి; నమూనా; స్వభావము; 'మామూలురైతులు సైతము ఈమాటను వాడుదు'రని మిశ్రబొణ్యము (చూ. పు. 100);-బు.అమోస్త్ర,మొస్త్ర=పద్ధతి,రీతి;మొస్త్రర్ =ప్రదర్శించు; స్పా. మూఏస్త్ర=మాదిరి, మచ్చు; నమూనా తమిళ. మోస్త్రరు=రీతి; నమూనా; —ఉర్దూ. మోస్త్రర్ —అరబ్బీ. మౌజాన్ (TL, 3389); ముస్త్రరు, మూ స్త్రరు—లు తెలుఁగు పదములుగా Port. Voc. P. 233 లో ఉదాహృతములగుట ప్రమాదము.

యాగాత : చూ. అగతమ్మ (మిశ్రబొ.).

యాలం : ఉ. యాలాం, యెలాం; చూ. ఏలము (మిశ్రబొ., MAMP, III, p. 1026).

133. రతులు : రత్నముల తూనికయందుపయోగించు పరి మాణవిశేషము, పచ్చలతూనిక యందొకయెత్తు. 'అతివినోదముగాఁగ రతుల మెప్పించు నీ పచ్చల కడి యాల పద్మగంధి' (విజయ. 1—16) —బు. అఱ్ఱతల్=ఒక పరిమాణవిశేషము; మరా. రతల్, రత్తల్ —బు; గుజ. హిం. రతల్; 'రతులు' లోని చివరి 'లు' వర్ణమును బహువచన 'లు' ప్రత్యయ ముగా భ్రాంతిపడి 'రతి' యను కృతకరూపము తెలుఁగున సిద్ధమయినది. అనుచిత విభాగముచే సిద్ధిం చిన ఈ 'రతి' నే తెలుగు నిఘంటువు లన్నియు (కాంబెల్ 488; బ్రౌ. 836; శ. ర. 922; బ్రౌ. రి. 1070; లక్ష్మీనారాయణీయము 720; ఆం. వాచ. 2143; సూ. ని. V, 750; శబ్దార్థచంద్రిక, 749) ను స్వీకరించినవి. ఇంగ్లీషునందలి 'కాన్ స్టేబుల్' లోని అవయవికమైన 'లు' ను బహువచన ప్రత్యయముగా భావించుటవలన కళింగసీమలో 'కని స్టీపు' అను మాట వాడుక కెక్కినది. కాంబెల్ 'రతి' ని సంస్కృతపదముగా పేర్కొనినాఁడు.

రంబరాళ్లు : చూ. రంబ్రాలు 'వాడ (ఓడ) స్తంభానికి కట్టే నూలు నిచ్చెన' (మిశ్రబొ.).

134. రంబ్రాలు : రూ. రంబరాళ్లు. 'తట్టుదగ్గఱనుండి చాపలకు అడ్డుగా సమాన దూరములలో కొయ్యల కొసల వరకును పోవు త్రాళ్లు; ఇవి నిచ్చెనవలె ఉపయోగించి కొయ్యల కొసలవరకు నెక్కుటకు పనికివచ్చును. (ఆం. భాచ) —బు. రామాల్=పగ్గపు చిక్కము; స్పా. రామాల్=త్రాటి నిచ్చెన.

135. రీపా (లు) : సన్నని కొయ్యబద్దలు (అనంత); —బు. రీపా=ఇంటి కప్పుక్రింద పెంకులకు ఆసరాగా దంతెలమీఁద వేసెడి పలచని కొయ్యబద్ద (లు); స్పా. రీపియా; కన్నడ, తుళు. రీపు; గుజ. మరా. రీప్.

రోదము : చూ. రోదా (మిశ్రబొ.)=కప్పీ (చక్రము)యొక్క గాడి (రేవు).

రోజా : చూ. రోదా (తెలంగాణము).

136. రోదా : రూ. రోదము, రోజా. బండిచక్రము, రథాంగము (కృ.); 'ఒక దిమ్మలో అమర్చఁబడిన త్రాడు జారుటకు ఏర్పరుపబడ్డ చక్రము' (ఆంబాచ. 641). —బు. రోదా=చక్రము; స్పా. రోదా=బండి జాడ; రోదాజా=చిన్నచక్రము, పళ్లెరము; రోదార్= అ. క్రి. భ్రమించు, తిరుగు; రూఏదా-చక్రము; ఫ్రె.రో; సం. రథ; కొంకణి. రోదా=బండిచక్రము; సింహళీ. రోదా, రోదె=చక్రము.

137 ? లాంచీ : మోటారు పడవ (గుం., గో.) —బు. లాంష; స్పా. లాంచ=తెడ్లపడవ; మలయా భాషా నిఘంటువులలో నిది బుడతకీచు పదముగా ఉట్టంకి తము. బుడతకీచు నిఘంటుకారు లిద్దానిని ప్రాచ్య సీమలపదముగా పేర్కొనినారు.

138. లీస్తు : పట్టిక, జాబితా (మిశ్రబొ.) —బు. లిష్త; స్పా. లీస్త; ఫ్రె. లిస్త్; ఇం. లిష్టు, డచ్చి. లియస్త్; —ఇం. (మిశ్రబొ.).

వలందు (బాజా) : చూ. ఒలందా (శ. ర. అను). ఒలందావారి ఫౌజు (రంగా. 1—151).

వలందేజా : చూ. ఒలందా (మిశ్రబౌ.); మరా. వలందేజా —ఇం. హోలండ్ (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము, 644); గుజ. వలందా —ఇం. హోలండ్ (బెల్సారె, 700).

వళంద : చూ. ఒలందా; 'ఈడము వళంద బందర యింగిలీషు—కళము మొదలైన పేటల గౌరలెల్ల ....' (హంస. 1—112); 'వళందలు' (పైది 3—28).

139. వెసల : రూ. ఎసల, వెసలె. దే. వి. వంటకుండ (బ్రౌ శ. ర., ఆం. వాచ.) '.... బంగరు వెసలలు ....' (విజయ. 2—150); 'వెసలతో మూనాళ్ల వెన్నలుండఁగ ....' (శుక. 2—562); 'వేడి వెసలట్లు వేసరి ....' (హంస. 3—145); 'వెసలన నల్వ భాండ మెసఁగు' (ఆం. భా. 2—246); 'వెసళ్లు' బహువ., వెసరు. ఏకవ. వండుటకుఁ దగిన పాత్ర (టిప్పణి, సాంబ నిఘంటువు. స్థావరవర్గ, పుటలు 85, 85 అథస్సూచి);—బు. వసిల్యా; ఫ్రె. వెసెల్; ఇం. వెసెల్.

వెసలె : చూ. వెసల. వెడల్పు మూతిగల చిన్నమట్టి పాత్రము (కాంబెల్ 543; బ్రౌ. 977).

వేలము : చూ. ఏలము. (శ. ర., ఆం. వాచ., గాలెటి). ఎన్ను—వెన్ను, ఆరతి—హారతి, అరబ్బీ—హరబ్బీ, అడపము—హడపము, తెంచు—త్రెంచు; ఈ జంటలలో మొదటివి ప్రాచీనములు; సహజములు. ద్వితీయములు అర్వాచీనములు, కృతకములు. మొదటివరుసలోనివి అప్రామాణికములను భ్రాంతి, రెండవ వరుసలోని కృతకప్రామాణికరూపముల సృష్టికి హేతువు. ఇట్లే 'ఏలము' అను దానికి ఈ 'వేలము' కృతకరూపము.

వేలాం : చూ. ఏలము (మిశ్రబౌ.).

140. వైను : ద్రాక్షరసము; క్రైస్తవ పరిభాష (బ్రౌ. ఇం. తె.) —బు. వైన్యు=వైను సారాయి; డచ్చి; వియన్; ఇం. వైన్; ఆంగ్ల శబ్దభవమని అనరాదా యనుట స్థూలదృష్టి. దీని మూల రూపము హిబ్రూ భాషాగతము. బైబిలు ద్వారముననే తొలుత దీని పరిచయము. పారిభాషిక పదములను వీలయినంత దాక భాషాంతరీకరింపరాదను నియమమును నాటి బైబిలు అనువాదకులు చాలవరకు పాటించిరి. (C. P. Brown, Preface to his English Tulugu Dic. P, IX). క్రైస్తవమత ధర్మవాహకముగా భారతీయ భాషావ్యవహర్తలకు ప్రప్రథమమున పరిచయము కలిగినది బుడతకీచుతో. ఈ చూపుతో 'వైను'ను బుడతకీచు బాషా సంబంధిగా ఇచట పేర్కొనుట.

141. శాంతోము : చెన్నపట్టణములో నొకపేట; పరంగికొండ పరిసరప్రాంతము; జువోన్ దీ కస్త్రో (1545—48) గోవాలో బుడతకీచు గవర్నరుగా నుండిన కాలమున పోర్చుగాలు చక్రవర్తి మూఁడవు జాన్ వేయించిన ఒక బంగారు నాణెము. —బు. సాంతోమి; ఇం. సెయింట్ థామస్ మౌంట్.

శావి : చూ. చెవి. చెవికంటె 'శావి' యే బుడతకీచు పలుకుబడికి చేరువ; —ఇటా. బు. (మిశ్రబౌ. 122).

142. సక్రీస్తు : రూ. సంక్రీస్త. పాదిరిగుడిలో పవిత్ర పాత్రములు, వస్త్రములు భద్రపఱుచువిభాగమునకధికారి. —బు. సక్రిస్తాన్, సక్రీస్తి; కన్నడ. సక్రిస్తీ; తమిళం. సక్రిస్తి.

143. సగ్గు : రూ. సబ్బు[1]. ఒకరకము చెట్టు పాలనుండి తయారుచేసెడి కృత్రిమధాన్యము, సగ్గుబియ్యము; °బియ్యము, చూ. సగ్గు (అనంత.); — బు. సాగూ; స్పా. సాగూ, సాగో; డచ్చి. సగో; ఫ్రె. సాగూ; ఆంగ్లము ద్వారమున తెలుఁగునఁ జేరిన మలయా భాషాపదమని బ్రౌ. రి., గాలెటి.

సంక్రీస్త : చూ. సక్రీస్త (కర్నూ., నెల్లూ.); కొంకణి సాంక్రీస్తి.

సంత్ర : చూ. సాంత్రా (నారింజ) (కడప, తెలంగాణము).

సబ్బుతు : చూ. సబ్బాతు; °దినము, సబ్బతోత్సవము (పూర్వ నిబంధన, 6, 7 కాండములు, నెల్లూరి ప్రతి).

144. సబ్బాతు : రూ. సబ్బతు. బైబిలు పూర్వనిబంధనలో శనివారము, క్రొత్త నిబంధనప్రకారము ఆదివారము; క్రీస్తు పునరుత్థాన చిహ్నమగు సబ్బాతు పుణ్యదినము, ఆదివారము. — బు. సాబాదు=సర్వేశ్వరుని విశ్రాంతి దినము. శనివారము; స్పా. సాబాదో=శనివారము; హిబ్రూ. షబ్బాత్; తిరునల్వేలి మండలములోని 'Hindu Church of the Lord Jesus' శాఖీయులు ప్రాతనిబంధనప్రకారము శనివారమునే సబ్బాతు దినముగా పరిగణింతురు (MAMP, Vol. I. p.).

సబ్బు[1] : చూ.. సగ్గు, °బియ్యం (సేలము); °బియ్యము (కాంబెల్); సబ్బియ్యం (గుం); సబ్బీము (అనంత.); మరా. సాబూదాణా, సాబూ+ధాణా; —దాణా = ప్రా. ధాణ = సం. ధాన్య—.

145. సబ్బు[2] : దే. వి. జిడ్డును పోఁగొట్టెడు ఒక విధమైన కారము (శ. ర.); 'తనరి యుండును వస్త్ర ధావన పదార్థసంజ్ఞ చౌకార మనఁగను సబ్బునాఁగ...' (ఆం. భా. 2—301); సబ్బిళ్ల, సబ్బుబిళ్ల. —బు. సబాను; స్పా. హబోన్: ఫ్రె. సవోఁ; కన్నడ. సబ్బు; —హిం. (కాంబెల్, ఆంభాచ.); —ఇం. (బ్రౌ. రి., శ. ర. అను., గాలెటి).

146. సాంత్రా (నారింజ) : రూ. సంత్ర. మేలిరిదినుసు నారింజ —బు. చింత్రా=పోర్చుగాలులోని 'చింత్రా' పట్టణ పరిసరముల పండెడి నారింజపండ్లు ప్రపంచ

ప్రసిద్ధము; 'సంగ్‌తారా' అను పారసి పద భవమని కొందఱు; భూటాను కొండల దిగువను గల 'సంత్ర బారి' యను గ్రామమునుండి ఈ పేరని కొందరు.

147. సార్జంతు : రూ. సార్జెంతువు. భటులమీఁది ఉద్యోగి' జాతి బంట్రోతు (మిశ్రబౌ.); 'సార్జంతుల్' (రంగా. 1—147);—బు. సర్జెంతు; స్పా. సార్జెంతో; ఫ్రె. సర్‌జాఁ; —ఇం. (బ్రౌ, రి., శ. ర. అను); పరాసు భాషా పదమని వీరభద్రరావుగారు.

సార్జెంతువు : చూ. సార్జంతు (మిశ్రబౌ).

148. సోడిదేవు : జూదము మొదలైన వానిలో సర్వస్వమును వెచ్చపెట్టి బీదవడినవాఁడు (అనంత). —బు. సొర్తి=లాటరీ; స్పా. స్వేర్‌తే = చెట్టు పుట్ట కొట్టి క్రొత్తగా సాఁగిన భూఖండములో చీట్లువేసి పంచుకొనిన భాగము; చీట్లు వేయుట, లాటరీ; మరా. సోడిత=లాటరీ—బు.; కొంకణి. సోడ్తి, సోర్తి=లాటరీ,

సోలుదాదు (లు) : చూ. సోల్దాదు (లు). పరంగి సైనికులు; 'సోలుదాదులు' (రంగా. 1—147).

149. సోల్దాదు (లు) : రూ. సోలుదాదు (లు). పరంగి సైనికులు; సోజరు (మిశ్రబౌ.;) సోలా దివాండ్లు. —బు. సోల్దాదు = సైనికుఁడు; స్పా. సోల్దాదో =సిపాయి; సోల్దాదా = జీతములు; సోల్దాదేరా=సిపాయియైన మగనిని అనుసరించిపోవు భార్య; ఫ్రె. సోల్ద; డచ్చి. సాల్దాత్; —ఫ్రె. (మిశ్రబౌ.); వీరభద్రరావుగారును ఫ్రెంచినే మూలముగా నిర్ధారించిరి.

150. స్పీరితుసాంతు : పరిశుద్ధాత్మ (క్రైస్తవ పరిభాష; కర్నూ., నెల్లూ.); సాంక్తు స్పిరిత = సత్పురుషుఁడు; సాంక్తుఁడు మహాపురుషుఁడు అను వాడుకలును కలవు; 'స్పీరితు సాంక్తువు' (మత్తయుని సువిశేషము); 'స్పిరితు సాంక్తు ప్రేరేపకము' (మార్కు సువిశేషము); ఇవి లాటిన్ మాటలు; —బు. స్పీరితుసంతు.

హిస్సోపు : చూ. ఏసోబు; °కుంచె (నిర్గమ. అధ్యా. 12); °పుడక (యోహాను. అధ్యా. 20); °మొక్క (రాజులు 1, అధ్యా. 15); ? —ఇం. హిసప్.

దీ ప శి ఖ లు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

చీకటి ముద్దల మొనలై
నీ కోవెలయందు భక్తి నీరాజనలై
నా కనుపాపల నిత్య-
మ్మాకర్షించె ప్రభు! జ్యోతు లావర్తములై.

కాల కాసారముకుళిత కమలముల వి
లాస లాస్యమ్ముగ, శుకప్రియాసుమముల
ముగ్ధ నేత్రోచ్ఛలనముగ, స్ఫురిత విరహా
కీల లూహాకృతినటించు క్రీడనముగ.

వివిధగతుల, నొండొంటి న-
వ్యవధానమ్ముగ నొఱసియు, ప్రత్యేకములై,
కవలై తుది, ప్రాణస్థిత
జవసత్త్వములై, రహించె స్వచ్ఛంద విధిఁ.

ద్వంద్వ భావమ్ములేని యథార్థమేది?
తలఁపు తెరల రంగస్థలి విలసనములు
నా కనీనికలఁ బరిణతము నెందె;
ముగిసె నాట్యమ్ము కన్నులు మూఁతవడియె!

శూన్యరాత్రమ్ము కాదిది, శుక్లపక్ష
యామినియుగాదు, వృద్ధిక్షయములు లేవు,
ఒడిని తృప్తిగా పాల్ద్రావి పడుకొని నెల
బాలు డొకతీరు నిదురించు వరుస లేదు!

గోపయువతీపథమ్మునం దోప నీవు,
క్షీరభాండము లసియాడి శీర్ణ పృథివి
'దుగ్ధపథ' మయ్యె—నల్లె కన్దోయి కెదుట
దివ్యతేజోపథ మొనర్చె దీపశిఖలు!

శివతత్త్వరత్నాకరంలోని సాహిత్యశాస్త్ర విషయాలు

శ్రీ బులుసు వేంకటరమణయ్య

మన ప్రాచీనులు ఏ విషయాన్నిగురించి గ్రంథాలు వ్రాసినా వానిలో ప్రధానవిషయంతోపాటు ఆనుషంగికంగా విషయాంతరా లన్నింటినీ వివరించడం పరిపాటి. అంతేకాకుండా వివిధ విషయాలనూ ప్రతిపాదించే బృహద్గ్రంథాలు కూడా చాలా ప్రాచీనకాలంనుంచీ రచింపబడుతూనే ఉన్నవి. అందులోనూ సంస్కృతభాషలో కూర్చబడిన యీ గ్రంథాలు క్రీస్తుశకానికి పూర్వంనుంచీ కూడా కానవస్తున్నవి. బౌద్ధమత ప్రవర్తకుడైన సిద్ధార్థుని జీవితచరిత్రాన్ని ప్రధానంగా చెప్పే లలిత విస్తర మహాపురాణంలో అనేక విషయాలు ఆయా సందర్భానుసారంగా వివరించబడినవి. ఇది ఇంచుమించుగా ఒక విజ్ఞానసర్వస్వమనే చెప్పవలసి ఉన్నది.

దీనికి తర్వాత చెప్పుకోదగినది అగ్నిపురాణం. అందులో వేర్వేరు అధ్యాయాల్లో వివిధశాస్త్రాలూ సంగ్రహంగా యియ్యబడి ఉన్నవి. అందులో సాహిత్యం, జ్యోతిషం మున్నగునవి విషయాంతసంకీర్ణత లేకుండా వివరించబడినవి. ఈ అగ్నిపురాణపద్ధతిలో రచింపబడిన బృహద్గ్రంథమే శివతత్త్వ రత్నాకరమనే విజ్ఞాన సర్వస్వం. దీన్ని మైసూరుప్రాంతీయుడూ, ప్రభువంశీయుడూ అయిన బసవరాజనే మహా విద్వాంసుడు రచించాడు. రచనలో ఇది నవీనమయినా, విషయ వివేచంలో పరిపూర్ణత కలిగి వివిధవాఙ్మయశాఖాభిమానుల ఆదరాభిమానాలను చూరగొంటూ ఉన్నది.

ఇందలి భాగాలకు కల్లోలాలనీ, ఆ భాగాలలోని అధ్యాయాలకు తరంగాలనీ పేరు. గ్రంథం శివతత్త్వ 'రత్నాకర' మగుట వల్ల అందలిభాగాలకూ, అధ్యాయాలకూ పై పేర్లు పెట్టడం ఎంతో సముచితంగా ఉన్నది.

'శివతత్త్వ రత్నాకరం' లో సాహిత్య శాస్త్రానికి తగిన స్థానం యీయబడి ఉన్నది. అందలి ఏడవ కల్లోలంలోని మూడవతరంగం మొదలు ఆరవ తరంగం చివరవరకూ— అంటే నాలుగు అధ్యాయాలు సాహిత్య విషయనిరూపణకే ప్రత్యేకించబడినవి.

తెలుగుసాహిత్యలక్షణవేత్తలు చాలవరకూ ప్రాచీనుడైన దండిమహాకవి కావ్యాదర్శాన్నీ, కొంత నవీనుడైన విద్యానాథుని ప్రతాపరుద్రీయాన్నీ తమకు ఆదర్శములుగా గ్రహించి ఉన్నారు. ఆధునికసాహిత్య విమర్శకులు తక్కిన భాషా వాఙ్మయాల లక్షణాలతోపాటు విశ్వనాథుని సాహిత్యదర్పణాన్నీ, జగన్నాథపండితరాయల రసగంగాధరాన్నీ ఆయా సందర్భాలలో ఉదాహరించడం కూడా పరిపాటి అయినది. ఈ శివతత్త్వసారంలో ఉన్న అలంకారశాస్త్రవిభాగంలో అనేక విషయాలను గూర్చిన సిద్ధాంతాలు చాలా చక్కగానూ, సంగ్రహంగానూ చూపబడిఉన్నవి. ఇందులోని విషయాలు విద్వద్విమర్శకులకూ, సాహిత్యప్రియులకూ మిక్కిలి ఆవశ్యకములు. అవి దిఙ్మాత్రంగా ఇక్కడ తెలుపబడును.

ఇందులో సాహిత్యశాస్త్రవివరణకై ప్రత్యేకించబడిన నాలుగు తరంగాలలోనూ మొదటి దానిలో కావ్యలక్షణము, మహాకావ్యస్వరూపము, కథా, ఆఖ్యాయిక అనే గద్యగ్రంథములకు ఉన్న భేదము, ముఖ్యము మొదలైన అర్థముల నిర్ణయము, స్థాయి భావాలు, సంచారిభావాలు మున్నగునవి వివరించబడినవి. రెండవదానిలో నాయికా నాయకభేదాలు, రీతులు, గుణములు, దోషములు, వాని భేదాలు వివరించబడినవి. మూడవదానిలో కావ్యభేదాలైన ధ్వన్యాదుల లక్షణాలూ, శబ్దార్థాలంకారాల వివరణమూ ఉన్నవి. నాల్గవ దానిలో దృశ్య కావ్య వివరణము కలదు. అన్నింటిలోనూ కొన్ని విశేషాలు— సాధారణ లాక్షణికులు ప్రస్తావించనివి కలవు. వానిని గురించి తెలుసుకోవడం సాహిత్యాభిమానులకు ఎంతో అవసరం.

(1) కావ్యలక్షణము—

గుణాలంకార సహితాలూ, దోష వర్జితాలూ అయిన శబ్దార్థాలూ కావ్య మగునని సాధారణంగా కావ్యలక్షణం చెప్పబడుతూ ఉన్నది. ప్రాచీనుడైన దండి తన కావ్యాదర్శంలో "శరీరం తావ దిష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" అని ఇష్టార్థాన్ని తెలియజేసే పదముల సమూహమే కావ్యమని చెప్పాడు. తర్వాతివారు చాలమంది శబ్దార్థాలు రెండింటినీ కావ్యంగా గ్రహించినా ప్రమాణ గ్రంథమైన సాహిత్యదర్పణాన్ని రచించిన విశ్వనాథపండితుడు రసాత్మకమైన వాక్యమే కావ్యమని చెప్పాడు. జగన్నాథ పండితరాయలు 'రమణీయార్థాన్ని ప్రతిపాదించే శబ్దమే కావ్యం' అని వివరించాడు. ఈవిధంగా సాహిత్య

విమర్శకులదృష్టిలో శబ్దమే కావ్యం ! శివతత్త్వ రత్నాకర కారుడున్నూ పై అభిప్రాయాన్నే తెలిపాడు.

'సంచయం తిజ్సుబన్తానాం
వాక్యమాహు ర్మనీషిణః,
తాన్యేవ కవి క్లృప్తాని
సార్థాని సరసానిచ,
సాలంకారాణి నిర్దోషా
ణ్యాహుః కావ్యం మనీషిణః.''

శబ్దాలయొక్కయూ, క్రియాపదాలయొక్కయూ సమూహమే వాక్యమనిన్నీ, అర్థ సహితాలూ, అలంకారయుక్తాలూ, దోష రహితాలూ, రసవంతాలూ అయిన కవి వాక్యాలే కావ్యమనిన్నీ బసవరాజు అభిప్రాయం. దీనినిబట్టి రసాత్మకమైన వాక్యమే కావ్యమనే సిద్ధాంతమే ఇతనికి సమ్మతమని తెలుస్తూఉన్నది. ఈ సిద్ధాంతం ఎంతో సముచితమైనది.

(2) మహాకావ్యం—

తెలుగులో మహాకావ్య లక్షణం చెప్పేవారు దండినీ, విద్యానాథునీ అనుసరించి అష్టాదశవర్ణనలూ వుండవలెనని చెప్పి ఉన్నారు. సంస్కృత మహాకావ్యంలో 'సర్గ' విభాగం ఉండాలి! వర్ణనలలో కొన్ని లేకపోయినా, దోషం లేదని కూడా లక్షణ వేత్తలు చెప్పారు. రసం ప్రధానంగా ఉండవలసిన కావ్యంలో వర్ణనలసంఖ్య ప్రధానంకాదు. అందువల్ల శివతత్త్వ రత్నాకర కారుడు మహాకావ్యంలో సర్గవిభాగం ఉండవలెననే చెప్పాడు.

సామాన్యంగా లాక్షణికులు సంస్కృత కావ్య లక్షణాలనే చెప్పుచుందురు. ప్రాకృతం సంగతి ప్రస్తావించడం చాలా అరుదు. ఇందులో మాత్రం ఆ విషయం కూడా చెప్పబడింది

సర్గబంధం సంస్కృతేన
సాశ్వాసం ప్రాకృతేనచ
తద్ద్వయం చ మహాకావ్యం
సేతు, రామాయణాదికమ్.''

'సంస్కృతభాషలో వ్రాయబడిన మహాకావ్యంలో సర్గ విభాగం ఉండవలెను. ప్రాకృతంలో అయితే ఆశ్వాసవిభాగం ఉండవలెను. ప్రాకృత మహాకావ్యానికి సేతుబంధము, సంస్కృత మహాకావ్యానికి రామాయణము ఉదాహరణములు' అని పయి శ్లోకానికి అర్థం.

(3) గద్య విభాగాలు—

గద్య కావ్యంలో కథా, ఆఖ్యాయిక అనే భేదాలు రెండు కానవస్తూ ఉన్నవి. ఇవి రెండూ ఒక్కటే అనీ, విభిన్నాలనీ ప్రాచీనకాలంనుంచీ అభిప్రాయభేదాలు ఉన్నాయి. దండిమహాకవి, ఇవి రెండూ అభిన్నాలని చెప్పియున్నాడు. బసవరాజుమాత్రం కథాఖ్యాయికలు విభిన్నాలని, వాటికిగల భేదాన్ని స్పష్టంగా ఇలా చెప్పాడు.

''కథా కల్పితవృత్తాన్తా
సత్యార్థాఖ్యాయికా మతా''

కల్పితమైన వృత్తాంతంకలది కథఅనీ, ఆఖ్యాయికలోని వృత్తాంతం యథార్థమైనదనీ దీని అభిప్రాయం.

(4) అర్థాలు, వృత్తులు—

అభిధ, లక్షణ, వ్యంజన అని శబ్దవృత్తులు మూడు. వాచకము, లక్షకము, వ్యంజకము—అని శబ్దములు మూడు. ముఖ్యార్థము, లక్ష్యము, వ్యంగ్యము అని అర్థాలు మూడు. వాచక శబ్దం అభిధావృత్తిమూలంగా వాచ్యార్థాన్ని—అనగా ముఖ్యార్థాన్ని తెలుపును. అట్లే లక్షకశబ్దం లక్షణావృత్తి మూలంగా లక్ష్యార్థాన్ని తెలుపును. వ్యంజకశబ్దం వ్యంజనావృత్తిమూలంగా వ్యంగ్యార్థాన్ని వ్యక్తం చేస్తుంది. అలంకారికు లందరూ ఈ రీతినే చెప్పినారు.

కొందరు లక్షణావృత్తికంటె వేరుగా గౌణవృత్తి వున్నదనీ, అది గౌణార్థమును తెలియజేస్తుందనీ భావించినారు. గౌణవృత్తి లక్షణాభేదమనే సిద్ధాంతం. శివతత్త్వ రత్నాకరంలోమాత్రం గౌణార్థం ప్రత్యేకంగా గ్రహించబడినది.

''ముఖ్యో లక్ష్య స్తథా గౌణో
వ్యంగ్య శ్చేతీహ కథ్యతే''

అని అందు చెప్పబడినది. గౌణార్థంలో కూడా లక్ష్యార్థంలో వలెనే, ముఖ్యార్థమునకు బాధకలిగి, అర్థాంతరం వస్తూ ఉన్నందున, దీన్ని ప్రత్యేకంగా గ్రహించనక్కర్లేదని అర్థత్రయాన్నే అంగీకరించినవారి అభిప్రాయం. బసవరాజుమాత్రం

'సగౌణో గుణసాదృశ్యా
దన్యోఽర్థోయః ప్రతీయతే'

అని గుణసంబంధం ఉండేది గౌణమని వివరిస్తూ 'సింహోమాణవకః' అని ఉదాహరణం ఇచ్చినాడు.

(5) రసములు

నాట్యశాస్త్రకారుడైన భరతుడు 'అష్టౌనాట్యే రసాః స్మృతాః' అని ఎనిమిదిరసాలనే గ్రహించాడు. వ్యాఖ్యాతలు నాట్య విషయంలోనే ఎనిమిది రసాలని భరతుని అభిప్రాయమనీ, శాంతరసం కూడా అతనికి సమ్మతమే అని చెప్పారు. కొందరు పదిరసాలను కూడా ఒప్పుకొన్నారు. భోజుడు ఒక్క శృంగార రసాన్నే ఒప్పుకొన్నాడు. ఈ రసాలకు ప్రధానాలు స్థాయి భావములు. శివతత్త్వ రత్నాకరంలో భరతుడు చెప్పిన ఎనిమిది స్థాయి భావములేకాక, తొమ్మిదవదైన శాంతరసానికి స్థాయిభావం శమం కూడా ''జుగుప్సా విస్మయ శమాః'' అని చూపబడినది.

వీరరస భేదాలను చెప్పిన లాక్షణికులు దాన, దయా, ధర్మ, యుద్ధ భేదములచే అది నాలుగు విధాలని వివరించినారు. ఆలంకారిక చక్రవర్తిఅగు జగన్నాథపండితరాయలు ఈ భేదాలను గ్రహించాడు. ఇందులోమాత్రం

'దాన వీరో దయా వీరో
యుద్ధవీర ఇతిత్రిధా'

అని వీరరస భేదాలు మూడే చెప్పబడినవి. ధర్మ భేదంలేదు. ధర్మ వీరానికి సాధారణంగా ధర్మరాజును ఉదాహరిస్తారు. బసవరాజు దృష్టిలో యుధిష్ఠిరుడు దయావీరుడై ఉండునేమో!

తక్కినవిషయాలలో వ్యత్యాసంలేదు. కావ్యానికి రసం ప్రధానంఅని ఇందలి కావ్యలక్షణం చెప్పుతూఉన్నా, రీతులనూ, కైశిక్యాదివృత్తులనూ వివరించేటప్పుడు "రీతి రాత్మా కావ్యస్య' అని వామనుని మతాన్ని అనుసరించి వ్రాయబడింది. ఇది కొంత ఆలోచించదగినదే!

దోషాలను వివరించే సందర్భంలో శ్రుతికటు వనేదోషం ఒకప్పుడు దోషంకాకపోవచ్చునని

'ఉదాహరణ కావ్యేషు
న దుష్టం శ్రుతికట్వపి"

అని ఇందులో చెప్పబడినది! క్షుద్ర (చిన్న) ప్రబంధాలయిన ఉదాహరణ కావ్యాలు చిత్రకావ్య భేదాలు కావడంవల్ల వానిలో శబ్దచమత్కారమే అధికంగా కానవస్తుంది. శ్రుతికటువును అక్కడ కూడా దోషంగా చెప్పితే ఆ శబ్ద చమత్కృతిలోపిస్తుంది. అందువల్లనే శ్రుతికటువు ఉదాహరణ కావ్యాల్లో దుష్టం కాదని చెప్పబడి ఉండవచ్చును.

శివతత్త్వరత్నాకరం పెక్కు విషయాలను బోధించే విజ్ఞానసర్వస్వం అయినా, ఆ యా శాస్త్రవిషయాలు అస మగ్రంగా విడవబడలేదు. సంగ్రహంగాఉన్నా, సమగ్రంగా చూప బడినవి. ఇందులోని అలంకార (సాహిత్య) శాస్త్ర విషయాలు భాషా, వాఙ్మయాభిమాను లందరికిన్నీ ఉపాదేయాలు.

కందుకూరి రుద్రకవి విజయనగర ఆస్థానమున యుండెనా?

శ్రీ తుమ్మపూడి కోటేశ్వరరావు

ఈ పై శీర్షికతో మార్చినెల భారతిలో ఒక చిన్న వ్యాసమును శ్రీ సోమరాజపల్లి చెంచయ్యగారు వ్రాసినారు. రుద్ర కవినిగూర్చి, వారికి తెలిసిన విషయములను పొందుపరచుటకై వారద్దానిని వ్రాసినారట. వారు చెప్పిన కొన్ని విషయములు చింత్యములుగా కన్పించుటవల్ల నే నీ నాల్గుమాటలు వ్రాయు చున్నాను.

వారి వ్యాసమందు ఈ వాక్యములు పరిశీలించగోరెదను. "రుద్రకవి ఈతని (మల్కిభరాం) యాస్థానమందుండియే తాను రచించిన 'నిరంకుశోపాఖ్యానం' అను కావ్యమును సుల్తా నకు అంకితమిచ్చి, యాతనివలన 'చింతలపాలెం' అను గ్రామ మును శ్రోత్రియముగా పొందెనని........"

"ఈ కవి రచన అయిన నిరంకుశోపాఖ్యానము గోలకొండ సుల్తానులకు అంకితమిచ్చి అగ్రహారము పొందియున్నపుడు.....'

వీరి ఈ పై వాక్యముల ననుసరించి, నిరంకుశోపాఖ్యానమును కృతిపొందినది గోల్కొండ సుల్తానికదా. కాని, ఆ కావ్యము ననుసరించి అది కందుకూరి సోమేశ్వరస్వామి కంకితముగా వ్రాయబడినది.

కోమలవర్ణధామయును గోవిదసంస్తవనీయ లక్షణ
స్తోమఫలాభిరామయును శుంభదలంకరణప్రసాధన
స్థేమయు నప్రతర్క్యగుణసీమయునైన మదీయ కావ్యక
న్యామణినిచ్చి మంచుమలయల్లని నల్లనిగా నొనర్చెదన్
1. ఆ. 19 ప.

కందుకూరిపట్టణ ప్రకాండ మండనోదయా. 2.144
శ్రితస్వీథవసాయక......కందపుర సోమేశా!. 3.1.
కావ్యమంతయు పూర్తియైనతర్వాత ఇట్లు వ్రాసినాడు.
అనిముని ధర్మశీలవసుధాధిపమౌళికి నేర్పుమించి చె
ప్పినకథ బాల్యచాపలము పెంపున స్వామికి విన్నవించితిన్
జనకుఁడు బాలుఁడాడు నవశబ్దవచోనివహంబుచేత నె
మ్మనమున మోదమందు క్రియ మామక వాక్కుల
సంతసిల్లుమీ!

మరి శ్రీ సోమరాజుపల్లి చెంచయ్యగారు వ్రాసిన విషయ మెక్కడదో తెలియుట లేదు.

వా రుదాహరించిన శ్లోకమునగాని, పద్యమునగాని ఆ విషయము సూచింపబడనైనలేదు. రుద్రకవి ఏ కావ్యముఖ సుల్తానున కంకితమిచ్చినట్లు కన్పించదు. రుద్రకవి చాల గ్రంథ ములు వ్రాసినట్లు నిరంకుశోపాఖ్యాన వ్యాఖ్యాతలు శ్రీస్వర్ణ సుబ్రహ్మణ్యకవిగారు వ్రాసినారు. అవి షుమారు పది పన్నెం డున్నవిగాని, అందులో నేదియు మల్కిభరామున కంకిత మిచ్చి నట్లు లేదు.

చింతలపాలెముగ్రామము సుల్తాను రుద్రకవి కిచ్చిన మాట వాస్తవమేగాని, అది నిరంకుశోపాఖ్యానకృతి స్వీకరణము వల్లగాదు; దానికి వేరే కథ యున్నది. అది ఆ కావ్య పీఠికలో తద్వ్యాఖ్యాతలు వ్రాసియున్నారు.

కావున శ్రీ చెంచయ్యగారు వ్రాసిన విషయము చింత్యముగా కన్పించుచున్నది.

"నిరంకుశోపాఖ్యానము గోలకొండ సుల్తానుల కంకిత మిచ్చి అగ్రహారముపొందియున్నపుడు ఈతడు ఆస్థానకవియని ఎట్లు విశ్వసించగలమని నా మనవి" యని వ్రాసినారు శ్రీ చెంచ య్యగారు. అసలాకావ్యము కృతిపొందినది సుల్తానుకాదు. పోనీ, అతడే కృతిభర్తయైనను, రాయల ఆస్థానమందుండు టకు వీలులేదనగలమా? రాయలఆస్థానము నందున్న కవు లందఱు నాయనకే తమ కావ్యముల నంకితమిచ్చిరా? శ్రీరామ

కృష్ణుడు తన ఉద్భటారాధ్య చరిత్రమును ఊరదేచమంత్రి కంకితమిచ్చియుండలేదా?

మాదయ్యగారి మల్లన తన రాజశేఖర చరిత్రమును మంత్రి తిమ్మరుసు అల్లుడైన నాదెండ్ల అప్పామాత్యున కంకితమీయ లేదా? రామభద్రకవియు నంతేగదా.

చింతలపాలెము రుద్రకవి కగ్రహారముగా లభించినది 1558 సం. మున. కావ్యమున రుద్రకవి వేశ్యావర్ణనమున తళ్ళికోట యుద్ధానంతరమున తురుష్కులు చేసిన "దోపిడీ" లను తడవుటవలన తత్కావ్యరచనము 1568 తర్వాతనే జరిగి యుండుననుటకు వీలున్నది. దీనినిబట్టియు సుల్తానునకు—నిరంకుశోపాఖ్యానమునకును—చింతలపాలెమునకు సంబంధము లేదని తెలియుచున్నదిగదా.

ఇట్లనుటచే రుద్రకవి రాయల ఆస్థానమునందున్నాడని కాదు నా భావము. వారు చూపిన హేతువు బలిష్ఠమైనదికాదని యే నా మనవి. పనిలో పనిగా రుద్రకవివిషయమున నాకు గల సందేహములను వ్రాసెదను.

రాయవాచక, శ్రీకృష్ణరాయవిజయముల పుణ్యమా యని ధూర్జటి మొదలగువారు రాయల ఆస్థానమందున్నట్లు తెలిసినది. మిగిలినవారినిగూర్చి తెలియదు.

రాయలకాలమున తెనుగుదేశమున చాలమంది కవు లున్నారు. వారిలో కొందరు రాయలసత్కారమును పొందినట్లు కొందరి కాభాగ్యము కలుగలేదన్న విషయము మన మెఱిగినదే. ఇట్లే రుద్రకవియు రాయలచే సత్కరింపబడియుండవచ్చు. లేదు, రుద్రకవి వంశీయులు చెప్పెడు మాటలనుబట్టి అతడు రాయలఆస్థానమున ఈశాన్యదిక్కున సింహాసనము నలంక రించినాడా? ఇదంతయు సందేహాస్పదముగనే యున్నది. రాయలు 1530 లో స్వర్గస్థుడైనాడు. రుద్రకవికి సుల్తాను 1558 సం. న చింతెలపాలెము నగ్రహారముగా నిచ్చినాడు. రాయల మరణానంతరము కవి పోషించెడివాడులేక పాదుషాతెలుగుకవిత్వ మందు బద్ధమనస్కుడని విని, ఆతనిని దర్శించుటకై వెళ్ళి యుండవచ్చును. సుల్తానుదర్శన మెట్లు జరిగినను మన కక్కఱలేదు. అతడు రాయలఆస్థానమందున్నాడా? లేడా? యన్నదే ప్రశ్న. అప్పకవి ననుసరించి రుద్రకవి గుంటపల్లి భాస్కరుని కాలమునాటివాడు. అతడు 1620 సంవత్సర ప్రాంతము వాడందురు. కావున రుద్రకవి నాటివాడు కావలెను గదా. రాయలఆస్థానమున ఆతనిచే పూజింపబడిన దెప్పుడు? రాయలు 1509 లో రాజ్యమునకు వచ్చెను. కావున 1509 తర్వాత 1530 లోపల రుద్రకవి రాయలసభలో సన్మానితుడై యుండవలెనుగదా. అప్పటికి రుద్రకవికి కనీసము 30 సం. ము లైన నున్నవనుకున్నచో నతడు 1490 ప్రాంతమున జన్మించి యుండవచ్చు. 1490 నుండి 1620 వరకు నతడు జీవించి యున్నాడనుట హాస్యాస్పదము. అవిశ్వసనీయము. రుద్రకవి నిరంకుశోపాఖ్యాన రచనమెప్పుడు చేసెను? అని విచారించినచో తత్కావ్యాంతమందు పద్యమున

"సేవమా నాస్మత్పౌత్రక మత్తనూభవక నాగాఖ్యాంక లింగాహ్వయా!!" అనియున్నది. ఈ కావ్యరచన చేయునాటికి కవికి మనుమలున్నారు. వారు పరమేశ్వరుని సమారాధించునంత వయస్సులోనున్నవారు. అప్పటికి కవికి 60, 70 ఏండ్లుండి యుండవలెను. ఎట్లు చూచినను కవి 1500 లో జన్మించి, 1620 వరకు జీవించియుండవలెను. అప్పకవి చెప్పిన రుద్ర కవి, నిరంకుశోపాఖ్యానకర్తయగు రుద్రకవి—ఇద్దఱు నొక్కరు కాదు. కాబట్టి సుమారు 1490 లోనో జన్మించి, 1570 వఱకు జీవించిన రుద్రకవి వేఱు. అతడే రాయలచే సన్మానింప బడినవాడు. అని ఊహించుట కవకాశమున్నది. ఆ వంశమునందు రుద్రకవులు చాలమంది యున్నారట. ఒకవేళ 1620 నాటి రుద్రకవియే నిరంకుశోపాఖ్యానకర్తయనుకొన్నచో తత్పూర్వు డితనికి తండ్రియో, తాతయో? యగునేమో తెలియదు.

ఇంతకును రుద్రకవి అష్టదిగ్గజములందున్నాడో లేడో తెలియదు. రాయలెవరికో ఇచ్చిన ఒక శాసనమున 'రుద్రకవి గళు' అని యున్నదట. ఆ మాటవలన రుద్రకవి నాడున్నా డనగలముగాని, అష్టదిగ్గజములలో నొకడని, ఈశాన్య దిక్కు నందలి సింహాసనమందున్నాడనిగాని, చెప్పుటకు వలనుపడదు. కాని, నిరంకుశోపాఖ్యానవ్యాఖ్యాతలు శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్య కవిగారు కొన్ని పద్యము లుదాహరించి రుద్రకవి—రాయల ఆస్థాన మందున్నాడని వ్రాసినారు. ఆ పద్యములకు పరమప్రామాణ్య మంగీకరింపరాదని చాటుపద్య మణిమంజరి 2 వ భాగమున శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిరి. ఆ పద్యములనే ప్రమాణముగ స్వీకరించి రాయలఆస్థానమందు రుద్రకవి ఉని కిని విశ్వసించినారు వ్యాఖ్యాతలు.

ఇంకను చారిత్రక సాక్ష్యమేమైన దొరుకునంతవఱకు రాయల ఆస్థానమున రుద్రకవి ఉనికిని అంగీకరింపలేము.

దీనికి బహుళమైన పరిశోధనలు జరుగవలెను.

నిరంకుశోపాఖ్యానము సుల్తానున కంకితముగా వ్రాయ బడలేదనియు, చింతలపాలెము తత్కావ్యాంకితమువల్ల కవికి లభించినది కాదనియు, రుద్రకవు లిద్దరు ముగ్గు రుండవచ్చు ననియు, అందులో ఒకడు రాయలఆస్థానమున అష్టదిగ్గజము లలో నున్నాడనుటకు తగిన సాక్ష్యము లేనందువల్ల ఏ విషయము నిర్ధరింపలేమనియు మనవి చేయుటకై ఈ వ్యాసము వ్రాయ బడినదని మనవి.

అఖండయతి భ్రాంతి

శ్రీ రావూరి దొరస్వామిశర్మ

భారతి 1962 ఏప్రిల్ సంచికలో గ్రంథ విమర్శనము క్రింద నిర్వచనసుందరకాండమును సమీక్షించుచు, దద్విమర్శకు లిట్లు వ్రాసిరి. (పుట—95.)

"కావ్యమున నఖండయతులు మిక్కిలిగా బాటింప బడినవి. (అప్పకవి మతమునఁ బేళ్లుమారిన మారనిండు)

కం. మరకత వర్ణ సుషమాసముంచిత చిత్ర.
అనఁ జనె నుత్తాలమయి సమంచిత భంగిన్.
వేగమె సిద్ధినొందు మద భీప్సిత.
కుజ,ముల నురమున ద్రోయుచున్ సముత్కటవృగముల్.
ఉరరీకృత వీచికా సముత్కరమగు.
అలంకృతిం జేయుదురు సమంచిత రీతిన్.
అఖండయతి మహాకవులచే సంగీకరింపబడినదియకదా!"

గ్రంథ విమర్శకులు చూపట్టిన పై స్థలములందలి యతులు లాక్షణికుల మతానుసారము అఖండయతులుగావు. అయ్యవి ప్రాదియతులనఁబడును. ప్రాదియతులును, అఖండ యతులే యగుఁగదా యను శంక కొందఱికుఁ గలుగవచ్చు. అందులకు సమాధానము దెల్పెదను.

ప్రాది, శకంధ్వాది, నిత్య సమాసాది శబ్దములకు భిన్నముగా అచ్సంధిఘటిత శబ్దముల సంధిస్థలమున నిలిచిన వ్యంజనమునకు యతి గూర్చుట యఖండయతి యనఁబడును.

అఖండవడి లక్షణము—కూచిమంచి తిమ్మకవి:
"హల్లునకు హల్లువడియిడునపుడు దాని
తుదిని స్వరము ఘటిల్లిన నది యఖండ
వడి యనఁగఁ బొల్చుఁ గృతులదే+వాది దేవ
యగుచుఁ జెప్పిన శైలకన్యాధినాథ."

(సర్వ లక్షణసార సంగ్రహము—పుట. 110)

తలంచుచుండు (తలంచుచు+ఉండు), ఏమన్న (ఏమి+అన్న) కవీంద్ర (కవి+ఇంద్ర) ఇత్యాది స్వరసంధిగత శబ్దముల సంధిస్థలమున నిలిచిన వ్యంజనములకు యతిగూర్చుట యఖండ యతి యనిపించుకొనును. "చూవె మనంబున దలంచు+చుండుదు నెపుడున్' (భార). ఇట్టి స్థలములలో స్వరమునకు యతి పాటింపవలయునని యప్పకవిమతము. ఇట్టి సామాన్యాఖండవళ్లను అప్పకవి నిషేధించెఁ గానఁ బ్రాది నిత్యసమాసాది యతుల నుభయయతి భేదములుగా నుపదేశించెను.

అఖండయతిని బేర్కొన్న పూర్వలాక్షణికులు (భీమన, తాతంభట్టు, చిత్రకవి పెద్దన, ముద్దరాజు రామన, లింగమగుంట తిమ్మన, కూచిమంచి తిమ్మన, రంగకవి మున్నగువారు) ప్రాది నిత్య సమాసాదులఁ బ్రత్యేక భేదములుగాఁ జెప్పియున్నారు. "స్వర విభాగ ప్రాదివర్గ నిత్యాదేశ ...... భిన్న కాకుస్వరాభేదోఽ యాఖండ బుప్రభు దేశియ' (చిత్రకవి పెద్దన)

స్వర వర్గాఖండప్లుత నరస ప్రాదులును (కూచిమంచి తిమ్మన)"

ప్రాదియతుల నఖండయతి భేదముగా నే లాక్షణికుఁడును జెప్పలేదు. అప్పకవి యఖండ యతుల పేళ్లు మార్పలేదు. ఉభయయతి భేదముల సృష్టి యప్పకవికిముందే యేర్పడినది.

'సమంచిత, సముత్కర, అభీప్సిత' ఇత్యాదులు ప్రాదులు. సర్వలాక్షణికు లిందలి యుభయయతిని ప్రాదియతి పేరనే వ్యవహరించిరి. అఖండయతి మహాకవులచేతనేకాక, యప్పకవి వంటి యొక రిద్దఱిచేతఁ దప్పఁ దక్కిన యెల్ల లాక్షణికులచేత నంగీకృతము. దీనినిగూర్చి భారతి 1962 జనవరి సంచికలో విశ్వనాథ ప్రయోగవైలక్షణ్య సమీక్షయను నా వ్యాసములో సవిస్తరముగా నిరూపించియున్నాను.

ప్రకృత సమీక్షలో నఖండవడికిఁ బ్రసక్తిలేదు. అందున్నది ప్రాది యతి. ఇది సమస్త లాక్షణికసమ్మతము. గ్రంథ విమర్శనములో దీనిని బ్రత్యేకముగ నుటంకింపవలసిన యవసరములేదు. కేవల మఖండవడి పాటించిన ప్రయోగము లుండునేని, వానిం జూపుటలో బ్రయోజనమున్నది. ప్రాదియతి నఖండవడిగా భ్రమించి సమీక్షించుట స్వరసముగాదని యెఱుఁగఁగోరుచున్నాను.

పెద తూర్కానకవి

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

ధూర్జటికవి వంశ్యుఁడును, కుమార ధూర్జటియని ప్రసిద్ధిగాంచిన వెంకటార్యుని కుమారుఁడునునగు ధూర్జటి లింగరాజకవి 'పెద కాళహస్తి స్థలమహాత్మ్యము' అను గ్రంథమును రచించెను. ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమునకుఁ బీఠిక వ్రాయుచు శ్రీ కొత్తపల్లి పద్మనాభశాస్త్రులుగారు క్రీ. శ. 1895 లో నీ కవినిగూర్చి ఇట్లు వ్రాసిరి. 'ఈ కుమార ధూర్జటి పుత్రుఁడు లింగరాజకవియను నతఁడును, శ్రీ కాళహస్తి మాహాత్మ్యమను కొండొక గ్రంథమును రచియించినాఁడు. దీనిని మా మిత్రు లొకరు మా కియ్యఁగాఁ జదివి చూచితిమి. అది ఈ కాళహస్తి మాహాత్మ్యముకన్న గ్రంథ బాహుళ్యంబున నాల్గింత లెక్కువయై 12 ఆశ్వాసములు కలదియై యొప్పుచున్నది. అది కాళహస్తిని బాలించుచుండిన యక్కరాజు వెంకటపతిగారి కంకిత మీఁబడియున్నది.' దీనినిబట్టి లింగరాజకవి రచితమగు కాళహస్తి మాహాత్మ్యము పండ్రెండాశ్వాసముల ప్రబంధమని తెలియుచున్నది.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యాపరిశోధనాలయ పుస్తక భాండాగారములో నీ గ్రంథమునకు మూడు ప్రతులు కలవు. కాని, గ్రంథము సంపూర్ణముగా లభ్యముకాలేదు. గ్రంథారంభము నుండి యేడాశ్వాసములదాఁక మాత్రమే గ్రంథము లభించినది. తక్కిన గ్రంథ భాగము మఱెచ్చటనైన నున్నదేమో తెలియరాదు ఇతని ద్విపద భాగవతము తాలూకు ప్రతులు ప్రాచ్య విద్యా పరిశోధనాలయ గ్రంథ భాండాగారముననే కలవు.

ఇతని కాళహస్తి మాహాత్మ్యములోని యవతారికలో పూర్వ కవి స్తుతుల సందర్భమున కవిత్రయమును స్తుతించినపిదప నీక్రింది పద్యములు కలవు.

క. జాగ్రద్ధూర్జటి చటుల జ
టాగ్రీ నటద్ద్యోధునీ స్వనాంచద్దుర్గా
నుగ్రహ కవిత్వవిభవస
మగ్రుని పెదతూర్కనార్యు మతి నుతియింతున్.

క. దిక్కుహర స్ఫురితయశో
ధిక్కృత దృక్కర్ణ రాజ దిక్కర్యమృతాం
భఃకణ వైభవుఁడగు శ్రీ
జక్కన శృంగార సుకవి చంద్రుఁ దలంతున్.

వీనికిఁ బిదప ధూర్జటికవి ప్రశంసయుఁ గుకవినిందయుఁ గలవు. పై పద్యములలోఁ దొలిపద్యమునందుఁ బేర్కొనబడిన 'పెద తూర్కానకవి' యెవఁడో, యాతఁడు రచించిన గ్రంథము లేవో మనకుఁ దెలియరాదు. లింగరాజకవి ప్రశంసనుబట్టి యాతడు చక్కని కవిత్వము చెప్పగలధీశాలి యని తెలియుచున్నది. అతని కవిత్వము పరమశివుని జటాజూటమునందు నటించెడి యాకాశగంగా ప్రవాహముయొక్క శబ్దమువంటి శబ్దము గలిగియుండునఁట! ఆ కవిత్వము కూడ నతనికి 'దుర్గానుగ్రహము' వలన గలిగినదఁట! విక్రమార్క చరిత్రమును రచించిన జక్కనకవికంటె ముందీ కవి స్తుతింపఁబడుటచే ఇతఁడు జక్కనకంటెఁ బూర్వుఁడగునేమోయని యనుమానము కలుగుచున్నది. ఈ కవి యొక్క యునికినిగూర్చి మన కవి చరిత్రకారు లెవ్వరును బేర్కొనియుండలేదు. లింగరాజకవితప్ప, యింకే కవియును అతని స్తుతించియుండలేదు. అసలు 'తూర్కన' యన్నపేరే వింతగా నున్నది. కాని, ప్రాచీన శాసనములలో 'తూర్కన' యనుపేరు కానవచ్చుచున్నది. తూర్కన యనుకవి జక్కనకంటె ముందు కాలములో వెలసియుండెనో, లేక దగ్గుబల్లి దుగ్గననే లింగరాజ కవి తూర్కనయని పేర్కొనెనో ఇంకను పరిశోధింపవలసియున్నది. 'దుగ్గన' నామము దుర్గన పదవికృతియగుట, యతడు శివకాంచీ మహాత్మ్యమును రచించియుండుట, తూర్కన యనునది 'దుర్గన' యనుటకు లేఖకులు వ్రాసిన యపరూపము కాఁదగుట యతఁడు దుర్గానుగ్రహ కవిత్వవైభవుఁడగుట యనునవి ఈ యూహకు కారణములు. కాని, దుగ్గన తన నాసికేతోపాఖ్యానమునందలి యాశ్వాసాంత గద్యలలో దన్నుగూర్చి 'శ్రీనాథ మహాకవీంద్ర ప్రసాద లబ్ధ కవితా విశేష' యని పేర్కొనియుండుట ఈ యూహమునకుఁ బ్రబల ప్రతిబంధకమగుచున్నది. దీనినిబట్టి తూర్కానకవి దుగ్గన కాక, మఱియొకఁడని, యతఁడు జక్కనకంటెఁ బూర్వకాలమునందు వెలసినవాఁడు కాఁదగునని యూహింపనగుచున్నది.

గ్రంథ విమర్శనము

తెలుగు నీతి

(తెనుఁగునీతి, రచన—తెనుఁగు లెంక–వెల రు. —75 న. పై.)

ఈ చిన్నిపొత్తము భర్తృహరి సుభాషితములోని నీతిశతకమునకుఁ దెనుఁగు సేత. ఈ నీతిశతకము నేనుగు లక్ష్మణకవి మొదలయినవారు పూర్వ మాంధ్రీకరించిరి. "మఱలనిదేల తెనుఁగుసేత యన్నచో వారిలోఁ దనపేరుగూడ 'రవళించుట'యే కవిగారికిఁ బ్రయోజనము.—కవిగారు దీని 'యావశ్యకము'ను నిర్ణయించు నధికారమును దెనుఁగువారికి వదలినారు. ముప్పది మూఁడేండ్ల యొజ్జనము సాగించి నిరంతరము విద్యార్థులకు నేనుగు లక్ష్మణకవి పద్యములు బోధించుటవల్ల నూతనాను వాదమున కుత్సాహము గలిగినదని కవిగారు వాకొనిరి. పీఠికాకర్తలు లక్ష్మణకవితోఁ గవిగారికి దూకమువేసి, కవిగారివంక మ్రొగ్గుచూపించినారు. కొన్నిచోట్ల 'మూలమునకుఁ గూడఁ గవిగారు మెఱుగులు దిద్దినార'ని పీఠికాకర్తలు వ్రాసినారు. ఉదాహరణ లీయలేదు. వారి మాటలు నహినిందాన్యాయమును బట్టి యర్థముచేసికొనవలెను.

లక్ష్మణకవి పద్యములలోఁ గొన్ని దొసగులు పీఠికాకర్తలు చూపించినారు. కొన్ని వ్యర్థపదములు గూడఁ జూపించినారు. అంతమాత్రమున లక్ష్మణకవి కవిత్వము తీసికట్టు కాఁజాలదు. వ్యర్థపదములు లేకపోవుట యొకటే కవిత్వమునకు గుణము కాదు. అన్నింటికంటే మించినది పద్యరచన. ఒక కవిలో వ్యర్థపదములు సమృద్ధిగానున్నను బద్యరచన సౌందర్యమువల్ల నతని కవిత్వమునకు బహుజనాదరణము లభించును. ఏనుగులక్ష్మణకవిలో నీ పద్యరచన సౌందర్యము పూర్వకవులలో నున్నంత సమృద్ధిగా నున్నది. ఆయన రచనలోనున్న మెలకువలన్నియు నెఱిఁగినవాఁడు. ఆయనకుఁ బేఱు రాకరాలేదు. నన్నయ, తిక్కన, శ్రీనాథులలోఁ దక్కినగుణము లన్నింటికన్న వారి ప్రసిద్ధికిఁ బ్రధాన కారణము పద్య రచన సౌందర్యమే—

శ్రీ సీతారామమూర్తిగారి రచనలోఁ దెలుఁగు పా లెక్కువ.
వేపినోరు పొట్టచూపుఁ గాల్గొట్టుఁ దోఁ
కార్చుఁ జలిది వైచు నతని యెదుటఁ
గరి గభీరదృష్టిఁ బఱపి మావటి బతి
మాలి యొసగ మెసవు మేలి తిండి.

ఈ పద్యము శ్రీ సీతారామమూర్తిగారి కవిత్వమునకు మచ్చుతునకగా గ్రహింపవచ్చును. ఈ పద్యమునందు మూలార్థసంగ్రహముతోఁబాటు జిగి బిగి రెండు నున్నవి. తెలుఁగుమాట లెక్కువగ నున్నవి. కాని, తోఁకాడించు నన్న యర్థములోఁ 'దోఁ కార్చు'నని ప్రయోగించుట సొగసుగాలేదు. 'ఱెక్కలార్చు', 'ఱెప్పలార్చు' నన్న ప్రయోగములవలెఁ దోఁకార్చుననుట సహజముగాలేదు.

శ్రీ సీతారామమూర్తిగారు పద్యరచనలోఁ జేయి తిరిగిన కవి. పద్యరచన సొగసుగా గడసరిగా మంచితీర్పుగాఁ జేయగలవారు. ఈయన పద్యరచనలో నొక కట్టుండును. ఒక ముద్రయుండును. వ్యక్తిత్వముగలకవికి ముఖ్యముగానుండు గుణము లివి. కవి వ్యక్తిత్వమునుబట్టి, యతని పద్యరచనయందలి స్వీయతా ముద్రయుండును.

'అణకువచేత నుచ్చదశనందుదు రన్యగుణప్రశంస కీ
కొని తమ పెంపు లోకమునకుం బ్రకటింతురు లాతిమేలికై
పెనగి స్వకార్యసిద్ధి యొదవింతురు లిట్టినయట్టివారి నో
ర్మిన పసవింతు రద్భుతచరిత్రులు పూజ్యులుగారె సజ్జనుల్

ఈ పద్యమునందు రచన బంగారము.— రెండు, మూడు నాలుగు చరణములందుఁ బ్రకటింతురు, ఒదవింతురు, పసవింతురు, అనుక్రియా రూపములు వాక్యముల విరుచుచు, రెండు లఘువుల తరువాత బిందుయుతమైన గుర్వక్షరమును, దరువాత రెండు లఘ్వక్షరములు కలుగుటవల్ల రచనయందొక విచ్ఛిత్తి నాపాదించుచు నర్థమున కుద్దీప్తి కల్గించు చున్నవి. ఇది పద్యములలో మెట్లు కట్టుటవంటిది. తొలితొలిమెట్టునందుఁ గంటె మలిమలి మెట్టునందు విచ్ఛిత్తి యధికము.—

అన్నింటికంటె 'తిట్టిన యట్టివారి నోర్మిన పనవింతుర'న్న వాక్యము శిఖరాయమాణముగానున్నది. 'తిట్టినయట్టివారి నోర్మిన పనవించుట యని వ్రాయుటయేకాదు. అది ఈ కవి గారికి బాగుగాఁ దెలిసిన విద్య

ఎంత సంగ్రహముగా వ్రాసినను బాదపూరణముకొరకు సంస్కృత సమాసమును సాగదీసిన సందర్భములుకొన్నిగలవు. —మణిమయూఖచ్ఛటాశ్లిష్టమస్తము; రణాస్ఖలితుఁడు; కవి రసాధిపులు మొదలైనవి రచనలోఁ బలుచదనము నాపాదించు చున్నవి.

'మొసలిపంటి పగడమును లాగవచ్చు'—మొసలిపంటిలో నుండునది ముత్యముగాని పగడముగాదు.

'కొమ్మలు మొలిచిన' అనుటకుఁ 'గొమ్ములుసాగిన' అనుట వీరిప్రాంతమునందు వాడుకలో నున్నదేమో?

అలరునకు బలె మనస్వికిఁ
గలవు గతుల్ రెండు మనుజగణ శీర్షమునన్
నెలకొనుట యొండె నటవీ
స్థలమునఁబడి యెండి చివికి సమయుట యొండెన్

కుసుమస్తబకస్యేవ ద్వయీవృత్తిర్మనస్వినః
మూర్ధ్ని వా సర్వలోకస్య శీర్యతే వన ఏవ వా.

శ్లోకమునందు 'శీర్యతే' అన్నక్రియ యుభయత్ర అన్వయించును. తెలుగుసేతలో సమయుట యన్నక్రియ నటవీ స్థలమున నన్నమాటతోనే యన్వయించును. మఱి పడి యెండి చివికి సమయుట యని భావమును సాగలాగుటవల్ల రచనయందలి బిగిచెడ్డది. ఇట్టిపద్యము లచ్చటచ్చటనుండి తెనుఁగు సేతలోని యొడికమును భంగించుచున్నవి.

'కుమ్మరివలె విధి నాదుమ
నమ్మను మృత్పిండముగనొనర్చి విపద్దం
డమ్మున బాది వృథాచ
క్రమ్మననిడి త్రిప్పు నేమి కావించుటకో.'

మఱి యిట్టి బంధురరచనగల పద్యములు బహుళముగా నున్నవి.

ప్రియసఖవిపద్దండ వ్రాత ప్రపాత పరంపరా
పరిచయచలే చింతాచక్రే నిధాయ విధిఃఖలః
మృదమివబలాత్పిండీకృత్య ప్రగల్భకులాలవత్
భ్రమయతి మనో నో జానీమః కిమత్రవిధాస్యతి.

శ్లోకమునందు విపద్దండేత్యాదిసమాసము చింతాచక్రే లోని కన్వయించును. తెనుఁగు సేతలో 'విపద్దండమ్మున బాది' యనుమాట కర్మాకాంక్షవల్ల మృత్పిండము నాక్షేపించి యన్వయించును. దండచక్రములకున్న సంబంధము దండ మృత్పిండములఁ గతికినారు కవిగారు. అర్థములోఁ గొంత తిర కాసు వచ్చినది. కాని కుమ్మరి మట్టిని దండముతోఁ గూడ బాదుటయున్నది. శ్లోక గతార్థముతో భేదించినను భావము సరిపెట్టుకొనవచ్చును. పద్యరచనము చాల ప్రశస్తముగా నున్నది. అనువాదము చేయుటలో నిట్టి భేదము లెంతటి వారికైనఁ దప్పవు.

శ్రీ సీతారామమూర్తిగారి యనువాదము సరళముగ నున్నదని చెప్పవచ్చును.

మఱి శ్రీ సీతారామమూర్తిగారి భాష నిర్దుష్టమైనదని వ్రాయనక్కఱ లేదనుకొందును. వారు చిన్నయసూరి గీచిన గిరిలోనే కూర్చుండు మందురు. అది కొంత వీరగ్రాంధిక లక్షణమని నా తలంపు. చిన్నయసూరి బాలవ్యాకరణమునకు నన్నయాదుల ప్రయోగములే కొన్నిలొంగవు. శ్రీ సీతారామ మూర్తిగారు కూడా బాలవ్యాకరణమునకు లొంగని ప్రయోగ ములు కొన్నిచేయకపోలేదు. బాలవ్యాకరణమునకేగాదు; ఏవ్యాకర ణమునకైనను లొంగని ప్రయోగ మొకటి కన్పించినది. 'తోపడి' అని. ప్రమాదమనుటకు వీలుకానిదిది. ప్రాసస్థానములో నతుకు కొన్నది. ఇంతమాత్రమువల్ల వచ్చిన నష్టమేమియులేదు. భాష ప్రవాహిని. దానికిఁగొంత సంస్కారముచేసి కావ్యయోగ్యముగాఁ జేసికొనవలయును. ఆ పనికి మహాకవుల ప్రయోగములు దిక్ప్ర దర్శకములు. తెనుఁగునకున్న వ్యాకరణ దీపముచిన్నది. కొందఱు దానిని పెద్దదిచేసి తగాదాలు పెంతురు. శ్రీ సీతారామమూర్తి గా రాత్రోవలోనివారు కా రనుకొందును— వారి తెనుఁగుపీతి సర్వవిధములఁ బ్రశస్తముగా నున్నది—

—ధూళిపాళ శ్రీరామమూర్తి

దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయము

(ఈ రచయిత: శ్రీ నిడుదవోలు వేంకటరావు; ప్రకాశ కులు: మద్రాసు విశ్వవిద్యాలయం; వెల రు. 20-0-0 లు)

దక్షిణాంధ్ర వాఙ్మయ మనగానే కొందరు పెదవి విర తురు. ఆ పెదవి విరుపులో 'ఇందులో ఏమున్నది' అను భావము ద్యోతక మగును. వారి దృష్టిలో దక్షిణాంధ్ర యుగ మున వెలుగులోనికి వచ్చిన రచనలు పేర్కొనదగినవి కావని వేరుగ చెప్ప నవసరములేదు. కాని ఆ నాళ్లలో వెలువడిన ఆయా రచనలను స్థూలముగా పరిశీలించినను, నిజము తేట తెల్లము కాగలదు. ఆంధ్రవాఙ్మయ చరిత్రలో ఏ యుగము

గ్రంథ విమర్శనము

నందును కనబడనంతటి వైవిధ్యము దక్షిణాంధ్రయుగమునందు ప్రధానముగ గోచరించును. ఈ యుగమున నూతన సాహిత్య ప్రక్రియ లెన్నియో వ్యాప్తిలోకి వచ్చెను. యక్షగాన, నాటక, వచన, గేయ రచనా శాఖలు వర్ధిల్లినవి యీ యుగమునందే. సాంత్వన రచనలు, క్షేత్ర మాహాత్మ్యములు, వేదాంత గ్రంథములు, దండకములు, ఛందోలంకారాది గ్రంథములు, సంగీతశాస్త్ర సంబంధ రచనలు మొదలగునవి చుబ్బన చూరలుగా వెలువడినవి యీ యుగమునందే. ఎందరో రమణీమణులు తమ రచనా ప్రసూనములచే తెలుగు పలుకుల వెలదిని పూజించినది కూడ ఈ యుగమునందే. పండిత పామర రంజకములైన రచన లెన్నో వెలువడిన దక్షిణాంధ్ర యుగమును చిన్నచూపు చూచుట న్యాయముకాదు. కనక యీ యుగమున వర్ధిల్లిన తెలుగు సాహిత్యమునందలి మంచిసెబ్బరలను తెలిసికొనుట ఎంతేని అవసరము. ఇందులకు సుప్రసిద్ధ పండిత పరిశోధకులు, మదరాసు విశ్వవిద్యాలయమున తెలుగు పరిశోధన శాఖాధ్యక్షులు నగు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమను బృహద్గ్రంథము తోడ్పడునని ఘంటాపథముగ పేర్కొనవచ్చును.

ఈనాటికిని మనకు సమగ్రాంధ్రవాఙ్మయ చరిత్రమును వివరించు గ్రంథము లేదు. అటులనే సమగ్ర దేశ చరిత్ర, సమగ్ర వ్యాకరణము, సమగ్ర నిఘంటువు మొదలగునవి కూడ లేవు. మొన్న మొన్నటి వరకు దక్షిణాంధ్ర యుగమున వెలువడిన రచన లన్నియు అందుబాటులో లేక పోవుట వలనను, ఈ యుగమునందలి వాఙ్మయ రంగములు మన వాఙ్మయ చరిత్రకారులకు దూరములో ఉండుటవలనను —ఏ కారణమువలన నైననేమి—దక్షిణ దేశమున వర్ధిల్లిన తెలుగు సాహిత్యమునకు సంబంధించిన కొన్ని కొన్ని వివరములు మాత్రమే తెలియవచ్చినవి కాని సమగ్ర స్వరూపము తెలియరాలేదు. ఇట్టి పరిస్థితిలో దక్షిణాపథమున వెలసిన తెలుగు వాఙ్మయమునకు సంబంధించిన ప్రామాణికము, సమగ్రము నైన యొక గ్రంథము వెలువడుట నిజముగానే హర్షింపదగిన విషయము.

నేటికి ఇరువది యైదేండ్లకు పూర్వమునుండియు దక్షిణాంధ్ర వాఙ్మయమును గురించి పరిశ్రమించుచున్న శ్రీ వేంకట్రావుగా రీ యుద్గ్రంథమును రచించుట, మదరాసు విశ్వవిద్యాలయమువారు దీనిని 1954 వ సం. న ముద్రించుట, దీనికి 1960 న ద్వితీయ ముద్రణ భాగ్యము గలుగుట మొదలగు నంశములు గమనింపదగినవి. ప్రస్తుత ద్వితీయ ముద్రణమునందీ క్రింది విశేషములు కనబడుచున్నవి.

1. దక్షిణాంధ్ర వాఙ్మయ సమీక్ష.

2. ఆంగ్లమున సంగ్రహముగ రచింపబడిన దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయ చరిత్ర.

3. పదానుక్రమణిక.

4. విపులీకృత గ్రంథసూచి.

5. దక్షిణ దేశమున వాఙ్మయ రంగములను సూచించు పటము.

విమర్శనా దృక్పథముతో సంతరింపబడిన వాఙ్మయ సమీక్షను సాహితీ మర్మజ్ఞులెల్లరు పరిశీలింపవలెనని కోరుచున్నాను. సమస్యాపూరణములు (కైపదములు), శతావధానము లేక శతలేఖినీ విద్య, సమయలేఖినీ విద్య, మాలికా కవిత్వము మొదలగువానిని గురించి పెక్కు విషయము లీ సమీక్షలో ఉదాహరణపూర్వకముగ వివరింపబడినవి.

నాయకరాజుల కాలమునను, వారి తరువాత దొరతనము చేసిన మహారాష్ట్ర నృపతుల కాలమునను తంజావూరిలో తెలుగు సాహిత్యమునకు పెండ్లిపందిళ్లు వెలసెననుట అత్యుక్తికాదు. ఈ రాజుల కాలమున యక్షగాన రచనకు ప్రాధాన్యము లభించెనని మన వాఙ్మయ చరిత్రకారులు సాధారణముగా పేర్కొందురు. ఇట్లనుట సరికాదనియు, ఆ నాళ్లలో వెలసిన రచనలను పరిశీలించుచో అవి యన్నియు యక్ష గానములు కావనియు అవి దేశి సంప్రదాయానుబద్ధముగ రచింపబడిన నాటకము లనియు శ్రీ వేంకటరావుగారు వివరించిరి. వారి యభిప్రాయము ననుసరించి తంజావూరిలో వెలసిన రచనలలో ముక్కాలు మువ్వీసము నాటకములే కాని యక్షగానములు కావని చెప్పవలసి యున్నది. యక్షగానము, నాటకము—ఈ రెండును భిన్న రచనా ప్రక్రియ లగుటచే తంజావూరి కేటలాగునందు యక్షగాన నాటకములు వేర్వేరుగా సూచింపబడినవి. ఆ కాలపు కవులు తాము యక్షగానమును రచించుచున్నామనియు, నాటకమును రచించుచున్నామనియు సుస్పష్టముగా తమ తమ రచనముందు

పేర్కొని యుండగా, మన వాఙ్మయ చరిత్రకారులు నాటకములను కూడ యక్షగానములుగా సంభావించుట ఆశ్చర్యముగానే యున్నది. ఈ విషయమై విపులముగ చర్చించి శ్రీ వేంకటరావుగారు తుది మాటలుగా ఇటుల నుడివిరి. "సారాంశమేమనగా తంజాపూరిని వెలసినవి యే యొకటి రెండు యక్షగానములు తప్ప తక్కినవన్నియు నాటకములే. ఇవి యన్నియు సంస్కృత నాటకముల పద్ధతి పూర్తిగా ననుసరింపక, దేశీయమైన పద్ధతులలో నూతనముగా రచితములైన స్వతంత్ర నాటకములు—దక్షిణాంధ్ర వాఙ్మయము యొక్క ప్రత్యేక విశిష్టత యీ స్వతంత్ర నాటక రచనము."

గ్రంథవిమర్శకు పాండిత్యముతోపాటు లోకానుభవము, ఆచార వ్యవహార పరిజ్ఞానము మొదలగునవి యెంతేని ఆవశ్యకములు. లేకున్నచో విమర్శ నీళ్లకు నీళ్ళు, ప్రసాదమునకు ప్రసాదముగా నుండును. ముఖ్యముగా మన ప్రాచీన సాహిత్యమును పరిశీలించునప్పుడు ప్రాచీనాచార సంప్రదాయములను దృష్టియం దుంచుకొనవలెనే కాని ఆధునిక సంప్రదాయములను పురస్కరించుకొని - విమర్శనకు దిగకూడదు. ఈ కారణము వలననే మన ప్రాచీన కావ్యములను గురించి చిత్రవిచిత్రములగు కొన్ని అభిప్రాయములు వ్యాప్తిలోనికి వచ్చినవి. దక్షిణాంధ్ర యుగమున వెలసిన కొన్ని కృతులు తీవ్ర విమర్శకు పాల్పడినవి. అట్టి వానిలో శహాజీ కాలమున వర్ధిల్లిన వాసుదేవకవి రచించిన పార్వతీ పరిణయ నాటక మొకటి. హాస్యరసమును పోషింపదలచి అసభ్యములు, ఆశ్లీలములు నగు విషయములను కవి యీ నాటకమున చెప్పినాడని ఒక విమర్శ. దక్షిణాంధ్రయుగమున వెలసిన కృతులలో అటనట అశ్లీలములుగా తోచు విషయములు లేకపోలేదు. అంతమాత్రమున ఆ యుగమున వెలసిన కావ్యజాలమును తూర్పారబట్టుట సమంజసముకాదు.

పార్వతీ పరిణయమునందలి మంగళాష్టక మిట్లున్నది: "చెంబూ కంబళి నంబివానిది గదా చేంతాడు మందేగదా, గంతల్ బొంతలు లోభివానివి గదా గార్ధంబు చాకింటిదే, అన్నా దమ్ముడు ఇద్దఱున్ కూడుకొని యొక్కరైన్ కుర్వంతు వాం మైథునమ్ ...." ఇది అమంగళాష్టకమని విమర్శకుల యభిప్రాయము. నవనాగరక దృష్టితో చూచినచో ఇది అసభ్యమనియే తోచును. ఇందులో వింత లేదు. మన ప్రాచీనాచార వ్యవహారములు తారుమారగుచున్న యీ దినములలో కూడ వివాహ కాలమున భోజనాది సమయములందు వినిపించు వ్యంగ్య సంభాషణలను గుర్తునకు తెచ్చుకొన్నచో, పయి మంగళాష్టకము కేవలము హాస్యరస పోషణమునకే ఉద్దేశింపబడినదని స్పష్టము కాగలదు. ఇందులో వావి వరుసలు తోపించి యుండవచ్చును; అసభ్యములగు భావము లుండవచ్చును. అయినను, నాగరకత బలిసిన పట్టణములలో కాకున్నను ప్రాచీన సంస్కృతిని పరిరక్షించుచున్న మన పల్లెపట్టులందలి పెండ్లి పందిళ్లలో వరుస పాటలు, బూజంబంతి (బువ్వముబంతి) పాటలు మొదలైన వానిని విన్నవారికి పై మంగళాష్టకము అసభ్యముగా కనిపించదు. ఈ సందర్భమున శ్రీ వేంకటరావుగారు నుడివిన విషయములు పరిశీలింప దగినవి. ఈ చిన్న విషయమై ఇంత వ్రాయుట అనవసరము. కాని, మన ప్రాచీన సంప్రదాయములు, ఆచారములును మరుగుపడిపోవుచున్న యీ సమయమున వీనిని గురించి తెలిసికొనుట చాల అవసరము. లేకున్నచో మన ప్రాచీన కావ్యములును, వానిలోని విషయములును మనకు వికృతములుగను వినూత్నములుగను తోచవచ్చును.

తెలుగుభాషా వాఙ్మయములకును, తెలుగుల సంస్కృతికిని సంబంధించిన విషయము లెన్నియో చోటుచేసికొనిన యీ వాఙ్మయ సమీక్ష (154 పుటలు) అవశ్య పఠనీయము.

ఆంధ్రవాఙ్మయ చరిత్రమున క్రీస్తుశకము 1600 నుండి 1775 వరకును వర్ధిల్లిన వాఙ్మయయుగమును దక్షిణాంధ్రయుగ మని మనము వ్యవహరించుచున్నాము. తెలుగువారగు నాయకరాజులు పరిపాలించిన మధుర, తంజాపూరులే కాక పుదుక్కోట, తురయూరు, సేలము, తిరునెల్వేలి, మైసూరు మున్నగు ప్రదేశములందును తెలుగు సాహిత్యము వర్ధిల్లెను. కాగా, దక్షిణాంధ్రయుగ మనగా ఈ వివిధ ప్రాంతములందు వర్ధిల్లిన వాఙ్మయమని విదితమగును. తమిళనాడున తెలుగు మాటకు, తెలుగు పాటకు నొక క్రొత్త చెలువము, నొక క్రొత్త సోయగము లభించినవి యీ తెలుగు నాయకరాజుల కాలములోనే. మధుర, తంజాపూరులలో వ్యవహారభాష తమిళమే యైనను రాజభాష తెలుగగుటచే, ఆ నాళ్లలో తెలుగునకు ఎక్కడలేని ప్రచారము లభించెను. తమిళులు కూడ తెలుగు నేర్చుకొని, తెలుగులో కావ్య నిర్మాణ మొనర్చిరన్నచో, ఆ దినములలో తెలుగనిన ఎంత ఆదరభావము ఉండెనో సువిదితమగుచున్నది. నాయకరాజులకు పిమ్మట తంజావూరును పరిపాలించిన మహారాష్ట్ర రాజులు కూడ తెలుగు భాషాసాహిత్యములనే ఎక్కుడుగ ఆదరించిరి. తంజావూరి మహారాష్ట్రులను గ్రంథమును రచించిన డాక్టర్ కె. ఆర్. సుబ్రహ్మణ్యన్‌గారి యీ క్రింది వాక్యములను పరిశీలించిన ఈ అంశము స్పష్టమగును.

"It is a sad contrast to find comparitively little of Tamil Literature during

గ్రంథవిమర్శనము

the Marata Period, the literature of the bulk of people. There was a revival of Sanskrit and Telugu but not of Tamil. The new dynasty continued the Nayak legacy and cared as little for Tamil as its predecessors..."

కనుక ఆ నాళ్లలో తెలుగు భాషను నేర్చుట, పాండిత్యము గడించుచో తెలుగున గ్రంథ నిర్మాణము చేయుటయు పరిపాటిగ నుండె నన్నను సాహసము కాదు. మొత్తముమీద దక్షిణాంధ్ర యుగమున ఎందరో కవులు, కవయిత్రులును విలసిల్లిరి. గ్రంథము లెన్నియో రచింపబడెను. కాని చేమకూర వేంకటకవి, సముఖము వేంకట కృష్ణప్ప నాయకుడు ముద్దుపళని యింకను మరికొందరిని మాత్రమే లోకము గుర్తించినది. కాగా లోకము గుర్తింపని కవులు, కవయిత్రులును పలువురు గలరు. అట్టివారిని కూడ చరిత్ర కెక్కించి శ్రీ వేంకటరావుగారు పుణ్యము మూటగట్టుకొన్నారు. ఆ నాళ్లలో వర్ధిల్లిన పదకవులను గురించి కూడ వా రనేక విషయములు తెలియజేసిరి. నిజమునకు దక్షిణాంధ్ర యుగమున సంగీత సాహిత్యములు - రెండును సమానముగ వర్ధిల్లెను. కాగా, దక్షిణదేశమునందలి తెలుగు సాహిత్య మన్నప్పుడు పదకవులను గురించి కూడ నుడువవలెనని పేర్కొనదగును.

శ్రీ వేంకటరావుగారు తమ దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమును తంజాపురాంధ్ర వాఙ్మయము (నాయకరాజ యుగము, మహారాష్ట్రరాజ యుగము), మధురాపురాంధ్ర వాఙ్మయము, పుదుక్కోట ఆంధ్ర వాఙ్మయము, మైసూరు ఆంధ్ర వాఙ్మయము—అని విభజించిరి. ఇవి ప్రధాన భాగములు. కులకాలాదికమునే కాక వివిధ కవుల కృతులలోని మంచిపెబ్బరలను కూడ తెలియజేయుటచే, ఈ గ్రంథము అటు చరిత్రకారులకును, ఇటు సాహిత్యోపాసకులకును ఉపయోగపడుననుటలో సందేహములేదు. గ్రంథవిమర్శనము చేయునప్పుడు, ఒకవేళ గ్రంథ మింకను తాళదళ రూపమున నున్నను లేదా అలభ్యమై యున్నను అట్టితరి శ్రీ వేంకటరావుగారా గ్రంథమునందుండి కొన్ని భాగములను కూడ చవి చూపించినారు. ఇందువలన ఇంకను తాళదళ రూపమున నున్న కొన్ని రచనల స్వరూప స్వభావములను గ్రహించుటకు మనకు వీలగుచున్నది.

ఈ బృహద్గ్రంథము నందలి విశేషముల నన్నిటిని ఈ సమీక్షలో తెలియజెప్పుట నాయభిమతము కాదు. కొన్నింటిని మాత్రమే ఇందు ఉదహరించితిని. గ్రంథ రచనావసరమున సంప్రతింపబడిన పుస్తకములు, వ్యాసములు మొదలగువానిని తెలియజేయుచున్న సూచికయొకటి గ్రంథాంతమున గలదు. ఈ సూచికను పరికించిన, దక్షిణాంధ్రయుగమునకు సంబంధించిన రచనలు నేటిదాకా ఎన్ని, ఎప్పుడెప్పుడు వెలువడినవో స్పష్టమగును. ఇది వాఙ్మయ చరిత్రాకారులకు బహుధా తోడ్పడగలదు. అధోజ్ఞాపికలలో గ్రంథకర్త పొందుపరచిన విషయములుకూడా గమనింపదగినవి. దక్షిణాంధ్ర వాఙ్మయ విషయమున పరిశ్రమించిన శ్రీయుతులు అక్కిరాజు ఉమాకాంతం, జయంతి రామయ్యపంతులు, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, కురుగంటి సీతారామయ్య, పింగళి లక్ష్మీకాంతం ప్రభృతులును, దక్షిణాంధ్రయుగమునకు చెందినకొన్ని గ్రంథములను ప్రకటించిన ఆంధ్రసాహిత్య పరిషత్తును కృతజ్ఞతా పూర్వకముగ స్మరించుట వారి సహృదయతను తెలుపుచున్నది.

దక్షిణాంధ్ర వాఙ్మయ నిర్మాణమునకు హేతుభూతములైన అలనాటి చారిత్రక సాంఘిక పరిస్థితులను శ్రీ వెంకటరావుగారింకను తెలియజేసి యుండినచో ఈ గ్రంథమునకు మరింత విలువ కలిగియుండెడిది. ద్రావిడ భాషావాఙ్మయములకు నిలయమనదగిన మధురాపురము నభివర్ణించుచు గ్రంథకర్త అట 'శంఖఫలకము' ఉండెడిదని పేర్కొనిరి. అట ఫలకము ఉన్నమాట నిజమే కాని అది శంఖఫలకము మాత్రము కాదు. దానిని 'సంగప్పలగై' అని వ్యవహరించిరి. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయ చరిత్రను సంగ్రహముగా తెలియజేయుచు శ్రీ వెంకటరావుగారు రచియించిన ఇంగ్లీషు రచనను ప్రత్యేక పుస్తకముగ ప్రచురించిన బాగుగ నుండునని తలచుచున్నాను. ఉపసంహారమున, శ్రీ నిడుదవోలు వెంకటరావుగారి దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమును భాషాజిజ్ఞాసువు లందరు నాదరింతురని నుడువ దగును. ఈ యుద్గ్రంథము అవశ్యపఠనీయము; ప్రతిగ్రంథాలయమునందును ఉండదగినది.

—కృష్ణ.

రెండు సాంఘిక నాటకాలు

"తలవని తలంపు" (సాంఘిక రూపకము)

[రచన: పులుగుండ్ల రామకృష్ణయ్య, సోల్ డిస్ట్రిబ్యూటర్స్, ది ఇండియన్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, ఆనకట్టరోడ్డు—నెల్లూరు. వెల తెలియదు. 78 పేజీలు.]

రచయిత చెప్పినట్టు—ఇది వారి తొలి రచన—1943లో రాశారు. ఆ రోజుల్లో విజయవంతంగా ప్రదర్శింపబడిందని పుస్తకంలో మనకు తెలుస్తుంది. ఈ నాటకం కథేమిటంటే—

ఒక అగ్రహారంలో అప్పయ్యపంతులుగారుంటాడు. అతని దగ్గరవాడైన జోగయ్యఅనేఅతని కూతురు కల్యాణిఅనే అమ్మాయి వాళ్లింట్లోనే చనువుగావుంటూ, అప్పయ్యపంతులుగారి కుమారరత్నమైన మధును ప్రేమించుకుంటూవుంటుంది. మధు పట్నంలో చదువుతూ, చదువుతోపాటు సుశీల అనే అమ్మాయిని ప్రేమిస్తూవుంటాడు. అప్పయ్యపంతులుకు కల్యాణిని తన కోడలిగా చేసుకోవాలనే ఆలోచన వున్నది. పట్నంలో మధు ఇంకో అమ్మాయి 'ప్రేమ'లో పడ్డట్టు కల్యాణికిగాని, కనీసం మధు తండ్రికిగాని తెలియదు—సాధారణంగా జరుగుతున్నట్టుగానే, పైగా సుశీలను పెళ్లి చేసేసుకుంటాడు. అగ్రహారంలో అప్పయ్యపంతులుకు కోపంవచ్చి, ఇంకో కుర్రాడికిచ్చి కళ్యాణినిచ్చి చెయ్యటానికి ముహూర్తం పెడతాడు. కల్యాణి ఎంత బతిమాలినా వినడు. పెళ్లి జరిగిపోతుంది. కల్యాణిభర్త రోగిష్టివాడవటంచాత, గుటుక్కుమన్నాడు. తనుచేసిన సంబంధం ఇట్లా కల్యాణిని విధవను చేసినందుకు ప్రాయశ్చిత్తంగా అప్పయ్య సన్యాసం పుచ్చుకుంటాడు. మధు భార్య సుశీల మంచి పిల్ల. కల్యాణి మధును ఎంతగా ప్రేమించిందో, ప్రేమిస్తుందో కనిపెడుతుంది. ఇరవైనాలుగ్గంటలూ విచారంలో మునిగి పోతున్నదని, తమతో పట్నం రమ్మని తీసుకెళ్తుంది. పట్నంలో కూడా కల్యాణి తనను చేసుకోమని మధును అడుగుతూ ఉంటుంది. సుశీల కూడా కల్యాణిని చేసుకోమంటుంది. మధు ఒప్పుకోడు. 'నీ జీవితాన్ని దేశకల్యాణానికీ, మానవసేవకూ వినియోగించు' అని కల్యాణికి నీతి బోధచేసి, డైలాగులు పలుకుతాడు. ఆమె కళ్లు తెరవబడి, "ఈ జీవితం మానవసేవకూ, దేశాభ్యుదయానికీ అంకితం' అంటుంది. నాటకం ఐపోతుంది.

ఈ నాటకంలో ఐదు రంగాలున్నాయి. పాత్రలు అట్టేలేవు. దృశ్యాలు కూడా రెండో మూడో వున్నాయి. 'సాంఘిక నాటకాలు సంఘాన్ని ఉద్ధరించటానికే' అని చాలావుంది వూహ. ఈ వూహాల కోవకు చెందినదే ఈ నాటకం. ఐతే పాత్రలూ, వాటి పోషణా—అవేమీ అవసరంలేదా? ఈ నాటకంలో ఒక్క సుశీల పాత్రపైతప్ప, ఇంకే పాత్రపైనా సానుభూతికలుగదు. పైగా కోపం వస్తుంది. నాటకంలో ముఖ్యపాత్రగా పోషింపబడిన కల్యాణి పాత్రపై ఎవరికీ కనీసం కొంతయినా సానుభూతి కలగకపోవటంతో ఆ పాత్రకు నిండురాలేదు. ఆమె, తన భర్తపోయినా, మధు ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకున్నా కూడా ఇంకా మధును పట్టుకుని 'నన్ను పెళ్లిచేసుకో' అనటం సబబుగాలేదు. సుశీల చూపిన త్యాగభావంవంటిదే ఏదయినా కల్యాణి కూడా చూపితే బావుంటుంది. ఆ పాత్ర గాలిలో తేలిపోయినట్టుఐపోయింది. ఇంక అప్పయ్యపంతులూ, వాళ్లూ మళ్లీ కనిపించరు. నాటకాల్లో ఉండాల్సిన 'డ్రామా'గాని, 'వినోదం' గాని ఇందులో లభించవు. అర్థంకాని విషాదంమాత్రం నాటకం నిండా తాండవమాడుతూవుంటుంది. ప్రతినాటకం 'ఎండింగ్‌షో' లోనూ, సాధారణంగా జరుగుతున్నట్టుగానే ఇందులో కూడా బాపూజీపేరూ, అహింసలూ—ఇవన్నీ వచ్చేస్తాయి. ఏ కథయినా సరే, ఏ సమస్యఐనాసరే చివరకు ఇవి రావాలి కాబోలు!

ఇంక—రెండోనాటకం

"బుట్టబొమ్మలు" (మహోజ్జ్వల సాంఘికనాటకం)

[రచన: కె. ఆదినారాయణమూర్తి "విజయశ్రీ", ప్రకాశకులు: విజయశ్రీ పబ్లికేషన్స్, 11—2—3291 సీతాఫల్ మండీ, సికింద్రాబాదు. 63 పేజీలు—వెల: ఒక రూపాయి.]

కేవలం దేశంలోవున్న కుళ్లను కడిగేయటానికీ, కనీసం దేశాన్ని నాలుగయిదు అంగుళాలు ఉద్ధరించటానికీ అనే ఈ రచయిత ఈ నాటకం రాశారు. అందుకని ఓ కథా, కమామీషూ అంటూ ఏర్పాటు చెయ్యలేదు రచయిత. 15 పాత్రలకు పైగా పాత్రలూ, ఏడురంగాలూ వున్నై. విలన్‌లూ, దేశద్రోహులూ, మంచివాళ్లూ, వీళ్లమధ్య మంచిఅమ్మాయీ అంతా వుంటారు. పాత్రలపేర్లనుబట్టే వాళ్లస్వభావాన్ని తెలుసుకునేటట్టుగా ఏర్పాటుచేసి రచయిత, 'కబుర్ల కామయ్య' 'రేడియో రంగయ్య' 'భావకవి బ్రహ్మానందం'—ఇట్లా పేర్లు పెట్టారు. ఈ నాటకంలోని ప్రతిపాత్రా డైరక్టుగా దేశాన్ని ఎదుర్కొంటుంది. అరాచకాన్నీ, లంచగొండితనాన్నీ, స్వార్థాన్నీ తిట్టిపారేస్తుంది. చిన్న విషయాలను గంపెడంతచేసి మాట్లాడే వాళ్లూ, లేనివిషయాలను కల్పించి మాట్లాడేవాళ్లూ—వీళ్లంతా కూడా వుంటారు. ఐతే ఆఖరికంతా, పశ్చాత్తాపాలు చెందిపోయి, తమ తప్పుల్ని ఒప్పేసుకుని "మంచి"వాళ్లైపోయి, "కులమత భేదాలు నసమసిపోవాలి" 'భారత్ జిందాబాద్' 'గాంధీజీ జిందాబాద్!.....' 'రాజేంద్రబాబు జిందాబాద్',

గ్రంథ విమర్శనము

'నెహ్రూ జిందాబాద్' అని నినాదాలు చేసేస్తారు. దేశోద్ధరణమే ప్రధానాంశంగా పెట్టుకుని ఈ రచయిత ఈ నాటకం రాశారు కాబట్టి, ఉపన్యాసాలూ, ఉద్రేకాలూ వున్నాయని ఎవరూ బాధ పడరు. ఈ నాటకాలవల్లైనా, కనీసం దేశంబాగుపడితే ధన్యులం !

—సుకుమార్.

గ్రంథ పరిచయము

1. మౌలానా అబుల్ కలాం ఆజాద్

(స్మారక సంపుటము)

మౌలానా అబుల్ కలాం అజాద్ ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌వారు ఈ గ్రంథమును ప్రకటించిరి. ప్రొఫెసర్ హుమాయూన్‌కబీర్ సంపాదకత్వమున వెలువడిన ఇంగ్లీషు గ్రంథమున కిది తెలుగు అనువాదము. డా. దివాకర్ల వెంకటావధానిగారు అనువాదకులు. ఇందులో శ్రీ నెహ్రూ, డా. రాధాకృష్ణన్, పెథిక్ లారెన్సు, లూయీమాసింగ్నన్, ఆచార్య కృపలానీ, రాజాజీ ప్రభృతులు వ్రాసిన వ్యాసము లున్నవి. వెల: రు 4—50 లు.

2. కవితా కింకిణి

ఇది శ్రీ గుమ్మళ్ల వెంకటేశ్వరరావుగారి రచన. ఇందులో 21 ఖండ కావ్యములు కలవు. వీనిలో కొన్ని స్కాట్, కీట్స్, లేహంట్ ప్రభృతి ఇంగ్లీషు కవుల లఘు కావ్యములకు అనువాదములు. ఈ గ్రంథమునకు శ్రీ బండారు తమ్మయ్యగారు మున్నుడి రచించిరి. ఇది పాండురంగప్రెస్, ఏలూరు వారి ప్రచురణము. వెల: ఒక రూపాయి.

3. గిరికుమారి

ఇది అంబటిపూడి నరసింహశర్మగారి పద్యకావ్యము. ఇందులోని ఇతివృత్తము గౌరీ మహేశుల కళ్యాణము. శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు దీనికి పీఠిక రచించిరి. పుస్తకము వలయువారు గ్రంథకర్త, నాయుడుపేట, 1 వ లైను, కొరిటెపాడు, గుంటూరు—2 కు వ్రాయవలెను. వెల రు. 1—25లు.

4. పురుషసూక్తము

యజుర్వేదములోని పురుషసూక్తమును స్వామి దయానందసరస్వతి వ్యాఖ్యానానువాదముతో సస్వరయుక్తముగ శ్రీ మద్దయానంద వేదాను సంభావనసదనము 3-5-1003, నారాయణగూడ, హైద్రాబాదు వారు ప్రకటించిరి. అనువాదకులు శ్రీ పాలడుగు శేషాచలార్య, శ్రీ అన్నే కేశవార్యులు. వెల: రూపాయి.

5. నందికొండ రామచిలుక

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు రచించిన పద్యకావ్యము. నందికొండప్రాజెక్టు కావలెనని రాచిలుక ఒకటి ప్రధానమంత్రి వద్దకు రాయబారము పోయినట్లు లూహించి కవి ఈ కావ్యమును రచించెను. ఆ చిలుక రాయబారము సఫలమై, నాగార్జున సాగరము వచ్చినట్లు కల్పన. వెల: 75 నయాపైసలు. ప్రకాశకులు: గ్రంథకర్త, మోర్జంపాడు పోస్టు, గుంటూరుజిల్లా.

6. మరో ఉదయం

శ్రీ మాదిరాజ రంగారావు కావ్యము. పద్యరచన మాత్రాచ్ఛందస్సులో జరిగినది. హైదరాబాదు నవోదయసమితి వారు దీనిని ప్రచురించిరి. వెల: రూపాయి.

7. నవోదయము

(ఖండకావ్యముల సంపుటి)

రచయిత శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తి. ఇందులో 33 ఖండ కావ్యములు గలవు. గ్రంథము వలయువారు రచయితకు 1—8—486 చిక్కడపల్లి, హైద్రాబాదుకు వ్రాసుకో వలయును. వెల: రూపాయిన్నర.

8. హరిహరదత్త స్తుతి

రచయిత శ్రీ మిన్నికంటి గురునాథశర్మ. ఇందులో శంకరస్తుతి, నరసింహస్తుతి, దత్తాత్రేయ శతకములు గలవు. ఇందులో నరసింహస్తుతి ఏకప్రాసముగా రచింపబడినది. వెల: రు. 2 లు. ప్రకాశకులు: గ్రంథకర్త, బ్రాడిపేట, 5 వ లైను, 15 అడ్డరోడ్డు, గుంటూరు—2.

9. ధారాపాత్ర (గేయకవిత)

రచయిత శ్రీ స్వర్ణరాజ హనుమంతరావు. శారదా సాహితీ సంసత్, విజయవాడ—2 ప్రచురణ; వెల: రూపాయి పావలా.

10. సీతారామానందలహరి

(అను బోయినపల్లి రాఘవ శతకము)

దీనిని శ్రీ'రామ ప్రమోదూత' రచించిరి. ప్రకాశకులు శ్రీ సీతారామభక్త సమాజము, బోయిన్‌పల్లి, సికింద్రాబాదు వారు. వెల తెలియదు.

11. శ్రీ శఠకోపచరితమ్

ఇది సంస్కృతకావ్యము. రచయిత శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు. ప్రకాశకులు: గోదా గ్రంథమాల, శ్రీమన్నారాయణపురము, ఉళ్లిపాలెము (పోస్టు), దివి తాలూకా, కృష్ణా జిల్లా, వెల: ఒక రూపాయి.

వార్తలు

మే నెల అంతా మూడు ముఖ్య సమస్యలను గురించి నడిచింది. (1) కాశ్మీర్, (2) లావోస్, (3) పశ్చిమ ఇరియన్. ఇందులో కాశ్మీర్‌వ్యవహారంలో భద్రతామండలిలో జరిగిన చర్చలతోపాటు కొన్ని పిల్ల సమ్మేరీ సమస్యలు గూడా తలఎత్తాయి. వాటిల్లో మొదటిది పాకిస్తాన్‌తో ఆక్రమిత కాశ్మీర్, చైనా సరిహద్దులను నిర్ణయించుకోవాలని చైనా, ఉబలాటపడటం. రెండు, పాకిస్తాన్‌కు అమెరికా చేస్తున్న సైనికసహాయంవల్ల ఏర్పడుతున్న అసమస్థితిని సర్దుబాటు చేసుకోడానికి భారతదేశం జెట్‌విమానాలను, మిస్సైళ్లను నిర్మించే కర్మాగారాన్ని నిర్మించుకొనడానికి నిశ్చయించుకొనడం. ఇది ఒక సమస్య ఎందుకైందంటే, ఈ కర్మాగారాన్ని రష్యా సహాయంతో నిర్మించుకోవాలని భారతదేశం ప్రయత్నం చేస్తున్నది. అంతేగాక రష్యా దగ్గర విమానాలు కొనాలని గూడా చూస్తున్నది. అందువల్లనే ఈ నెల మొదటి వారంలో జరిగిన చర్చ వాయిదాపడగా, దానిని తిరిగి వెంటనే తిరగతోడడానికి పాకిస్తాన్, పాశ్చాత్యరాజ్యాలు ప్రయత్నంచేయడం జరిగిందని అభిజ్ఞులు అంటూ వచ్చారు. ఇక, ఈ సమస్య గురించి నడచిన చరిత్ర ఈవిధంగా వుంది.

కాశ్మీర్ సమస్య

ఏప్రిల్ 30 వ ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ, అంతకు ముందు మండలిలో పాక్ ప్రతినిధి చేసిన బెదిరింపులకు సమాధానం చెప్పారు. మండలియేమో, ఒక రోజున జరుపుదామన్న సమావేశాన్ని భారతదేశం కోరికమేరకు ఒకరోజు ఇవతలికి జరిపింది. ఈ అల్ప విషయంగూడా పాకిస్తాన్‌కు ఆందోళన కల్గించింది. అసలు ఏ విషయంలోనైనా భద్రతామండలి తన మాటే వినాలి గాని, భారతదేశం మాటను వినకూడదు అనే ధోరణిలోకి పాకిస్తాన్ వచ్చేసింది.

మే 1:—కాశ్మీర్ సమస్య విషయంలో ఒక ఆఫ్రికన్ రాజ్యం మధ్యవర్తిత్వం వహించాలన్న సూచనను పాకిస్తాన్ ప్రచారంలోకి తెచ్చింది.

మే 3 : జఫ్రుల్లాఖాన్ మండలిలో ప్రసంగించారు. గ్రాహంను తిరిగి మధ్యవర్తిగా నియమించి కాశ్మీర్‌నుంచి ఉభయ దేశాల సైన్యాల ఉపసంహారాన్నిగురించి నివేదికను తయారు చేయించాలని కోరారు. సమితి అధ్యక్షుని సమక్షంలోగాని, లేక ఒక ఆఫ్రికన్ ప్రతినిధి సమక్షంలోగాని భారత్, పాకిస్తాన్‌ల మధ్య ముఖాముఖి సమాలోచనలు జరగాలని గూడా సర్ జఫ్రుల్లా సూచించారు.

మే 4 :—కాశ్మీర్‌పై భారతదేశం సార్వభౌమాధికారాన్ని శంకించే అధికారం మండలికిలేదని, సమితి ఆ అధికారాన్ని గుర్తించిందని శ్రీ మీనన్ సమాధానం చెప్పారు. జనవాక్యం అనవసరమని, భారతదేశాన్ని, పాకిస్తాన్‌ను ఒకేస్థాయిలో పెట్టిచూడటం తగదని కూడా ఆయన చెప్పారు. కాశ్మీర్ సరిహద్దులనుగురించి చైనాతో పాకిస్తాన్ మంతనాలు సాగించబోవడం ప్రమాదకరమని, ఈ విషయంలో పాకిస్తాన్ ఏమి చేసినా భారతదేశం చర్య తీసుకోవలసి వస్తుందని చెప్పారు.

—రష్యా భారతదేశాన్ని బలపరిచింది.

—తీర్మానంలేకుండా సమావేశం వాయిదా పడింది.

మే 4:—ఆక్రమిత కాశ్మీర్‌సరిహద్దులపై తాత్కాలికంగా ఒప్పందం కుదుర్చుకొని, కాశ్మీర్ సమస్య పరిష్కారం అయిన తర్వాత శాశ్వతమైన ఏర్పాట్లు చేసుకోడానికి చైనా, పాకిస్తాన్‌లు నిశ్చయించుకున్నాయి.

మే 7:—సరిహద్దుల విషయంలో చైనా, పాకిస్తాన్‌ల మంతనాలు జరపడంఅంటే భారతదేశం ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం పెట్టుకోవడమేనని, వారిమధ్య కుదిరే ఏ ఒప్పందాన్ని భారతదేశం ఆమోదించదని శ్రీ నెహ్రూ ప్రకటించారు.

మే 14—తిరిగి కాశ్మీర్‌నుగురించి మండలిలో చర్చ జరగాలని సర్ జఫ్రుల్లా మండలిఅధ్యక్షుణ్ణి కోరారు.

—చర్చను 17 వ తేదీనాడు జరపాలని మండలి అధ్యక్షుడు నిర్ణయించారు. భారతదేశం అధిక్షేపణ తెలియజేసింది. మామూలుగా భారతదేశంతో గూడా సంప్రదించి ఈ నిర్ణయం చేయవలసివుండగా, మండలి అధ్యక్షుడు, భారత్‌తో సంప్రదించకుండా ఈ పని చేశారు.

మే 16:—భారత్, రష్యా, రుమేనియా, ఘనా, చిలీ దేశాల ప్రతిఘటనవల్ల మే 28 కి సమావేశం వాయిదాపడింది.

మే 17:—కాశ్మీర్‌పై భారతదేశం అధికారాన్ని కాదనే ఏ తీర్మానాన్ని భారతదేశం ఆమోదించదని ఢిల్లీలో శ్రీ మీనన్ ప్రకటించారు.

మే 18:—కాశ్మీర్ సమస్యను తిరిగి మండలిలో చర్చించినందువల్ల ఫలితం ఏమీ వుండదని, అందువల్ల చర్చ అనవసరం అని సమితిలో భారతశాశ్వతప్రతినిధి శ్రీ ఝా మండలి అధ్యక్షునికి వ్రాశారు.

వార్తలు

మే 22:—లావోస్, పశ్చిమన్యూగినీవంటి ముఖ్య సమస్యలు ఉండగా, మండలిలో కాశ్మీర్‌చర్చ జరగడం అసంగతమని, కాబట్టి ఈ చర్చ ఇప్పుడు జరగరాదని సమితిలో విమర్శ వచ్చింది. అయినా చర్చ 28 నే జరగాలని కొంతమంది పట్టుదల చూపుతున్నట్లు వార్తలు వచ్చాయి.

మే 25:—సమావేశం జరపరని, ముందు ఈ సమావేశం జరిగితే భారత, పాకిస్తాన్‌లతో సంప్రదించే ఆ జరిగే తేదీ నిర్ణయించబడుతుందని, సమితి అధికారులు ప్రకటించారు. ఇది ఇట్లా జరగడం తనకు ఓటమిగా పాకిస్తాన్ భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

*   *   *   *

లావోస్ వ్యవహారం

జినీవాలో లావోస్ సమస్యా పరిష్కారసమావేశం జరిగినతర్వాత ఒక మాదిరిగావున్న పరిస్థితి మే 7 నాటికి ప్రబద్ధలై పోయింది. ఇందుకు కారణం కమ్యూనిస్టులని అమెరికా, అమెరికా అని కమ్యూనిస్టులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కాని, ఈమధ్య వచ్చిన వార్తలనుబట్టి ఈ పరిస్థితి విషమించడానికి అమెరికాయే కొంతవరకు కారణమని, ముఖ్యంగా అమెరికా కేంద్ర సమాచార సంస్థ కారణమని పరిశీలకులు చెబుతున్నారు. ఏది ఏమైనా, లావోస్‌లో పరిస్థితి పథేట్‌లావోబలాలు నాంథా అనే పట్టణాన్ని మే 7 న వశపరుచుకొనడంతో విషమించింది.

మే 8:—నాంథానుంచి కమ్యూనిస్టులు (అంటేపథేట్ లావో బలాలు) వెళ్ళిపోయేట్లు చూడాలని బ్రిటన్, రష్యాను కోరింది.

మే 9:—బ్రిటన్ కోరికను రష్యా తిరస్కరించింది.

మే 11:—బాన్‌వోం సైన్యాలు ఇంకో పట్టణాన్ని ఖాళీ చేశాయి. పథేట్ లావో విజృంభణను ఆపించాలని రష్యా, బ్రిటన్‌లకు థాయ్‌లాండ్ విజ్ఞప్తి చేసింది.

మే 12:—బాన్‌వోం సైన్యాలు థాయ్‌లాండ్‌లోకి పారిపోయాయి. ఇంకో పట్టణం పథేట్ లావో వశమైంది.

—అమెరికా సప్తమ నౌకాదళం సయాం సముద్రంలో ప్రవేశించింది.

మే 13:—లావోస్‌ను రక్షించడం తమ బాధ్యత అని శ్రీ కెనెడీ ప్రకటించారు.

మే 14:—అమెరికా మెరైన్ బలాలు థాయ్‌లాండ్‌కు బయలుదేరాయి. అమెరికా చర్యకు బ్రిటన్ అమోదించింది.

మే 14:—అమెరికా సైన్యాలు థాయ్‌లాండ్‌లో దిగాయి. జపానులోవున్న అమెరికా విమానాలు గూడా థాయ్‌లాండుకువచ్చి చేరాయి. మనిలా సంధిరాజ్యాలను గూడా సైన్యాలను పంపవలసిందిగా అమెరికా విజ్ఞప్తి చేసింది.

మే 18:—థాయ్‌లాండ్‌లో సైన్యాలను దింపినందుకు శ్రీ కృశ్చేవ్ అమెరికాను విమర్శించారు.

మే 20:—లావోస్ పరిస్థితినిగూర్చి సువన్న ఫౌమా ఒక ప్రకటన చేశారు.

మే 25:—పథేట్‌లావో సైన్యాలు ఇంకో పట్టణాన్ని పట్టుకున్నాయి. లావోస్‌లో పరిస్థితి చేయిదాటిపోయేట్లు చేయము అని శ్రీ కృశ్చేవ్ ప్రకటించారు.

*   *   *   *

పశ్చిమ ఇరియన్ సమస్య

పశ్చిమ ఇరియన్ విముక్తికిగాను తాను చెప్పినట్లుగా ఇండోనీషియా అధ్యక్షుడు డా. సుకర్నో తన సైన్యాలనుఅక్కడ దింపారు. ముందు గెరిల్లాలు, తర్వాత పారాట్రూపుదళాలు పశ్చిమ ఇరియన్‌లో దిగాయి. మే 15 న ఇండోనీషియా పారాట్రూపు దళాలు నాలుగు డకోటా విమానాలలో పాక్‌పాక్‌వద్ద దిగినట్లు హేగ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సైన్యాలను ప్రతిఘటించేందుకు డచ్చివారు అదనపు సేనలను అక్కడ ఉరికించారు.

మే 19:—డచ్చి సేనల ప్రయోగం విరమిస్తే, ఇరియన్‌పై తిరిగి చర్చలకు ఒప్పుకుంటామని సమితిలోని ఇండోనీషియా ప్రతినిధి ప్రకటించారు.

మే 20:—ఇరియన్‌కు ఇంకో సైనికదళాన్ని డచ్చివారు పంపించారు.

మే 21:—ఇరియన్‌ను అప్పగిస్తామంటేనే డచ్చివారితో చర్చలు సాగుతాయని డా. సోకర్నో ప్రకటించారు.

మే 22:—పశ్చిమ ఇరియన్‌లో ఒక పట్టణం ఇండోనీషియా సేనల వశమైంది. పాక్ పాక్‌లో ఈఇండోనీషియన్లు ప్రవేసించారు.

మే 23:—పశ్చిమ ఇరియన్ సమస్య బంకర్ ప్రతిపాదనలు ఆధారంగా పరిష్కారం కావాలని సమితి కార్యదర్శి సూచించారు.

మే 25:—ఇరియన్‌ను అప్పగించే పద్ధతిపై చర్చలకు హాలండ్ సమ్మతించదని ప్రధాని జాన్ డిక్వే ప్రకటించారు.

మే 27:—బంకర్ ప్రతిపాదనలు ఆధారంగా ఇరియన్‌పై చర్చలకు హాలండ్ సమ్మతించింది.

*   *   *

మే 1:—కొత్తగూడెంలో ఎరువుల కర్మాగారం నిర్మాణానికి ఒక అమెరికన్ సంస్థతో ఒప్పందం కుదిరినట్లు భారీ పరి

వివిధ వార్తలు

శ్రమలమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం ప్రకటించారు.

—నాగార్జునసాగర్ నిర్మాణంలో ఏర్పడిన సిమెంటు, ఉక్కు కొరతను తీర్చడానికి రాష్ట్రప్రభుత్వం ఆలోచన చేస్తున్నది.

మే 2:— సరిహద్దుల్లో ఆక్రమించుకున్న ప్రాంతాలనువదిలితేనే మంతనాలు సాధ్యం అని భారత ప్రభుత్వం చైనాకు తెలియజేసింది.

—ఎగువ సీలేరు ప్రాజెక్టుకు "కాఫర్‌డాము" నిర్మాణానికి ఒరిస్సా ప్రభుత్వం ఆమోదించిందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

మే 4:—నాగార్జునసాగర్ ప్రథమదశ నిర్మాణానికి 137 కోట్ల (డాము 47 కోట్లు, కాలువలు 90 కోట్లు) రూపాయలు ఖర్చు అవుతుందని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నది.

మే 3:—సరిహద్దులలో చైనా ఏ చర్యకుదిగినా, ప్రతిఘటిస్తామని శ్రీ నెహ్రూ ప్రకటించారు. చైనా శ్రేణులకు ఆవల నెలకొల్పిన చౌకీలను తొలగించడం అంటూ ఉండదని గూడా ఆయన చెప్పారు.

మే 6:—కేంద్రంలో మరో 12 గురు మంత్రులను నియమించారు. శ్రీ డి. ఎస్. రాజు, శ్రీ జగన్నాథరావులు ఉపమంత్రులైనారు.

—నేపాల్ భారతదేశంసరిహద్దులలో చైనా వారు ఫోటోలు తీస్తున్నట్లు నేపాల్ మంత్రి శ్రీ లలితచంద్ర వెల్లడి చేశారు.

మే 7:— ఉప రాష్ట్రపతిగా డా. జకీర్‌హుస్సేన్ ఎన్నిక అయినారు.

—మే 1 వ ఫ్రాన్సు అణ్వస్త్ర పరీక్షలు జరిపినట్లు ప్రకటన వెలువడింది.

మే 8:—సమగ్ర కాలుదారీ శాసనం ప్రతిపాదనకు రాష్ట్రమంత్రివర్గం నిర్ణయించుకొన్నది.

మే 10:—ఢిల్లీలో డా. రాజేంద్రప్రసాద్‌కు వీడ్కోలు ఉత్సవం జరిపారు.

—డా. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎన్నిక అయినారు.

—గుల్వాతీ కమిషన్ నివేదిక అందగానే ఆ యా రాష్ట్రాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుగుతాయని కేంద్రమంత్రి శ్రీ అలగేశన్ లోక్‌సభలో ప్రకటించారు.

మే 13:—డా. రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు.

—డా. ప్రసాద్ పాట్నాకు బయలుదేరారు.

మే 14:—డా. సోకర్నోపై జరిపిన హత్యా ప్రయత్నం విఫలమైంది.

—చైనాతో మంతనాలకు శ్రీ నెహ్రూ కొత్త ప్రతిపాదనలు చేశారు. లడక్ సరిహద్దుల్లో 'తటస్థ ప్రాంతం' సృష్టించాలని కోరారు.

మే 15:—పంచశీలకు చైనా కొత్త వ్యాఖ్యానం చేసింది.

మే 18:—కృష్ణా—గోదావరీ జలాల తగాదా విషయంలో ఏ నదికి ఆ నదిని పరిశీలించాలని ఆంధ్ర పార్లమెంటు సభ్యులు లోక్‌సభ చర్చలో సూచించారు.

మే 21:—జులై ఆఖరుకు గుల్వాతీ సంఘం నివేదిక అందగలదని పార్లమెంటులో శ్రీ అలగేశన్ ప్రకటించారు.

మే 23:—క్షామప్రాంతాల అభివృద్ధికి 8 కోట్ల ఖర్చుతో ఒక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

మే 24:—అమెరికా ఇంకో వ్యోమగామిని వదిలింది. కమాండర్ కార్పెంటర్ మూడుసార్లు భూమినిచుట్టి, తిరిగి నేలకు దిగారు.

—రైతులకు గిట్టుబాటుగా ధరలు వుండేట్లు చూస్తామని శ్రీ పాటిల్ పార్లమెంటులో ప్రకటించారు.

మే 25:— యుద్ధప్రచారనిరోధాన్నిగురించి అమెరికా, రష్యాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	150/-	125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	125/-	100/-
అర్థ పేజి	...	65/-	55/-
పావు పేజి	...	40/-	35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-0-0
6 మాసముల చందా	...	రు. 6-0-0
విడి ప్రతి	...	రు. 1-0-0

మేనేజరు, భారతి,
మద్రాసు-1.